# అభయారణ్యం

## కథలు

**జి.లక్ష్మి**



# అభయారణ్యం

(కథలు)


జి. లక్ష్మి



విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజయవాడ

**Abhayarnyam - by : G. Lakshmi**

| | | |
|---|---|---|
| ప్రచురణ నెం. | : | 2350/677 |
| ప్రతులు | : | 1000 |
| ప్రథమ ముద్రణ | : | జనవరి, 2018 |
| టైటిల్ డిజైన్ | : | గిరిధర్ |

© రచయిత్రి

**వెల : ₹ 120/-**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520 004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# నా మాట

**మ**నిషి కుల మత వర్గ భేదాలకు అతీతంగా ఎదగాలి. అన్ని వాదాల్లోకి మానవతా వాదం గొప్పది. మార్కెట్ ఎకానమీ మనిషిని పరాయీకరణలోకి నెట్టి మనిషితనాన్ని చెల్లాచెదురు చేసి ఒక సరికొత్త సంక్షోభాన్ని సృష్టిస్తోంది. మానవ జీవితాల్లోని ఈ సంక్షోభాన్ని ఎంతో కొంతపట్టుకోవాలన్న ప్రయత్నంలోంచి వచ్చినవే ఈ కథలు. రచయిత ఏదైనా ఒక సమస్యను ప్రస్తావించినప్పుడు ఆ సమస్యకు పరిష్కారాన్ని కూడా రచయితే సూచించాలని సాధారణంగా పాఠకులు భావిస్తుంటారు. నిజానికి నిజజీవితంలో తనకు నచ్చినదాని గురించో నచ్చని దాని గురించో తనను ప్రభావితం చేసినదాని గురించో సమస్యగా అనిపించిన దాన్ని గురించో చెప్పడమే రచయిత పని. సమస్యను గుర్తించడటమే అక్కడ ప్రధానం. ఏ సమస్య అయినా బహుముఖంగా ఉంటుంది. ఏ సమస్యనైనా నిర్దుష్టంగా ఇదే పరిష్కారం అని చెప్పడం ఏ రచయితకూ సాధ్యంకాదు. పరిష్కారానికి కొంత సమీపంగా మాత్రమే వెళ్ళగలడు. నేను కూడా ఆ ప్రయత్నమే చేశాను.

ఈ కథల పుస్తకంగా వెలువడడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు శ్రీ గడ్డం కోటేశ్వరరావుగారికి, శ్రీమతి గడ్డం సుశీలగారికి, మేనేజన్ శ్రీ టి. మనోహర్ నాయుడుగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

**జి. లక్ష్మి**

## ఇది వరుస.....


| | | |
|---|---|---|
| 1. | అతుకు | 5 |
| 2. | తోడు | 12 |
| 3. | అలక | 19 |
| 4. | జీవన చిత్రం | 27 |
| 5. | భయం | 33 |
| 6. | థర్డ్ ఆప్షన్ | 39 |
| 7. | డిలీట్ | 47 |
| 8. | అభయారణ్యం | 53 |
| 9. | పెళ్ళంటే | 61 |
| 10. | ఓ సిల్లీ కథ | 66 |
| 11. | దుఃఖావరణం | 73 |
| 12. | హోమం | 80 |
| 13. | అద్దం | 85 |
| 14. | అదృశ్యం | 93 |
| 15. | కళాకారుడు | 101 |
| 16. | నాలుగో తరం | 106 |
| 17. | పరుసవేది | 114 |
| 18. | అమ్మా వాళ్ళ ఇల్లు | 120 |
| 19. | సుమిత్ర | 127 |
| 20. | రూట్ కెనాల్ | 135 |

# అతుకు

"ఎంతైనా అతుకు అతుకే" మనసులో అనుకోబోయి పైకే అనేసింది సుమతి.

హిందూ పేపర్ని దీక్షగా చదువుతున్న భాస్కర్రావు తలెత్తి సుమతి వంక చూస్తూ "ఏంటి అన్నావ్?" అన్నాడు.

"ఏం లేదండీ. కాంపౌండ్‌వాల్ ఆ మూల మళ్ళీ బీటలిచ్చింది. ఇప్పటికే రెండు సార్లు సిమెంటు చేయించాం. ఎందుకు బీటలిచ్చింది అంటే 'అబ్బే ఏం లేదండి ఏదో గాలి పగులు' అంటారు. మళ్ళీ చూడండి అదే చోట ఎట్లా బీటలిచ్చిందో" సుమతి గోడ వంకే పరీక్షగా చూస్తూ అంది.

'నువ్వన్నది గోడ గురించా' మనసులో అనుకుని "ఇంకోసారి సిమెంటు చేయిస్తే సరిపోతుంది. మేస్త్రీకి ఒకసారి రమ్మని కబురు చేద్దాం. ఆనిక్కి ఓసారి గుర్తుచెయ్" మళ్ళీ పేపర్లో తల దూరుస్తూ అన్నాడు భాస్కర్రావు.

అంతలో అతనికి ఆదివారం ప్రొద్దున్నే అంతసేపు పేపరు చదవటం సుమతికి ఇష్టం ఉండదని గుర్తొచ్చింది. వెంటనే పేపరు మడిచి టీపాయ్ మీద పెట్టి "ఇవాళేంటి ప్రోగ్రాం? ఎటన్నా వెళ్దామా?" అన్నాడు. ఆదివారం పొద్దున్నే కాఫీ తాగుతూ వరండాలో కూర్చునో, మొక్కల్లో తిరుగుతూనో పిచ్చాపాటీ మాట్లాడడం అంటే సుమతికి ఇష్టం. భాస్కర్రావుకి పేపర్ల పిచ్చి. రోజూ వచ్చే రెండు పేపర్లు కాక ఆదివారం అదనంగా ఇంకో రెండు పేపర్లు కొంటాడు. మొత్తం నాలుగు పేపర్లు ఆదివారం అనుబంధంతో సహా అయిపోయే వరకూ వరండాలో అరుగుమీద బాసింపట్టు వేసుక్కూర్చుని కదలడు. మధ్యలో రెండు టీలు.

కష్టం సుఖం మాట్లాడుకోడానికి ఇద్దరికీ కాస్త సమయం చిక్కేది ఆదివారమే. సుమతి హెడ్‌లైన్లు, ముఖ్యమైన వార్తలు చూసేసి పేపరు పక్కన పడేస్తుంది. కాసేపు మొక్కల్లో తిరుగుతూ ఏ మొక్క ఎంత పెరిగిందో, ఏ కొమ్మ ఎన్ని మొగ్గలు తొడిగిందో

చూస్తూ ఆ ఆనందాన్ని భాస్కర్రావుతో పంచుకోవాలని అనుకుంటుంది. అతనికి ఇవేవీ అంత పట్టవు. అసలు సుమతి ఎందుకు ఆనందపడుతుందో కూడా అతనికి అర్థం కాదు. 'మొక్కన్నాక పెరగదా మొగ్గలు వేయదా పూవులు పూయదా ఏంటో అన్నీ విచిత్రంగా మాట్లాడుతుంది. వెధవ పుస్తకాలన్నీ చదివి ఇలా చెడిపోయింది' మనసులో అనుకుంటాడు తిక్కగా. అతడు విచిత్రంగా చూడడంలోని అర్థం అర్థమై సుమతి కూడా తర్వాత మొక్కల గురించీ పువ్వుల గురించీ అతనికి చెప్పడం మానేసింది. ఏదైనా అరుదైన మొక్క పువ్వు పూసినప్పుడు మాత్రం ఆగలేక అనేది. భాస్కర్రావు 'అలాగా' అని ఊరుకునేవాడు.

అయితే ఇప్పటి పరిస్థితి వేరు. ఇద్దరూ ఒకరి ఇష్టాలు ఒకరి అయిష్టాలు ఒకరి కొకరికి నచ్చక విడిపోయి ఏడాది పాటు వేరు వేరుగా ఉండి కొన్ని "అనివార్య కారణాల" వల్ల మళ్ళీ కలిసి ఉండడం మొదలైనప్పటి నుంచీ పరిస్థితిలో మార్పు వచ్చింది. అతుకు పడనంత వరకూ ఫరవాలేదు. ఒకసారి అతుకు పడిన తర్వాత మాత్రం దాన్ని రెట్టింపు జాగ్రత్తగా కాపాడుకోవాల్సి ఉంటుంది. అది కాపురం అయినా, వస్తు సామాగ్రి అయినా.

అందుకే భాస్కర్రావు అలా పేపర్లు ముందేసుకుని కూర్చుని పరీక్షలు రాస్తున్నవాడిలా బట్టీ పట్టడాన్ని సుమతి సహించుకోవడాన్ని నేర్చుకుంది. అలాగే భాస్కర్రావు పేపర్లు గబగబా చదివేసి కొన్నిటిని రాత్రికి దాచిపెట్టుకుని మరీ సుమతి చెప్పే కబుర్లు వినడానికీ, మొక్కల క్షేమ సమాచారాన్ని ఆలకించడానికి ఆసక్తి కనబరచడం నేర్చుకున్నాడు. ఇరవై ఏళ్ళ కాపురంలో కొన్ని వందల వేల సార్లు చిన్నా పెద్దా గొడవలు పడి రెండుసార్లు విడిపోయి కొంతకాలం పాటు దూరంగా ఉండి మళ్ళీ కలిసిన తర్వాత ఇద్దరూ ఒకళ్ళ ఇష్టాలను ఒకరు ప్రేమగా కాక తప్పనిసరి అవసరంగా గుర్తించాల్సి వచ్చింది. రెండుసార్లు పడిన అతుకుని జాగ్రత్తగా కాపాడు కోవాల్సిన విషయం ఇద్దరికీ బాగానే అర్థమయింది.

ఏమాట కామాటే చెప్పాలి. అంతవరకూ ఇద్దరూ ఒక ప్రజాస్వామ్య దేశంలో తమకున్న వాక్ స్వాతంత్ర్యాన్ని పూర్తిగా ఉపయోగించుకుంటూనే వచ్చారు. నువ్వు 'హౌమచ్' అంటే నువ్వు 'హౌమచ్' అనేంతా స్వేచ్ఛను అనుభవించారు. కోపం వస్తే వర్ణమాలలోని అక్షరాల నన్నిటినీ ఉపయోగించుకుని, మరీ కోపం వస్తే ఇరుగు పొరుగు భాషల సహకారం తీసుకుని మరీ నోటికి పనిచెబుతూనే వచ్చారు. తమ

ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్నీ కాపాడుకుంటూనే ఇండియా పాకిస్థానుల్లా కలసిమెలసి సహజీవనం చేస్తూ వచ్చారు.

అయితే ఇప్పుడు ఇద్దరికీ ఆ స్వాతంత్ర్యం కాస్తా పోయింది. ఏ చిన్న తగాదా వచ్చినా అది ఎక్కడ మళ్ళీ పెద్ద తగాదా అవుతుందో ఎక్కడ మళ్ళీ రెండో వాళ్ళు మూటాముల్లె సర్దుకుంటారో నన్న భయం ఇద్దరికీ మొదలయింది. దాంతో ఇద్దరూ ఒకళ్ళకి ఒకళ్ళు కొత్త చుట్టాలు అయిపోయారు. ఒకళ్ళని ఒకళ్ళు సంతోషంగా ఎంగేజ్ చెయ్యడం నేర్చుకుంటున్నారు. అయితే అతుకు అతుకులానే తెలుస్తోంది ఇద్దరికీ. ఒకళ్ళ నొకళ్ళు నొప్పించుకోడానికి భయపడేవాళ్ళు అసలు భార్యాభర్త ఎలాగవుతారు?

"ఇవాళ్టి ప్రోగ్రాం అంటే ఏం చేద్దాం? పోనీ సాయంత్రం లేపాక్షి ఎగ్జిబిషన్‌కు వెళ్ళి హెూటల్లో ఏదన్నా తినేసి వద్దామా?" సుమతి 'ఉత్సాహంగా' అంది.

ఆదివారం వస్తే ఎడాపెడా వదిలేసి పోతున్న ఇల్లు సర్దుకుని తర్వాతి వారానికి కావాల్సిన వెచ్చాలు, కూరగాయలు తెప్పించి పెట్టుకుని కాస్త విశ్రాంతిగా నడుం వాల్చడం సుమతికి ఇష్టమని భాస్కరావుకి తెలుసు. భాస్కరావుకి బైట షికార్లు తిరిగి హోటల్లో ఇష్టమైన నాన్‌వెజ్ ఐటమ్స్ తింటే కాని ఆదివారం గడిచినట్టు అనిపించదని సుమతికి తెలుసు. ఇప్పటి పరిస్థితి వేరయ్యే మరి. ఇద్దరూ కొత్త దంపతుల్లా ఒకళ్ళ ఇష్టాల్ని ఒకళ్ళు పట్టించుకునే పనిలో ఉన్నారు. ఎంతైనా కొత్త దంపతులేగా. విడిపోవడం అంటే భయం పోవడానికి ఇంకొంత కాలం పడుతుంది.

"మార్కెట్‌కి పోయి మంచి చేపలు ఏమన్నా దొరికితే తేనా? అన్నం తిని కాసేపు రిలాక్సయిన తర్వాత ఓపికుంటే ఎగ్జిబిషన్‌కి వెళ్దాం లేకపోతే లేదు" అన్నాడు భాస్కరావు ఉదారంగా.

'ఆ చేపల కూర చచ్చీచెడి తోమితోమి వండేదానికన్నా హోటల్‌కి పోయి అపోలో ఫిష్ తినడమే నయం. ఈ దిక్కుమాలిన వంట ఎవడు కనిపెట్టాడో గానీ' మనసులోనే విసుక్కుంది సుమతి. ఏడాదిపాటు వంటరిగా గడిపిన జీవితంలో ఇష్టమైతే వండుకోవడం లేకపోతే ఏ టిఫినో తెచ్చుకుని తినడంలోని సౌఖ్యాన్ని హాయినీ రుచిచూసి కాస్త బద్ధకం దానితో పాటు వంట అంటే కాస్త ఏవగింపూ ఒంటబట్టింది సుమతికి.

భర్త హృదయంలోకి ప్రవేశించడానికి ఆడదానికి మంచి వంటను మించిన దగ్గరి దారి లేదని అమ్మమ్మ చెప్పిన ఉపాయంపై అప్పటికే నమ్మకం పోయింది ఆమెకి. "అప్పుడే ఎండ చూడండి. కరకరమని ఎలా మండిపోతోందో? ఈ ఎండలో మార్కెట్‌కి వెళ్ళి చేపలు తెచ్చే సరికి మీ పనీ, వండేసరికి నా పనీ అయిపోతుంది కానీ

ఈ పూటకి ఏదో ఒకటి వండేస్తాను. రాత్రికి బైటకు వెళ్ళి మీకిష్టమైన అపోలో ఫిష్ తిందాంలెండి" అని వరం ఇచ్చేసింది. పైగా "ఇవాళ ట్రీట్ నాదే. ఇంక్రిమెంట్ వచ్చిన సందర్భంగా" అంటూ కూడా కలిపింది.

"అయితే సరే" అన్నాడు భాస్కర్రావు త్యాగం చేయడానికి కుదరని నీరసంతో.

అంతకుముందు ఇంటికి సుమతి తరఫు బంధువులొచ్చినా భాస్కర్రావు తరఫు బంధువులొచ్చినా సహజ సిద్ధంగానే మర్యాదల్లో కొన్ని తేడాలు ఉండేవి. ఇప్పుడు పరిస్థితి అలా కాదు. ఒకసారి అతుకు పడిన కుటుంబంపై బంధువుల నిఘా సహజం గానే ఎక్కువగా ఉంటుంది. విడిపోతే బాధ పడేవాళ్ళకన్నా కలిసిపోతే బాధపడే శ్రేయోభిలాషులే ఎక్కువగా ఉంటారు. ఫలితంగా వాళ్ళ అభిమానం కొద్దీ "మీ ఆయన ఇప్పుడెలా వుంటున్నాడు?" "మీ ఆవిడ ఇప్పుడుఫరవాలేదా?" వగైరా పరామర్శలు చేస్తుంటారు. వాళ్ళ సమాధానం ఏ మాత్రం తేడాగా వున్నా బంధువులు ఆత్మ సంతృప్తితో నిట్టూరుస్తారు. "ఎంతైనా అతుకు అతుకే. నేను చెప్పలా" అంటూ గీతా జ్ఞాన రహస్యాన్ని బోధిస్తారు.

అందుకే అతుకు పడినప్పుడు బంధువుల్ని మరింత బాగా 'హేండిల్' చేయాల్సి ఉంటుంది. పాల కుండలో విషం చుక్క వేయగల సామర్థ్యం ఒక్క వారికే బాగా ఉంటుంది. సుమతికి ఇలాంటి కొన్ని దెబ్బల తర్వాత ఆత్మానుభవం కలిగి తత్వం బాగానే బోధపడింది. అంతకు ముందు భాస్కర్రావు తరఫు చుట్టాలు వస్తే ఏదో ఒకటి వండి పడేసే సుమతి ఇప్పుడు వాళ్ళు గుమ్మంలోకి వచ్చారో లేదో చికెన్ కోసం బుట్టా తట్టా ఇచ్చి అతన్ని బైటకు తరుముతోంది. ఆడవాళ్ళయితే చీరా సారె. ఇక సుమతి తరఫు బంధువులొస్తే కాసేపు ముళ్ళ మీద ఉన్నట్టుండి బైటకు జారుకునే భాస్కర్రావు తప్పనిసరిగా ఇంట్లోనే ఉండి వాళ్ళని ఎంగేజ్ చేస్తున్నాడు. కొండొకచో జోకులు కూడా వేస్తున్నాడు. వాళ్ళు రాగానే 'బిర్యానీ తెచ్చుకుందామా' అని హుషారు పోతున్నాడు.

ఇదివరకు భాస్కర్రావు తెచ్చిన సరుకులు, కూరగాయలు ఏమన్నా బాగోకపోతే ప్రాథమిక హక్కు అయిన వాక్ స్వాతంత్ర్యాన్ని పూర్తిగా ఉపయోగించుకునేది సుమతి. మొహం చిట్లించుకుని మరీ భర్త అప్రయోజకత్వంపై నిరసన ప్రకటించేది. సంచి లోంచి కూరగాయలన్నీ ఎత్తి ఎత్తి పడేస్తూ "అవున్లే మరి. అందరూ మంచి కూరగాయలే కొనుక్కుంటే పుచ్చులూ చచ్చులూ కొనేది ఎవరు? మరి వాళ్ళూ బతకాలిగా" అని ముక్తాయింపు ఇచ్చేది. ఇప్పుడు ఈ కొత్త పాతివ్రత్యం ఆమె నోటిని కట్టిపడేసింది.

కూరగాయలు ఎలా ఉన్నా వాటికి కూడా అతుకు వేయాల్సిన పరిస్థితి వచ్చింది.

"బెండకాయలు కొంచెం ముదురుగా ఉన్నట్టున్నాయి చూడు నేను అంత గమనించలేదు" అని భాస్కర్రావు అంటే.

"ఫరవాలేదు లెండి వేపుడు బదులు పులుసు చేస్తాను" అంటోంది సుమతి.

"వంకాయలు పుచ్చులున్నట్టున్నాయి. నేను చూడకుండా వేసేశాడు" అని భర్త అంటే

సతీ సుమతిలా "పోనీండి అంతగా తగ్గితే కూర బదులు బండపచ్చడి చేసేస్తాను. నోటికి వర్రగా ఉంటుంది" అంటోంది.

భాస్కర్రావు కూడా హఠాత్తుగా ధరించాల్సి వచ్చిన ఆదర్శ భర్త పాత్రలో ఉక్కిరిబిక్కిరి కాక తప్పడం లేదు. వంట ఆడవాళ్ళ సబ్జెక్టని తీవ్ర అభిప్రాయంతో ఉండేవాడు కాస్తా పొయ్యిమీద కూర వేగుతోంటే

"కూర నేను తిప్పుతుంటాలే. టైమవుతోంది. నువ్వు స్నానానికి వెళ్ళు" అంటున్నాడు. భార్య గంజిచీర కట్టుకుని కుచ్చెళ్ళు పెట్టుకోవడానికి అవస్త పడుతుంటే "నేను పట్టుకోనా?" అని అడిగేంత ఉదారత్వం ప్రదర్శిస్తున్నాడు కూడా. ఆ మాత్రానికే అతనేదో కాళ్ళు పట్టుకోనా అని అడిగినంత ఉలికిపడి "అబ్బెబ్బే ఛీ ఛీ అక్కరలేదు" అని అనాల్సి వస్తోంది సుమతికి.

ఇంతకు ముందు కూర నచ్చకపోతే ఎత్తిఎత్తి పళ్ళెం కేసి కొట్టే భాస్కర్రావు "అయ్యో కూరలో ఉప్పు, కారం తగ్గినట్టున్నాయండి" అని సుమతి అంటే

"ఫరవాలేదులే. డాక్టర్లు అవి తగ్గించమంటున్నారు. అయినా ఒకపూటకి ఎలా ఉంటే ఏంటి? ఆ మాత్రం సర్దుకోలేమా?" అంటూ వరాలిచ్చేస్తున్నాడు.

అసలు ఈ అతుకు వల్ల తనకేం లాభం అని కూడా సుమతి ఆలోచించి చూసుకుంది. బ్యాంకులో డబ్బువేయాలన్నా, తియ్యాలన్నా, సరుకులు, కూరగాయలు కావాలన్నా, ఫోన్ బిల్లులు, కరెంటు బిల్లులు కట్టాలన్నా సుమతికి తగని చిరాకు. ఇక ఇంటి రిపేరులు సరేసరి. ఇంట్లో ఏవైనా బరువైనవి ఎత్తాల్సి వచ్చినపుడు అర్ధరాత్రి ఫ్యూజులు పోయినప్పుడు ఆమెకు తప్పనిసరిగా భాస్కర్రావు గుర్తొచ్చేవాడు. సుమతి ఇంటి దగ్గరే వాళ్ళ ఆఫీసు అటెండరు ఉండేవాడు. అతను ఉన్నంతవరకూ సుమతికి భాస్కర్రావు అవసరం అంతగా తెలీలేదు. అసలు భర్త అవసరం ఏంటి? ఎంత వరకూ అనే జిజ్ఞాస కూడా అప్పుడప్పుడూ అమెకు కలుగుతుండేది. ఆ అటెండరు ట్రాన్స్ఫర్ అయిన తర్వాత కానీ సుమతికి భర్త వల్ల ఉండే ఉపయోగాలు అర్థం కాలేదు. భర్త

అవసరమా అనే జిజ్ఞాస ఎంతో కొంత అవసరమే అనే దగ్గరికి వచ్చి ఆగింది. అంతకు మించి భర్తతో ఏం ఉపయోగాలు ఉంటాయో ఎంత ఆలోచించినా సుమతి బుర్రకి అర్థం కాలేదు. అక్కడికీ ఓసారి పక్కింటి ఆవిడని అడిగి చూసింది. ఆవిడ చాలా సేపు ఆలోచించి బట్టలు ఆరేసుకునే తీగలు తెగిపోయినప్పుడు కట్టడానికి పనికొస్తారు అని చెప్పింది కానీ అంతకు మించి ఆవిడా చెప్పలేకపోయింది.

సుమతి నాయనమ్మ వంటకి ఎక్కువగా మట్టి పాత్రలే వాడేది. ఇంటి ఎదురుగా ఉన్న చెరువు ఎండగానే ఆల్చిప్పలు ఏరుకుని వచ్చి స్పూన్ల బదులు ఆల్చిప్పలనే స్పూన్లుగా వాడేది. పొంతకుండ మాటిమాటికీ చిల్లు పడుతుండేది. చిల్లు పడినప్పుడల్లా ఆ చిల్లులో గుడ్డపీలికలు దోపి నెట్టుకొచ్చేది తప్ప ఒక పట్టాన కొత్తకుండ కొనేది కాదు. అట్లా వాడి వాడి విసుగొచ్చిన రోజు కుండని ఎత్తి నేలకేసి కొట్టేది. “ఎందుకు నాయనమ్మా కుండని నేలకేసి కొట్టావ్?” అంటే “ఆ వెధవ కుండ. ఏంటీ దాన్ని బతిమాలేది? అదేమన్నా మొగుడా మొద్దులా అస్తారు పదంగా కాపాడుకోడానికి? ఎంతైనా ఓటికుండ ఓటికుండే” అనేది. సుమతికి ఎందుకో నాయనమ్మ గుర్తుకొచ్చింది.

జీవితం అలా మూడు రాజీలు ఆరు సర్దుబాట్లుగా కొంత కాలం బాగానే సాగింది. అయితే ఏంటో ఎందుకో తెలీదు గానీ జీవితం చాలా ఇరుకుగా తయారయిందన్న ఆత్మ జ్ఞానం కలిగింది ఇద్దరికీ. గుండె ఏంటో బరువెక్కిపోయినట్టు అయి నిద్ర పట్టడం మానేసింది. నిద్ర చాలక మొహంలో కళ పోయింది. కురవకుండా గడ్డకట్టుకుపోయిన మేఘంలా ఏదో బరువెక్కి పోతున్న భావన. సర్కస్‌లో తాడుమీద నడుస్తున్న పిల్లలా రకరకాల విన్యాసాలు చేసి చేసి, త్యాగాలు చేసి చేసి, ఉదారత్వం చూపి చూపి పాతివ్రత్యాన్ని, ఆదర్శ భర్తృత్వాన్ని నటించి నటించి ఇద్దరికీ బతుకుమీద రోత పుట్టి పోయింది.

అలా ఓ ముప్ఫయ్ ఆదివారాలు సజావుగా నడిచి నడిచి ముప్ఫయ్ ఒకటో ఆదివారం వచ్చింది. అప్పటికి భర్తృత్వం లోని ధీమా భాస్కర్రావుకి మళ్ళీ ఒంటబట్టింది. నాలుగు పేపర్లూ ముందేసుకుని కదలకుండా చదువుతూనే ఉన్నాడు. సుమతిలోని భార్య అది కనిపెట్టి జూలు దులిపి నిద్రలేచింది. ఆ రోజు భాస్కర్రావు తెచ్చిన కూరగాయలన్నీ ముదుర్లూ, చచ్చులూ పుచ్చులూ అయినై. ఆ రోజు అన్నం సుద్ద అయిపోయింది. పప్పు బద్దలు బద్దలుగానే ఉండిపోయింది. భాస్కర్రావు మొహం ముటముటలాడింది. సుమతి చిటపటలాడింది. ఆ రోజు మధ్యాహ్నం సుమతికి పడుకోవాలనిపించింది. భాస్కర్రావుకి బజారుకెళ్ళాలనిపించింది.

భాస్కర్రావు తెచ్చిన డోర్ కర్టెన్లు సుమతికి సుతరామూ నచ్చలేదు. సుమతి చేసిన పకోడీలు భాస్కర్రావుకి అంతకన్నా నచ్చలేదు. సుమతి పాతివ్రత్యాన్ని మడిచి పక్కన పడేసింది. భాస్కర్రావు ఆదర్శ భర్త ముసుగు తీసేశాడు. ఇద్దరిలో జీవకళ ఉరుకులు పరుగులెత్తి గంగా ప్రవాహంలా పొంగి పొరలింది. జిహ్వ చచ్చిపోయి ఉన్న నోటికి నోరూరింది. తెల్లజండా కిందకు దిగింది.

అప్పుడే స్వాతంత్రం సిద్ధించిన ఆదర్శ పౌరుల్లా ఇద్దరూ స్వేచ్ఛావాయువులు పీల్చారు. ముప్ఫయి వారాల ఉక్రోషాన్నీ మూడు గంటలపాటు అనర్గళంగా, వచ్చిన అన్ని భాషలకూ సమన్యాయం చేస్తూ తీర్చేసుకున్నారు. చూస్తుండగానే ఇద్దరూ బరువు తగ్గి గాల్లో తేలినట్టు అయిపోయారు. మళ్ళీ మామూలు భార్యాభర్తలుగా మారిన ఆనందాన్ని తనివితీరా అనుభవించారు. ఆ రాత్రి చాలా కాలం తర్వాత ఇద్దరికీ హాయిగా నిద్ర పట్టింది. మర్నాడు పొద్దున 'గిన్నెలకు మాట్లు వేస్తామండీ మాట్లు' అన్న కేకలతో ఇద్దరికీ మెలకువ వచ్చింది.

'ఎంతైనా అతుకు అతుకే' మంచం మీంచి లేస్తూ నూట పదకొండోసారి అనుకుంది సుమతి.

***'ఈనాడు' 13 ఏప్రిల్ 2014***

# తోడు

ఉదయం తొమ్మిదింటికే సూర్యుడు భగభగమని మండిపోతున్నాడు. మంగలంలోని పేలాల్లా జనం చిటపటలాడిపోతున్నారు. సూర్య అపార్ట్‌మెంట్ లిఫ్ట్ ఎప్పట్లానే పని చేయకపోవడం చూసి ఉసూరుమన్నాడు ఆదినారాయణ. మొదటి అంతస్తులో ఉన్న పెద్దకొడుకు ఇంటికి వెళ్ళడానికి ఆ నాలుగు మెట్లూ ఎక్కేటప్పటికే ఆయనకు ఆయాసం వచ్చింది. వళ్ళంతా చెమట్లు. అలుపు తీర్చుకోవడానికి కాసేపు గుమ్మం బైటే ఆగి తను వచ్చిన పనిని ఒకసారి రిహార్సల్ వేసుకుని మరీ లోపలకు అడుగు పెట్టాడాయన.

లోపల ఆయన అనుకున్నట్టే భీకరదృశ్యం కనపడింది. కోడలు వంటింటికీ బెడ్‌రూమ్‌కీ మధ్య పీటీ ఉషలా పరుగెడుతూ ఆఫీసుకి తయారవుతోంది. కొడుకు శంకర్ ఓ చేత్తో టిఫిను చేస్తూ ఓ చేత్తో షూ వేసుకుంటూ చెవికీ భుజానికి మధ్య సెల్ నొక్కిపెట్టి సెల్‌లో మాట్లాడుతున్నాడు. తండ్రిని చూడగానే రమ్మన్నట్టు తలూపి మళ్ళీ మాట్లాడుతూ వుండిపోయాడు. వంటింట్లోంచి బెడ్‌రూమ్‌లోకి పరిగెడుతున్న పార్వతి మామగారిని చూసి పానకంలో పుడకలా ఈయనేంటి ఈ హడావుడిలో అన్నట్టు చూసి ఏదో గుర్తొచ్చి మళ్ళీ వంటింట్లోకి పరిగెత్తింది. ఆదినారాయణ ధైర్యం తెచ్చుకుని మనవడి కోసం చూశాడు. మనవడు కనుచూపు మేరలో ఎక్కడా కనిపించలేదు.

శంకర్ కొడుకు ప్రకాష్ ఈ మధ్యే ఇంజనీరింగ్ పూర్తిచేసి ఉద్యోగాల వేటలో ఉన్నాడు. ఏవో కంప్యూటర్ కోర్సులు చేస్తూ ఇంట్లోనే ఉంటున్నాడు. ఇంత విశాల ప్రపంచంలో ఆయనకు కాస్త ఆసరా ప్రకాషే. మిగిలిన వాళ్ళంతా పరుగు పందెంలోనే ఉన్నారు. ఆయన ఆ పరుగును అందుకోలేకపోతున్నాడు. వాళ్ళ మధ్యకు వెళ్తే కాళ్ళకింద పడి నలిగిపోవడం తప్ప ఉపయోగం ఉండదని ఆయనకు స్వానుభవంతో తెలిసి వచ్చింది. ఆ గడియారాల బతుకుల్లో ఇమడలేకే ఆయన ఒంటరిగా ఉంటున్నాడు.

శంకర్ ఫోన్ ఎంతకీ తెమిలేలా కనిపించక "ప్రకాష్ ఏడిరా? కనిపించడం లేదు" అడిగాడు ఆదినారాయణ.

"బెంగుళూరులో ఏదో ఇంటర్వ్యూ ఉందని రాత్రే వెళ్ళాడు మామయ్యా" పార్వతి రన్నింగ్ చేస్తూనే చెప్పింది.

ఆదినారాయణ ప్రాణం ఉసూరుమంది. ఆయన ప్రకాష్ ఆశతోనే పెద్దకొడుకు ఇంటికి వచ్చాడు. ఆదినారాయణకు ఏడాది కిందట గుండెజబ్బు వచ్చింది. కొంతకాలం హాస్పిటల్లో ఉన్నాడు. డిశ్చార్జి చేసేటపుడు వాళ్ళు నెలకోసారి వచ్చి చెకప్ చేయించుకోవాలని చెప్పారు. అదే ఆయనకు ఇప్పుడు సమస్య అయిపోయింది.

మొదట నాలుగైదు నెలలు ఆయనకు ఏ ఇబ్బందీ లేకుండానే గడిచిపోయింది. ఎవరో ఒకరు వెంటబెట్టుకుని వెళ్ళేవాళ్ళు. సిటీలో అదే పెద్ద హాస్పిటల్. అపాయింట్ మెంట్ తీసుకున్నా చెకప్ చేయించుకుని మందులు తీసుకుని రావడానికి ఎంతలేదన్నా ఒక పూట పని. ఈ పరుగు ప్రపంచంలో ఒకళ్ళ కోసం ఒకపూట కేటాయించగలగడం ఎవరికి సాధ్యం? ఆదినారాయణ కొడుకులకు అసలు సాధ్యం కాదు.

ఆదినారాయణ పెద్దకొడుకు శంకర్ బ్యాంక్ మేనేజర్. అతనికి తనకోసం తను సెలవు పెట్టుకోడానికే కుదరదు. ఒకప్పుడు బ్యాంకు ఉద్యోగం వస్తే కడుపులో చల్ల కదలనట్టే అనేవాళ్ళు. శంకర్ మాత్రం ఉద్యోగం చెయ్యలేక టెన్షన్ పడిపోతున్నాడు. ఎప్పటికప్పుడు ఈ వెధవ ఉద్యోగం ఇంక చెయ్యలేను. వీ ఆర్ ఎస్ తీసేసుకుంటాను అంటుంటాడు. పిల్లల బాధ్యతలు తీరేంత వరకన్నా చేద్దామని నెట్టుకొస్తున్నాడు. అకౌంట్లతో కుస్తీ పట్టి కుస్తీ పట్టి ఏ తొమ్మిదింటికో ఇంటికి చేరే శంకర్‌కి భార్యా, కొడుకూ, కూతురూ, తల్లీ, తండ్రీ ఎవరూ లేరు. బ్యాంక్ ఉద్యోగం, దాని తాలూకు టెన్షన్లు, దాని తాలూకు ఫోన్లు మాత్రమే ఉన్నాయి. అందుకని ఆదినారాయణ పెద్దకొడుకుని లిస్టులోంచి తీసేశాడు.

ఏదన్నా ఆటో చేసుకుని వెళ్ళడం వరకూ అయితే వెళ్ళగలడు కానీ ఆ ఐదు నక్షత్రాల హాస్పిటల్ ఎప్పటికప్పుడు ఆయన్ని కంగారు పెడుతూనే ఉంటుంది. రిసెప్షన్‌లో డబ్బులు కట్టడంతో ఆయన కష్టాలు మొదలవుతాయి. ఆ అమ్మాయి ఏ మూడు వందలో నాలుగు వందలో కట్టమంటుంది. ఆయనకు వేళ్ళు వణుకుతాయి. డబ్బులు ఏ జేబులో ఉన్నాయో చప్పున గుర్తురాదు. వెతికి వెతికి డబ్బులు తీస్తే ఆ అమ్మాయి చిల్లర ఇమ్మంటుంది. లేదంటే విసుక్కుంటుంది. చిల్లర మార్చి తెమ్మనలేక, ఆయన్ని చూసి మీరే వచ్చారా? ఇంకెవరన్నా ఉన్నారా అని అడుగుతుంది. ఒక్కడినే వచ్చానని

అంటే ఈ వయసులో ఒకళ్ళే రాకపోతే ఎవరినన్నా తోడు తెచ్చుకోకపోయారా అంటుంది. ఇంక అక్కడి నుంచీ మొదలు.

ఆయనకు షుగరు, బీపీ ఉన్నాయి. డాక్టరు దగ్గరికి వెళ్ళేలోపలే షుగరు, బీపీ. ఈసీజీ అవసరమైతే ఎకో టెస్ట్ చేయించుకుని రిపోర్టులు తీసుకోవాలి. షుగర్ టెస్టుచేసే డాక్టర్ రూమ్ కింద సెల్లార్‌లో ఉంటుంది. అక్కడికి వెళ్ళగానే ఎదురయ్యే మొట్టమొదటి ప్రశ్న "మీరు ఒక్కరే వచ్చారా? ఎవరన్నా తోడు వచ్చారా? లేదనగానే డెబ్బయ్యేళ్ళ వయసులో మీరు ఒంటరిగా రాకూడదు తాతగారూ, కళ్ళు తిరిగితే ఏం చేస్తారు? ఈసారి నుంచీ ఒకళ్ళే రావద్దు. డాక్టర్ గారు ఊరుకోరు" నర్సు చిలక పలుకులు వల్లిస్తుంది.

షుగర్ టెస్టు అయిన తర్వాత మొదటి అంతస్తులోకి వెళ్ళి ఇసిజి చేయించుకోవాలి. వాటి రిపోర్టులన్నీ వచ్చిన తర్వాత ముందు చిన్న డాక్టరు గదిలోకి పంపిస్తారు. ఆయన అన్నీ చెక్‌చేసి బీపీ చూసి ఓపీనియన్ రాసిన తర్వాత మళ్ళీ గంటపాటు ఓపీలో నిరీక్షణ. అప్పుడు కానీ పెద్ద డాక్టరు దగ్గరికి వెళ్ళడానికి కుదరదు. ఆయన కూడా ఏదన్నా చెప్పాల్సి వస్తే అదే ప్రశ్న "వెంట ఎవరన్నా వచ్చారా?"

ఈ మధ్య ఆయన్ని ఆ ప్రశ్న ఇబ్బంది పెడుతోంది. వేలవేల శబ్దాలుగా మారి భయపెడుతోంది. అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు బిజీగా ఉన్నారని, వచ్చేంత తీరిక ఎవరికీ లేదని డాక్టర్‌కి ఎలా చెబుతాడు? ఎవరూ తోడురాకపోవడం ఒక ఎత్తూ, ఎవరూ రాకపోతే ఎవరూ పట్టించుకోవడం లేదు వదిలేశారు అనుకుంటారేమోనన్న భయం ఒక ఎత్తూగా ఆయన్ని హింస పెడుతోంది. అసలే అంతంత మాత్రంగా ఉంటే రెండు నెలల కిందట ఆయనకి ఆస్పత్రిలోనే కళ్ళు తిరిగినై. ఆ రోజు సోమవారం. జనం విపరీతంగా ఉన్నారు. అనుకున్న దాని కన్నా బాగా లేటయింది. తినడానికి కూడా ఏమీ దొరకలేదు. డాక్టర్ రూమ్‌లోకి వెళ్ళేసరికల్లా వళ్ళు చెమటలు పట్టి కళ్ళు బైర్లు కమ్మడం మొదలైనాయి. డాక్టరు ఆయన పరిస్థితి చూసి ఒక చాక్లెట్ తినమని ఇచ్చి చప్పున బికాంప్లెక్స్ ఇంజెక్షన్ చేశాడు. కొంచెం తేరుకోగానే గడ్డి కూడా పెట్టాడు. ఇక మీదట ఒక్కడే వస్తే ఊరుకోనని కచ్చితంగా చెప్పేశాడు. అప్పటి నుంచీ ఆయన కష్టాలు మొదలైనయ్యి. రెండు నెలల్నుంచీ ప్రకాష్ ఆయన్ని వెంట పెట్టుకుని వెళుతున్నాడు. రేపు మళ్ళీ డాక్టర్ దగ్గరికి వెళ్ళడానికి అపాయింట్ తీసుకున్నాడు. అందుకే ప్రకాష్ కోసం వచ్చాడు.

"ప్రకాష్ ఎందుకు నాన్నా? హాస్పిటల్‌కేనా" శంకర్ అడిగాడు.

"అవునురా. రేపు వెళ్ళాలి" అన్నాడు ఆదినారాయణ.

"పోనీ ఓ రెండు రోజులు ఆగి వెళ్ళండి నాన్నా. అప్పటికి ప్రకాష్ వచ్చేస్తాడు." షర్టు తగిలించుకుంటూ అన్నాడు శంకర్.

"మందులు కూడా అయిపోయినయ్యిరా. పైగా రేపటికి అపాయింట్‌మెంట్ తీసుకున్నాను" ఆయన చెప్పాడు.

"మందులు మరీ అలా బొటాబొటీగా తీసుకోకపోతే ఓ రెండు రోజులు ఎక్స్ట్రాగా తీసుకోవచ్చుగా నాన్నా? రెండు రోజులు ఆలస్యమైతే ఏమవుతుంది? అంత కచ్చితంగా అదే రోజుకి వెళ్ళాలంటే కుదరొచ్చు కుదరకపోవచ్చు. పోనీ నేను తీసుకెళదామనుకుంటే నేను షుగర్, బీపీ టెస్టు చేయించుకుందామంటేనే నెలరోజులుగా కుదరక పాత మందులే వాడుతున్నాను. బ్యాంక్‌లోనేమో పని వత్తిడి ఎక్కువగా ఉంది" తాళం చేతిలోకి తీసుకుంటూ అన్నాడు శంకర్. అంటే ఇంక వాళ్ళు బయలుదేరబోతున్నారని అర్థం. ఆదినారాయణ కూడా లేచి నుంచున్నాడు.

"సరేలేరా. ఈసారికి చిన్నాడిని అడిగిచూస్తానులే" అన్నాడు పెద్దకొడుకుని నొప్పించకూడదని.

"ఊ. అడుగు పోనీ. ప్రకాష్ గాడు కూడా విసుక్కుంటున్నాడు. ఎప్పుడూ హాస్పిటల్‌కు నేనే తీసుకువెళ్ళాలా అని. మూడు నాలుగు గంటల పైగా పడుతోందిగా. చదువుకోడానికి కుదరడం లేదంటున్నాడు. అయినా చిన్నాడికి కూడా తీసుకెళ్ళాల్సిన బాధ్యత ఉందిగా" శంకర్ అన్నాడు.

ఆదినారాయణ మనసు కలుక్కుమంది. ప్రకాష్ విసుక్కుంటున్నాడన్న విషయం ఆయనకు తెలీదు. పోనీలే వాడన్నా తోడుగా వస్తున్నాడని సంతోషించాడు ఇన్నాళ్ళూ. ఇప్పుడు ఆ ఆశ కూడా పోయింది.

చిన్నాడనే శివ ఆదినారాయణ రెండో కొడుకు. హైస్కూల్లో టీచరుగా పని చేస్తున్నాడు. ఈ ఏడే అతనికి హెడ్మాస్టరుగా ప్రమోషన్ వచ్చి వేరే జిల్లాకి బదిలీ చేశారు. భార్య ఇక్కడే టీచరుగా పనిచేస్తోంది. పిల్లల చదువులు డిస్టర్బ్ కాకూడదని తనే తిరుగుతున్నాడు. పొద్దున్నే ఏడింటి ట్రైనుకి బయలుదేరి వెళ్ళి రాత్రి ఎనిమిదింటికి ఇంటికి చేరతాడు. అందరూ లేచి టీలు తాగే టైముకి రెలెక్కడానికి పరిగెత్తిపోవాల్సి వస్తోందని చికాకు పడుతుంటాడు. "ఛీ వెధవ జీవితం. ఈ రైలు ప్రయాణం తప్ప నేను ఇంకేమీ చేస్తున్నట్టు కనిపించడంలేదు. టైమ్ అంతా అదే తినేస్తోంది" అని విసుక్కుంటుంటాడు ఇంట్లో.

ఆదినారాయణ వెళ్తూ చూస్తే చిన్నకొడుకు ఇంటి తలుపులు తీసి కనిపించాయి. వెళ్ళి చూస్తే శివ ఇంట్లోనే ఉన్నాడు. కొడుకు చైతన్య కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. "ఒకసారి మీ ఫాదర్‌ని రమ్మను. మాట్లాడాలి" అని కాలేజీ వాళ్ళు అనడంతో ఆ రోజు సెలవు పెట్టుకున్నాడట. మర్నాడు కూడా సెలవు పెట్టమని అతన్ని ఇంకేం అడుగుతాడు?

కొడుకులు, కోడళ్ళ ఉరుకుల పరుగుల జీవితాలు చూసే వాళ్ళు వచ్చి ఉండమన్నా ఉండకుండా ఆదినారాయణ పాత ఇంటిలోనే ఒక్కడే ఉంటున్నాడు. చుట్టాల ముసలమ్మ ఒకామె ఇంట్లోనే ఉండి వంట చేసి పెడుతుంటుంది. దగ్గర్లోనే ఇద్దరు కొడుకుల ఇళ్ళు. సాగినంతకాలం వాళ్ళని ఇబ్బంది పెట్టకూడదనేది ఆయన కోరిక.

ఆదినారాయణ లేస్తుండగా అడిగాడు శివ "ఏంటి నాన్నా ఏదన్నా పనిమీద వచ్చావా?" అని.

"హాస్పిటల్‌కి వెళ్ళాలిరా రేపు. ప్రకాష్ బెంగుళూరు వెళ్ళాడంట. హాస్పిటల్ వాళ్ళేమో ఒక్కడివీ రావద్దు ఎవర్నన్నా వెంట పెట్టుకుని రండి అని ప్రాణం తీస్తున్నారు. మీ అందర్నీ చూస్తున్నా కదా. ఎవరి హడావుడి వాళ్ళది. ఇంక మిమ్మల్ని ఏం అడిగేది?" అన్నాడు.

"పోనీ ఇవాళ వెళదామా నాన్నా? ఇవాళైతే నాకు కుదురుతుంది."

"అప్పాయింట్‌మెంట్ రేపు తీసుకున్నారా. అప్పాయింట్‌మెంట్ లేకుండా అయితే చాలా టైము పడుతుంది. ఎమర్జెన్సీ అయితే తప్ప రావద్దంటారు" చెప్పాడు ఆదినారాయణ.

"నువ్వు ఏ పని చేసినా అంతే నాన్నా. అంత టైట్ షెడ్యూల్ పెట్టుకోవద్దు అని ఎప్పుడూ చెబుతుంటా. వినిపించుకోవు. ఒకరోజు అటూ ఇటూ అయితే ఏం అవుతుంది. ఇంతలోకే ప్రాణాలు పోతాయా" విసుక్కున్నాడు శివ.

ఆదినారాయణ ప్రాణం చివుక్కుమంది. శివకి ముక్కు మీద కోపం ఉంటుంది. చిన్నప్పటి నుంచీ అంతే. ఎవర్ని ఎంత మాటైనా పుటుక్కుమని అనేస్తాడు.

"పోనీలేరా. నీకు కుదరకపోతే ఏం చేస్తావు? ఈసారికి నేనే ఏదో ఒక ఏర్పాటు చేసుకుంటాలే" అంటూ లేచాడు ఆదినారాయణ.

మర్నాడు పొద్దున ఏ కొడుకన్నా అడుగుతాడేమో, హాస్పిటల్‌కు తీసుకు వెళతానంటాడేమో అని చూశాడు. ఎవరూ ఫోన్ చేయలేదు. పోనీ ఒక్కడే వెళ్దామా అనుకున్నాడు. అక్కడి మెట్లు ఎక్కి దిగి పడే హింస తల్చుకుని, డాక్టర్ అనే మాటలు

తల్చుకుని ధైర్యం చాలలేదు. పైగా వంట్లో ఆ రోజు కొంచెం నీరసంగా ఉన్నట్టనిపించింది. ఆ నీరసం మీద మళ్ళీ కళ్ళు తిరిగితే. డాక్టరు తిట్టినతిట్టు తిట్టకుండా తిడతాడు. ఇన్నాళ్ళూ డబ్బులు లేకపోతే మనుషులకి ఇబ్బంది అనుకున్నాడు. ఆయన టీచరుగా చేసి రిటైరయ్యాడు. నెలకు పదిహేను వేలు పెన్షన్ వస్తుంది. కావాల్సింది కాస్త తోడు. వెంటపెట్టుకుని నాలుగు పరీక్షలు చేయించి ఇంటికి తీసుకురాగల మనిషి.

తన చిన్నప్పుడు ఊళ్ళో శివాలయం పూజారి ఉండేవాడు. ఊళ్ళో ఎవరికి ఒంట్లో బాగోలేకపోయినా ఆయనే మందులిచ్చేవాడు. ఆయన్ని పంచదార గోళీల డాక్టరనే వాళ్ళు. చెరువు, చెరువు పక్కనే శివాలయం, చెరువులోని ఎర్ర కలువలు, శివాలయంలోని పారిజాతాలు, గన్నేరులూ, గోపురం మీది పావురాల కువకువలు ఆ వాతావరణంలోనే ఏదో మహాత్యం ఉండేది. నాలుగు బల్లలూ, ఒక కుర్చీ టేబిలూ ఉండే ఆ రెల్లుగడ్డి ఆస్పత్రికి పోతే ఎంత రోగం ఉన్నా మనసుకి ఏదో తెలీని నిశ్చింతగా ఉండేది. రోగం తగ్గిపోతుందన్న ధీమా ఉండేది. అదేంటో ఈ ఐదు నక్షత్రాల ఆస్పత్రిని చూసినప్పుడల్లా గుండె దడ పుట్టడం, ఇది మనది కాదు, మనకు సంబంధం లేనిది అనిపించడం తప్ప ఆ నిశ్చింత రాదు. పక్కన కూర్చున్నవాళ్ళ డబ్బు లెక్కలు, ఇంత కట్టమంటున్నారు, అంత కట్టమంటున్నారు అనేది తప్ప ఇంకో మాట వినపడదు. వెనకటికి పేరుకూడా తెలియని ఇన్ని రోగాలు లేవు. ఇప్పుడు రోగులు, రోగాలు, ఆస్పత్రులు అన్నీ అలాగే పెరిగిపోయినయి అనుకున్నాడు ఆదినారాయణ.

ఆయనకు ఎవరిమీదా కోపం లేదు. కొడుకుల జీవితాలు దగ్గర నుంచీ చూస్తున్నాడు. నిజంగానే వాళ్ళకి తీరికలేదు. వాళ్ళకి వాళ్ళు హాస్పిటల్‌కి వెళ్ళాలన్నా తీరిక లేనంత బిజీ బతుకులు వాళ్ళవి. జీవితాలే అలా అయిపోయినై. ఉద్యోగాలు చేయటం తప్ప ఎవరూ ఇంకేమీ చేయలేకపోతున్నారు. వాళ్ళకే వాళ్ళు ఉపయోగపడలేక పోతున్నారు. ఇంక మిగిలిన వాళ్ళకు ఏం ఉపయోగపడతారు. తనూ ఒకప్పుడు అలా పరుగు పెట్టినవాడే. ఇప్పుడు పరుగు పందెం నుంచీ తప్పుకున్నాడు. వాళ్ళు ఇంకా పరిగెడుతున్నారు.

మనుషులవి క్లోజ్‌డ్ నెట్ జీవితాలు అయిపోయినై. అందులో భర్త, భార్య, పిల్లలు వాళ్ళ అవసరాలకే ఏదన్నా ఉంటే కాస్త అవకాశం. అమ్మ, నాన్నా, అక్కా, అన్నా, చెల్లి అన్నీ ఎక్స్‌ట్రా బ్యాగేజీనే. అదనపు లగేజీనే.

ఏ పనికైనా ఖాళీలేదు. బిజీ బిజీ అంటారు అసలు కొడుకులు చేస్తున్న పని

ఏమిటా అని ఆలోచించాడు ఆదినారాయణ. వాళ్ళు ఉద్యోగాలు తప్ప ఇంకే పనులు చేస్తున్న దాఖలాలు ఏమీ కనిపించలేదు. కొడుకులకి ఏ పని చెప్పినా చిన్నపని అయితే ఆదివారం చూద్దాం అంటారు. పెద్దపని అయితే రిటైరయ్యాక చూద్దాం అంటారు. ఇల్లు కట్టుకోండిరా అంటే రిటైర్ అవ్వాలంటాడు పెద్దకొడుకు. ఉద్యోగం చేస్తూ ఏపని అయినా ఎలా కుదురుతుంది అంటాడు. ఏదన్నా అంటే 'బతకడానికి ఉద్యోగం చేయాలిగా నాన్నా అంటాడు'. బతకడం కోసం ఉద్యోగం చేస్తూ పోతే మరి బతికేది ఎప్పుడు? అసలు బతుకే లేనివాళ్ళ మీద ఏం నిష్టూరపడగలడు?

హాస్పటల్‌కి వెళ్ళడానికోసం ఇంత మందిని ప్రాధేయపడి, ఎవరన్నా తోడు వస్తారో రారో అని టెన్షన్ పడి, వస్తే ఆనందపడి, రాకపోతే కంగారు పడి – ఇదంతా దేని కోసం అనిపించింది ఆదినారాయణకి. ఈ జీవితాన్ని ఇంకా ఇంకా పొడిగించి ఏం చేయాలి? పూటకు గుప్పెడు మందులు మింగి పేగుల్నిండా విషం నింపుకొని బతకకపోతే ఏం పోతుంది? ఈ ఎక్స్‌టెన్షన్ ఎవరి కోసం? దేని కోసం? ఆయన నిర్లిప్తంగా నవ్వుకున్నాడు.

మర్నాడు పొద్దున పెద్ద కొడుకు ఫోన్ చేశాడు.

"హాస్పటల్‌కు వెళ్లావా నాన్నా? డాక్టర్ ఏమన్నాడు?"

"చాలా వరకు మెరుగు పడిందంటరా. ఇంక మందులు మానేయొచ్చన్నాడు. తేలికపాటి వ్యాయామాలు చేసుకుంటే చాలన్నాడు" తడుముకోకుండా చెప్పాడు ఆదినారాయణ.

*'చినుకు' మే 2014*

# అలక

**ఆ**టో ఇంటికి వెళ్ళే మలుపు తిరుగుతుండగా గుర్తొచ్చింది కృతికి ఇంట్లో కూరగాయలు ఏమీ లేవని. ఆటోని ఆపమని చెప్పి మూలన ఉన్న కొట్లో గుడ్లు, ఉల్లిపాయలు తీసుకుంది. సంతోషంతో గాల్లో తేలిపోతున్నట్టుగా ఉంది కృతికి. రోజూ చూసే పరిసరాలే ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా అనిపిస్తున్నాయి. ఎక్కడి నుంచో సన్నజాజుల పరిమళం గాల్లోంచి తేలి వచ్చింది. తలెత్తి చూసింది.. ఆకాశంలో కనిపించీ కనిపించనట్టు సన్నని రేఖలా నెలవంక. పక్కనే తళుక్కుమంటూ మెరుస్తున్న నక్షత్రం. ఆమె మనసు చిత్రమైన సంతోషంతో నిండిపోయింది. ఇంటికి ఎప్పుడెప్పుడు వెళ్ళి రిషితో ఆనందం పంచుకోవాలా అని తహతహగా ఉంది ఆమెకి. ఈ నెలనుంచీ శాలరీలో పదివేల హైక్. ప్రాజెక్టు పూర్తవగానే శాలరీ పెరుగుతుందని అనుకుంటున్నదే. ఐదువేలు పెరుగుతుందేమో అనుకుంది కృతి. పదివేలు అనేటప్పటికల్లా అంతవరకూ పడిన కష్టం దూది పింజెలా తేలిపోయినట్టు అనిపించింది. చకచకా మెట్లెక్కి హుషారుగా ఇంట్లోకి అడుగు పెట్టింది. కృతిని చూస్తూనే అంతవరకూ చూస్తూ ఉన్న టీవీ కట్టేసి లాప్‌టాప్ ఓపెన్ చేశాడు రిషి.

కృతి ఉత్సాహం చప్పున చల్లారి పోయింది. అప్పుడు గానీ ఆమెకు గుర్తుకు రాలేదు ఉదయం జరిగిన గొడవ. రిషి ముభావంగా ఉండడం చూసిన తర్వాత అతను దాన్ని సీరియస్‌గా తీసుకున్నాడని అర్థమయింది.

ఇవాళ ప్రాజెక్ట్ సబ్మిట్ చేయాల్సిన రోజు. పొద్దుట్నించీ ఏదో తెలీని కంగారు. హడావుడిగా పరిగెడుతూ పనులు చేస్తున్నా మనసు స్థిమితంగా లేదు. ఆలోచనంతా ప్రాజెక్టు మీద వుంది. పాలు పొంగబెట్టింది. ఇడ్లీలోకి చట్నీ చేయడానికి వేపిన మిరపకాయలు నల్లగా, బొగ్గుల్లా అయ్యాయి. మళ్ళీ మిరపకాయలు వేపేంత టైమూ లేదు. స్థిమితమూ లేదు. అల్మరాలో నుంచి అల్లపచ్చడి సీసా టేబిల్ మీద పెట్టి రిషికి

చెప్పింది. ఇడ్లీల్లోకి చట్నీ లేదు ఈ పూటకి అల్లప్పచ్చడితో తినేయవా ప్లీజ్ అని. టిఫిన్ చెయ్యకపోయినా ఫరవాలేదు కానీ చేస్తే కనుక మాత్రం అన్నీ కచ్చితంగా ఉండాలి రిషికి. చట్నీ లేందే అందులోనూ వేరుశెనగ పచ్చడి లేందే ఇడ్లీకానీ దోశ కానీ ముట్టడు. ఆ విషయం కృతికి కూడా తెలుసు. అందుకే భయం భయంగానే చెప్పింది.

"చట్నీ లేకపోతే నేను తిననని తెలుసుకదా" రిషి విసుక్కొన్నాడు.

కృతి కోసం అప్పటికే కాబ్ వచ్చేసింది. డ్రైవరు హారన్ కొడుతున్నాడు. కృతికి చిరాకనిపించింది.

"ఒక్కరోజుకి చట్నీ లేకపోతే ఏమయింది? ఏదో ఒకటి వేసుకుని తినొచ్చుగా" కృతి కూడా విసురుగానే అంది.

"నా సంగతి నేను చూసుకుంటాను. నువ్వెళ్ళు" రిషి అసహనంగా అరిచాడు.

కృతి మాట్లాడకుండా నాలుగు ఇడ్లీలు, చట్నీ బాక్సులో సర్దుకుని బ్యాగ్ తీసుకుని బైట పడింది. తర్వాత ఆఫీస్ హడావుడిలో పడి ఆ విషయమే మర్చిపోయింది. బ్యాగ్ లోంచి లంచ్ బాక్సు తీసి కిచెన్ గట్టుమీద పెడుతూ హాట్‌ప్యాక్ మూత తీసి చూసింది. పొద్దున పెట్టిన ఇడ్లీలు పెట్టినట్టే ఉన్నాయి. అంటే రిషి టిఫిన్ చెయ్యలేదన్నమాట.

కృతికి ప్రాణం ఉసూరు మనిపించింది. రిషి మళ్ళీ అలిగాడు. ఆ మాటనుకోగానే ఎక్కడలేని నీరసం ముంచుకొచ్చింది. రిషిని ఎట్లా అర్థం చేసుకోవాలో ఆమెకు బోధపడలేదు. ఉన్నంత సేపూ బాగానే ఉంటాడు. నవ్వుతూ కబుర్లు చెబుతాడు. సినిమాలకూ, షికార్లకూ కలిసి తిరుగుతారు. కానీ అలిగాడంటే చాలు నత్తగుల్లలా ముడుచుకు పోతాడు. ఆ అలక అలక అలా పది రోజులు పదిహేను రోజులు సాగుతూనే వుంటుంది. కృతి ఏదన్నా అడిగినా ముక్తసరిగా సమాధానం చెబుతాడు. ఏదైనా బలమైన సంఘటనో, ఫ్రెండ్సో, చుట్టాలో ఎవరన్నా రావడమో ఏదో ఒకటి జరిగితే తప్ప మళ్ళీ మామూలుగా అవడు.

అయిన లేటు ఎలాగూ అయింది. ఆ చట్నీ ఏదో చేసేసి వెళితే బాగుండేది. ఈ అలక భరించేదానికన్నా అదే నయం. ఏంటో అప్పుడు తట్టిచావలేదు మనసులో తిట్టుకుంది. అయినా పైకి ఉత్సాహం తెచ్చుకుంటూ...

"రిషీ. కాఫీ తాగుతావా?" అడిగింది.

"ఉహూ వద్దు" ముభావంగానే అన్నాడు.

"పోనీ టీ పెట్టనా?"

"ఇందాక తాగాను."

అది అబద్దం. తప్పించుకోడానికి ఆ మాట అన్నాడని తెలుసు. అయినా పట్టించుకోకుండా "ఇవాళ ఆఫీసులో ఏమయిందో తెలుసా. ప్రాజెక్టు సబ్మిషన్ డే కదా. అనుకున్నట్టే శాలరీ పెంచారు. ఎంతో తెలుసా. పదివేలు" మెరుస్తున్న కళ్ళతో హుషారుగా చెప్పింది.

"ఊ. సరే. నాక్కొంచెం తలనెప్పిగా ఉంది. కాసేపు పడుకుంటాను" ముక్తసరిగా అంటూ బెడ్‌రూంలోకి నడిచాడు రిషి.

"తల వత్తనా?" అడిగింది కృతి.

"అక్కర్లేదు" తుంచినట్టుగా అని అటువేపు తిరిగి పడుకున్నాడు.

"కాసేపు పడుకో అయితే. వంట అయిన తర్వాత లేపుతాను" అంది.

"నాకు ఆకలి లేదు. అన్నం తినను. నాకు వండొద్దు" దుప్పటి తీసి ముసుగు పెట్టుకున్నాడు రిషి. ఇంక ఆ మాటకు తిరుగులేదని కృతికి తెలుసు.

నీరసంగా హాల్లోకి తిరిగివచ్చి సోఫాలో కూర్చుండిపోయింది కృతి. రిషి ఎప్పుడూ అంతే. అలిగినన్ని రోజులూ అన్నం తినడు. ఏ పూటకి ఆ పూట వండడం పడేయడం. వండక పోతే వండలేదని అనుకుంటాడేమోనని వండుతుంది. తింటే తింటాడు లేకపోతే లేదని. ఇంక ఇట్లా అయితే ఎలా? ప్రతి దానికీ అలిగి రోజుల తరబడి మాట్లాడకపోతే ఇంట్లో ఎలా గడుస్తుంది? ఒకే ఇంట్లో అపరిచితుల్లా ఎడమొహం పెడమొహంగా ఎలా ఉండడం?

పెళ్ళయిన కొత్తల్లో హైదరాబాదు వచ్చినపుడు సభద్ర రిషి అలవాట్ల గురించి కృతికి చెప్పింది. వాటిల్లో ఏది తేడా వచ్చినా రిషి సర్దుకోడని ఆ ఒక్క జాగ్రత్త తీసుకుంటే చాలని.

రిషి అన్నం తినకపోతే ఇంక తన ఒక్కదానికే వంట ఏం చేసుకుంటుంది? చేసే ఓపికా, ఉత్సాహం కూడా చచ్చిపోయింది. పొద్దుటి ఇడ్లీలు ఉన్నాయని గుర్తొచ్చింది. అవి తిని సరిపెట్టుకుందాంలే అనుకుంది. వండుకునే ఓపిక కూడా లేదు. అదే రిషి తింటానంటే ఓపిక ఎక్కడి నుంచీ వచ్చేదో కృతికి అర్థం కాలేదు. తనని చూసి తనకే ఆశ్చర్యం అనిపించింది. అమ్మ కూడా అచ్చంగా ఇలాగే చేసేదని కృతికి హఠాత్తుగా గుర్తొచ్చింది.

నాన్న ఊళ్ళో ఉంటే రెండు రకాల కూరలు, వడియాలు, అప్పడాలు అంటూ హడావుడి చేసే అమ్మ ఏదన్నా పనిమీద నాన్న ఊరు వెళితే పిల్లలకి ఏ ఆమ్లెట్లో

వేసిపెట్టి ఆవకాయ పచ్చడితో అన్నం తినడం తనకు బాగా గుర్తు. “ఏదన్నా కూర చేయవచ్చుకదమ్మా” అంటే “నాన్న లేరుగా మనమే కదా. ఈ పూటకి దేనితో దానితో సరిపెట్టుకుందాంలే. ఓ పూటన్నా కాస్త ప్రాణానికి తేలిగ్గా ఉంటుంది” అనేది.

“ఏ నాన్న ఒక్కడే మనిషా? నువ్వు మనిషివి కాదా?” అని తను దెబ్బలాడేది. అమ్మ నవ్వి ఊరుకునేది. ఆ నవ్వుకి అప్పుడు అర్థం తెలియలేదు. ఇప్పుడు ఆలోచిస్తే అర్థం అవుతోంది.“రేపు నువ్వేం చేస్తావో నేనూచూస్తాగా” అనేది ఆ నవ్వుకి అర్థం అని.

ఇడ్లీ చప్పగా చల్లారి హాట్ ప్యాక్‌లో పెట్టడం వల్ల కాబోలు ఒకలాంటి ఉడుకు వాసన వేస్తోంది. ఇడ్లీ తింటుంటే ఆమెకు ఎక్కడలేని ఉక్రోషం ముంచుకొచ్చింది. రిషి కూడా తింటానంటే వేడివేడిగా కోడిగుడ్డు పొరుటు చేసుకునే పనికదా అని. ఏ చేసేది నువ్వే కదా! ఆ పని నీ కోసం ఎందుకు చేసుకోకూడదు? నిన్ను ఎవరన్నా చేసుకోవద్దన్నారా? మనసు నిలదీస్తోంది.

తనంటే తనకు విలువ ఉందా? నీకు నువ్వే విలువ ఇచ్చుకోకపోతే వేరేవాళ్ళు ఎందుకు ఇస్తారు? మనసు మళ్ళీ సతాయిస్తోంది. బ్యాగులో కొత్తగా చేరిన ఫెళఫెళలాడే పది వెయ్యినోట్లు ఉన్నట్టుండి హఠాత్తుగా గుర్తుకొచ్చి మళ్ళీ ఉత్సాహం పొంగుకొచ్చింది. అన్నం తినకుండా పడుకున్న రిషి మీద ప్రేమ కూడా పొంగుకొచ్చింది. పాలు వేడి చేసి గ్లాసులో పోసింది. ఇంకా ముసుగు కప్పుకునే ఉన్నాడు రిషి. అతను కచ్చితంగా నిద్రపోయుండడని ఆమెకు తెలుసు. ఇలా ఉన్నప్పుడు ఎవరికైనా నిద్ర ఎలా పడుతుంది?

“రిషీ! లేచి కొంచెం ఈ పాలన్నా తాగు” దుప్పటి పట్టుకుని లాగుతూ అంది.

“అబ్బ. వద్దన్నానా” రిషి విసురుగా దుప్పటి లాక్కున్నాడు. ఆ విసురుకి కృతి చేతిలోని గ్లాసు కిందపడి భళ్ళున బద్దలయింది. రిషికి స్టీలు గ్లాసులు నచ్చవు. అందుకే గాజు గ్లాసులో పోసి తెచ్చింది. కిందంతా చెల్లాచెదురుగా పడిన గాజు పెంకులు, ఒలికి పోయిన పాలతో రణరంగంలా ఉంది. కృతికి ప్రాణం ఉసురుమంది. గాజుగ్లాసు పగిలినందుకన్నా గాజు పెంకులు ఏరి శుభ్రం చేయడం తల్చుకునేటప్పటికి ఆమెకు నీరసం ముంచుకొచ్చింది. రిషి ముసుగుతీసి పారేసి లేచి కూర్చున్నాడు.

“ఏమీ వద్దన్నానుగా. ఎందుకు విసిగిస్తావు?”

గ్లాసు పగిలిపోయిన చిరాకు అతని గొంతులో. కృతికి బక్క కోపం వచ్చేసింది.

“అన్నం తినడానికి ఏమయింది నీకు? అసలు అన్నం తిననని ఎందుకన్నావు?”

“ఆకలిగా లేదని చెప్పాను కదా.”

“పొద్దున ఇడ్లీలు ఎందుకు తినలేదు. ఒక్కసారికి చట్నీలేకుండా తినొచ్చు కదా. ఆ మాత్రం అర్థం చేసుకోకపోతే ఎట్లా బతికేది?” కృతికి అంత ధైర్యం ఎలా వచ్చిందో ఆమెకే తెలీలేదు. ఈ మాత్రం అడగ్గలగడం అంటే నిజంగా సాహసమే.

“ఒక్కసారా? అలాంటి ఒక్కసార్లు ఈ నెలలోనే ఎన్ని వచ్చాయో చెప్పమంటావా? ఇవాళ చట్నీ లేదు. నిన్న అసలు టిఫినే లేదు. అన్నం వండితే కూర ఉండదు. కూర వండితే అన్నం ఉండదు. ఎన్ని రోజులు సర్దుకోవాలో నువ్వే చెప్పు. ఇది బతుకా? మనం బతుకుతున్నామని నువ్వు అనుకుంటున్నావా? చట్నీ ఉందా లేదా అని కాదు. అసలు మొత్తంగా ఈ బతుకే నచ్చడం లేదు. తెల్లారి లేవడం, పరుగులు పెట్టడం, ఏం తింటున్నామో తెలీకుండా ఏదో ఒకటి నోట్లో కుక్కుకోవడం, రాత్రికి పడుకుని నిద్రపోవడం – ఇదేనా బతుకంటే? దీనికే మళ్ళీ సర్దుబాట్లు. ఇది బతుకని అయితే నేను అనుకోవడం లేదు!” రిషి విసురుగా బైటకు వెళ్ళిపోయాడు.

కృతి ఏం చేయాలో తోచనట్టు కూర్చుండిపోయింది. పెళ్ళయిన కొత్తల్లో ఒకసారి రిషిని అడిగింది కృతి “రిషికి నచ్చిన అమ్మాయి అంటూ ఎవరన్నా ఉన్నారా?” అని. అలాంటివాళ్ళు ఎవరూ లేరని చెప్పాడు రిషి. అతను అబద్ధం చెబుతున్నాడేమో అనిపించి “అదేంటి కాలేజీలో కానీ తర్వాత కానీ ఎవళ్ళూ నచ్చలేదా?” ఆశ్చర్యంగా అడిగింది.

“నచ్చలేదు” అన్నాడు రిషి.

“ఎందుకని?”

“ఎందుకంటే అందముంటే తెలివుండదు. తెలివి ఉంటే అందం ఉండదు. ఆ రెండూ ఉంటే మంచితనం వుండదు. ఆ మూడూ ఉన్నవాళ్ళు నాకు తగల్లేదు. అందం లేకపోయినా ఫరవాలేదు కానీ తెలివితేటలు లేకపోతే నేనసలు తట్టుకోలేను.”

“తెలివితేటలు అంటే?”

“అంటే నేను నా అభిప్రాయాలు షేర్ చేసుకోగలిగినంత. షేర్ చేసుకున్నప్పుడు అర్థం చేసుకోగలిగినంత.”

“అంత ఉంటే చాలా?” అంతకన్నా ఎక్కువ అక్కరలేదా?”

“అంతచాలు. అంతకన్నా ఎక్కువ అయితే మళ్ళీ కష్టం. ఒకే ఇంట్లో రెండు గట్టి బుర్రలు ఉండకూడదు. యుద్ధాలైపోతాయి” అన్నాడు. అప్పట్లో తను నవ్వేసింది కానీ, ఇప్పుడు ఆలోచిస్తోంటే అర్థమవుతోంది. రిషి అప్పుడు నవ్వుతూ అన్నా అతని అసలు ఉద్దేశం అదే అని.

రిషి అలక వట్టి అలక కాదు. అది ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ అని కృతికి అర్థమయింది. తనకి నచ్చని పని చేసినప్పుడు రిషి అందరిలా అరవడు. తిట్టడు. కోపం తెచ్చుకోడు. అలుగుతాడు. బిగదీసుకుపోతాడు. అత్తిపత్తి ఆకులా ముడుచుకు పోతాడు. ఏదన్నా నచ్చని పనిచేసినప్పుడు మొహం మీద అడిగేస్తే అది అక్కడితో తీరిపోతుంది కదా. అడగకుండా అలా బిగదీసుకు పోతే ఏం తెలుస్తుంది అనుకునేది మొదట్లో.

తర్వాత తర్వాత కృతికి అర్థమవుతూ వచ్చింది. రిషి ఒక్కమాట కూడా అనకుండానే తనకు కావలసింది సాధించుకుంటున్నాడని. అతను కావాలనే అలకనే ఒక ఆయుధంలా ఎంచుకుంటున్నాడని.

రిషికి ఏం చేస్తే కోపం రాదు? ఏం చేస్తే అలగడు? ఏం చేయకపోతే అలుగుతాడు. రాత్రీ పగలూ ఆమెకు ఈ ధ్యాసే. రిషితో పోట్లాడడమనేది ఆమెకి కలలో కూడా తట్టని విషయం. పోట్లాడకపోతేనే నెలల తరబడి బిగదీసుకు పోయే మనిషి పోట్లాడితే ఇంకెన్ని నెలలు బిగదీసుకు పోతాడో అనేది ఆమె భయం. భర్తలతో ధైర్యంగా పోట్లాడే భార్యలను చూస్తే ఆమె ఆశ్చర్యపోతుంటుంది. అట్లా కూడా మాట్లాడొచ్చా అని.

రిషికి అన్ని విషయాలకు సంబంధించి, మనుషులకి సంబంధించి కొన్ని కచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. వాటి గురించి అతన్ని వాదనలో మెప్పించడం కష్టం. అయితే అతనికి ఏది ఇష్టమో ఏది కాదో ఎవరితో ఏం మాట్లాడితే నచ్చుతుందో, ఎంతవరకు మాట్లాడితే నచ్చుతుందో ఎప్పటికప్పుడు ప్రాణసంకటంగానే ఉంటోంది కృతికి. ఒక అలక నుంచీ కొంత, ఇంకో అలకనుంచీ కొంత అట్లా ఎప్పటికప్పుడు ఎన్ని తెలుసుకుంటున్నా అతని గురించి అతని ఇష్టాయిష్టాల గురించి తెలియంది ఇంకా ఎంతో మిగిలిపోతూనే ఉంది. ఈ అలకల భయంతో కృతి తను ఒక మనిషిననే మర్చిపోయింది. తనకూ కొన్ని ఇష్టాయిష్టాలు ఉంటాయని అంతకు ముందే మర్చిపోయింది.

రిషి మౌనంగా ఉంటూనే ఇంట్లో తనకు కావలసిన వాతావరణాన్ని ఏర్పరచు కుంటున్నాడు. తనే మనిషి కాకుండా పోతోంది. జీవచ్ఛవంలాగా ఎప్పుడు ఏ పనిచేస్తే ఏమవుతుందో అని గడగడ లాడుతూ రోజుకి వందసార్లు చచ్చి బతుకుతోంది.

ఒక్కమాట కూడా అనకుండా అతను పెట్టే హింస ఏంటో కృతికి ఒక్కదానికే తెలుసు. కృతి మాట్లాడకుండా ఉండలేదు. ఒకే ఇంట్లో ఉంటూ మాట్లాడకుండా ఉంటే ఎలా గడుస్తుంది? ఏదో ఒక అవసరం వస్తుంది. ఇంట్లో ఏం ఉన్నా లేకపోయినా

ఆ బరువు బాధ్యతలన్నీ కృతివే. ఒక్కోసారి అతని అలక చూసి కోపం వచ్చి తనూ మాట్లాడకుండా బిగదీసుకుపోయేది కృతి. నాకేనా అంత పౌరుషం లేనిది అనుకునేది. అంతలోకే ఇంట్లోకి ఏదో ఒకటి కావాల్సి రావడమో, ఏ ఫోన్ బిల్లులో, కరెంటు బిల్లులో కట్టాల్సి రావడం, వాటికోసం రిషితో మాట్లాడాల్సి రావడం తప్పేది కాదు.

మూడొందల అరవై అయిదు రోజులూ అలా ఒక యజ్ఞంలా తపస్సులా రిషి అలగకుండా ప్రయత్నించి ప్రయత్నించి ఇల్లు అలికే ఈగ తన పేరు మర్చిపోయినట్టు అయిపోయింది కృతి కూడా.

రిషి ఏదీ బైట తినడు. అవుట్‌సైడ్ ఫుడ్ పడడం లేదని ఆఫీస్ క్యాంటీన్‌లో కూడా ఏదీ తినడు. తను ఆఫీస్ క్యాంటీన్‌లో తిందామన్నా అతనికోసం టిఫిన్, వంట చేయక తప్పదు కృతికి. మళ్ళీ అక్కడ కూడా ఏ లోపం జరగకూడదు. ఒక్క కూరతో ఏం తింటాం? కనీసం రెండు రకాలన్నా లేనిదే మధ్యాహ్నం లంచ్ చేయడం కష్టం అంటాడు. మధ్యాహ్నానికి చప్పబడిపోకుండా స్పైసీగా చేయాలి. ఇవన్నీ ఎనిమిదింటిలోగా అయిపోవాలి. ఎనిమిదింటికి కృతికి క్యాబ్ వచ్చేస్తుంది. వంటకి అవసరమైనవేమన్నా తెచ్చి పెడతాడనుకుంటే రిషి ఏడున్నర వరకూ నిద్రలేవడు. ఏది కావాలన్నా కృతి అప్పటికప్పుడు నైటీలోంచి చీరలోకి మారి బజారుకి వెళ్ళి తెచ్చుకోవలసిందే.

పోనీ వంట అమ్మాయినన్నా పెట్టుకుందామంటే రిషికి ఇష్టం వుండదు. అంతకు ముందు అలా ఒక అమ్మాయిని పెట్టుకుంటే ఆ అమ్మాయి కూరగాయలు సరిగా కడగడం లేదని, నూనె, ఉప్పు, కారాలు ఎక్కువ వేస్తోందని, మంచినీళ్ళలో చేతులు ముంచుతోందని రకరకాల కారణాలు చెప్పి ఆ అమ్మాయిని మానిపించేంతవరకూ ఊరుకోలేదు. వంట చేసే వాళ్ళు అంతే. అట్లాగే గబగబా చేసి పోతారు. ఇంకో అమ్మాయిని మాట్లాడినా ఆ అమ్మాయి అలాగే చేస్తుంది. అందుకే కృతి అప్పటినుంచీ అన్నీ తనే చేసుకోవడం మొదలెట్టింది.

కృతి అమ్మమ్మ ఎప్పుడూ అంటుండేది భార్య కష్టాన్ని గుర్తించే ఇళ్ళు పచ్చగా కళగా ఉంటాయని. భార్య కష్టానికి గుర్తింపు లేని ఇళ్ళల్లో కళ ఉండదని.

రిషి అన్నమాట గురించే ఆలోచిస్తూ కూర్చుంది కృతి. పొద్దున్నే లేవడం, తినడం, పరిగెత్తుకుని ఉద్యోగానికి వెళ్ళడం, రాత్రికి అలసిపోయి రావడం ఇదేనా బతుకంటే అన్నాడు.

దానికి తనేం చేస్తుంది? అది తన చేతుల్లోది కాదు. అందరూ అట్లాగే

బతుకుతున్నారు. అట్లాగే పరుగు పెడుతున్నారు. అయితే దానికీ తననే తప్పు పడుతున్నాడు. తను ఉద్యోగం మానితే కొంత వత్తిడి తగ్గుతుంది. కానీ ఉద్యోగం మానేస్తే ఫైనాన్షియల్ బర్డెన్ పెరుగుతుంది. ఆ వత్తిడిని రిషి అసలు తట్టుకోలేడు. ఆ వత్తిడినే కాదు అసలు ఏ వత్తిడినీ అతను తట్టుకోలేడు. పడే కష్టాలన్నీ పక్కవాళ్ళు పడాలి. తన జీవితం మాత్రం సాఫీగా జరిగిపోవాలనుకుంటాడు. అది ఎలా సాధ్యం? తన చేతుల్లో ఏదన్నా మంత్రదండం ఉందా? అనుకూలంగా లేని ప్రతిదాన్నీ అనుకూలంగా మార్చుకోడానికి.

ఇంట్లో వాటికంటే నెపం తనమీద వేసుకుంటుంది. ఎందుకంటే ఆడదానిగా పుట్టింది కనుక.. కానీ జీవితం యాంత్రికంగా ఉందనే దానికి కూడా నెపం తనమీదే వేస్తే తనేం చేస్తుంది? ఈ నెపం మాత్రం కచ్చితంగా తనమీద వేసుకోదు. రిషి అలిగినా సరే అది అతనికి చెప్పే తీరుతుంది.

*'ఆంధ్రజ్యోతి' 10 ఆగస్ట్ 2014*

# జీవన చిత్రం

"ఏదో ఒకటి స్వంత ఇల్లు కట్టుకుందామని చెవిలో ఇల్లు కట్టుకుని పోరాను. ఏనాడన్నా చెప్పేది వింటేగా? ఎంతవరకూ పుస్తకాలు ముందేసుకుని కూర్చోడం, కక్కాయి, బుక్కాయి గాళ్ళందరినీ చేరదీసి నేను ఇట్టా నేను అట్టా అని గొప్పలు చెప్పుకోవడం తప్ప రేపటి గురించి ఆలోచన ఏమన్నా ఉంటేగా? పిల్లి పిల్లల్ని తిప్పినట్టు సిగ్గు లేకుండా ఈ ఇల్లూ ఆ ఇల్లూ అని జీవితం పొడుగుతా తిరుగుతుంటే సరిపోతుందా? మనిషి జన్మ ఎత్తిన తర్వాత ఆపాటి జ్ఞానం ఉండొద్దూ?" గుమ్మం ముందు చెప్పులు విడుస్తున్న దాన్నల్లా అమ్మ సాధింపులు వినిపించి బైటే ఆగిపోయాను. ఒక్క క్షణం వెనక్కి తిరిగి వచ్చేద్దామా అనిపించింది. ఆ ఇంట్లో ఇది రోజూ ఉండే గొడవే. ఎన్నిసార్లు చెప్పినా ఎంతమంది చెప్పినా ఉండి ఉండి కార్చిచ్చులాగా అది అలా మండుతూనే ఉంటుంది.

కర్టెన్ తీసి లోపలకు అడుగుపెడుతూ "మళ్ళీ మొదలుపెట్టారా" అన్నాను విసుగ్గా. మంచంమీద కుప్పగా పోసి ఉన్న బట్టల్ని ఒక్కొక్కటీ తీసి మడతలు పెడుతున్న అమ్మ నన్ను చూసి బట్టలు పక్కకు జరిపి కూర్చోమన్నట్టు చూసింది.

నా గొంతు వింటూనే నాన్నకు ప్రాణం లేచివచ్చినట్టుంది. "చూడమ్మా. ఇల్లు, ఇల్లు అని ఎలా సాధించి పోస్తోందో. మీ అందరి చదువులూ, పెళ్ళిళ్ళు మధ్య అవకాశం ఎక్కడ కుదిరింది ఇల్లు కట్టడానికి? ముగ్గురు ఆడపిల్లల చదువులూ, పెళ్ళిళ్ళూ అంటే ఈ రోజుల్లో మాటలా? అన్నీ చూస్తూనే ఉంది. నేనేదో చేయలేదని సాధించడం కాకపోతే తనకు తెలియదా?" నాన్న ఫిర్యాదు చేస్తున్న గొంతుతో అన్నాడు.

"అవును. నువ్వే చేశావు మహా పెళ్ళిళ్ళు. పేరంటాళ్ళు. ఈ భూ ప్రపంచం మీద నువ్వు తప్ప ఇంకెవ్వరూ ఆడపిల్లల పెళ్ళిళ్ళూ చేయలేదు. ఇళ్ళూ కట్టలేదు" అమ్మ అందుకుంది.

ఇంక ఆ వాదన ఇప్పుడప్పుడే తెమలదు. ఇద్దరూ ఎక్కడెక్కడి సంగతులూ గుర్తుకు తెచ్చుకుని మరీ అప్పుడు నువ్వట్టా చేశావు. నువ్విట్టా చేశావు అని వాదనకు దిగుతారు. అమ్మ అనేది కూడా నిజమే. మా చిన్నప్పటి నుంచీ ఎక్కడన్నా చిన్న స్థలం కొని ఇల్లు కట్టుకుందామని నాన్నను పోరుతూనే వుండేది. ఎంతోకొంత డబ్బు పోగేసేది. అది ఏదో ఒక అవసరానికి అయిపోయేది. తర్వాత తర్వాత మా చదువులూ ఒకళ్ళ తర్వాత ఒకళ్ళ పెళ్ళిళ్ళూ ఇంక ఇంటి గురించి ఎత్తడానికే అవకాశం లేకుండా పోయింది.

పిల్లలం ముగ్గురం ఉద్యోగాల్లో, జీవితంలో స్థిరపడ్డాం. స్వంతంగా ఇళ్ళు కొనుక్కున్నాం. కానీ వాళ్ళే స్వంత ఇల్లనేది లేకుండా అయిపోయారు. ఆడపిల్లల ఇంట్లో ఉండడం ఏంటని మాలో ఎవరిదగ్గరా ఉండరు. ఏదో చుట్టం చూపుగా వచ్చి వారం పదిరోజులు ఉండడం తప్ప అంతకు మించి ఎక్కడా ఉండరు. ఉండరని అనడమే కానీ నిజానికి వాళ్ళని ఉంచుకునే పరిస్థితే ఎవరికీ లేదు. డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లనబడే ఆ పీత గదుల్లో అదనంగా ఇంకో ఇద్దరికి చోటు ఏది? ఉన్న ఆ నాలుగు రోజులే పడకలకు ఇబ్బంది అయ్యేది. వాళ్ళకి పిల్లల బెడ్రూం కేటాయించి హాల్లో టీవీ, సోఫా, డైనింగ్ టేబుల్ ఇటు జరిపి అటు జరిపి పిల్లలకు పడకలు ఏర్పాటు చేయడానికి తలప్రాణం తోకకు వచ్చేది. చదువుకోడానికి సరిగా కుదరడం లేదని పిల్లల గొణుగుళ్ళు.

అసలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణమే కుట్ర అనిపించేది నాకు. భర్త, భార్య, వాళ్ళ పిల్లలకి తప్ప ఇంట్లో వేరే వాళ్ళకి స్థానం లేదనేగా అర్థం? మా చిన్నప్పుడు ఇంటికి ఎంతమంది చుట్టాలు వచ్చినా హాలులోనే సర్దుకునే వాళ్ళు. టీవీలు వచ్చిన తర్వాత హాలు డ్రాయింగు రూమ్‌గా మారిపోయి స్థానాన్నంతా ఆక్రమించేసింది.

"ఎందుకమ్మా ఎప్పుడూ అదే విషయం మీద గొడవపెట్టుకుంటారు? ఇప్పుడింక ఇల్లు కట్టడం జరిగేది కాదు. అయిపోయిందేదో అయిపోయింది. ఈ డెబ్భయ్యేళ్ళ వయసులో ఇప్పుడింక మీరు చేసేది ఏంటి? అన్నీ తవ్వుకుని ఉపయోగం ఏముంది? ఏదో ఒక రకంగా జాగ్రత్తగా రోజు గడుపుకోవడానికి చూడాలి కానీ ఈ సాధింపులూ, పోట్లాటలూ ఏంటి? ఉన్న కొద్దీ చిన్నపిల్లల్లా అయిపోతున్నారు. మాకు చెప్పాల్సింది పోయి మాతో చెప్పించుకునేలా చేస్తున్నారు" కొంచెం గట్టిగానే అన్నాను. ఆ మాత్రం అనకపోతే వాతావరణం అంత తేలిగ్గా సర్దుకోదు.

"నువ్వే చెప్పమ్మా. నా వంట్లో ఏమన్నా ఓపిక ఉండి ఏడిసిందా ? రోజూ అది చేయలేదని ఇది చేయలేదని సాధిస్తుంది. అక్కడికీ చేయగలిగిన పనులన్నీ చేస్తూనే

ఉన్నాను. అయినా ఎప్పటెప్పటివో గుర్తు తెచ్చుకుని మరీ సాధిస్తూనే ఉంటుంది. ఉన్న రోగాలతోనే బతకలేక మందులు మింగలేక చస్తున్నాం. ఏదో కృష్ణారామా అని ప్రశాంతంగా ఉందామంటే ఉండనివ్వదు" నాన్న అన్నాడు.

"అవును. అక్కడికి నాకే ఓపిక ఉంది. నేను మనిషినైతేగా. నువ్వు తెచ్చిపెట్టేవన్నీ తిని కూర్చుని పనీపాటా లేకుండా సాధిస్తున్నా" అమ్మ మడతపెడుతున్న బట్టలు మంచం మీదకు గిరాటు పెడుతూ అంది.

బట్టలు మడతపెట్టడానికి చేతుల్లోకి తీసుకున్నానన్న మాటేకానీ మనసు మనసులో లేదు. జరిగేదంతా చూస్తుంటే చిరాగ్గానూ ఉంది. బాధగానూ ఉంది. ఇద్దరూ అన్నిటికీ అట్లా చిన్నపిల్లల్లా తగువులాడుకుంటుంటే చిరాకు. మాకు చెప్పాల్సింది పోయి మాతో చెప్పించుకుంటున్నారని విసుగు. ముసలివాళ్ళయి పోయిన ఇద్దర్నీ వాళ్ళ మానానికి వాళ్ళని అలా వదిలేసి వాళ్ళకి ఏమీ చేయలేకపోతున్నందుకు బాధ, వాళ్ళ జీవితం సాఫీగా గడిచిపోవడానికి ఏవో కొన్ని ఏర్పాట్లయితే చేశాం కానీ అంత మాత్రాన సరిపోతుందా? పొద్దున లేచిన దగ్గర్నుంచీ రాత్రి అయ్యేవరకూ ఎన్ని పనులు, ఎన్ని సర్దుళ్ళు ఉంటాయి ఇంటిలో. అవన్నీ చేసుకోవడానికి ఓపిక ఉండొద్దూ.

"మొన్న ఎముకల డాక్టరు చెప్పలేదా? మీ ఎముకలన్నీ గుల్ల అయిపోయాయి. ఇంక మీరు పనులు చేయొద్దన్నాడు. అయినా ఏం తప్పుతోంది? రాత్రీ పగలూ ఈ కొంపకి ఇట్లా చాకిరీ చేసి చేసే మా అమ్మ అర్థాంతరంగా పోయింది. ఎంత చేసినా చేసిన పనికి ఏమన్నా గుర్తింపా పాడా. చేసి చేసి ఎముకలు గుల్లయి చావాల్సిందే కానీ" అమ్మ గొంతు పైకి లేస్తోంది.

అమ్మ మాటలతో నాకు అమ్మమ్మ గుర్తుకొచ్చింది. అమ్మమ్మ రూపం ఏదో లీలగా తప్ప సరిగా గుర్తులేదు.

అమ్మమ్మ క్షణం ఖాళీగా కూర్చునేది కాదు. ఎప్పుడూ ఏదో ఒక పని చేసింది చేసినట్టే ఉండేది. చిన్నప్పుడు అమ్మ ఉద్యోగం కోసం పల్లెటూళ్ళో ఉండేవాళ్ళం. పెద్ద చావిడి ఇంట్లో ఎప్పుడూ పాడిగేదెలు, కోళ్ళూ ఉండేవి. ఇంట్లో పని కాకుండా పేడతో పిడకలు చేయడం, గేదెలకు పాలు తియ్యడం లాంటి పనులన్నీ అమ్మమ్మవే. స్కూలు నుంచీ రాగానే మాకు స్నానాలు చేయించి తెల్లని ఫ్రాకులు వేసేది. వేడివేడి అన్నంలో చింతకాయ పచ్చడి వేసి అంతకి అంతా నెయ్యి పోసి కోడిగుడ్డు అట్టు నంజుకోడానికి కలిపి పెడుతుంటే ఎంత తింటున్నామో కూడా తెలీకుండా తినేసేవాళ్ళం. ఆరుబైట మంచంమీద కూర్చుని మమ్మల్ని చుట్టూ కూర్చోబెట్టుకుని కథలు చెబుతూ అన్నం

తినిపించేది. ఆకు పచ్చటి అంచు ఉన్న సాదా తెల్లటి చీరలో చామన చాయగా ఉండే అమ్మమ్మ మొహం ఎంత గుర్తుకు తెచ్చుకుందామన్నా ఇప్పుడు గుర్తుకురాదు.

అప్పట్లో నాన్నకి కోపం ఎక్కువగా ఉండేది. ఎప్పుడు దేనికి కోపం వస్తుందో తెలీక అమ్మ, అమ్మమ్మ గడగడా వణికి పోతుండే వాళ్ళు. కోపం వస్తే నాన్న చేతికి ఏది అందితే అది గిరాటేసేవాడు. నాన్న ఎప్పుడన్నా బైటకు వెళ్ళి ఆలస్యంగా వచ్చినప్పుడు తనకన్నా ముందు అమ్మ, అమ్మమ్మ అన్నం తింటే సహించలేక పోయేవాడని అమ్మ చెబుతుండేది. అందుకే ఎంత ఆలస్యమైనా ఆయన వచ్చేవరకూ ఆగి తర్వాత తినేవాళ్ళమని అమ్మ ఒకసారి చెప్పింది.

అమ్మ మీద కోపం వస్తే నాన్న ఇంట్లోంచి వెళ్ళిపోతున్నానని రెండు బట్టలు సంచిలో పెట్టుకుని బయల్దేరేవాడట. అమ్మ కాళ్ళా వేళ్ళా పడి బతిమాలి ఆపేదట. వారానికో రెండువారాలకో ఒకసారి కోడిని కోసేవాళ్ళు. ఎప్పుడన్నా మేక మాంసం తినాలనిపించి తెమ్మంటే నాన్న విసుక్కునేవాడంట. తెచ్చిన కూరలో సగంపైగా ఆయనకే పెట్టినా ఎక్కడన్నా బొయిక తగిలితే దాన్ని పళ్ళెంకేసి గట్టిగా కొడుతూ చప్పుడు చేస్తూ మరీ తినేవాడంట. నాన్నకూ, మాకూ పెట్టగా మిగిలిన ఒకటో అరో బొయికలు కాస్త గుజ్జుతో అమ్మా, అమ్మమ్మా సరిపెట్టుకునే వాళ్ళంట. మళ్ళీ ఎప్పుడన్నా కూర తెమ్మంటే మొన్నేగా తిన్నదీ అనేవాడంట. "తెచ్చిన కూరంతా తనకే పెట్టేవాళ్ళం. అందుకే తనకి కూరమీద తినాలని కోరిక ఉండేది కాదు. మాకేమో ఒకటీ అరా ముక్కలు తిని కూర తిన్నట్టు అనిపించక దానిమీదే ఉండేది. అట్లాంటి వాడు మీ నాన్న. ఇప్పుడంటే ఇట్లా ఉన్నాడు కానీ" అందోసారి.

నాన్న చూస్తుండగా అమ్మమ్మకి ఏదన్నా పెట్టడానికి ధైర్యం చాలక నాన్న లేనప్పుడు చూసి అమ్మమ్మకి తినడానికి ఏవన్నా ఇస్తుండేదట అమ్మ. అయితే అమ్మమ్మకి అభిమానం ఎక్కువ. అందుకే అట్లా రహస్యంగా ఇచ్చినదేదీ అమ్మమ్మ అంటుకునేది కాదట. అమ్మమ్మ జబ్బుపడి మంచాన పడ్డప్పుడు ఓ రోజు అమ్మమ్మ దగ్గర నన్నుంచి అమ్మా వాళ్ళందరూ బైటకు వెళ్ళారు. ఎవరికీ చెప్పనని ఒట్టు వేయించుకుని మరీ అమ్మమ్మ ఈ మాట స్వయంగా నాతో చెప్పింది. అమ్మమ్మ చెప్పిన ఈ రహస్యం నా గుండెల్లో ఇప్పటికీ రహస్యంగానే ఉండిపోయింది. అమ్మమ్మ నాతో ఈ మాట చెప్పినప్పుడు నాకు ఎక్కడలేని పెద్దరికం వచ్చేసినట్టు అనిపించింది. నేను ఆరో తరగతిలో ఉన్నప్పుడు అమ్మమ్మ జబ్బుతోనే చనిపోయింది. అమ్మమ్మ నీరసంగా ఉందంటే బలానికని అమ్మ ఎక్కువగా క్షీరాన్నం చేసి పెట్టేది. తర్వాత ఎప్పటికో తెలిసింది

అమ్మమ్మకు వచ్చింది షుగరని. తెలిసిన తర్వాత అమ్మమ్మ ఎక్కువ కాలం ఉండలేదు. అమ్మ ఇప్పటికీ బాధపడుతుంటుంది అమ్మమ్మను చేతులారా చంపుకున్నామని. నాన్న అంటే భయం మూలంగానే అమ్మమ్మని సరిగా చూసుకోలేకపోయానని అమ్మకి ఏ మూలో కోపం ఉందని నాకు అనిపించేది. ఆ కోపం తాలూకూ పొగలూ సెగలే ఇప్పుడు నాన్నను తాకేది.

ఒక సంవత్సరంగా అమ్మ బాగా మారిపోయింది. అంతకు ముందు నాన్నకు ఎదురు చెప్పని అమ్మ ఇప్పుడు నాన్నను ఎంతమాట పడితే అంతమాట అనేస్తోంది. ఎప్పుడెప్పుడో వాళ్ళ పెళ్ళి అయిన కొత్తల్లోని విషయాలతో మొదలుపెట్టి ఇప్పటివరకూ దేన్నీ వదిలిపెట్టడం లేదు. అసలు నాన్న పొడ అంటేనే గిట్టనట్టు తయారయింది. మాటకు ముందు కయ్యానికి కాలు దువ్వుతోంది.

పాపం నాన్న పరిస్థితే ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్టు అయింది. ఆయనకు షుగరు, బీపీ, గుండెదడ. గట్టిగా నాలుగు అడుగులు నడవలేరు. వణుకుతున్న వేళ్ళతో ఏదీ సరిగా చేయలేరు. ఇంకొకళ్ళపై ఆధారపడకుండా రోజు గడవదు. అమ్మ చూస్తే ఇలా అన్నిటికీ సహాయ నిరాకరణ అంటోంది.

“నిన్న కాక మొన్న పెళ్ళి అయిన వాళ్ళు కూడా చిటుక్కున ఇల్లు కొనుక్కుంటున్నారు. ఎంతవరకూ సత్రం తిండి, మఠం నిద్ర లక్షణాలు తప్ప మంచి లక్షణాలు ఏడిస్తేగా? ఎక్కడికి పోతాయి అమ్మా నాన్న బుద్ధులు? ఎక్కడెక్కడి వాములూ దొడ్లూ కడుపుకి ఫలహారం అయిపోవడం తప్ప రేపనేది ఉంటేగా? అయినా అవన్నీ నాకెందుకు? ఎవళ్ళెట్లా పోతే నాకేంటిగానీ అమెరికా నుంచీ వాళ్ళ పిల్లలు వస్తున్నారంట. ఇల్లు ఏమన్నా ఖాళీ చేయాల్సి వస్తుందేమో. ముందే ఓమాట చెప్పడం మంచిదని చెబుతున్నా అంది ఇంటావిడ. అదేదో నువ్వే చూసుకో. నాకు తెలీదు. ఇట్లా ఇంకా ఎన్ని ఇళ్ళు తిరగాలని రాసి వుందో నా మొహాన” అమ్మ అంది. అమ్మ కోపానికి కారణం అర్థమయింది. నాన్న గాలితీసిన బెలూన్లా అయిపోయాడు. ఈ ఎండల్లో ఇంటి కోసం ఎక్కడ తిరగాలో అన్న బెంగ ఆయన మొహంలో కనిపించింది. నాన్నని చూస్తే జాలేసింది. అమ్మని చూస్తే బాధనిపించింది.

అమ్మ పోరగా పోరగా నాన్న ఓ స్థలం కొన్నాడు. అందులో ఇల్లు కడదామని అనుకున్నారు. అయితే మంచి సంబంధం వచ్చిందని ఆ స్థలాన్ని నాకే ఇచ్చేశాడు నాన్న. ఇచ్చేశాడు అనేకంటే ఇవ్వాల్సి వచ్చింది. ఆ స్థలం ఇచ్చారు కాబట్టే సంబంధం కుదిరింది. ఊరిచివర ఉన్న ఆ స్థలంలో ఇల్లు కట్టుకోవడం ఇష్టంలేక, ఉద్యోగాల

కారణంగా ఇల్లు కట్టుకోవడం కుదరక ఆ స్థలాన్ని అమ్మి సిటీలో అపార్ట్‌మెంట్ కొనుక్కున్నాం. అమ్మ సొంత ఇంటికల కొంతవరకూ అలా నామూలంగా చెదిరి పోయింది.

"నేను మాత్రం ఎక్కడ తిరగను? బైట తిరగ్గలిగేలా ఉన్నానా నేను" నాన్న నిస్సహాయంగా అన్నాడు.

"సరే. దీని గురించి మీరు ఊరికే ఆలోచించి ఇదవకండి. ఆంటీతో నేను మాట్లాడతానులే" అన్నాను.

"ఆ పని చెయ్యమ్మా. నీకు పుణ్యం ఉంటుంది" నాన్న అన్నాడు.

"మీకు మందులు కానీ, ఇంట్లోకి సరుకులు గానీ ఏమన్నా కావాలా అమ్మా. కావాల్సినవి లిస్టురాసి ఇవ్వు" అమ్మని అడుగుతూ వెళ్ళడానికి లేచాను.

"“ఆయన్ని అట్లా కూర్చోపెట్టి అన్నీ మీరు చేసి పెట్టండి. కుర్చీలో కదలకుండా కూర్చుని కబుర్లు చెబుతాడు కబుర్లు" అమ్మ విసుక్కొంది.

నాకు తెలిసి అమ్మ ఎప్పుడూ నాన్నమీద గట్టిగా పోట్లాడిన జ్ఞాపకం లేదు. మమ్మల్ని కూడా నాన్న పేరు చెప్పే భయపెట్టేది. ఇప్పుడు ఎందుకు ఇట్లా చేస్తోందో నాకు అర్థం కాలేదు.

అయితే నాకు ఒక్కటి మాత్రం ఆశ్చర్యంగా అనిపించింది. నిన్న మొన్నటివరకూ ఇంటిని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన నాన్న ఒక్కసారిగా అలా నిశ్శబ్దంలోకి జారిపోయాడేంటీ అని. అమ్మ అట్లా సాధించిపోస్తోంటే ఒక్క దానికీ నోరు మెదపకుండా అన్నిటినీ అలా భరిస్తున్నాడేంటీ అని. చప్పున నాకు ఒక విషయం తట్టింది.

అప్పట్లో నాన్న బలవంతుడు. అమ్మ అన్నిటికీ ఆయనపై ఆధారపడి ఉండేది. ఇప్పుడు నాన్న తిండిదగ్గర్నుంచీ అన్నిటికీ అమ్మపై ఆధారపడుతున్నాడు. ఇప్పుడు నాన్నకంటే అమ్మ బలం ఎక్కువ. ఎక్కడయినా బలవంతులదే కదా రాజ్యం !

*'ఈనాడు' 10 ఆగస్ట్ 2014*

# భయం

**టీ**వీ చూస్తోందన్న మాటే కానీ విజయ దృష్టి టీవీ మీద కానీ, టీవీలో వస్తున్న ప్రోగ్రామ్ మీద కానీ లేదు. ఆమె టీవీ చూస్తోంది. చూడడంలేదు. రాత్రి పదవుతున్నా ఇంటికి చేరని కూతురి చుట్టూ ఆమె ఆలోచనలు పరిభ్రమిస్తున్నాయి. గోడ గడియారం పదిగంటలు కొట్టింది. విజయ ఉలిక్కిపడి లేచింది. ఇంక ఆగలేక వీధి గుమ్మం దగ్గరికి నడిచింది. గేటుమీద పాకించిన మాలతీల పరిమళం ఒక్కసారిగా ఆమెను కమ్ముకుంది. అయితే అవేవీ గమనించే స్థితిలో లేదామె. గేటు దగ్గర నిలబడి వీధి చివరికంటా చూసింది కృతి వస్తోందేమోనని. అప్పుడప్పుడే రోడ్లు సందడి తగ్గి నిశ్శబ్దంగా అవుతున్నాయి. ఒకటీ అరా వాహనాలు తప్ప మనుషుల అలికిడి తగ్గుముఖం పడుతోంది. విజయకి ఒక్కసారిగా కూతురిమీద కోపం ముంచుకు వచ్చింది. చెప్పింది ఏనాడన్నా విని ఏడిస్తేగా?

ఆడపిల్లలూ లేదు మగపిల్లలూ లేదు అందరూ ఒకేరకంగానే ఏడిపిస్తున్నారు. ఒకళ్ళు కాకపోతే ఒకళ్ళ కన్నా అమ్మ చెప్పింది విందామన్న ధ్యాసలేదు. పైగా వెక్కిరింతలూ, వేళాకోళాలు. అక్కడికీ చిలక్కి చెప్పినట్టు చెప్పింది ఆ వెళ్ళేదేదో మీనాన్న వచ్చిన తర్వాత ఆయన ఊళ్ళో ఉన్నప్పుడు వెళ్ళవే. నన్ను అనవసరంగా గాభరా పెట్టకు అని. వింటేనా? ఆయనతో ఫోన్ చేసి మరీ చెప్పించింది.

"ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి ప్రాజెక్టు వర్కేదో చేసుకుని వెంటనే వచ్చేస్తుందంటలే. పంపించు" ఆయన సిఫార్సు. పోనీ వెళ్ళి ఏడిసేది ఏదో బస్సులోనో ఆటోలోనో ఏడవకూడదూ? వచ్చీరాని బండెక్కి పోయింది. బండివద్దు అంటే వినిపించుకుందా?" అబ్బ ఊరికే విసిగించకమ్మా ఏంకాదు. ఇప్పుడే వచ్చేస్తాగా" అంటూ పోయింది. గంటలో వచ్చేస్తానన్న పిల్ల గంటకాదు రెండు గంటలు కాదు నాలుగు గంటలైంది. ఫోను చేస్తే తియ్యదు. అదేం ఖర్మో. ఫోన్ ఎప్పుడూ సైలెంట్‌లో పెట్టి ఏడుస్తుంది. ఆ

మాత్రం దానికి ఇంక ఫోన్ ఎందుకూ? అవసరమైనప్పుడెప్పుడూ దాని ఫోన్ కలిసి చావదు.

ఏమయిందో ఏంటో? అక్కడ ఫ్రెండు ఇంట్లో నుండి బయలుదేరిందో లేదో! ఇంకా అక్కడే ఉన్నా ఫరవాలేదు. ఒకవేళ బయలుదేరితే? దారిలో ఏమన్నా అయితే? ఆ ఆలోచనకు విజయ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అసలే రోజులు బాలేదు. రోడ్డు మీదకు వెళితే ఎప్పుడు ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలీదు. ఒకవేళ జరగకూడనిది ఏమన్నా జరిగితే? ఆమెకు గుండె గాభరాగా అనిపించింది. జరిగితే జరగనీ. చెబితే వింటా ఆ పాడు మొహంది. పెద్దవాళ్ళ మాట వినకుండాపోతే ఏమవుతుందో తెలిసి రావాలి. విజయ మనసులోనే కూతుర్ని తిట్టుకుంది. అంతలోనే ఛ ఛ ఏంటి తనకి ఏమయింది? ఏదో చిన్నపిల్ల. తనకంటే భయాలు కానీ వాళ్ళకేం భయాలు తెలుస్తాయి అనుకుంది.

దూరంగా సందు మలుపు తిరుగుతున్న బండి కనిపించింది. కృతి ఏమోనన్న ఆశతో కళ్ళు చిట్లించి చూసింది. ఉహు! కాదు. బండి దూరంగా వెళ్ళిపోయింది. గుండెల్లో ఎక్కడో కలుక్కుమంది. ఈ మధ్య ఈ దొంగ జబ్బొకటి ఏడిపిస్తోంది. అసలు తనది గట్టి ఆరోగ్యం. ఏ రోజూ తలనెప్పి అని కూడా ఎరగదు. అలాంటిది ఇప్పుడు వీళ్ళ పుణ్యమా అని ఈ గుండెదడతోనే ఏదో ఒక రోజు పోయేలా ఉంది. చెప్పిన టైముకి రాకపోతే నాకు గుండెదడ వచ్చేస్తోంది. కాస్త చెప్పిన టైముకి వచ్చేయండి. లేకపోతే ఫోనన్నా చేయండి అంటే ఒకళ్ళు వింటారా? చిన్నాలేదు పెద్దాలేదు. ఆయనా వినరు. అదీ వినదు. ఎక్కడో దేశంకాని దేశంలో ఉన్న కొడుకూ వినడు. ఏం చెప్పినా మొహమొహాలు చూసుకుని నవ్వుకోడం.

వాళ్ళకు ఎట్లా చెబితే అర్థం అవుతుంది? మీరురాని ఒక్కో నిముషం ఒక్కో ఆలోచనతో నా గుండె పగిలిపోతోంది. మీకు ఎక్కడ ఏం అయిందో ఏం జరిగి ఇంటికి రాలేక పోయారో ఏ ప్రమాదం జరిగిందోనన్న ఆలోచనతో గుండె గాభరా పడిపోతోంది. చెమట్లు పట్టి కళ్ళు తిరిగిపోతున్నాయి. ఆ భయంతో చచ్చిపోతానేమో అనిపిస్తోంది అని చెప్పగలదా? చెబితే తనను బతకనిస్తారా? పనీపాటా లేకుండా ఇంట్లో కూర్చుని అనవసరంగా ఏదేదో ఊహించుకుని ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నావని అరుస్తారు. తనమీద విరుచుకు పడతారు. అంతేకానీ పిచ్చి మొహంది ఏదో భయపడి ఏడుస్తోంది కదా. చెప్పిన టైముకి కాస్త అటూ ఇటూగా వచ్చేద్దామన్న జ్ఞానం ఒక్కరికన్నా ఉంటేగా? ఆయనా అంతే, మొదట్లో కనీసం ఫోన్ అన్నా తీసి

ఎక్కడ ఉందీ చెప్పేవారు. ఇప్పుడు ఫోన్ కూడా తియ్యరు. ఏదన్నా అంటే బండిమీద ఉన్నాను. వినిపించలేదు అని తప్పించుకుంటారు. కృతి అయితే “ఎందుకమ్మా అన్నిసార్లు ఫోన్ చేసి ఎక్కడున్నావ్ ఎప్పుడొస్తావ్ అని అడుగుతావు. మా ఫ్రెండ్స్ అంతా నవ్వు తున్నారు తెల్సా. ఫోన్ రింగయితే చాలు ‘కృతీ ఎక్కడున్నావ్’? అంటూ ఏడిపించేస్తున్నారు. ఇంక నువ్వు అట్లా ఫోన్ చేస్తే నేనసలు ఫోన్ తియ్యను” అని చిరాకు పడిపోతుంది.

ఇక్కడ ఏడిసేవాళ్ళు ఇట్లా ఉంటే అక్కడెక్కడో దేశంకాని దేశంలో ఉన్నాడు ఇంకో రకంగా ఏడిపిస్తున్నాడు. ఏ వీకెండ్‌కో ఫోన్ చేస్తాడు. చేసి “అమ్మా రేపు మేం ఏంచేస్తున్నామో తెల్సా. ఇక్కడ పల్లెటూళ్ళు ఎలా ఉంటాయో చూడాలని బాగా రిమోట్ ఏరియాకి వెళుతున్నాం. ఈ రెండు రోజులు అక్కడే ఉంటాం” అంటాడు. తెలియని కొత్తచోటులో రెండు రోజులు గడపడం. అదిచాలు తనకు గుండెదడ రావడానికి. అలా తెలియని చోట్లకి వెళ్ళొద్దురా అంటే వినడు. లేకపోతే ఎక్కడో చోట లేట్ నైట్ పార్టీ ఉంది అంటాడు.

అక్కడ నుండి అర్ధరాత్రి ఒంటరిగా హాస్టల్‌కు ఎలా వెళ్తాడోనన్న భయం. నిద్ర పట్టదు. క్షేమంగా చేరాడో లేదో కనుక్కోడానికి ఫోన్ చేసే సమయమూ కాదు.

అసలు వాడు ఫ్లయిట్ ఎక్కిన తర్వాత దిగే వరకూ దిగి ఫోన్ చేసేవరకూ తను మనిషి మనిషిలా లేదు. ప్రపంచం అంతా ఓ పక్క నిద్రపోతుంటేవాడు వెళ్ళే విమానం ఒక్కటే ఆ చీకట్లో అలా ఎగురుకుంటూ వెళ్ళడం తల్చుకుంటే ఏంటో దిగులుగా అనిపించింది. ఎవరితోనన్నా అందామంటే నవ్వుతారు. ఆడపిల్లలే ఒంటరిగా దేశాలు చుట్టివస్తున్నారు. మగపిల్లాడి గురించి భయపడుతోంది చూడు అంటారు. తన భయం వాడి గురించా? ఆ విమానం గురించి కానీ. ఒకవేళ... ఒకవేళ ఆ విమానానికి ఏదైనా అయితే... తన మనసులో తిరుగుతున్న ఆలోచనలు ఎవరితోనన్నా అనగలదా?

గుండెల్లో మళ్ళీ మరోసారి కలుక్కుమంది. వళ్ళంతా చెమటలు. ఇంట్లోకి వచ్చి మంచినీళ్ళు తాగింది విజయ. కొంచెం సర్దుకున్నట్టు అనిపించింది. అంతకు ముందు అలా వచ్చినప్పుడు ఒకసారి డాక్టర్ దగ్గరికి వెళ్ళారు. రకరకాల టెస్టులు చేసి చివరికి ఒసిడి అని తేల్చాడు. అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ అబ్సెసివ్ యాంగ్జయిటీ డిజార్డర్ అయుండొచ్చన్నాడు. దూరంగా ఉన్న తనవాళ్ళు క్షేమంగా ఉన్నారో లేదో అని కంగారు పడుతుండటం, వాళ్ళకు ఏదన్నా ప్రమాదం జరగవచ్చేమోనని ఊహించుకుని ఆందోళన పడుతుండడం దాని లక్షణం అంట. దానికి మందులకన్నా గుండె నిబ్బరం ముఖ్యమంటూనే గుప్పెడు మందులు రాసిచ్చాడు.

డాక్టరు దగ్గర నుంచీ ఇంటికి వచ్చి ఇంకా గుమ్మం అన్నా ఎక్కీ ఎక్కకముందే ఈయన ఉపన్యాసం.

"చూడు విజయా! నీకు ఎట్లా చెప్పాలో తెలియడం లేదు. నువ్వేమన్నా చిన్నపిల్లవా! ఏమీ తెలియని దానివా? అన్నీ చూస్తూ అన్నీ తెలిసికూడా అలా చేస్తుంటే ఎలా? ఇంటి నుంచి బైటకు వెళితే తిరిగి వచ్చేవరకూ గండమే. అలా అని బైటకు వెళ్ళకుండా ఎలా కుదురుతుంది చెప్పు? ఏదన్నా అవుతుందేమోనని పనులు మానుకుని ఇంట్లో కూర్చోలేం కదా. ఒకసారి బైటకు వెళ్ళిన తర్వాత ఏదైనా జరగొచ్చు. ఒక్కోసారి అనుకున్న టైముకి పని అవదు. ఫోన్ చేయగల పరిస్థితి ఉండకపోవచ్చు. అంతమాత్రాన నీలో నీవే ఏదేదో ఊహించేసుకోవాలా? నువ్వు ఇబ్బంది పడుతున్నావు. మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నావు. ఒక్కోసారి ఎంత పానిక్ క్రియేట్ చేస్తున్నావో తెల్సా. కొంచెం కూల్‌గా ఆలోచించు. అసలు ఎందుకంత వర్రీ అవుతున్నావు? ఏదో అవుతుందని ఎందుకనుకుంటావు? ఒకవేళ అవుతుంది అనుకో. ఏం చెయ్యగలం? మన చేతుల్లో లేని దాని గురించి భయపడి ఏం ప్రయోజనం? బస్సులో, రైళ్ళలో, కార్లలో ప్రపంచం ఎలా పరిగెడుతుందో చూడు. ఏదో జరుగుతుందని ఎవరైనా ఆగుతున్నారా? పిచ్చి పిచ్చి ఆలోచనలు మాని బుర్రకి ఏదన్నా పని కల్పించుకో. డాక్టరు చెప్పింది విన్నావుగా. గుండె గట్టి పరుచుకుని నీకు నువ్వు నిబ్బరం తెచ్చుకో. మందులు వాడడం ఒకటేకాదు. ఏదన్నా వ్యాపకం కూడా కల్పించుకో. నీకు నువ్వే ఇందులోంచి బైటపడు. పుస్తకాలు చదువు. సంగీతం విను. అంతే కానీ నువ్వు కూడా నాకు ఒక సమస్య కాకు" అని చెప్పిందే చెప్పడం.

గుండె నిబ్బరం తెచ్చుకోవాలంట. మందుల కన్న అదే ముఖ్యమంట. అదేంటది అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డరా? యాంగ్జయిటీ డిజార్డరా? అన్నీ డిజార్డర్లే. బైటకు వెళ్ళిన భర్తా పిల్లలూ క్షేమంగా ఉండాలని, ఏ ప్రమాదం జరగకూడదని అనుకోవడం డిజార్డరా? అనుకోకపోవడం డిజార్డరా? ఏమైనా ఫరవాలేదులే అని పట్టించుకోకుండా ఉంటే ఆర్డర్‌లో ఉన్నట్టా? ఆందోళన పడడమే డిజార్డరా? ఏంటీ డాక్టరు అన్నీ రివర్సులో చెబుతున్నాడు. అందరూ ఏదో చిన్న పిల్లను అడిగినట్టు మందులు వేసుకుంటున్నావా. మందులు వేసుకుంటున్నావా అని అడుగుతున్నారు. ఆ మందుల్లో ఏదో మాయా మంత్రాలు ఉన్నట్టు. అవి వేసుకుంటే ఏదో మహాత్యం జరిగిపోతుందన్నట్టు.

బైటకు వెళ్ళిన కూతురు టైముకి తిరిగిరాకపోతే కంగారు పడనివ్వకుండా చేసే మందు ఏదన్నా ఉందా ప్రపంచంలో? ఊరు వెళ్ళిన భర్త క్షేమంగా ఉన్నాడో లేదో అని ఆందోళన పడకుండా శుభ్రంగా తిని పడుకునేలా చేసే మందు ఏ కంపెనీ

అన్నా కనిపెట్టగలిగిందా? దేశం కాని దేశంలో ఉన్న కొడుకు ఎలా ఉన్నాడో అని బెంగపడకుండా చేసే మాత్రలు ఏ దేశం అన్నా తయారు చేయగలిగిందా? ప్రపంచంలో ఏ మూల అన్నా భద్రంగా ఉందా? ఎగరేసిన గాలిపటాల్లా, గాలిలో పెట్టిన దీపంలా ఏ క్షణానికి ఏం జరుగుతుందో అన్న భయం తప్ప ఏదీ కాదన్న ధీమా ఇచ్చేదేదన్నా ఉందా బతుకులో?

గుండె మళ్ళీ దడ దడ మని కొట్టుకుంది. తల తిరుగుతున్నట్టు అనిపించింది. టాయ్‌లెట్‌కు వెళ్ళాలనిపించేలా నరాల్లో ఏదో కదలిక. గుండె పోటు వచ్చేటప్పుడు అలాగే అనిపిస్తుందట. కొంపదీసి గుండెపోటు కాదు కదా? ఇంట్లో ఎవరూ లేను కూడా లేరు. ఎవరెన్ని అంటున్నా ఈ మాయదారి గుండె గట్టిపడి చావదేంటి? ఏదైతే అదవుతుందని ఎంత గుండె నిబ్బరం తెచ్చుకుందామన్నా మాటి మాటికీ జారిపోతూనే వుంది. ఏమన్నా అయి తను చచ్చిపోతే వీళ్ళకి దిక్కెవరు?

ఆడపిల్ల ఇంకా పెళ్ళి కూడా అవలేదు. తనకేదన్నా అయితే దానికి అచ్చటా ముచ్చటా ఎవరు తీరుస్తారు? ఈయనకి మంచినీళ్ళు ముంచుకోడానికి కూడా బద్ధకం. తను లేకపోతే ఏమైపోతారు వీళ్ళంతా? తనకేదన్నా అయితే బాబుగాడికి అసలు చెబుతారో లేదో? చదువు మధ్యలో చెడిపోతుందని చెప్పరేమో? అక్కడ ఉండగానే తెలిస్తే వాడి గుండె పగిలిపోదూ?

మొన్ననే ముచ్చటపడి రెండు పట్టుచీరలు కొనుక్కుంది. ఇంకా మడతన్నా విప్పలేదు. పోరి పోరి చేయించుకున్న ఒంటిరాయి నెక్లెసు ఒక్కసారన్నా ఒంటిమీద పెట్టలేదు. వాటి మొహం అన్నా చూడకుండానే పోతుందేమో. తను దగ్గరికి వెళ్ళగానే సన్నజాజి చెట్టు ఎంత సంతోషంగా ఊగుతుందని. తనకేదన్నా అయితే దాని మొహం చూసేది ఎవరు? చెంబుడు నీళ్ళు పోసేది ఎవరు? బుట్టతో బుట్టెడు పూలు పూస్తుంది. తనకి కచ్చితంగా తెలుసు. తనకేదన్నా అయితే పూలు కోసేవాళ్ళు కూడా ఉండరు.

అబ్బ ఇన్ని మమకారాలు తనకెందుకు? ఏదైతే అది అవుతుందని ఎందుకు నిర్లిప్తంగా ఉండలేకపోతోంది. అక్కడికీ ఈ మధ్య గీత చదువుతోంది. భజగోవిందం వింటోంది. ఆ పదామపహర్తారం చదువుతోంది. జెకెని చదువుతోంది. ఏదీ కూడా మనసుకి స్థిమితం ఇవ్వలేకపోతోంది. మనసుకి ఉదాశీనత తేలేకపోతోంది.

స్థితప్రజ్ఞత అని చదవడమే కానీ అనుభవం లోకి రాకుండానే వయసయిపోతోంది. ఇప్పటికీ గట్టిపడకపోతే ఇంకెప్పుడు గట్టి పడుతుంది? ఆ కాస్త ప్రాణం పోయాకా?

తను ఎవరి కోసం అయితే కళ్ళల్లో వత్తులు వేసుకుని చూస్తోందో వాళ్ళే తనను విసుక్కుంటున్నారు. చిరాకుపడుతున్నారు. వాళ్ళు విసుక్కుంటున్నారని వాళ్ళ కోసం

ఎదురు చూడడం, రాకపోతే కంగారు పడడం మానేయగలదా? అది వాళ్ళు అనుకుంటున్నంత తేలికా? అది తన చేతుల్లో ఉందా? కావాలని చేస్తోందా? ఆ విషయం వాళ్ళకు ఎందుకు అర్థం కాదు? విసుక్కున్నంత మాత్రాన ఎవరికైనా గుండె గట్టిపడిపోతుందా? బండరాయిలా గడ్డ కట్టిపోతుందా? ఏమయితే అవుతుంది కానిమ్మని కాలు మీద కాలేసుకుని కూర్చుని టీవీ సీరియళ్ళు చూడగలుగుతుందా? సహజంగా జరిగేదాన్ని అసహజం అంటున్నారు. అదే రోగం అంటున్నారు. అలా అనిపించక పోవడమే రోగం అని వాళ్ళకు తెలియదా?

టీవీ పెడితే ఒక్కటన్నా మంచి వార్త ఉంటుందా? అక్కడ అదయింది. ఇక్కడ ఇదయింది. ఇంతమంది చనిపోయారు. అంతమంది చనిపోయారు అని తప్ప స్థిమితం ఇచ్చేది ఒక్కటన్నా ఉంటుందా? అవన్నీ చూస్తూ బైటకు వెళ్ళిన వాళ్ళు ఎలా ఉన్నారో, చెప్పిన టైముకి పది నిముషాలు లేటైతే ఏమయ్యారో అని కంగారు పడకుండా ఉండడం కుదురుతుందా? "పదినిముషాల్లో ఇంటికి వచ్చేస్తున్నా" అని చెప్పిన బిడ్డ చెప్పినట్టే ఇంటికి చేరుతున్నాడా? ఇవన్నీ చూస్తూ వింటూ పొద్దున్నించీ రాత్రి వరకూ ప్రాణాలు బిగబట్టుకుని ఎదురుచూడడం ఎవరికైనా ఎలా సాధ్యం? ఆలోచించవద్దంటే ఆలోచించకుండా ఉండడానికి అదేమన్నా మనసా? టీవీనా? స్విచ్చి తీసేయడానికి? రేడియోనా? కట్టేయడానికి. చెప్పడం తేలిక. చెయ్యడం కష్టం.

నిన్నకాక మొన్న శశిగాడు ఎంత మాటన్నాడు? "కొంచెం జాగ్రత్తగా ఉండరా. రాత్రుళ్ళు అట్లా ఒంటరిగా తిరగకూ" అంటే "ఏమవుతుంది? మహా అయితే పోతాం. అంతేగా. నువ్వు అట్లాంటివన్నీ ఊరికే అలా చెప్పకు" అన్నాడు. వేలెడంత లేడు. వెధవ చిటుక్కుమని ఎంత పెద్ద మాట అన్నాడు.

నిజమే. బతుకులే అలా వున్నాయి. అన్నీ గాలిలో దీపాలే. దేనికి భద్రత ఉందని దేనికో లేదని భయపడడానికి? అన్నీ అలాగే ఏడిసినయి. ఇంతోటి బతుక్కి ఎంతకని అనుక్షణం చస్తూ బతకడం? ఏదీ తన చేతుల్లో లేదు. దేన్నీ అడ్డుపెట్టి ఆపలేదు. ఎవరికెంత ప్రాప్తం ఉంటే అంతే. ఏది రాసిపెట్టి ఉంటే అదే జరుగుతుంది. అది కర్మ సిద్ధాంతమో, అకర్మ సిద్ధాంతమో, వికర్మ సిద్ధాంతమో ఏదో ఒకటి దాన్ని నమ్ముకోవడం తప్ప ఇంక చెయ్యగలిగింది ఏదీ లేదు. మన చేతుల్లో ఏదీ లేదు. అంతే. ఇంక ఇదే తన పాలిట గీతా పారాయణం. విజయ కృత నిశ్చయం చేసుకుంది.

ఇంటి ముందు బండి వచ్చి ఆగింది.

*'చినుకు' ఏప్రిల్ 2015*

# థర్డ్ ఆప్షన్

"**అ**వునా?... అలాగా?... అయ్యో?... అతనేమంటాడు?..... అట్లాగైతే ఎట్లా?.... మరీ ఇలాంటి వాళ్లనుకోలేదు.....బుజ్జీ ! అట్లా బాధపడకురా తల్లీ.... ఏదో ఒకటి చేద్దాం... నేను చెబుతున్నాగా... నువ్వు అవన్నీ పట్టించుకోవద్దు... నేను మాట్లాడతాను. మాట్లాడుతానన్నాగా... సరేనా...."

వరండా ఆ చివరి నుంచీ ఈ చివరి వరకూ ఏం చేస్తున్నారో కూడా తెలియకుండా కంగారు కంగారుగా తిరుగుతూ సెల్‌లో ఆయన మాట్లాడుతున్న మాటలు పొడిపొడిగా వినిపిస్తున్నాయి. పొడి పొడిగా వినిపించినా ఆ ఫోను ఎవరి దగ్గరి నుంచో నేను తేలిగ్గానే ఊహించగలను. చైత్ర. మొదట్లో నాకు చేసేది. నేను సరిగ్గా పట్టించుకోవడం లేదని ఈ మధ్య వాళ్ళ నాన్నకు చేస్తోంది. ఆయన కంగారు చూసి నవ్వొచ్చింది. ఎప్పటికప్పుడు అది ఫోన్ చేయడం, ఈయన కంగారు పడుతూ కాళ్ళుతొక్కుకుంటూ ఇది విన్నావా? నిన్నేమైందో తెలుసా? మొన్నేమైందో తెలుసా? అంటూ నాకు పాఠంలా అప్పజెప్పడం... రోజూ ఇదే తంతు. ఒకో రోజయితే రెండుసార్లు, మూడుసార్లు. ఏదైనా తనదాకా వస్తేకానీ తెలియదంటారు.

కూర తిప్పుతూ చపాతి తిరగేయడం మర్చిపోయినట్టున్నాను. అట్లకాడతో తిరగేసే సరికి నల్లగా మాడు రంగుకి తిరిగింది. చపాతీలు మాడితే ఆయన మొహం అంతకన్నా మాడిపోతుంది. గబగబా ఆ చపాతీని కింద వరుసలో పడేసి స్టవ్ కట్టేస్తుండగా ఆయన లోపలికి వచ్చారు. "ఇది విన్నావా?" అంటూ.

"ఇవాళ బుజ్జి పూరీలు చేసిదంట. పూరీలు పొంగలేదని కూరలో సెనగపిండి సరిగ్గా కలవలేదని వాళ్ళ అత్తగారు ఒకటే గొణుగుడంట. ఎప్పుడూ లేనిది వాళ్ళ మామకూడా కూర వద్దని పచ్చడి వేసుకుని తిన్నాడట. అది చూసి వాళ్ళ అత్తగారు మళ్ళీ విసుక్కుందంట. పాపం బుజ్జిని చూస్తే ఏం చేయాలో తోచకుండా పోతోంది.

బంగారం లాంటి పిల్లని తీసుకెళ్ళి రాక్షసుల మధ్య పడేశాం. చిన్న పిల్ల. దానికేం తెలుసని? అయినా వీళ్ళకు పూరీలు, దోసెలు చేసి పెట్టడానికా పువ్వులాంటి పిల్లని అక్కడికి పంపింది? ఎక్కడో మూర్ఖులు దొరికారు. పోనీ ఆ అబ్బాయి అన్నా వాళ్ల అమ్మకు సర్ది చెప్పొచ్చుగా, వాళ్ళలా అంటుంటే ఏమీ అనడంట. పైగా "అమ్మ చేసేలాగానే చెయ్యి చైత్రా. నాకు అలానే ఇష్టం" అంటాడంట. మరీ అంత నోరులేని వాజమ్మ అయితే ఎట్లా?" ఆయన నాతో చెబుతున్నారో, స్వగతంగా అంటున్నారో తెలీకుండా కలగా పులగంగా మాట్లాడేస్తున్నారు. ఆయన గారాల కూతురు ఏడ్చిందనే దుగ్ధ ఆయన ప్రతిమాటలో కనిపిస్తోంది. మొహం వాడి పోయింది. ఏం చేయాలో తోచని అయోమయంలో చిరాకు చిరాగ్గా ఉన్నారు.

మాడకుండా మంచిగా వున్న చపాతీలు ఏరి ఒక ప్లేటులో పెట్టి కూరవేసి ఆయనకు ఇచ్చాను. చపాతీ ఒక ముక్క తుంచి నోట్లో పెట్టుకోబోతూ "పాపం బుజ్జి టిఫిన్ అన్నా చేసిందో లేదో" అంటూ ఆ  ముక్క మళ్ళీ ప్లేటులో పడేశారు.

"కొత్తల్లో ఇలాంటివన్నీ మామూలే. తర్వాత అవే సర్దుకొంటాయి. ముందు మీరు టిఫిన్ చేసెయ్యండి. చల్లారిపోతోంది" అన్నాను.

"ఒకపూట కూర కాస్త కుదరకపోతే సర్దుకోలేరా? అంత మాత్రానికే అంత ఇదైపోవాలా? వాళ్ళు అసలు మనుషులా? దున్నపోతులా?" ఆయన కోపంగా అంటుంటే నాకు నవ్వొచ్చింది. నవ్వకూడదని ఆపుకొన్నాను.

ఆమాట ఆయన నోట వింటుంటే విచిత్రంగా అనిపించింది. మరి మాడిన చపాతీని నేను ఎందుకు దాచినట్టు?

"చైత్రని కొన్నాళ్ళపాటు ఇక్కడికి తీసుకొచ్చేద్దామా?" ఏదో ఆలోచిస్తున్నట్టు అన్నారాయన.

"తీసుకొచ్చి?"

"కొన్నాళ్ళు ఉండి వెళుతుంది. లేకపోతే...."

"ఊ.. లేకపోతే...?"

"డైవోర్స్ ఇప్పించేస్తే పీడా పోతుంది. పిల్ల శుభ్రంగా కళ్ళముందు ఉంటుంది."

"తర్వాత?"

"తర్వాత ఏముంది? అది ఇష్టపడితే ఇంకో మంచి సంబంధం చూసి చేయొచ్చు."

"అప్పుడు ఇదీ మంచి సంబంధమే అనుకున్నాంగా."

"రోజూ పిల్లని ఏడిపించేవాళ్ళది మంచి సంబంధం ఎలా అవుతుంది?"

"ఆ వచ్చే అబ్బాయికి మాత్రం అమ్మా నాన్నా ఉండరా? అక్కడ మాత్రం పని చేయక తప్పుతుందా? ఏదో ఒక పొరబాటు జరక్కుండా వుంటుందా?"

"ఇందాకట్నుంచీ చూస్తున్నాను ఓ పక్క నేను ఇంత బాధపడిపోతుంటే నీకసలు చీమ కుట్టినట్టు అయినా ఉందా? అన్నిటికీ ఎడ్డెమంటే తెడ్డెం అనడం తప్ప. అరె! ఒక్కగానొక్క కూతురు బాధపడుతోంది. ఏం చెయ్యాలి అని ఆలోచించేది ఏమన్నా ఉందా లేదా? దాన్ని కాదు అసలు నిన్ను అనాలి. ఏం నేర్పకుండా పరాయి ఇంటికి పంపించి ఏం చేద్దామని?"

"నాకు తెలియక అడుగుతాను అది నీ కూతురా? శత్రువా?" ఆయన కోపంగా లేచి బైటకు వెళ్ళిపోయారు.

అయినా ఈ చైత్రకి ఏమయింది? అక్కడ తుమ్మినా దగ్గినా అప్పటికప్పుడు చెప్పేయాలా? మొదట్లో అట్లాగే నాకు చేసేది.

"అబ్బబ్బా. ఈ యింట్లో చచ్చిపోతున్నానమ్మా. కదిలితే తప్పు. మెదిలితే తప్పు. అది చెయ్యి, ఇది చెయ్యి. అట్లా చెయ్యకూడదు, ఇట్లా చెయ్యకూడదు. రోజంతా ఇదే గోలనుకో. నేను ఏం చేసినా నచ్చదు. ఆవిడ అన్నిటికీ వంకలు పెడుతూనే ఉంటుంది" అని మొదట్లోనే చెప్పింది.

చూసి చూసి ఒకసారి వాళ్ళ అత్తగారికి ఫోన్ చేసింది. "చైత్ర ఒక్కటే పిల్లని కొంచెం గారాబంగా పెంచాం. తెలియక ఏదన్నా తప్పు చేస్తే ఏమీ అనుకోకండి. నిదానంగా అదే నేర్చుకుంటుంది" అని.

"నేనేమన్నా అన్నానని చైత్ర చెప్పిందా?" ఆవిడ గొంతులో అనుమానం.

"అబ్బే అలాంటిదేం లేదండి. ఎంతైనా మా ప్రాంతం అలవాట్లు వేరు. మీ అలవాట్లు వేరు. ఆ తేడా ఉంటుందని నేనే చెబుతున్నాను. మీకెలా కావాలో చెబితే నిదానంగా అదే నేర్చుకుంటుంది."

"టీవీలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వదిలి వస్తే కదా ఏదన్నా చెప్పడానికి" ఆవిడ గొంతులో నిష్టూరం. ఆ మాట చైత్రతో చెప్పబోతే "ఆవిడ డ్యూటీ నువ్వు తీసుకున్నావా?" అనేసింది. అప్పటి నుండీ నాకు కాకుండా ఆయనకు ఫోన్లు చెయ్యడం మొదలెట్టింది.

కూతుర్ని అంటున్నారని ఇప్పుడిట్లా ఇంతలా గిలగిలలాడిపోతున్నారు కానీ పెళ్ళయిన కొత్తలో ఈయన మాత్రం చేసింది ఏంటి? పెళ్ళయిన కొత్తలో ఏంటి

ఇప్పుడు మాత్రం? తను చేసే ప్రతి పనినీ వేయి కళ్ళతో కాపలా కాసేవారు. పనేమీ రాదని వెక్కిరించిన వాళ్లు వెక్కిరించినట్టే ఉండేవారు.

అంత వరకూ జరిగింది ఒక ఎత్తు చైత్ర పుట్టిన తర్వాత జరిగింది ఒక ఎత్తు. చైత్ర పుట్టిన దగ్గర్నుంచీ తన బతుకు మరీ నరకం అయిపోయింది. స్నానం చేయించేటప్పుడు పిల్ల లెవరైనా ఏడుస్తారు. చైత్ర ఏడ్చిందోలేదో గిలగిలలాడిపోయేవారు. కళ్ళల్లో నీళ్ళు పడినయ్యని, చెవుల్లోకి నీళ్ళుపోయినయ్యని, స్నానం చేయించడం సరిగా రాదని, నీళ్ళు మరీ వేడిగా ఉన్నాయనో, వేడిగా లేవనో, పాలసీసా సరిగ్గా కడగలేదనో, నీళ్ళల్లో మరిగించలేదనో పాలపీక రంధ్రం చిన్నగా ఉందనో, పెద్దగా వుందనో – ఏదైనా సాధించడానికి కారణమే.

తర్వాత అది పాకేటపుడు, నడిచేటపుడు, మట్టి తిన్నా, జలుబు చేసినా, జ్వరం వచ్చినా, బట్టలు తొడిగేటప్పుడు ఏడ్చినా అన్నీ తన తప్పులే. తన చేతగాని తనమే. దానితో చైత్ర అంటేనే తనకు భయం పట్టుకునేది. చైత్ర స్కూల్‌కి వెళ్ళేటపుడూ అంతే. ఒక పూట సాక్స్ ఉతికి లేకపోయినా, బటన్ కుట్టే టైమ్ లేక పిన్నీసుపెట్టినా ఆయన చేసే హంగామా అంతా ఇంతా కాదు. దానికి ఇచ్చే లంచ్ బాక్స్, స్నాక్స్ – అన్నిటి గురించీ  భయమే. అది ఏ రోజు ఇంటికి వచ్చి కూర బాగోక లంచ్ చేయలేదు, స్నాక్స్ నచ్చక తినలేదు బాగా ఆకలిగా ఉందని చెబుతుందేమోనని, అది కూడా ఆయన ఎదుట అత్తగారి ఎదుట చెబుతుందేమోనని తను భయంతో గజగజ లాడిపోయేది. అది ఏదైనా ఫిర్యాదు చేస్తే ఇంక ఆ రోజు ఇంట్లో యుద్ధమే.

అందుకే నాన్నకు ఏదీ చెప్పొద్దని ఏదన్నా ఉంటే తనకే చెప్పమని దాన్ని బ్రతిమలాడుకునేది. అది చిన్నతనంగా, అవమానంగా అనిపించినా ఇంక అంతకన్నా చేయగలిగింది లేదు. అప్పుడు  చైత్ర కళ్ళల్లో ఒకలాంటి విజయగర్వం కనిపించేది.

చైత్ర వాళ్ల చేతుల్లో ఉండగా ఏడిస్తే మామూలుగా ఏడ్చినట్టు. అదే నా చేతుల్లో ఉండగా ఏడిస్తే అది నాకు ఎత్తుకోవడం కూడా చేతకానట్టు. ఒకసారి నేను ఎత్తుకున్నప్పుడు చైత్ర ఏడుపు మొదలు పెట్టి ఎంతకీ ఆపలేదు. ఇంట్లోని అందరూ పరిగెత్తుకొచ్చారు. ఎంత సముదాయించినా ఆగలేదు. ఏడ్చి ఏడ్చి దాని మొహం నీలి రంగులోకి తిరిగి పోయింది. గబగబా హాస్పటల్‌కి తీసుకెళ్ళాల్సి వచ్చింది. ఆ రోజే నేను నేరస్థుల జాబితాలోకి చేరిపోయాను. వంద హత్యలు చేసిన వాడివంక చూసిన దానికన్నా నా వంక ఇంకా హీనంగా నువ్వే ఏదో చేశావన్నట్టు చూశారు.

“అది నాకు కూడా కూతురే. అది ఎందుకు ఏడ్చిందో నాకూ తెలీదు. దాని

బుల్లి శరీరంలో ఎక్కడ ఏం బాధ ఉందో నాకెలా తెలుస్తుంది? అది చెబితే కదా తెలిసేది అని ఎలుగెత్తి అరవాలనిపించింది. కానీ నేరస్థుల మాట వినిపించుకునే దెవరు? అప్పట్నుంచీ అదంటే నాకు ఇంకా భయం పెరిగిపోయింది. అది కూతురిలా కాక శత్రువులా, నన్ను తిట్టించే సాధనంలా అనిపించేది.

అసలు ఎందుకో ఏంటో తెలీదు కానీ నాకు మొదట్నుంచీ ఇంటిపని అంటే చిరాకే. కొందరికి రకరకాల వంటలు నేర్చుకోవడం అంటే ఆసక్తి వుంటుంది. నాకు ఎంతవరకూ అమ్మ పెట్టింది తినేసి, ఏ పుస్తకమో పట్టుకుని కూర్చుంటే చాలు కడుపు నిండిపోయినట్టు ఉండేది. పండగలనీ అదనీ ఇదనీ అమ్మ రకరకాల వంటలు చేస్తున్నా విసుక్కునేదాన్ని. ఇప్పుడవన్నీ అంత కష్టపడి వండుకుని తినకపోతే ఏమయిందని?

ఓసారి చైత్రని పక్కన ఆరుగుమీద కూర్చోబెట్టి ఏదో పుస్తకం చదువుకొంటున్నాను. చైత్ర నిద్ర వచ్చి కాబోలు ముందుకు తూలి కిందపడిపోయింది. కింది పన్ను పై పెదవిలో గుచ్చుకుపోయి రక్తం వచ్చింది. అది ఏడవడం మొదలు పెట్టగానే అందరూ పరిగెత్తుకుని వచ్చేశారు. ఏడుస్తున్న చైత్రని గుండెల కానించుకుని ఊరుకోబెడుతున్నాను. ఆయన చైత్రని నా చేతుల్లోంచి లాక్కుని మా అత్తగారికి అందిస్తూ నా వంక, నా చేతుల్లోని పుస్తకం వంక చూసిన చూపు ఇప్పటికీ ఇన్నాళ్ల తర్వాత కూడా ఇంకా అలాగే గుర్తుండిపోయింది.

ఆ తర్వాత చైత్రనే కాదు పుస్తకాల్ని చూసినా కూడా ఒకలాంటి భయం పట్టుకుంది. ఏదన్నా పుస్తకం చదవాలంటే అది ఎప్పుడు చదువుకోవచ్చో, ఎప్పుడు చదువుకుంటే ఎవరికీ అడ్డం ఉండదో తెలియక పుస్తకాలకి కూడా దాదాపు దూరం అయిపోయాను.

ఒకసారి చైత్రని తీసుకుని మా ఊరు వెళ్ళినపుడు పచ్చడి జాడీ మూత కాలుపై వేసుకుంది. మూత పగిలి బొటన వేలి గోరు చితికి రక్తం వచ్చింది. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన మొహం చూడడానికే భయం వేసింది. అదేం ఖర్మో ఎంత జాగ్రత్తగా చూసినా అది అక్కడ ఏదో ఒక దెబ్బ తగిలించుకునేది. తగిలిన దెబ్బ వారం రోజులకే నయమైపోయేది. కానీ నా మనసుకి తగిలిన దెబ్బ?

ఆయన్ని చూస్తుంటే "స్లీపింగ్ విత్ ది ఎనిమీ" సినిమా గుర్తొచ్చేది. అందులో కూడా అంతే. భార్య ఏం చేసినా భర్త వెనకే సరిచేసుకొస్తూ ఆమె పనుల మీద నిఘా పెడుతుంటాడు. చివరికి వాష్ బేసిన్ దగ్గర ఉండే నాప్‌కిన్ మడత కూడా ఆయన చెప్పినట్టే ఉండాలి. వేరేగా వుంటే ఆమె చూసేలా తీసి సరిచేస్తుంటాడు. భర్త ఇంటికి వస్తున్నాడంటేనే ఆమె భయపడిపోతుంటుంది.

ప్రపంచంలో ఏ ఒక్కరి పనీ ఇంకొకరికి నచ్చదు. ఎవరు పని చేసే పద్ధతి వాళ్లకుంటుంది.

ఏదైనా అదే పనిగా అంటుంటే చివరికి అది నిజమై పోతుందేమో. మా నాయనమ్మ ఎప్పుడూ అంటుండేది ఓడు ఓడు అంటే కంచమంతా ఓడు అని. నాకు పని చేతకాదు చేతకాదు అని వాళ్ళు అంటుంటే అది చివరకు నిజం అయ్యేది. అంతకు ముందు ఏపని అయినా మామూలుగా చేసేసేదాన్ని. అయితే తప్పులు పట్టుకునే కొద్దీ వంకలు పెట్టేకొద్దీ ఆ భయంలో కంగారులో నేను ఏం చేస్తున్నానో నాకే తెలియకుండా పోయేది. ఎంత జాగ్రత్తగా చేసినా ఒకోసారి ఇడ్లీ గట్టిపడిపోయేది. ఉప్మా ఉండలు కట్టేది. తోడుకోవాల్సిన పెరుగు తోడుకునేది కాదు. పప్పులు బూజుపట్టిపోయేవి. ఎక్కడ ఏది సరిగ్గా లేకపోయినా అది నా లోపమే. నా చేతకాని తనమే. నా బద్ధకమే. ఇంట్లో ఎంతమంది ఉన్నా వాటన్నిటి బాధ్యత నా ఒక్కదానిదే.

నేనేమన్నా వంద కాళ్ళూ చేతులూ ఉన్న కాళ్ళజెర్రినా? వేయి చేతులున్న సూపర్ ఉమెన్నా అనిపించేది. కొన్నాళ్ళకు నా గురించి నాకే సందేహంగా అనిపించడం మొదలు పెట్టింది. నేను నేనేనా? నేను సుమిత్రనా? లేక ఉడకని పప్పునా? ఊడిన గుండీనా? వేలాడే బూజునా? అనుకునేదాన్ని. ఒకసారి మా ఫ్రెండు సువర్చల ఇంటికి వెళ్లినప్పుడు అది కూరలో కొంచెం ఉప్పు కారం వేసి కలియతిప్పి స్టవ్ కట్టేసింది. “అదేంటి ఉప్పు కారం చూడవా” అని అడిగాను. అదే నేనయితే ఒకటికి రెండుసార్లు చూసి ఏది తగ్గితే అది కలుపుతాను. పులుపు ఎక్కువైనట్టు అనిపిస్తే దొంగతనంగా ఏ బెల్లమో వేసి జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసిన సందర్భాలు ఎన్నో. నేను అడిగింది విని అది “తినేది నేనొక్కదాన్నే కదా! ఎట్లా ఉంటే ఏంటి?” అంది. వాళ్ళ ఆయన దుబాయ్‌లో ఉంటాడు. లోకంలో అంత స్వేచ్ఛ కూడా ఉందా అని నాకు ఆశ్చర్యం వేసింది.

మా మామగారికి బిజినెస్‌లో మంచి అనుభవం ఉంది. తన తెలివితేటలతో అనుభవంతో ఆయన బిజినెస్‌ను ఎంతో వృద్ధిలోకి తెచ్చారు. మామగారు అనారోగ్యంతో మంచంలో పడగానే బిజినెస్ వ్యవహారాలన్నీ ఆయన ఒక్కరే చూసుకోవాల్సి వచ్చింది. ఎవరిని పడితే వాళ్ళని నమ్మి అన్నీ కిందివాళ్లకి అప్పగించడంతో నష్టాలు రావడం మొదలయింది. కుటుంబ పరిస్థితిపై కూడా ఆ నష్టాల ప్రభావం పడింది.

“బిజినెస్ ఎలా ఉంది? కొంచెం దెబ్బతిందట కదా” అని ఎవరైనా అడిగితే మా అత్తగారు ఆయన్ని వెనకేసుకొచ్చేది. “పిచ్చి సన్నాసి. వాడికేం తెలుసని, అన్నీ ఇంతకాలం ఆయనే చూసుకునేవారు. ఒక్కసారి అంత భారం వచ్చి మీద పడితే పసివాడు ఉక్కిరి

బిక్కిరైపోదూ? బిజినెస్ అన్నాక లాభాలు వస్తాయి. నష్టాలూ వస్తాయి. కాస్త అనుభవం వచ్చాక నిదానంగా అన్నీ వాడే నేర్చుకుంటాడు. అదేమన్నా బ్రహ్మవిద్యా" అనేది.

అచ్చంగా నా పరిస్థితి కూడా అదే అనేది ఆవిడకి ఎందుకు అర్ధంకాదు అనిపించేది. నేనూ కొత్తగా వచ్చిన దాన్నే కదా. ఏదైనా పని పనే. ఇంట్లో పని అయినా బిజినెస్ అయినా ఒకటే. ఇంట్లో పని సరిగ్గా చెయ్యలేక పోవడం చేతకానితన మైతే బిజినెస్ సరిగ్గా చెయ్యలేకపోవడం కూడా చేతకానితనమే అవ్వాలి కదా! బిజినెస్ పాడవడానికి పొరబాట్లు కారణమైతే వంట పాడవడానికి కూడా పొరబాట్లే కారణం అవ్వాలి కదా. కానీ ఒకటి పొరబాటు, అనుభవం లేకపోవడం అయితే ఇంకోటి చేతకాని తనం ఎందుకు అవ్వాలి? అయితే నేను ఆడదాన్ని. అందులోనూ ఒక భార్యని. ఆ జ్ఞానం ఉండడం వల్ల ఆ ప్రశ్నలన్నీ స్వగతాలుగా ఉండిపోయేవి కానీ గొంతుదాటి పైకి వచ్చేవి కాదు.

ఇప్పుడు ఇన్నాళ్ళకు చైత్ర కారణంగా మరుగున పడిన ఆ జ్ఞాపకాలన్నీ బావిలో ఊటలాగా వద్దన్నా ఊరుతున్నాయి. పాతికేళ్ళ కిందట నేను ఏ పరిస్థితిలో ఉన్నానో ఇవాళ చైత్ర అచ్చంగా అదే పరిస్థితిలో వుంది. అప్పుడు నేను పడిన బాధ ఇప్పుడు అది పడుతోంది. నేనంటే ఆయనకు భార్యని. నేను బాధపడినా ఆయనకు లెక్కలేదు. భార్య ఎటుతిరిగీ మనిషి కాదు కనుక. కానీ అది కూతురు. భార్యనంటే కష్టపెట్టటం తేలిక. లోకంలోఅన్నింటికన్నా హీనమైన ప్రాణి భార్యకాక ఇంకేముంది? కూతురంటే అలా కాదు కదా!

చైత్ర చిన్నప్పటి నుంచీ అన్నిట్లో తన మాటే నెగ్గించుకుంటూ పెరిగింది. దానికి ఏవీ ఒక పట్టాన నచ్చవు. ఇంట్లో చేసేవి కూడా దానికి నచ్చేవి కాదు. ఏం కూర చేసినా గిన్నె మూత తీసి చూసి వాళ్ళ నాన్నకి ఫోన్ చేసేది. బైటినుంచీ వస్తూ పిజ్జానో, నూడిల్సో, బిర్యానీనో తేవా అంటూ. సోఫాలో కూర్చుని కాళ్ళు టీపాయ్ మీద తన్నిపెట్టి టీవీ చూసేది. ఏదన్నా చెప్పబోతే అట్లా అత్తలా సాధిస్తావేంటి అనేది.

ఇప్పుడు తెలిసివస్తోంది. దానికి అత్తగారిల్లు అంటే ఎలా ఉంటుందో ఏంటో? అంత మాత్రాన ఫోన్లు చేసి వాళ్ళు ఇట్లా అన్నారని, అట్లా అన్నారని చాడీలు చెప్పడమేనా? కొద్దిగన్నా ఇంగిత జ్ఞానం ఉండొద్దూ?

అది నీ కూతురా? శత్రువా అని ఆయన తేలిగ్గా అనేశారు. మరి నేను ఆయన భార్యనా? శత్రువునా అని ఆయన్ని అడగలేకపోయాను. దానికి మళ్ళీ భార్యననే జ్ఞానం అడ్డుపడింది. అట్లా జ్ఞానం అడ్డుపడినప్పుడల్లా మాట్లాడకుండా నవ్వడం అదీ

కుదరకపోతే మనసులోనే నవ్వుకోవడం అలవాటైపోయింది. అలాంటి ఎన్ని వందల వేల నవ్వులు, స్వగతాలు కలిపి ఒకనేను అయ్యానో నాకు తప్ప ఇంకెవరికి తెలుస్తుంది?

ఇప్పటికీ చైత్ర అంటే నాకు భయమే. కానీ అది నాకు కూతురు. శత్రువు కాదు. అయితే అది ఒక భార్య కూడా. భార్యకుండాల్సిన జ్ఞానాన్ని అమ్మ మాత్రమే ఇవ్వగలదు. ఆ జ్ఞానం ఇవ్వలేకపోతే అప్పుడు అది నా చేతకానితనం అవుతుంది. ఇంట్లో ఒక భార్య కుండే అనంతమైన బాధ్యతలు గురించీ ఆమె అధికారాలకు ఉండే పరిమితుల గురించీ ఏ రాజ్యాంగం చెప్పదు. చెప్పలేదు. ఒక్క భార్య మాత్రమే ఒక అమ్మ మాత్రమే చెప్పగలదు.

సెల్ రింగయింది. చైత్రే అయుంటుందనుకున్నాను. చూస్తే చైత్రే.

"చైత్రా. చెప్పు"

"అమ్మా, నాన్న లేరా? ఫోన్ చేస్తే తియ్యడం లేదు."

"చూడు చైత్రా. నీకు మీ నాన్న ఎందుకో నాకు తెలుసు. మీ నాన్న చెప్పలేనిది నేను మాత్రమే చెప్పగలది ఒక్కటుంది. నువ్వు విన్నా వినకపోయినా చెప్పడం నా బాధ్యతని చెబుతున్నాను. ఒక్కపూట తినే కూర కన్నా భార్య మనసు ఎక్కువని, అది గాయపడకుండా ఉండడం ఎక్కువని లోకంలో ఏ భర్తా అనుకోడు. అందుకని ఏదైనా చెయ్యడం ఒక్కటే నీ పని. పొరబాట్లు జరుగుతుంటాయి. వాటినుంచీ నేర్చుకునేది నేర్చుకో. చికాకులు వస్తూనే ఉంటాయి. అవన్నీ జీవితంలో భాగం. ఇవేవీ లేని జీవితం అంటూ ఎక్కడా వుండదు. నీకు భర్తా పిల్లలు, ఒక కుటుంబం అంటూ ఉండాలి అనుకుంటే అలాగే కొంచెం సర్దుకుపో. అవేవీ వద్దు అనుకుంటే... అలా ఎప్పుడనిపిస్తే అప్పుడు ఇక్కడికి వచ్చెయ్యి. జీవితంలో ఈ రెండే ఆప్షన్లు. థర్డ్ ఆప్షన్ అంటూ ఏదీ వుండదు. ఉంటుందని ఎవరన్నా చెప్పినా నమ్మకు. తర్వాత నీ యిష్టం."

"అమ్మా..." అంటూ అది ఏదో చెప్పబోయింది. వినిపించుకోనట్టే ఫోన్ పెట్టేశాను. అది ఏం చెప్పబోయినా ఏం చెప్పినా నేను చెప్పాల్సిన దానిలో, చెప్పినదానిలో మార్పేమీ ఉండదు. ఇంక దేనికి వినడం?

*'ఆంధ్రజ్యోతి' 31 మే 2015*

# డిలీట్

**మ**ళ్ళీ ట్రాన్స్‌ఫరయింది. కొత్త ఊరు, కొత్త మనుషులు, కొత్త పరిచయాలు. మనసు మనకు తెలియకుండానే కొన్ని కొన్నిటికి అలవాటు పడిపోతుంది. పరిసరాలతో అనుబంధం పెంచుకుంటుంది. వాటన్నిటినీ తుంచి వేసుకుని ఒక కొత్త వాతావరణం లోకి రావడానికి మొదట కాస్త మొరాయిస్తుంది. అలవాటైన దారిలో ఉండే సుఖం అది. తెలియని మిత్రుడికన్నా తెలిసిన శత్రువు నయమన్నట్టు కొత్త సర్దుబాట్లకు మనసు ఎప్పుడూ ఆహ్వానం పలకదు. అయినా కొన్ని కొన్ని తప్పవు. శరీరాన్నీ, మనసునీ నలభై మైళ్ళ ప్రయాణానికి సిద్ధం చేస్తున్నాను. ఆదివారం. రోజువారీ పరుగు పందెంలో కొంచెం ఆటవిడుపు. రోజులో కాసేపయినా యంత్రంలా కాకుండా మనిషిగా బతకనిచ్చేరోజు. తీరిగ్గా కూర్చుంటే గుర్తొచ్చింది సెల్‌లో కొన్ని నెంబర్లు డిలీట్ చేయొచ్చని. ట్రాన్స్‌ఫర్ అయినప్పుడల్లా అది కూడా ఒక పని.

ఉద్యోగ అవసరార్థం వచ్చిచేరే నెంబర్లు కొన్ని ఉంటాయి. అవి ఆ ఊరికే పరిమితం. ఊరి పొలిమేర దాటగానే ఇంక వాటితో పని ఉండదు. జీవితంలో మళ్ళీ ఆ నెంబరును ఉపయోగించాల్సిన అవసరం వాళ్ళకీ నాకూ కూడా రాదు. అలాంటివి తేలిగ్గా ఓ ఇరవై, ముప్ఫయి ఉంటాయి. వాటిని డిలీట్ చేయడానికి కూర్చున్నాను.

ప్రతి పేరుకీ ఓ జ్ఞాపకం ఉంటుంది. మంచిదో, చెడ్డదో. అభిమానంగా ఉన్న వాళ్ళు, విసిగించిన వాళ్ళు, ఉపయోగపడిన వాళ్ళు, ఉపయోగించుకున్న వాళ్ళు, బతకనేర్చిన వాళ్ళు, బతకలేక పల్టీలు కొడుతున్నవాళ్ళు – ప్రతి పేరూ వట్టి పేరు మాత్రమే కాదు. ఓ జ్ఞాపకం. ఓ సజీవ స్మృతి శకలం. వరుసగా ఒకొకటీ డిలీట్ చేస్తూ కూర్చున్నాను. ఎస్. అక్షరం మొదలయింది. స్క్రీన్ శశాంక్ పేరు దగ్గరికి వచ్చి ఆగిపోయింది. శశాంక్. శశి మనసు ఉలిక్కిపడింది. అది డిలీట్ చేయాల్సిన పేరా? ఆలోచన అక్కడే ఆగిపోయింది. ఆ పేరు చుట్టూ గిరికీలు కొడుతోంది.

అవడానికి మా వారి స్నేహితుడే అయినా శశాంక్ మా రోజువారీ జీవితంలో ఒక భాగం అయిపోయాడు. శశాంక్‌లో ఇదీ అని చెప్పలేని ఓ ప్రత్యేకత ఉండేది. అతని కళ్ళల్లో, మాటల్లో, నవ్వుల్లో మనుషుల బలహీనతలపై ఎగతాళి కనిపించేది.

శశాంక్‌తో కలిసి ఎప్పుడన్నా బైటకు వెళ్ళినప్పుడు బస్టాండు ముందుకు రాగానే కారు స్లో చేసేవాడు. అక్కడ ఎలక్ట్రిక్ క్రిమెటోరియం వంక చూసి నవ్వేవాడు. "ఎందుకు శశీ నవ్వుతున్నావు?" అని ఆయనోసారి అడిగేశారు.

"ఏం లేదు. ఈ ఊరి మొత్తం మీద నాకు ఇష్టమైన చోటు ఏదో తెలుసా. ఇదే. ఎవరు ఎంత గొప్పవాళ్ళయినా చివరికి ఇక్కడకు రావాల్సిందేగా" అనేవాడు. ఎన్నిసార్లు అక్కడికి వచ్చినా ఎప్పుడూ అదేమాట."ఒకసారి లోపలకు వెళ్ళి చూడాలి ఎలా ఉంటుందో" అనేవాడు. అతని మాటలకి ఇద్దరం నవ్వేవాళ్ళం. అప్పుడు మాకు తెలియదు. శశాంక్ త్వరలోనే అక్కడికి వెళతాడని, లోపల ఎలా వుందో చూస్తాడని.

జీవితంలో కొన్నికొన్ని విషయాలను గురించి ఆలోచిస్తుంటే విచిత్రంగా అనిపిస్తుంది. అవి అలాగే జరగాలని ఎక్కడో రాసిపెట్టి ఉంటుందేమో. జీవితంలో ఎన్నో అనుకుంటాం. ఇంకెన్నో ఆశిస్తాం. ఏవేవో చేయాలని కలలు కంటాం. కానీ జీవితం మనకోసం ఏం దాచిపెట్టి ఉంచిందో, కనబడని అదృశ్యహస్తం మనని ఏ వైపుకి నడిపిస్తుందో అప్పుడు తెలియదు. తీరా జరిగేటప్పటికి తెలుసుకోడానికి మనం ఉండం. మన నుంచి దూరమైనవాళ్ళని మన జ్ఞాపకాల్లోంచి చూసినప్పుడు అది కొంత కొంత బోధపడుతుంది.

మనిషికి ఎన్ని కలలు? ఎన్ని కోరికలు? జీవితం అంటే ఎన్ని ఆశలు? అన్నీ తన చేతుల్లో ఉండాలి. ప్రతిదాన్నీ తన చేతుల్లోకి తెచ్చుకోవాలి. ఏదీ తనని దాటి పోకూడదు అని. శశాంక్ కూడా అలాగే ఉండేవాడు. ఏదో పనిమీద బైటకు వెళ్ళి ఒకసారి తన ఆఫీసుకి వెళ్ళాం ఆయనా, నేనూ. శశాంక్ ఆఫీసులోనే ఉన్నాడు. తన గదిలోనే కూర్చుని రహస్యంగా పెట్టించుకున్న క్లోజ్‌డ్ సర్క్యూట్ టీవీ నుంచి సిబ్బంది కదలికల్ని గమనిస్తున్నాడు. తప్పు కదూ అన్నాను. నవ్వి ఊరుకున్నాడు.

జీవితంపై అంత నిఘా పెట్టినవాడు ఇప్పుడు ఏడీ? ఎక్కడున్నాడు? అందరిపై నిఘా పెట్టాడు కానీ కాలం తనపై పెట్టిన నిఘా కనుక్కోలేకపోయాడు. అన్నిటినీ గుప్పిట్లోకి తెచ్చుకోవాలనుకున్నవాడు గుప్పెడు బూడిదగా మారిపోయాడు. అదే ఎలక్ట్రిక్ క్రిమెటోరియంలో. ఆ మాట అన్నప్పుడు శశాంక్‌కి తెలుసా తర్వాత అదే జరగబోతోందని.

శశాంక్ ఒకోసారి ఎంత చిన్న పిల్లాడిలా ఉంటాడో ఒకోసారి అంత మేధావిలా ఉంటాడు. గొంతులోని చిన్న ప్రకంపనాన్ని బట్టి అది నిజమో అబద్ధమో పట్టుకునేవాడు. ఎంత సీరియస్‌గా ఉండేవాడో మళ్ళీ అంత హాస్యప్రియుడు. ఎవరన్నా సరదాగా ఒక మాట చెబితే రోజుల తరబడి దానిని తల్చుకుని నవ్వేవాడు.

ఒకసారి ఆయనా, శశాంక్ పనిమీద బైటకు వెళ్ళి వస్తూ నన్ను ఎక్కించుకునేందుకు మా ఆఫీసుకు వచ్చారు. కారు బయల్దేరిన తర్వాత లంచ్ బాక్స్ బరువుగా ఉండడం చూసి "ఏంటి లంచ్  చేయలేదా?" అన్నారు ఆయన.

"ఊ. తినలేదు. తినబుద్ధి కాలేదు" అన్నాన్నేను.

"అయ్యో! అదేంటి ఎందుకు తినలేదు? వంట్లో బాగోలేదా?" ఆదుర్దాగా అడిగాడు శశాంక్.

"బిర్యానీ తిన్నాను" అన్నాన్నేను తాపీగా.

అంతే. శశాంక్ స్టీరింగ్ వదిలేసి గట్టిగా నవ్వడం మొదలుపెట్టాడు. హైవే. వచ్చేకార్లు, పోయేకార్లు.

"బాబ్బాబు నీకు పుణ్యం ఉంటుంది. సరిగ్గా డ్రైవ్ చేయి. చేయాల్సిన పనులు ఇంకా కొన్ని మిగిలున్నాయి" అన్నాను. గట్టిగా నవ్వుతూనే స్టీరింగ్ పట్టుకున్నాడు.

"మీ ప్రాణానికి, మీ ఆయన ప్రాణానికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. మీ ఇద్దర్నీ క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యత నాది. సరేనా" అన్నాడు.

మమ్మల్ని క్షేమంగా ఇంటికి చేర్చాడు. తనే క్షేమంగా ఇంటికి చేరలేకపోయాడు. అదే రోడ్డు తర్వాత కొన్ని రోజులకే అతన్ని శాశ్వతంగా దూరం చేయబోతోందని అప్పుడు మేం అనుకున్నామా?

ఆ దారిన ఎప్పుడు వెళుతున్నా శశాంక్ ఈ దారిలోనే వెళ్ళుంటాడు కదా. పాటలు వింటూ జీవితం గురించి ఏవేవో  ఊహించుకుంటూ ఈ దారిలోనే వెళ్ళుం టాడు కదా అనిపించేది. రోజులో ఏదో సందర్భంలో శశాంక్ గురించి మాట్లాడుకో కుండా మాకు ఇప్పటికీ గడవదు. అలాంటిది డిలీట్ చేసినంత మాత్రాన మరిచిపోయేదా శశాంక్ జ్ఞాపకం.

శంకర్రావు మాత్రం? అవడానికి ఆఫీసులో అటెండరే అయినా శంకర్రావు నుంచీ నేను నేర్చుకున్న పాఠాలు చివరకు యూనివర్శిటీలో కూడా నేర్చుకోలేదేమో.

ఉద్యోగంలో చేరిన రెండో రోజు అనుకుంటా అడిగాడు "ఇంటిపేరు పూర్తి పేరు చెప్పండమ్మా. నేమ్ బోర్డు తయారు చేయిద్దాం" అని.

"పూర్తి పేరు ఎందుకు? పొడి అక్షరం సరిపోతుంది" అన్నాను.

"కాదమ్మా. ఈ ఊళ్ళో ఎక్కువమంది మీ వాళ్ళే. పూర్తి పేరు ఉండడమే మంచిది" అన్నాడు.

యూనివర్శిటీలో చెప్పని జీవితపు కొత్త పాఠాన్ని సమాజపు మరో కోణాన్ని ఆ రోజు శంకర్రావు నుంచీ తెలుసుకున్నాను. అతను అన్నది నూటికి నూరుపాళ్ళు నిజమని తర్వాత అనేక సందర్భాల్లో రుజువయింది కూడా. అయితే అది అట్లా రుజువు కావడం కూడా నాకు బాధనే కలిగించింది. అసలు దాన్ని అలా ట్రంప్ కార్డులా వాడాలనుకోవడం, వాడాల్సిన అవసరం రావడం కూడా నిజానికి దౌర్భాగ్య మనిపించింది. అలా సంవత్సరం గడిచేటప్పటికల్లా కొన్ని చేదు అనుభవాలు మిగుల్చు కున్నాను. అయితే ఆ అన్ని సందర్భాల్లో నేను బెంబేలెత్తిపోకుండా నిలబెట్టింది కూడా శంకర్రావే.

"ఉద్యోగం అంటే అలాగే ఉంటుందమ్మా" అనేవాడు ఎప్పుడూ.

ఒకసారి ఏదో పేదలకి పట్టాల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. రెండు పార్టీల వాళ్ళు మా వాళ్ళకి పట్టాలు ఇవ్వాలంటే మా వాళ్ళకి ఇవ్వాలని ఇంతింత పొడుగు జాబితాలు పంపారు. ఎవళ్ళకి వాళ్ళు మా వాళ్ళకి రాకపోతే మీ సంగతి చూస్తాం అన్నట్టు ఉన్నారు. ఆ వత్తిడికి తట్టుకోవడం కష్టమనిపించింది. శంకర్రావే అప్పుడూ కొంత వరకు గట్టెక్కించాడు.

ఒకరోజు రాత్రిపూట గుండె దడగా అనిపించి చనిపోతానేమో అనిపించింది. మర్నాడు శంకర్రావుకి చెబితే 'రోజూ మృత్యుంజయ శ్లోకం చదువుకుంటే ఎటువంటి భయం ఉండదమ్మా. మీరేమో అటువంటివి నమ్మరు. నా మాటవిని ఆ శ్లోకం చదవండి. ఇంక ఏ భయం ఉండదు" అన్నాడు. అతని నమ్మకాన్ని ఆ విషయాన్ని అతను చెప్పిన తీరుని చూసి నవ్వువచ్చింది.

శంకర్రావు చనిపోయిన రోజు చూడడానికి వెళ్ళినప్పుడు ముందు అదే గుర్తు వచ్చింది. అందరికీ చెప్పిన మృత్యుంజయ శ్లోకాన్ని అతను ఎందుకు పట్టించుకోలేదు అని. అందరికీ చదవమని చెప్పినవాడు తను ఎందుకు ఆ పని చేయలేకపోయాడని.

శంకర్రావుకి జ్యోతిష్యం అంటే నమ్మకం ఎక్కువ. జాతకాల పిచ్చి కూడా ఉండేది. వాళ్ళ అమ్మాయి జాతకం కూడా రాయించానని ఒకసారి చెప్పాడు. "మా అమ్మాయికి గవర్నమెంటు ఉద్యోగం వస్తుందని జాతకంలో ఉందమ్మా. మరి ఎందులో వస్తుందో ఎలా వస్తుందో కానీ అన్నాడోసారి. ఆ మాట అన్నప్పుడు శంకర్రావుకీ

నాకూ తెలీదు ఆ అమ్మాయికి శంకర్రావు ఉద్యోగమే కంపాసినేట్ గ్రౌండ్స్ కింద వస్తుందని. శంకర్రావు ఉద్యోగాన్ని ఆ అమ్మాయికి ఇచ్చిన తర్వాత నాకు అనిపించింది. శంకర్రావుకి ఎలాగైనా ఆ విషయం చెప్పగలిగితే బాగుండని. శంకర్రావునీ, అతని భార్యనీ, కూతుర్ని ఇంటికి భోజనానికి పిలిచి బట్టలు పెట్టాలని అనిపించింది. ఆడ వాళ్ళిద్దరికీ బట్టలు తీసుకున్నాను. శంకర్రావుకి షర్టు తీసుకోవడమే కుదరలేదు. షర్టు తీసుకున్న తర్వాత భోజనానికి పిలవడం కుదరలేదు. చివరికి ఆ రోజు రాకుండానే పోయింది. బీరువా తీసినప్పుడల్లా ఆ షర్టు ముక్క కనిపించి చేద్దామనుకున్న పని జీవితకాలం లేటు కాకూడదన్న విషయాన్ని గుర్తు చేస్తుండేది.

ఇప్పుడు శంకర్రావు ఓ జ్ఞాపకమే. అయినా ఇప్పటికీ ఏ చిన్న కష్టం వచ్చినా ఇప్పుడు శంకర్రావు ఉంటే బాగుండేది అనుకుంటాను.

స్క్రీన్ మళ్ళీ సురేంద్ర పేరు దగ్గర ఆగిపోయింది. మొదటిసారి సురేంద్రని చూసినప్పుడు అతని మొహంలో కనిపించిన వికారత్వాన్ని చూసి ఆశ్చర్యమనిపించింది. నొసటి నుంచీ కిందకు అణిగిపోయిన ముక్కు, పక్కకి తిరిగిపోయిన నోరు, ఉబ్బెత్తుగా ఉండే కళ్ళు. చూడడానికి తేడాగా కనిపించేవాడు. యాక్సిడెంటు జరిగి మొహం అలా అయిందని తర్వాత తెలిసింది.

అయితే రానురాను అతని మొహం అలవాటయిపోయి అతని రూపులోని వికారాన్ని మనసు గుర్తించడం మానేసింది. ఎప్పుడు మాట్లాడినా నంగినంగిగా మాట్లాడే వాడు. అందుకని అతన్ని ఎప్పుడూ తిట్టేదాన్ని, కోప్పడేదాన్ని.

ఓ రోజు "ఉద్యోగానికి సెలవు పెడుతున్నానమ్మా" అన్నాడు. ఎందుకని అడిగాను. "మొహానికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాలి. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే తప్ప మంచి సంబంధాలు రావని మా నాన్న గోలపెడుతున్నాడు. నాకైతే ఇష్టం లేదు. కానీ మా నాన్న కోసం చేయించుకోక తప్పడం లేదు" అన్నాడు.

అప్పటికే అతని అవకరం అవకరంగా అనిపించడం మానేసింది. అసలు ప్లాస్టిక్ సర్జరీ అవసరమా అనికూడా అనిపించింది. అతనితో ఆ మాటే అన్నాను. అతను నవ్వి ఊరుకున్నాడు.

ఆ రోజు ఆపరేషన్ అనగా పొద్దున్నే ఫోన్. సురేంద్ర చనిపోయాడని. ఆత్మహత్య చేసుకున్నాడట. ప్లాస్టిక్ సర్జరీ అయిపోయిందని చెబుతారన్న వార్త కోసం చూస్తున్న నాకు ఆ వార్త వెంటనే అర్థం కాలేదు.

ప్లాస్టిక్ సర్జరీకి రెండు లక్షలు ఖర్చు అవడం అనేదానిమీద ఇంట్లో ఘర్షణ

జరిగిందంట. తర్వాత సురేంద్ర పొలం దగ్గరకు వెళ్ళి పురుగుల మందు తాగాడంట.

ఆ విషయం చెబుతూ అతని ఫ్రెండు నేను ఊహించని ఒక విషయం చెప్పాడు. సురేంద్ర అతనితో ఎప్పుడూ అంటుండేవాడట. "మేడమ్ మంచివాళ్ళురా. నేనున్నా లేకపోయినా మేడమ్‌కి ఆఫీసులో ఏ ఇబ్బందీ లేకుండా చూడూ అని.

అది వినగానే మనసు భారంగా అయింది. నా గురించి అలా అప్పగింతలు పెట్టిన మనిషిని నేను రోజూ తిట్టేదాన్ని కదా అని. అతను అలా డిప్రెషన్‌లో ఉన్నాడని తెలిస్తే నాలుగు మంచి మాటలు చెప్పి జీవితం మీద కొంచెం ధైర్యం కలిగించే దాన్నికదా. అలా అయితే బతికి ఉండే వాడేమో అని.

ఈ ముగ్గుర్నీ ఏదో సందర్భంగా నేను రోజూ గుర్తుచేసుకుంటూనే ఉంటాను. అలాంటిది వాళ్ల నెంబర్లని నేను చూస్తూ చూస్తూ ఎలా డిలీట్ చేయగలను?

నా నెంబర్‌ని ఎవరో ఒకరు డిలీట్ చేసేంతవరకూ వాళ్ళ నెంబర్లని నేనూ డిలీట్ చేయలేనేమో!

*'విపుల' జులై 2015*

# అభయారణ్యం

**వ**రండాలో చీకట్ల నీడలు. వెలుతురులో ఉంటే వెలుతురుని గుర్తించలేం. చీకటిలోంచి వెలుతురుని చూడడం బాగుంటుంది. మనం చీకటిలో వున్నామన్న స్పృహ ఉండదు. చీకటి కంటికి అదనపు చూపునిస్తుంది. రోడ్డుమీద పోయే వెలుతుర్ల దండల్ని చూస్తూ కూర్చుంటే కాలం తెలియదు.

"ఏంటినాన్నా లైటు వేసుకోకుండా ఇంత చీకట్లో" వరండాలో వెలుతురు చప్పుడు. అంత వెలుతురికి కళ్ళు చెదిరినయి. సూపర్ బజారుకి వెళ్ళినట్టున్నారు రెండు చేతులలో పేకెట్లతో లోపలికి వచ్చారు సిద్ధార్థ, విభ. ఇద్దరి మొహాలు ప్రసన్నంగా ఉన్నాయి. అంటే ఈ రోజుకి ఇంక ఫరవాలేదు. కానీ అలా అనుకోడానికీ లేదు. నిద్రపోవడానికి ఇంకా మూడు గంటలు టైముంది. అందులో రెండు నిముషాలు చాలు ఆ ప్రసన్నత చెదిరిపోవడానికి. ఇల్లు మూగబోవడానికి. వాళ్ళు ఏ రోజు ఎందుకు హుషారుగా వుంటారో, ఎందుకు మొహం ముడుచుకుంటారో ఇన్ని రోజులుగా చూస్తున్నా నాకు అంతు బట్టలేదు.

"విభా. వంట సంగతి ఏంటి?"

"నాకిపుడు వంట చేసే ఓపిక లేదు బాబూ. ఈ స్నాక్స్ ఏమన్నా తినేసి పాలు తాగేద్దాం."

"మరి నాన్న?"

"బైటినుంచీ ఏదో ఒకటి తెచ్చేద్దూ."

"రోజూ అంతే అవుతోంది. ఇంట్లోనే ఏమన్నా చేద్దామా? ప్లీజ్."

"ప్లీజ్ సిద్ధూ. అయామ్ డెడ్లీ టైర్డ్. అసలు తినే ఓపిక కూడా లేదు. నిద్ర వచ్చేస్తోంది."

"సరే. బైటే తెస్తాలే" సిద్ధూ గొంతులో నిస్సహాయపు అలసట.

బైటినుంచీ ఇప్పుడే అలసిపోయి వచ్చాడు. ఇప్పుడు నాకోసం మళ్ళీ బైటికి. వాళ్ళ సంభాషణలో జోక్యం చేసుకునేంత చనువూ లేదు. అలా అని వాళ్ళు ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకునే నిబ్బరమూ లేదు.

"సిద్ధూ, నాకు అంత ఆకలిగా లేదురా. కొంచెం మజ్జిగ తాగేస్తాను" చెప్పులేసు కుంటున్న సిద్ధూతో బెరుకుబెరుగ్గానే అన్నాను.

"అబ్బ. ఊరుకో నాన్నా. నువ్వొకడివి నా ప్రాణానికి" విసుగ్గా అంటూనే సిద్ధూ బైటకు వెళ్ళిపోయాడు.

మనసు చివుక్కుమనిపించింది. కానీ వాడి గొంతులోది నా మీది విసుగు కాదు. నాకు ఏదీ మంచిగా అమర్చిపెట్టలేకపోతున్నానన్న నిస్సహాయత.

పొద్దున్నే ఏ టిఫినో చేసుకోవడం, ఎనిమిదికల్లా ఆఫీసులకి పరిగెత్తడం, రాత్రికి వస్తూ ఏ బిర్యానీనో, పిజ్జానో, నూడుల్సో తెచ్చుకుని చెరికాస్తా తినేసి పడుకోవడం. నేను వచ్చేవరకూ వాళ్ళకు అట్లాగే సాగిపోయింది.

ఊళ్ళో ఒక్కడివే ఎందుకు ఇక్కడికి వచ్చేయి నాన్నా అని సిద్ధూ పట్టుబట్టి ఇక్కడకు తీసుకొచ్చాడు. దాంతో నాతో పాటు వాళ్ళకీ కష్టాలు.

ఏదో ఒకరోజు రెండు రోజులంటే ఫరవాలేదు కానీ, రోజూ ఆ బిర్యానీలు, పిజ్జాలు ఎక్కడ తినగలడు? తనకు ఆ తిండి అలవాటు లేదు. తిన్నా పడదు. ఇద్దరూ లంచ్ ఆఫీస్ కాంటిన్లో తినేవాళ్ళు, తన కోసం ఇప్పుడు మళ్ళీ ప్రత్యేకంగా వంట. వాళ్ళు మాత్రం ఏం చేస్తారు? వాళ్ళకి దేనికీ తీరికలేదు. ఓపిక లేదు. అన్నీ ఇన్‌స్టాంట్ తిళ్లే. ఇన్‌స్టాంట్ ఇడ్లీ, ఇన్‌స్టాంట్ దోశె – ప్రేమలు, పెళ్ళిళ్ళు, విడాకులు అన్నీ ఇన్‌స్టాంట్‌లే.

ఇష్టమున్నా లేకపోయినా అదే వాళ్ల జీవితం అయిపోయింది. వాళ్ళు దానికి అలవాటు పడిపోయారు. తనే అలవాటు పడలేకపోతున్నాడు. అంతకు ముందు వాళ్ళు గొడవలు పడేవాళ్లో లేదో తనకు తెలీదు. ఇప్పుడు సాయంత్రాలు ప్రతిరోజూ ఘర్షణే. కొంత వంట గురించి. శని, ఆదివారాలు వస్తే ఫ్రెండ్సనీ, పార్టీలనీ ఏవో ఒక ప్రోగ్రాములుంటాయి. విభకీ అవన్నీ ఇష్టం. సిద్ధూకి నచ్చవు. పైగా తనని ఇంట్లో ఒక్కడినీ వదిలేసి వెళ్ళలేడు.

వాళ్ళు బైటకు వెళుతున్నా తనకోసం ఏదో ఒకటి తయారుచేసి వెళ్ళాలి. విభ మొహంలో, నడకలో ఆ విసుగూ, అసహనం వద్దన్నా కనిపిస్తుంటాయి. బైటపార్టీ కెళ్ళేటప్పుడు కూడా ఇంట్లో వంట చేయాల్సి రావడం ఎవరికి మాత్రం ఉత్సాహంగా

ఉంటుంది. సిద్ధూ తనకోసం విభని వత్తిడి చేయడం తనకు ఇబ్బందిగా అనిపిస్తుంది. తన గురించి ఇద్దరి మధ్యా ఘర్షణ తనకు ఇష్టం ఉండదు. తన మూలంగానే సమస్యలు వస్తున్నాయని విభ ఎక్కడ అనుకుంటుందో అని తన భయం. వాళ్ళ ఇద్దరి మధ్యా కూడా గొడవలు మొదలైతే? ఒకసారి అయింది చాలదూ?

సహస్ర గుర్తుకు వచ్చింది. ఎంతో వెతికి వెతికి ఏరికోరి సహస్రని సిద్ధూకి చేసుకున్నాడు. సహస్ర మంచి పిల్ల. తెలివైన అమ్మాయి. వాళ్ళ జీవితం ప్రశాంతంగా సాగిపోతోందనుకుంటున్న రోజుల్లో ఓరోజు సహస్ర తన దగ్గరకు వచ్చింది. వచ్చీ రావడమే ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా

"నాకు సిద్ధూ నచ్చడం లేదంకుల్" అంది.

ఏం వింటున్నాడో ఒక్క నిముషం అర్థం కాలేదు.

"వాడు నచ్చకపోవడం ఏంటమ్మా. వాడు అచ్చమైన బంగారం. నువ్వు ఏదో పొరబాటు పడుతున్నావు తల్లీ"

"లేదంకుల్. సిద్ధూలో లోపం ఉందనడం లేదు. నాకు నచ్చడం లేదంటున్నానంతే. దానికి కారణం కూడా వేరే ఏదీ కాదు. జీవితం అంటే సిద్ధూకి ఉత్సాహం లేదంకుల్. అన్నీ ఏమిటి? ఎందుకు? ఏం ఉంది అందులో అంటాడు. ఒక సినిమాలు నచ్చవు. షికార్లు నచ్చవు. టీవీ చూడడు. పండగల్లో ఏముందంటాడు? పుట్టిన రోజు సెలబ్రేషన్ దేనికంటాడు. గుడికి వెళ్దాం అంటే ఎందుకంటాడు? ఒకళ్ళిద్దరు తప్ప ఫ్రెండ్స్ నచ్చరు. ఇరుగూ పొరుగూ నచ్చరు. బంధువులు అసలే నచ్చరు. తనని ఎలా అర్థం చేసుకోవాలో నాకు నిజంగా తెలియడం లేదంకుల్. దేనిపట్లా ఉత్సాహం లేదు. దేనిమీదా ఆసక్తి లేదు. కనీసం మంచి బట్టలు వేసుకోవాలన్న ధ్యాస కూడా ఉండదు. పుస్తకం పట్టుకుని కూర్చున్నాడంటే మాత్రం తిండీ తిప్పలు కూడా అక్కర్లేదు."

"వాడు చిన్నప్పటినుంచీ అంతేనమ్మా."

"కానీ నేను అలా కాదు అంకుల్. నాకు అన్నీ కావాలి. పండుగలు కావాలి, సరదాలు కావాలి, ఫ్రెండ్స్ కావాలి, బంధువులు కావాలి, జీవితంలోని అన్నీ.... అన్నీ ఏదీ మిస్సవకుండా అన్నీ కావాలి. ఏదీ నా చేతుల్లోంచి జారిపోకూడదు. ఏ క్షణం కూడా నాకు తెలియకుండా ముగిసిపోకూడదు. నవ్వుతూ నవ్విస్తూ జీవితాన్ని సరదాగా ఆనందంగా గడిపేయాలని ఉంటుంది నాకు. తనతో పాటు ఉంటే నా ఉత్సాహం అంతా చచ్చిపోతోంది అంకుల్. ఎంత ప్రయత్నించినా సిద్ధూలో ఉత్సాహం

నింపలేకపోతున్నాను. జీవితం అంతా ఇంత నిస్సారంగా గడపాలనే ఊహే భరించలేకపోతున్నాను."

"సహస్రా! వాడికోసం నా కోసం ఇంకొక్కసారి ఆలోచించలేవా తల్లీ?"

"ఇక్కడ నాకు నిజంగా సంతోషంగా లేదు అంకుల్. మీకు ఎట్లా చెప్పాలో నాకు తెలీడం లేదు. సిద్ధూలాంటి వాడికన్న ఒక మామూలు అబ్బాయి అయితే నేను ఇంకా ఎక్కువ సంతోషంగా ఉండేదాన్నేమో. ఇక్కడుంటే ఆ బీరువాల్లోని పుస్తకంలా నేనూ ఒక అలంకారంగా ఉంటాను తప్ప మనిషిలా ఉండలేను అంకుల్. సిద్ధూ ఎందులోనూ ఏమీ లేదంటాడు. నేను ఏదైనా మనం అనుకోవడంలోనే ఉందంటాను. ఏది అయినా ఉంది అనుకుంటే ఉంటుంది. లేదు అనుకుంటే ఉండదు. ఇది ఏదైనా ఒక విషయానికి సంబంధించి అయితే ఫరవాలేదు. మొత్తం జీవితానికి సంబంధించింది అంకుల్. మేం కలిసి సంతోషంగా ఎలా ఉండగలమో మీరే చెప్పండి?"

సహస్రకి ఏం చెప్పను? ఇందులో దోషం ఏదన్నా ఉంటే అది కచ్చితంగా నాదే. నా ప్రపంచాన్నంతా సిద్ధూకి పరిచయం చేయాలనే తహతహతో వాడిని నాతోపాటు తిప్పడం నేను చేసిన మొదటి తప్పు. వాడు ఆడుకోవాల్సినపుడూ పుస్తకాలు చదివాడు. పుస్తకాలు చదవాల్సినప్పుడూ పుస్తకాలు చదివాడు. వాడు ఎదగాల్సిన దానికన్నా ఎక్కువగా ఎదిగిపోయాడు.

వాడిని చూస్తే ఒకోసారి సంతోషం అనిపించినా ఒకోసారి బాధ కలుగుతుంది. బాల్యానికీ, కౌమారానికీ సంబంధించిన సహజసిద్ధమైన చాపల్యాలకు, అనుభవాలకు వాడు దూరం అవడానికి నేనే కారణమా అని. మానసికంగా వాడు వయసుకి మించి ఎదిగాడు. స్నేహితులతో వాడుసరదాగా మామూలు పిల్లల్లాగా మాట్లాడడం నేను ఎప్పుడూ చూడలేదు.

వాడి మానసిక స్థాయికి కొంతన్నా దగ్గరలో ఉండే అమ్మాయి కోసం చూడక పోవడం నేను చేసిన రెండో తప్పు. నదికీ, సెలయేటికీ మధ్య సహవాసం ఎలా ఉంటుందో సిద్ధూ, సహస్ర అలాంటివాళ్ళు. సెలయేటితో పాటు నది పరిగెత్తలేదు. నదికోసం సెలయేరు ఆగలేదు. సహస్ర చెబుతున్నదదే.

సిద్ధూకి నేను చెహోవ్‌నీ, టాల్‌స్టాయ్‌నీ, డాస్టియోవిస్కీని పరిచయం చేస్తే వాడు ఇంకొకడుగు ముందు వేసి ప్లేటో, అరిస్టాటిల్ వరకూ వెళ్ళొచ్చాడు. ఇప్పుడు వాడితో పాటు వాదనలో నేను గెలవలేను. వాడు వరసబెట్టి నీషేనూ, సార్త్రేను చదువుతుంటే

మొదటిసారి సిద్ధూ గురించి ఆలోచించాల్సి వచ్చింది. జీవితానికి అర్థం ఏమిటని అన్వేషణ మొదలు పెడితే ఇంక జీవితాన్ని వాడు ఆనందించేది ఎపుడనిపించింది.

వాడి గురించి సహస్ర అన్న మాటల గురించి ఆలోచించాను. వాడు సినిమాలు చూడకపోవడం అంటూ ఏమీలేదు. ఏవి పడితే అవి చూడడు. అంతే. నిజానికి వాడి దగ్గర ఉన్నన్ని హాలీవుడ్ క్లాసిక్స్ కలెక్షన్ నేను ఇంకెవ్వరి దగ్గరా చూడలేదు. వాడికి బాలమురళి, జేసుదాసు  కచేరీలంటే ప్రాణం. ఎమ్మెస్ భజగోవిందం వినందే నిద్ర లేవడు. సాహిత్యం, సంగీతం, సినిమాలు అన్నిటికి సంబంధించి వాడికి చక్కటి అభిరుచి ఉంది. సహస్రకీ వాడికీ మధ్య కొంత కల్చరల్ గ్యాప్ ఉండొచ్చని నేను అనుకున్నాను. అయితే అది ఇంత వరకూ వస్తుందనుకోలేదు. పుట్టినరోజులు, పండుగలు, గుళ్ళు,  గోపురాలు – సిద్ధూ వాటికి ఎప్పుడూ అతీతంగానే  ఉండేవాడు. వాటికి మించిన దేనికోసమో నిరంతరం పెనుగులాడుతుండేవాడు. ఒకసారి “జీవితానికి అర్థం ఏమిటినాన్నా” అని అడిగాడు. అలాంటప్పుడే సిద్ధూ తనని తికమక పెడుతుండే వాడు. ఇక సహస్రకి వాడు ఏం అర్థం అవుతాడు?

తర్వాత సిద్ధూని విడిగా పట్టుకుని అడిగాను.

“సిద్ధూ! సహస్ర చెబుతున్న దాని గురించి ఆలోచించావా?”

“సహస్ర చెబుతున్న వన్నీ మీనింగ్‌లెస్‌గా, అబ్సర్డ్‌గా అనిపిస్తాయి నాన్నా. వాటిల్లో నాకు దేనిమీదా ఇంట్రెస్ట్ లేదు. తనదంతా చిన్న పిల్లల తరహా. వీటన్నిటి నుంచీ మనుషులు ఎదగాలిగా నాన్నా” అన్నాడు.

వాడికి ఆఫీసులోనూ అదే సమస్య. త్వరగా ఎవరితో కలవలేడు. ఎవరిలో ఎలాంటి అల్పత్వం ఉన్నా సహించలేడు. తనకు నచ్చకపోతే మొహమాటానిక్కూడా పలకరించడు. ఇట్లా అయితే ఎలారా అంటే “వాళ్ళు మాట్లాడేదంతా జస్ట్ రబ్బిష్ నాన్నా. వీకెండ్ పార్టీలు, పబ్బులు, మందు, అమ్మాయిలు, క్రికెట్, బెట్టింగులు – ఎంతసేపూ వీటి గురించే నాన్నా? వీటి గురించి ఏం మాట్లాడను? ఎవరితో మాట్లాడను? మాట్లాడకపోతే మళ్ళీ అదొక ప్రాబ్లమ్” వాడు చెబుతుంటే అప్పుడు మొదలైంది నాకు సిద్ధూ గురించిన భయం. వాడి జీవితం ఎలా ఉంటుందోనన్న భయం.

సిద్ధూకి బతకడానికి కావాల్సిన లౌకికజ్ఞానం లేదు. కొన్ని కొన్నింటిని కావాలనే పట్టించుకోడు. బతుకు పోరాటంలో గెలవాలంటే కొన్ని కవచాలు, తొడుగులు తప్పనిసరని వాడికి చెప్పినా అర్థం కాదు. వాడు జీవితం సరళరేఖలా ఉంటుందను కున్నాడు. దారిలో కొండలు, లోయలు ఎదురైతే ఇబ్బంది పడుతున్నాడు. ఇరవై

ఏళ్ళు చదువుకుని వాడు నేర్చుకున్నదేమిటి? ఏది తిన్నగా ఉంటోంది కనుక జీవితం కూడా తిన్నగా ఉండడానికి?

సహస్ర వెళ్ళిపోయిన తర్వాత ఇల్లంతా ఒకలాంటి శూన్యం. తను వెళ్ళిపోయిన తాలూకు వెలితి అనుకున్న దానికన్నా ఎక్కువగా ఉంది. ఆ శూన్యాన్ని నింపడం కోసం మళ్ళీ అన్వేషణ. మొదటిసారి జరిగిన పొరబాటు మళ్ళీ జరగకూడదని ప్రయత్నించాడు. కానీ అది తను అనుకున్నంత తేలిక కాదని తేలిపోయింది.

దానికి తోడు ఆఫీసులో వాతావరణం నచ్చక అదే సమయంలో సిద్ధూ జాబ్‌కి కూడా రిజైన్ చేశాడు. ఇంక ఇరవై నాలుగ్గంటలూ ఇంట్లోనే. ఆ రోజుల్లో వాడిని పలకరించాలంటేనే భయం వేసేది. ఏం మాట్లాడితే ఏం వినాల్సి వస్తుందోనని సిద్ధూ అంటేనే భయపడి పోయేవాడు. ఈ చికాకుల్లో పడి కొట్టుకుంటుంటే ఇంటికి వచ్చీ పోయేవాళ్ళ పరామర్శలు ఒకటి. ఇంటికి రానూ ఏ టీనో, కాఫీనో తాగి కాళ్ళు బారచాపుకుని కూర్చుని సిద్ధూ ఇంట్లోనే ఉంటున్నాడంటగా అని ఎంక్వైరీలు చేయడం, ఏదన్నా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడా? మళ్ళీ సంబంధాలు చూస్తున్నారా? అని కెలికిందే కెలకడం, సమాధానాలు చెప్పలేక ఓ వైపు, సిద్ధూ అవన్నీ ఎక్కడ విని ఎలా రియాక్టవుతాడోనన్న భయం మరోవైపు. ఒక అవస్థ కాదు. నరకం ఎక్కడో లేదని పించింది. వచ్చినవాళ్ళు వచ్చినట్టు ఊరుకోకుండా వాళ్ళ కొడుకులు, కూతుళ్ళు, అల్లుళ్ళు, కోడళ్ళ జీతాలు, వాళ్ళ బ్యాంక్ బ్యాలెన్సుల పరమపద సోపాన పటాల గురించిన వివరాలు, వాళ్ళ విజయం తాలూకు ఐదుమెట్లు, అరవై ఆరు మెట్ల గురించిన హర్షపులకిత ఉపన్యాసాలు వినీ వినీ మనుషుల మీద విరక్తి పుట్టిపోయింది.

సిద్ధూని మనిషిగా నిలబెట్టడానికి ఎంత అవస్థపడ్డాడు. వాడికి ఇతర ఆలోచనలు రాకుండా ఎంతో ఎంగేజ్ చేశాడు. సిద్ధూది కాదు తన అదృష్టం కొద్దీ సిద్ధూకి మళ్ళీ ఉద్యోగం వచ్చింది. అందులో పనిచేస్తున్న విభ వాడి జీవితంలోకీ వచ్చింది. అయినా సిద్ధూ గురించి తన భయం తనదే. చరిత్ర మళ్ళీ పునరావృత్తమైతే? అందుకే విభ మొహంలో కోపం, అప్రసన్నత కనిపిస్తే తనకు కాళ్ళు చేతులు ఆడవు. విభ నవ్వితే పండుగ, ఒక్కగానొక్క కొడుకు సుఖ సంతోషాలే ప్రాణంగా బతుకుతున్న ఓ తండ్రి అంతకన్నా కోరుకునేది మాత్రం ఏముంటుంది?

కానీ ఎక్కడో ఏదో అపశృతి. ఇద్దరి మధ్యా కనిపించీ కనిపించనట్టు ఏదో తెర. సిద్ధూ మొహంలో అది కనిపిస్తోంది. ఏంటని అడిగే ధైర్యమూ లేదు. చెబితే విని తట్టుకునే శక్తీ లేదు. లోపం విభది కూడా అయుండకపోవచ్చు. సిద్ధూలో నిరంతరం

జరిగే సంఘర్షణ వాడిని కుదురుగా నిలవనివ్వడంలేదేమో అనిపిస్తోంది.

"నాన్నా. ఇక్కడున్నావా?" చీకట్లోంచి సిద్ధూ గొంతు.

"కింద ఊపిరాడనట్టు అనిపించిందిరా. కాసేపు చల్లగాలి తగులుతుందని."

"నాకూ ఊపిరాడడం లేదు నాన్నా. అంతా సఫకేటింగ్‌గా ఉంది. ఉక్కిరి బిక్కిరై పోతున్నాను. జీవితం, ఉద్యోగం – అన్నిటిలో ఏదో సఫకేషన్. ఎక్కడా స్థిమితం దొరకడం లేదు. అశాంతిగా అనీజీగా ఉంది నాన్నా."

ఒక్క నిముషం మాట్లాడలేకపోయాను.

"ఏమైందిరా సిద్ధూ" ఎలా అడిగానో నాకే తెలీదు.

"పుట్టటం, చదువుకుని ఉద్యోగం చేయడం, పెళ్ళి, పిల్లలు, మళ్ళీ ఆ పిల్లల చదువులు, ఉద్యోగాలు, ఆ పిల్లల పెళ్ళిళ్ళు, మళ్ళీ వాళ్ళ చదువులు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు – ఇదేనా నాన్నా జీవితం? ఇలాంటి జీవితానికి అర్థం ఉందంటావా?"

సిద్ధూ అన్నదాని గురించి నిజానికి అప్పటివరకూ నేనూ ఆలోచించలేదు. నేనే కాదు, నూటికి తొంభైతొమ్మిది మందీ కూడా ఆలోచించరేమో. కానీ ఆ తొంభైతొమ్మిది మందీ సుఖంగానే బతుకుతున్నారు. ఇట్లా సంఘర్షణలో పడి కొట్టుకుని ఇబ్బంది పడడం లేదు. తమ పక్కనున్న వాళ్ళనీ ఇబ్బంది పెట్టడం లేదు. ఆ తొంభైతొమ్మిది మందిలో సిద్ధూ కూడా ఒకడై ఉంటే తండ్రిగా నాకు మనశ్శాంతి దక్కేది. కానీ ఒక మనిషిగా సిద్ధూ నాకు నచ్చి ఉండేవాడు కాదేమో. సిద్ధూలోని ఆ విలక్షణత నాకు ఇష్టం. కానీ అప్పుడప్పుడూ ఆ విలక్షణతే భయపెడుతోంది. నలిగిన దారుల్లో నడక సుఖంగా ఉంటుంది.  అందరూ అలాగే అనుకుంటే కొత్త దారులు పుట్టేవి కాదేమో.

సిద్ధూకి ఏం చెప్పాలో తోచక మౌనంగా ఉండిపోయాను. ఇద్దరి మధ్యా కాసేపు మౌనం.

"ఈ అసూయలు, అల్పత్వాలు లేకుండా మనుషులు హుందాగా బతకలేరా? సమూహం ఒకడిని ఒంటరి వాడిని ఎందుకు చేస్తుంది నాన్నా?"

నాకు గుండె పట్టుకున్నట్టయింది. సిద్ధూ అన్న మాటల్లోని గాఢతను పట్టుకోవ డానికి నిముషం పట్టింది. ఎక్కడో బయలుదేరిన దిగులు మేఘం నా చుట్టూ మళ్ళీ కమ్ముకుంటోంది.

మనుషులు హుందాగా ఎందుకు బతకలేరు? ఒక సమూహం ఒకడిని ఎందుకు ఒంటరివాడిని చేస్తుంది? ఒకడిని ఎందుకు కలుపుకొంటుంది? ఒకడిని ఎందుకు వెలి వేస్తుంది? సమాధానం తెలిసినట్టూ ఉంది. తెలియనట్టూ ఉంది. కొన్ని ప్రశ్నలు అంతే.

ప్రతి సమాజానికి కొన్ని విలువలు ఉంటాయి. సమాజాన్ని, సమాజానికి ఉండే విలువలని ఉపేక్షించే వాళ్ళని సమాజమూ ఉపేక్షిస్తుంది. కానీ సిద్ధూతో ఆ మాట చెప్పలేక పోయాను.

"తర్కం వివేకాన్ని పెంచుతుంది కానీ, మనిషికి ఆనందం ఇవ్వదురా సిద్ధూ. కొన్నిటిని పైపైన అలా దాటుకుంటూ పోవాలి."

"అదే నా చేత కావడం లేదు నాన్నా."

వాడి గొంతులోని నిస్సహాయత్వపు లోతు సుడులు సుడులుగా గుండెని తాకింది. మనిషి జీవితంలోని అసహాయపు క్షణాలు. ప్రతి ఒక్కరికీ ఎప్పుడో ఒకప్పుడు ఎదురయ్యే క్షణాలు. అస్థిత్వాన్ని సవాలుచేసి మనిషి శక్తికి ఉన్న పరిమితులను చాటి చెప్పే క్షణాలు.

"నా చేత కావడం లేదు నాన్నా" కిందికి దిగివచ్చి పడుకున్నానన్న మాటే కానీ సిద్ధూ అన్న ఆ మాట కారణంగా ఆ రాత్రి నిద్ర కరువైంది. మాటి మాటికీ పడిపోతున్న వాడిని లేపి నిలబెట్టడం ఎంత కష్టం? విజయాలని పంచుకోవడం బాగుంటుంది. వైఫల్యాల బరువు మళ్ళీ మళ్ళీ ఎంతవరకని మోయగలం?

సిద్ధూ జీవితం గురించి ఆలోచిస్తున్నాడు. జీవితానికి వుండే అర్థం గురించి అన్వేషిస్తున్నాడు. జీవితం గురించి ఆలోచించే ఆ ఒక్కళ్ళు సోక్రటీస్‌లు, ప్లేటోలు అయ్యారు. సిద్ధార్థుడు అందుకే బుద్ధుడు అయ్యాడు.

అయితే ఆ క్రమంలో సిద్ధూ ఒక అవుట్‌సైడర్‌లా మిగిలిపోకూడదు. సమాజం తనను ఉపేక్షించే వారిని సహించలేదు. వాళ్ళని ఒంటరిని చేసి వేటాడుతుంది. సిద్ధూ అలా వేటాడబడకూడదు.

అపుడపుడూ మందలోంచి కొన్ని గొర్రెలు దారి తప్పుతాయి. కొన్ని వెనుకపడ తాయి. కొత్త దారుల్లో నడవడం కోసమో, మిగిలిన వాటి వేగాన్ని అందుకోలేకో – కారణం ఏదైనా కానీ, అవి ఒంటరి దారుల్లో కూడా నిర్భయంగా వెళ్లగలిగేలా ఉండాలి.

సిద్ధూ ఒక రేర్ స్పీషీస్. అంతరించిపోతున్న అన్వేషణకి ఒక మంచి మానవ జాతి నమూనా. వాడిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

అభయారణ్యాలు కావలసింది పులులకీ, సింహాలకే కాదు. సిద్ధార్థలకి కూడా.

***'ఆంధ్రజ్యోతి' 9 ఆగస్ట్ 2016***

# పెళ్ళంటే

ఇల్లంతా పెళ్ళి సందడి. ఇల్లుకి ఇల్లూ మనుషులకి మనుషులూ కళకళలాడిపోతున్నారు. ఎటు చూసినా హడావుడి. వచ్చే అతిథులు పోయే అతిథులు, అతిథులకి భోజన ఏర్పాట్లు ఎంత ఆర్భాటంగా ఉండాలో అంత ఆర్భాటంగానూ ఉంది ఇల్లు. పెళ్ళి కూతురు పెద్దమ్మలు, పిన్నమ్మలు, అత్తయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు వగైరా వగైరా అందరూ హాల్లో చేరారు. సోఫాలు, కుర్చీలు, మంచాలు ఎటు చూసినా చీరల రెపరెపలే. అంతకు ముందు రోజు రాత్రే ఎంగేజ్‌మెంట్ జరిగింది. ఇంక పెళ్ళి పదంటే పదే రోజులు. ఎంగేజ్‌మెంట్‌లో పెళ్ళి కూతురికి కాబోయే అత్తగారు పెట్టిన సరంజామా అంతా హాల్లో ఒక పక్కగా ఉంది. పెళ్ళికూతురికి పెట్టిన చీరలు, నగలు, పెళ్ళి కూతురి అమ్మ నాన్నకి పెట్టిన బట్టలు ఒకరి తర్వాత ఒకరి చేతులు మారుతూ గదిలో షికార్లు చేస్తున్నాయి. పెళ్ళి కూతురికి పెట్టిన ప్రధానం చీర చూసి మూతి మూడు వంకర్లు తిప్పింది అమ్మమ్మ.

"అయ్యో! ఇదేం చీరే. ఇంత సాదా సీదాగా ఉంది. పెళ్ళి కూతురికి పెట్టాల్సిన చీరేనా ఇది? పెళ్ళి కూతురి చీరంటే ఎంత ధగధగలాడిపోవాలి" అంది దీర్ఘం తీస్తూ.

"మొన్న మన పద్మ ఆడబిడ్డ పెళ్ళి జరగలా! ఆ పెళ్ళిలో పెళ్ళికూతురి చీర బంగారం ముద్ద అంటే నమ్ము. ఎటు తిరిగితే అటు కళ్ళు జిగేల్ మన్నాయి. ఎంత లేదన్నా ఏ డెబ్భయ్, ఎనభై వేలో ఉంటుంది. లక్షన్నా ఆశ్చర్యపోను. అంత బాగుంది చీర. చీరంటే అదీ" అందుకుంది పెద్దమ్మ.

"మరీ అంత కాకపోయినా కొంచెం ఫాస్ట్ కలర్ తీసుకుని ఉండాల్సింది. కలర్ గ్రాండ్‌గా ఉన్నా మంచి రిచ్ లుక్ వచ్చేది. కడితే వెలాతెలా పోయినట్టు లేదూ" చిన్నమ్మ అంది.

"మనం సూట్ పెట్టాం. డైమండ్ రింగ్ పెట్టాం. ముంజేతి గొలుసు పెట్టాం.

అనుకున్న దానికన్నా అన్నీ ఎక్కువలోనే తీశాం. మనం పెట్టిన వాటికీ వాళ్ళు పెట్టిన వాటికీ ఎక్కడన్నా పోలిక ఉందా? పెళ్ళి కూతురికి నెక్లెస్ సెట్ కొనే దగ్గరే తేలిక పడిపోయారు. ఏమన్నా మనకి పెట్టేవా? వాళ్ళ పిల్లేగా ఇంక. దానికి ఉండేవేగా" పెద్ద మేనత్త అంది.

"మేం అనడం కాదుగానీ నువ్వే చెప్పవే గీతా. చీర కానీ, సెట్ కానీ నీకు నచ్చిందా? మీ అమ్మ ఎప్పుడన్నా అట్లాంటి చీర కట్టిందా? మనుషుల్ని బట్టి అన్నా కొనద్దూ? కొన్నామన్న పేరుకి కొన్నారు. పెట్టామన్న పేరుకి పెట్టారు. అవా పెట్టుపోతలంటే? మీ అమ్మకి చెబుతూనే ఉన్నాను. ఆడపిల్ల గల వాళ్ళం. బోలెడు ఖర్చులుంటాయి. కాస్త ముందూ వెనుకా చూడూ అని. వినకుండా ఎంతేసి పెట్టి కొందో చూడు. ఆఖరికి ఊళ్ళో పంచడానికి కూడా గ్రాండ్‌గా ఉండాలని ఎంత ఖర్చు పెట్టిందో చూడు. పెళ్ళి కొడుకు తరపు వాళ్ళు అయిండీ వాళ్ళు కాపీనం చూపించారు" చిన్న మేనత్త అంది.

"పోనీ ఓ పని చేయవే బుజ్జీ. రేపు పెళ్ళికి ఎలాగూ వాళ్ళకి బట్టలు పెట్టాలి కదా. నీకు పెట్టిన చీర మళ్ళీ వాళ్ళకే పెట్టెయ్ సరిపోతుంది" పెద్దమ్మ అక్కసుగా సలహా ఇచ్చింది.

"ఛ.ఛ. అట్లా చేస్తే ఏం బాగుంటుంది? వాళ్ళేదో పల్లెటూరు వాళ్ళు. తెలిసో తెలియకో ఏదో కొన్నారు. దానికి ఎందుకల్లా ఇంత రాద్ధాంతం చేస్తున్నారు? నాలుగుసార్లు కట్టి విడిచే చీర కోసం ఇంత గుంపు చింపులు పడాలా?" చిన్నాయనమ్మ పెళ్ళి కొడుకు వాళ్ళని వెనకేసుకొచ్చింది.

"పెళ్ళి కొడుకుది దీని అత్తగారి ఊరని చూడవే ఎలా సమర్థించుకొస్తోందో దాని కొడుకు పెళ్ళి జరిగినప్పుడు అది నచ్చలేదని ఇది నచ్చలేదని ఎంత తిరణాల చేసిందో మనం మర్చిపోయామనుకుంటోందేమో కర్రిది" నానమ్మ చెల్లెల్ని ఎగతాళి చేసింది.

"నీ గోల పాడుగానూ, అటు తిరిగి ఇటు తిరిగి నాకు పెడతావేమే? నీ ఊరు కొచ్చానా? నీ సోది కొచ్చానా? ఏదో పెళ్ళిల్లు. నిష్ఠూరాలెందుకు? మనసులు బాధ పెట్టుకోకండల్లా అని అన్నాను గానీ " చిన్నాయనమ్మ ఉడుక్కొంది.

అందరూ ఫక్కుమన్నారు.

"అవన్నీ కాదుగానీ గీతమ్మా. ఇప్పటికేదో అయిపోయిందనుకో. పెళ్ళి కూతురికి పెట్టాల్సిన నగలూ, చీరలూ పెట్టలా వాళ్ళు. ఇదంటే ఏదో నలుగురి మధ్యనా అయిపోయింది. రేపు పెళ్ళి అంటే ఇలా కాదుగా. అందరూ పెళ్ళి కూతురు పెళ్ళి

కూతురు అని ఎగబడి చూస్తారు. ఎలా ఉంది?ఏం నగలు పెట్టింది? ఏ చీర కట్టింది? ఎంత ఖరీదుది కట్టింది అని వంద పరీక్షలు చేస్తారు. ఆ రోజుకి నువ్వే హీరోయిన్‌వి. నువ్వే వీఐపివి. అందర్లో నువ్వే పెట్రోమాక్సు లైటులా ధగధగలాడాలి. పెళ్ళికొచ్చినాళ్ళూ అయ్యే చీరలు కట్టి, పెళ్ళి కూతురూ అయ్యే చీరలు కట్టి ఇంక తేడా ఏంటంట? పెళ్ళి కన్నా అట్లా జరగక్కుండా చూడు. ఆ అబ్బాయితో అప్పుడప్పుడూ మాట్లాడుతున్నా వంటగా. అతనితో గట్టిగా చెప్పెయ్యి. ఇలా వివరం గివరం లేని పనులు చెయ్యొద్దని. మన లెవిలుకి తగ్గట్టు పెట్టమను ఏది పెట్టినా" అమ్మమ్మ చిన్నపాటి లెక్చరిచ్చింది.

పెళ్ళికూతురి మొహం చిన్నబోయింది. మొహం కళ తప్పింది. కోపంతో అదురుతున్న పెదాలతో సెల్ చేతిలోకి తీసుకుంది.

"ఏదో గొప్ప సంబంధం గొప్ప సంబంధం అంటే కామోసనుకున్నాను. ఇదేం సంబంధమే. ఒక్క సూట్ పెట్టడానికి అన్ని నీల్గుళ్ళు నీల్గారు. మొన్న సుబ్బయ్య గారి అచ్యుతరామయ్య గారి కొడుక్కి ప్రధానానికే రెండు సూట్లు పెట్టారు. ప్రధానబ్బట్టలు వెండిపళ్ళాలలో పెట్టి అందించారు. పెళ్ళి కూతురి తల్లికి ఎంతవరకూ కిందాపైనా చీర సర్దుకోవడమే సరిపోయింది. కనీసం పెళ్ళికొడుకు తరఫు వాళ్ళని భోజనాలకు లేవండని చెప్పినాళ్ళు కూడా లేరు. అదేదో ఎంత బఫేనో డఫేనో అయితే మాత్రం భోజనాలకు రండని అన్నా చెప్పొద్దా?" పెళ్ళి కొడుకు నాయనమ్మ మొహం ముటముటలాడించింది.

"మరేనే అక్కా బాగా చెప్పావు. ఎంత వరకూ వాళ్ళ హంగూ ఆర్భాటం చూపించుకోవడమేగానీ అసలు ఏం మర్యాదలు చేశారని. ఆడాళ్ళకు గంధం పసుపు పెట్టడానికి ఒక్క దానికి చేతకాలా! ఊరికే ఇక ఇకలూ పక పకలూ. అక్కడికి ఏదో పెద్దపట్నం నుంచీ  దిగి వచ్చినట్టు. ప్రధానంలో కార్లు పెట్టేవాళ్ళు కూడా ఈళ్ళంత బడాయి పోరు" ఇరుగింటి సరోజనమ్మ వంత పాడింది.

"ఊళ్ళో పంచడానికి లెక్కపెట్టి మరీ మూడొందల గడపంటే మూడొందల గిఫ్టులు పంపించారు. జీతగాళ్ళు నాతగాళ్ళు ఉండరా ఏంటి? ఇంకో పాతికో పరకో అదనంగా పంపుకోరూ? పెళ్ళికూతురి పెద్దమ్మ అనుకుంటా సూరేకాంతంలా వుంది. మొహం చూసి ముద్ద ఏసేరకం. లెక్కపెట్టి మరీ ఇచ్చిందమ్మా మహాతల్లి. మా బుడ్డది నాక్కూడా ఆ సంచి కావాలని ఏడ్చి గీపెట్టింది. నా సంచి ఇవ్వబోతే తీసుకోలా? అంత ఏడుపు

చూస్తా కూడా ఇంద తీసుకో అని ఓ సంచి పిల్ల చేతిలో పెట్టిందేమో చూడు. అయి పిల్లలకు కాదులే పెద్దాళ్ళకు అని ఓ మాట అని ఊరుకుంది. ఇంతా చేస్తే అందులో ఏం ఉందని? ఓ బొచ్చె, ఓ లడ్డు, రెండు అరటిపళ్ళు. దీనికే అంత కాపీనంపోయింది" పెళ్ళికొడుకు పిన్నమ్మ ఎత్తి పొడిచింది.

"అయినా నాకు తెలీక అడుగుతానూ పెళ్ళి కొడుకు తల్లనే గానీ దీనికి ఏమంత వయసు మించి పోయిందని? అదెప్పుడు గద్వాల చీరలు కట్టాలి? ఏ ఉప్పాడ పట్టుచీరో పెడితే పోయేదానికి? ఒరే అబ్బుడూ ఇప్పుడే చెబుతున్నా. ఏదో ప్రదానం కాబట్టి సరిపోయింది రేపు పెళ్ళి కూడా ఇట్టాగే జరిగితే నీ ఇంటి గడప కూడా తొక్కనబ్బాయ్. ఇప్పుడే చెబుతున్నా. పెళ్ళికొడుకు వాళ్ళం ఆ మాత్రం బెట్టుగా ఉండకపోతే తాటాకులు కట్టేస్తారు తాటాకులు" పెళ్ళికొడుకు అమ్మమ్మ హెచ్చరించింది.

"అవునే సావిత్రీ. మనూరోళ్ళకి మరీ పట్టింపు లెక్కువ. మొన్న జానకిరామయ్య గారి మనవరాలి పెళ్ళిలో మర్యాదలు సరిగా లేవని మగపెళ్ళివారు భోజనాలకు లెమ్మన్నా లెగలేదట. వాళ్ళని బతిమలాడి బామాడి భోజనాలకు లేపిచ్చే సరికి తాతలు దిగొచ్చారంట. ఏదన్నా తేడా జరిగిందంటే మనూరోళ్ళతో అసలు ఏగలేమే తల్లీ. నీ కొడుకు పెళ్ళితో మొదలెట్టి మనవడి పెళ్ళి అయే వరకూ దెప్పుతూనే వుంటారు. ఎకసెక్కాలు ఆడుతూనే ఉంటారు. నీ మంచికే చెబుతున్నా. ఎలాంటి లోటూ జరక్కుండా చూసుకో" పెద్దమ్మ సలహా ఇచ్చింది.

"అరేయ్. పెళ్ళికూతురు అదే ఆ పిల్ల గీతమ్మో, రేకమ్మో ఏదో నువ్వు మాట్టాడు తుంటావుగా ఆ పిల్లకు గట్టిగా చెప్పు. రేపు పెళ్ళిలో మర్యాదలు సరిగా లేకపోతే గోలైపోతుందని" చిన్నమ్మ హెచ్చరించింది.

పెళ్ళికొడుకు మొహం కోపంతో ఎర్రబడిపోయింది. ముక్కుపుటాలు అదురుతుండగా కోపంతో సెల్ తీసుకున్నాడు.

"హలో. నేను వంశీని"

"చెప్పండి" పెళ్ళికూతురి గొంతులో ఇదివరకటి మార్దవం లేదు.

"ఏం లేదు. మీతో ఒక మాట చెప్పాలి. ఫ్రీగా వున్నారా?"

"ఫరవాలేదు. చెప్పండి."

"ఏం లేదు. నిన్న జరిగిన ఎంగేజ్‌మెంట్‌లో సరిగా మర్యాదలు జరగలేదట. పెట్టిన బట్టలూ అవీ అంత బాగులేవుట. మా వాళ్ళంతా కోపంగా అసంతృప్తిగా ఉన్నారు" వంశీ అన్నాడు.

"మా వాళ్ళు కూడా అలాగే ఉన్నారు" గీత గొంతులో కరుకుదనం.

"మీరేం అనుకుంటున్నారు దాని గురించి?"

"అనుకోడానికేముంది? వాళ్ళన్నదానిలో నాకేం తప్పు కనిపించలేదు."

"ఇలా అనుకుంటారనే నేను ఫోన్ చేసింది. నేను మా వాళ్ళకు ఒకటే చెప్పదలచుకున్నాను. మేం పెళ్ళి చేసుకునేది మా కోసం. మా జీవితం కోసం. మేం సంతోషంగా జీవితం గడపడం కోసం. మీకు పెట్టే, మీరు పెట్టే చీరల కోసం, నగలకోసం కాదు. ఇలా పేచీలు పెడితే నేనసలు పెళ్ళి మండపం గడపేతొక్కను అని. మీరే చెప్పండి. ఇది మన జీవితం. అవునా కాదా?" వంశీ ఆవేశంగా అన్నాడు.

గీతకి ఏం అనాలో తోచలేదు. సగం సంతోషం, సగం దుఃఖంతో గొంతు ఉండచుట్టుకుపోయింది.

"అన్నట్టు గీతా మీ కోసం కొన్న చీర నేనే సెలక్ట్ చేశాను. ఆడవాళ్ల చీరల గురించి నీకేం తెలుసు? అందులో ఖరీదైన చీర. నేను సెలక్ట్ చేస్తా నీకేం తెలీదు నువ్వూరుకో అంది అక్క. కానీ మా ఇంట్లో అడుగుపెడుతున్న మీకు మొట్టమొదటగా మా తరఫున పెడుతున్న చీర. అది నేను సెలక్ట్ చేస్తేనే బాగుంటుందనిపించింది. నిజంగా చెప్పండి. చీర బాగుందా లేదా?" వంశీ అడిగాడు.

ఎండా వానా కలగలిసిన ఇంద్రధనుస్సులా కన్నీళ్ళతో నవ్వింది పెళ్ళికూతురు.

సాక్షి

# ఓ సిల్లీ కథ

**గో**డ దగ్గర ఏదో అలికిడి అయింది. తల తిప్పి చూస్తే మా అమ్మ. అన్నం గిన్నె వైపు చూపిస్తూ ఏమన్నా అందులో పడిందా అన్నట్టు సైగ చేసింది. లేదన్నట్టు తలూపాను. నిదానంగా నడుచుకుంటూవచ్చి నా వంక, ఖాళీ గిన్నె వంక ఒకసారి చూసి "హు! మనుషులు" అని ఈసడిస్తున్నట్టు అంటూ ఒక్క ఉదుటున పిట్టగోడమీదకు దూకింది. నాకు వళ్ళు మండింది. ఎగిరి దాని వీపుమీద ఒక తన్ను తందామా అనిపించింది. అమ్మ అనే గౌరవం కొద్దీ ఆగిపోయాను. దాని మూలంగా కదూ నా అన్నంగిన్నెలో రాయి పడింది.

నేను గుమ్మం దగ్గరే ఉన్నానన్నట్టు చిన్నగా 'మ్యావ్' అన్నాను. గుమ్మం మీద కాళ్ళతో తట్టాను. ఉహూ. ఒకళ్ళు కూడా వంటింటి గుమ్మంలోకి రాలేదు. అదే ఇదివరకు అయితే నేను రెండుసార్లు మ్యావ్ మ్యావ్ అనగానే ఇంటిగలాయన వచ్చేసే వాడు. ఆయన పేరు ఏంటో నాకు తెలీదు. మా ఇంటి ఎదురుగా ఓ ఆరేళ్ళ గొట్టంగాడు ఉండేవాడు. వాడూ, వాడి అమ్మా కూడా ఆయన్ని అంకుల్ అని పిలుస్తుంటారు. దానితో ఆయన పేరు అంకుల్ ఏమో అనుకున్నాను. అంకుల్ రావడం రావడం నా దగ్గరకు వచ్చి "ఏం సిల్లీ! ఆకలేస్తోందా? పాలు తాగుతావా? పెరుగు తింటావా?" అనేవాడు.

మొదట్లో అంకుల్ నన్ను 'పిల్లీ' అంటున్నాడని తెగ కోపం వచ్చేసింది. ఎక్కడన్నా పిల్లిని 'పిల్లీ' అని కుక్కని 'కుక్కా' అని పిలుస్తారా? వాటికి పేర్లు ఉండవా అని. ఆయన్ని నేను 'మనిషీ' అంటున్నానా అంకుల్ అంటున్నా కదా అనుకున్నాను. తర్వాత అర్థమయింది ఆయన నన్ను ముద్దుగా సిల్లీ అంటున్నాడని. సిల్లీ ఏంటి నా బొంద? పిల్లిని పట్టుకుని ఎవడన్నా 'సిల్లీ' అంటాడా? ఏ పుస్సీనో, గిస్సీనో అనాలి కానీ.

పాలు తాగుతావా అనగానే నాకు ఆయనంటే ప్రేమ పొంగుకు వచ్చేసేది. ఆయన

కాళ్లకు అడ్డంపడి వీపుని ఆయన కాళ్ళకి రుద్దుతూ, తోక ఎత్తి గిరిగిరా తిరుగుతూ తెగ హడావుడి చేసేదాన్ని. పొద్దున్నే పాలు, మజ్జాన్నం పెరుగన్నం, సాయంత్రం పాలు, రాత్రికి పాలన్నం – ఇలా అంగరంగ వైభోగంగా ఉండేది నా జీవితం.

ఉదయాలు నాకు ఎంతో బాగుండేవి. ఆయన లేచి తలుపులు తియ్యగానే 'మ్యావ్' అని శుభోదయం చెప్పేదాన్ని. ఆయన కాసిని పాలు పోసేవాడు. వాటిని తన్మయత్వంగా తాగేదాన్ని. తర్వాత ఇంటాయన, ఇంటావిడ టీ తాగుతూ పేపర్లు చదువుతూ కూర్చునే వాళ్ళు. మధ్య మధ్యలోమాట్లాడుకుంటుండే వాళ్లు. వాళ్ళు అలా కూర్చుని మాట్లాడు కుంటుంటే చూడడం నాకు భలే ఇష్టంగా ఉండేది. వాళ్ల ఎదురుగా వరండాలో వెచ్చగా పడుకునేదాన్ని. స్వర్గం కళ్ళముందు ఉన్నట్టే అనిపించేది. నేను కూడా వాళ్ళ కుటుంబంలో ఒక భాగం అనుకునేదాన్ని.

ఒకోసారి వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకునేవాళ్ళు కాదు. టీ తాగి ఎవరి మానాన వాళ్ళు పేపరు చదువుకుంటూ ఉండిపోయేవాళ్ళు. దాన్ని పోట్లాడుకోవడం అంటారని మా అమ్మ చెప్పింది. మా అమ్మకు ఎలా తెలుసో కాని ఇలాంటి విషయాలన్నీ భలేగా తెలుసు.

సాయంత్రాలు ఆయన వరండాలో కూచుని ఏదన్నా పుస్తకం చదువుకుంటుంటే ఆయన కాళ్ళ దగ్గరే ముడుచుకుని పడుకునేదాన్ని. మధ్య మధ్యలో ఆయన కాలు నా దగ్గరగా పెట్టి "సిల్లీ. షేక్ హ్యాండ్. షేక్ హ్యాండ్" అనేవాడు. అది షేక్ హ్యాండ్ ఏంటి నా బొంద. షేక్ లెగ్ అనాలి. ఆ మాత్రం తెలీదు కానీ రోజుకి నాలుగు పేపర్లు చదువుతాడు మళ్ళీ. సరే భాషదేముందిలే అని కాలు ఎత్తి ఆయన పాదం మీద రెండుసార్లు తాటించేదాన్ని. ఆయన తెగ సంతోషపడిపోయి మళ్ళీ షేక్ హ్యాండ్ అనేవాడు. ఇంక నాకు విసుగొచ్చేసేది. ఒకటి రెండు సార్లు కాలు ఎత్తి తట్టి "ఇంక చాల్లే పోవాయ్" అన్నట్టు అక్కడ్నుంచీ లేచి వచ్చేసేదాన్ని. మనుషులకంటే పనీపాటా ఉండదు పిల్లులకి అట్లా ఎట్లా సాగుతుంది?

ఆయనకి తోడు ఇంటి చుట్టూ ఓ పిల్ల బ్యాచ్ ఉండేది. తెల్లారగానే వాళ్లు తయారైపోయేవాళ్ళు "పిల్లీ పిల్లీ" అంటూ తెగ విసిగించే వాళ్ళు. ఇంకాసేపు ఆగండ్రా వెధవల్లారా మీ తిక్క కుదురుతుంది అనుకునేదాన్ని. కాసేపవగానే వాళ్ళ అమ్మలు వచ్చి రెక్కలు పట్టుకుని ఈడ్చుకుపోయి ఆటోల్లో పడేసేవాళ్ళు. బడికి పంపడం కోసమంట. ఒక్కో వెధవ శోకాలు పెడుతూ ముక్కులు చీదుకుంటూ ఆటోలో కూర్చుని ఉంటే వరండాలో నిలబడి చూడడం భలే మజాగా ఉండేది. పిల్లిగా పుట్టి బతికిపోయాను

గానీ మనిషిగా పుట్టి ఉంటే బండెడు పుస్తకాలేసుకుని నేనూ ఆ ఆటోలో కూర్చోవాల్సి వచ్చేది కదరా భగవంతుడా అనుకున్నాను.

నేనంటే మా ఇంటాయన, ఆవిడా చాలా ఇష్టంగా ఉండేవాళ్ళు. నేనే పని చేసినా పిల్లి మొగ్గలు వేసినా ఒకళ్ళకి ఒకళ్ళు చూపించుకుని నవ్వుకునేవాళ్ళు. కుండలో పడుకుంటే చూసి నవ్వేవాళ్ళు. వాళ్ళు అట్లా నవ్వుతుంటే నాకూ బాగుండేది.

అలా జీవితం స్వర్గయుగంలా సాగిపోతున్న రోజుల్లో ఓపెద్ద ప్రమాదం వచ్చి పడింది. అదీ మా అమ్మ మూలంగా. మా ఇంటాయన నాకు పాలు పోసే స్టీలు గిన్నె బట్టలుతికే దిమ్మ వెనకాల ఉండేది. ఆయన అటు పాలుపోసి వెళ్ళగానే మా అమ్మ గోడ చాటునుంచీ తయారైపోయేది. నేను కాసిని పాలుతాగి తప్పుకునేదాన్ని. మా అమ్మ మిగిలిన పాలు తాగేసి “గుమ్మం దగ్గరికి వెళ్ళి మళ్ళీ దీనంగా అరిస్తే పాలు చాల్లేదనుకుని ఆ పిచ్చాడు మళ్ళీ పోస్తాడులే” అని ఉచిత సలహా ఒకటి పారేసి మీసాలు నాక్కుంటూ వెళ్లిపోయేది.

అట్లా మా అమ్మ రావడం నాకు పోసిన పాలు తాగడం ఓ రోజు ఇంటావిడ చూసేసింది. ఆవిడ కదలకుండా అక్కడే నిలబడి ఇంటాయన్ని పిలిచింది. “ఇది చూశారా ఏం చేస్తోందో” అంటూ. ఆయన కూడా వచ్చి చూసేంత వరకూ ఆగింది. అప్పుడు మొదలైంది ఆవిడకీ నాకూ మధ్య యుద్ధం. అటూ ఇటూ చూసి ఆవిడ అక్కడే ఉన్న ఖాళీ బాటిల్ తీసుకుని మా మీదకు ధబేల్ మని విసిరింది. ఆ దెబ్బకి మా అమ్మొకవైపూ, నేనొక వైపూ పరార్. తర్వాత మా అమ్మ నాకు ధైర్యం చెప్పింది. “కాసేపు జాలిగా అరిస్తే ఆయన ఏదో ఒకటి పెడతాడులే. ఫరవాలేదు ధైర్యంగా ఉండు” అని.

ఎంత ధైర్యం తెచ్చుకుందామన్నా వాటి దుంపతెగ అవేం బాటిళ్ళో కానీ నేలమీద పడీ పడగానే ధమాల్ ధమాల్ అని సీమటపాకాయల్లాగా ఎగిరేవి. ఆ శబ్దానికి గుండెబేజారెత్తి పోయేది. దెబ్బకు పరుగు లంకించుకునేదాన్ని. అయినా ఆవిడ వెంటబడి వాటిని మళ్ళీ విసిరేది. వాటిని పెప్సీనో, థమ్సప్పో అంటారంట. ఆ బాటిళ్ళు ఇంటినిండా ఎప్పుడూ ఉండేవి. అప్పట్నుంచీ ఆవిడ నా కోసం వంట ఇంట్లో గట్టుమీద ఎప్పుడూ రెండు మూడు బాటిళ్ళు పెట్టి ఉంచేది.

ఆవిడకి నా మీద కోపం రావడానికి ఇంకా ఏదో కారణం ఉందని నా అనుమానం. టీ తాగడం అవగానే పూలు కోయడానికి ఆవిడ డాబా మీదకి వెళ్ళేది. కిందకి దిగడం దిగడమే ఏదో తెగులు వచ్చినట్టుగా “దీనికి పాలూ, పెరుగూ ఏమీ

పోయకండి. దొంగముండ. అంతా ఖరాబుచేస్తోంది. పోసారంటే మీ సంగతి చెబుతా" అని ఖాళీ బాటిళ్ళు నా మీదకు ధమాధమా అని విసిరేది. దీనికేమన్నా తిక్క ఉందా పైకి వెళ్ళొచ్చి రోజూ ఇలా వెంట పడుతోందేంటి అని మెట్లెక్కి పైకి వెళ్ళి చూశా. అక్కడ మెట్టు మెట్టుకీ రకరకాల ఆకారాల్లో నేను పెట్టిన ముగ్గులు తప్ప ఇంకేం కనపడలేదు.

ఎక్కడ ఒకటికి వెళ్ళినా, రెండుకి వెళ్ళినా (మనుషులు వాటిని అట్లా అంటారని మా అమ్మ చెప్పింది) దానిమీద మట్టి కప్పేయాలని మా అమ్మ చిన్నప్పుడే చెప్పింది. కానీ ఈ దిక్కుమాలిన ఇళ్ళల్లో ఎక్కడన్నా మట్టి కనిపిస్తేనా? ఇంకేం చేయలేక మెట్లమీద కానిచ్చేస్తున్నా. అంతా బాగానే ఉన్నా, ఆ దరిద్రపు బాటిళ్ళ చప్పుడికే గుండె దడ వచ్చి కాళ్ళల్లో వణుకు అరగంటకి కూడా తగ్గేది కాదు.

మా ఇంటాయనకి ఒక కొడుకున్నాడు. అక్కడెక్కడో ఏదో ఉద్యోగం వెలగబెడుతున్నాడంట. పాపం మనుషులు పొట్ట నింపుకోడానికి ఏదో ఒకటి చేయాలిగా. వాడొకడు నా ప్రాణానికి. వాడు ఏ పండక్కో పబ్బానికో ఒకసారి ఇంటికి వస్తాడు. వచ్చిన తర్వాత కాసేపు నాతో ఆడతాడు. సెల్ఫీలు దిగుతాడు. ఇంటాయన పాలు పోయడం చూశాడంటే మాత్రం పూనకం వచ్చిన వాడిలా బాటిళ్ళు తీసుకుని వెంటపడు తుంటాడు. వాళ్ళ అమ్మ కన్నా వీడు ఇంకొంచెం డేంజర్. గురిచూసి మరీ మీదకే బాటిళ్ళు విసురుతుంటాడు.

"నువ్వు పాలుపోసి దాన్ని చెడగొడుతున్నావు నాన్నా? అది తిండి సంపాదించు కోకుండా సోమరితనం అలవాటు చేస్తున్నావు. ఇది ఇంకా ఎందుకు పనికి వస్తుంది?" అని పెద్దాచిన్నా లేకుండా ఇంటాయన మీద కూడా ఎగిరేవాడు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. వాడంటే ఇంటాయనకి కూడా భయమే. వాడున్న రెండు రోజులూ నన్ను తప్పుకుని తప్పుకుని తిరిగేవాడు. దొంగతనంగా పాలు పోసేవాడు. వళ్ళు మండినా తాగక తప్పేదికాదు.

అసలు ఈ బాటిళ్ళు కూడా ఈ పిల్లవెధవ తెచ్చేదేఎక్కువ. రావడం రావడం బిర్యానీలు బిర్యానీలు అంటూ హోటళ్ళ మీద పడతాడు. బిర్యానీలు తెచ్చుకోవడం, తర్వాత పెప్సీలు, కోలాలు తాగడం. ఆ బాటిళ్ళు పుచ్చుకుని ఇంటావిడ నా వెంట పడడం – ఇదీ తంతు.

బిర్యానీ అంటే గుర్తొచ్చింది. అదేం వాసనో కానీ ఆ వాసనకే నోట్లో నీరూరి పోయేది. మ్యావ్ మ్యావ్ అని గుమ్మం పట్టుకుని వదిలేదాన్ని కాదు. వాడు మంచి

మూడ్‌లో వుంటే అప్పుడప్పుడు బొమికెలు, మాంసం ముక్కలు పెడుతుంటాడు. అట్లా ఒకసారి బొమికెలతో పాటు కొంచెం బిర్యానీ కూడా పెట్టాడు. ఆకలిమీద ఆవురావురు మని తిన్నా. తిన్నానా ఇంక చూసుకోనా సామిరంగా దాహం దాహం అని నాలుక పీక్కోవాలనిపించింది. అప్పుడర్థమైంది ఆ పిల్ల వెధవ బాటిళ్ళు బాటిళ్ళు ఎందుకు తాగుతాడో. అది మొదలు మళ్ళీ బిర్యానీ తింటే ఒట్టు.

"ఇల్లు వదలకుండా ఇక్కడే పడుకోకపోతే వెళ్ళి ఓ ఎలుకను పట్టటం నేర్చుకో. పో" అని ఇంటాయన ఓ రోజు వీధిలోకి తరిమాడు. పోనీపెద్దాయన ఏదో చెబుతున్నాడు కదాని ఓ రోజు ఎలుకను పట్టి తిన్నా. ఎలుక తల, పేగులు తినబుద్ధికాక వదిలేశా. వరండా అంతా రక్తం అయిందని ఇంటావిడ మళ్ళీ బాటిళ్ళు పుచ్చుకుని వెంటపడింది. ఇంటాయన్ని పిలిచి వరండా అంతా చూపించి ఏదో చెప్పింది. ఇంటాయన బైటకు వస్తే ఎప్పట్లానే సంతోషంగా ఎదురెళ్ళి ఆయన కాళ్ళకి వీపుని రుద్దుకోబోయాను. ఎలుకని చంపానని గొప్పగా చెబుదామనుకున్నాను. ఆయన ఉన్నట్టుండి కర్ర తీసుకుని వెంటపడ్డాడు.

నాకు చాలా అవమానంగా అనిపించింది. దుఃఖం వచ్చింది. అంతకుముందు ఇంటావిడ ఎన్నిసార్లు తరిమినా ఇంటాయన ఎప్పుడూ కొట్టలేదు. అలాంటిది ఇంటాయన కొట్టడానికి రాబోవడం నాకు అర్థం కాలేదు. ఆయన కర్రతో వెంటపడడం చూసి పారిపోవాలని కూడా తట్టక మతిపోయి నిలబడిపోయాను.

అంతా విని మా అమ్మ "హు! మనుషులు. నేను చెప్పలా. వాళ్ళంతే. వాళ్ళు పెట్టింది తిను. అంతే తప్ప వాళ్ళని అభిమానించకు" అంది.

ఆ రోజంతా ఇంటికి వెళ్ళకుండా బైటే ఉండిపోయాను. ఎప్పుడో రాత్రికి వెళ్ళి గుమ్మం ముందు కూర్చున్నాను. ఇంటాయన చూసి లోపలికి వెళ్ళిపోయాడు తప్ప ఏం పెట్టలేదు. మర్నాడూ అంతే. ఇవాల్టికి మూడో రోజు ఏదన్నా తిని. అక్కడికీ ఆకలికి తట్టుకోలేక రెండు దోమల్నీ, ఓ బొద్దింకనీ, రెండు తూనీగల్నీ పట్టుకుని తిన్నా. కానీ అవే మూలకి? నిన్నటికి నిన్న ఇంటావిడ మళ్ళీ ఇంటాయనకి అల్టిమేటమ్ ఇచ్చింది "అది చూడండి మొహం ఎంత జాలిగా పెట్టి ఎలా అరుస్తోందో. అరిస్తే అరిచింది. జాలిపడి ఏదీ పెట్టొద్దు. ఇంక ఇల్లు వదలదు. నిన్న వర్షం వచ్చినపుడు మెట్లమీంచి ఆ నీళ్ళన్నీ వరండాలోకి వచ్చి ఒకటే వాసన. కడుపులో తిప్పింది. దాని అమ్మ అమ్మే. ఇది ఇదే. రెండూ కలిసి ఒకటే వేషాలు వేస్తున్నాయి. ఎంత దీనంగా

అరిచినా సరే అన్నం పెట్టొద్దు. వాళ్ల అమ్మే పెట్టుకుంటుంది. ఏం మనం పెడతామని కన్నదా ఏంటి?" అంటూ గట్టిగా చెప్పేసింది.

ఆయన్ని చూసి వళ్ళు మండింది. కోపం వచ్చింది. ఈ మొగుళ్ళు స్వతంత్రంగా ఉండక పెళ్ళాలకు అట్లా భయపడి చస్తారెందుకు అని. మా పిల్లుల్లాగా కేరేజాట్‌గా ఉండొచ్చు కదా. ఈసారి ఆయన నా దగ్గరకు వచ్చి "ఏయ్ సిల్లీ" అంటే "పోవోయ్ పుష్కీ" అనాలని గట్టిగా తీర్మానించుకున్నాను కూడా.

మళ్ళీ 'మ్యావ్' అన్నాను. ఇంటాయన ఒక గదిలోంచి ఇంకో గదిలోకి వెళుతూ నన్ను చూశాడు కానీ పట్టించుకోనట్టే వెళ్ళిపోయాడు. నా మొహం వంకన్నా చూడలేదు. రెండు రోజులుగా తినని దానికన్నా ఈ నిరాదరణ నన్ను ఇంకా బాధ పెట్టింది.

నీరసంతో కాళ్ళు తేలిపోతున్నాయి. కళ్ళకి అన్నీ రెండుగా కనిపించడం మొదలు పెట్టింది. కళ్ళు అరమూతలు పడుతున్నాయి. ఇంక కూర్చోలేక పక్కకు వాలిపోయాను. పడిపోయాననుకున్నా కానీ వెల్లకిలా పడిపోయానని తర్వాత తెలిసింది.

కళ్ళముందు రకరకాల దృశ్యాలు. అస్పష్టంగా ఏవో గొంతులు. తెరలు తెరలుగా మగత కమ్ముకొస్తోంది. కళ్ళు తెరుద్దామనుకుంటే కళ్ళకి అడ్డంగా తెల్లటి తెర. ఎక్కడి నుంచో అస్పష్టంగా ఏదో గొంతు.

"ఏయ్ సిల్లీ.. నిన్నే. ... ఇదుగో పాలు.. లే. కళ్ళు తెరు. పాలు తాగుదువుగానీలే" ముక్కలు ముక్కలుగా ఏదో చిరపరిచితమైన గొంతు. కళ్ళు తెరవడానికి ప్రయత్నించాను. కుదరలేదు. నోటినుంచీ అప్రయత్నంగా మూలుగు వచ్చింది.

నోటిలో చల్లగా తియ్యగా ఏదో బొట్లు బొట్లుగా సన్నటి ధారలు ధారలుగా పడుతున్నట్టు అనిపించింది. మెల్లగా గుటక వేయడానికి ప్రయత్నించాను. గొంతులోకి చల్లగా ఒక గుక్క దిగింది. ప్రాణం లేచి వచ్చినట్టయింది. ఇంకో రెండు మూడు గుటకలు వేసిన తర్వాత కళ్ళు కొంచెం తెరవగలిగాను.

ఇంటాయన, ఇంటావిడ వంగి ఆదుర్దాగా నా వంకే చూస్తూ కనిపించారు. వాళ్ళని చూసి నీరసంగా లేవడానికి ప్రయత్నించాను.

"ఏయ్ సిల్లీ.. లే... ఈ పాలు తాగు" ఇంటాయన పాలగిన్నె వైపు చూపించాడు.

మెల్లగా లేచి నిలబడ్డాను. ఎదురుగా తెల్లగా మల్లెపూలు కుప్పపోసినట్టు మెరుస్తున్న పాలు. ఇంటాయన కాలుకి ఓసారి వీపు రుద్దుకున్నాను. నాకు ఎందుకో మళ్ళీ దుఃఖం వచ్చింది.

ఇంటావిడ గుమ్మం మీద కూర్చుని నా వంకే దీర్ఘంగా చూసింది. చూసి చూసి

"సరే కానీ. ఏం చేస్తాం? ఎట్లా వున్నా మొగుళ్ళని భరించడంలా? అట్లాగే నువ్వూను" అనేసింది. మొగుళ్ళతో నన్ను పోల్చినందుకు ఇంటాయన వంక నిరసనగా చూసాను. ఆయన అదేం పట్టించుకోకుండా సంతోషంగా నవ్వాడు. "కాని అది ఎక్కడన్నా కూర్చుంటే మాత్రం మీరే ఎత్తాలి. అట్లా అయితే ఓ.కె." అంటూ ఆవిడ లోపలకి వెళ్ళిపోయింది. ఆయన్ని చూసినవ్వొచ్చింది.

ఆయన నా ముందు ముంగాళ్ళమీద కూర్చుని "సిల్లీ. చెప్పింది విన్నావుగా. ఇకనన్నా బుద్ధిగా వుండు. డాబామీద ఒకటికి, రెంటికి వెళ్ళకు, ఎలుకల్ని పట్టుకుని దొడ్లో తినకు. పాలు తాగటానికి మీ అమ్మని రానివ్వకు" అంటూ సుమతీ శతకం చాలా చదివాడు.

అంత నీరసంలోనూ నాకు ఒళ్ళు మండింది. పుట్టినప్పటినుంచి ఇంతవరకూ మా అమ్మే నాకు ఇన్ని చెప్పలేదు. అయినా నేనేమన్నా పిల్లిననుకుంటున్నాడా? మొగుడ్ని అనుకుంటున్నాడా చెప్పినవన్నీ వినడానికి? చివాట్లు తిన్నంత మాత్రాన ఆయన ఏమన్నా ఇల్లు వదిలిపెట్టి పోయాడా? నేను పోవడానికి? ఎంత ఆపుకుందామన్నా ఒళ్ళు చిరచిరలాడిపోయింది. అయినా కూర్చుంటే ఎత్తాలని ఆవిడ చెప్పింది ఆయనకా? నాకా? మధ్యన నాకెందుకూ?

అందుకే వినీ వినీ విసుగొచ్చి "ఇంకా చాల్లే పోవాయ్" అన్నట్టు తోక దులుపుకుని లేచి నా కుండలోకి దూరిపోయాను.

*'ఆంధ్రజ్యోతి' 20 మార్చి 2016*

# దుఃఖావరణం

**రో**డ్డుకి రెండు వైపులా కొండలు. కనిపించినంతమేరా పచ్చదనం. అక్కడక్కడా పొదల్ని అలంకరించినట్టుగా తెల్లటి పూలు, ఎర్రటిపూలు, చిత్రవిచిత్రంగా అల్లుకున్న తీగలు.ఏదో తెలీని కొత్త లోకంలోకి అడుగుపెట్టిన అనుభూతి. ఉన్నట్టుండి సడెన్‌బ్రేకుతో ఆగిపోయింది కారు. రోడ్డు నిండా రోడ్డుకి రెండువైపులా పుట్టలు పుట్టలుగా జనం.

"ఏమైంది" కంగారుగా అడిగాను.

"యాక్సిడెంట్ అనుకుంటా అమ్మా" గుమికూడిన జనం వైపు చూస్తూ అన్నాడు డ్రైవరు. ఆవిడ వంక చూశాను. ఆవిడ ఏం పట్టనట్టు బైటకు చూస్తూ కూర్చుంది. తలతిప్పే ప్రయత్నం కూడా చేయలేదు. ఈ గంట ప్రయాణంలో ఆవిడ నాతో మాట్లాడింది మూడే మూడు మాటలు. "ఇక్కడ్నుంచీ ఫామ్ హౌస్‌కి గంటన్నర పడుతుంది. లంచ్ చేసి వెనక్కు వచ్చేద్దాం. మీకేం ప్రోబ్లం లేదుగా" కారు ఎక్కేటప్పుడు అన్న మాటలు తప్ప ఆవిడ విడిగా నాతో మాట్లాడింది లేదు.

నిన్న రాత్రి కావ్య ఫోన్ చేసింది. "రజనీ, అమ్మ ఏదో మాట్లాడాలంట. తెలిసిన లాయర్ ఎవరన్నా ఉంటే చూడమంది. రేపు శనివారం. నీకు ఎలాగూ కోర్టు పనులు అంతగా ఉండవు కదా. నిన్ను ఫామ్‌హౌస్‌కి తీసుకువెళతానంది. నువ్వు నా ఫ్రెండ్ అని నేను చెప్పలేదు. ఆవిడతో పాటు వెళ్ళి ఆవిడ ఏం చెబుతుందో విను. జస్ట్ అంతే. ప్లీజ్. ఇది నా రిక్వెస్ట్ అనుకో" అని బతిమాలింది. దాంతో ఈ ప్రయాణం.

కారు మళ్లీ వేగం అందుకుంది. ఒకొక ఊరూ వెనుకపడిపోతోంది. వరసపెట్టి పొలాలూ, తోటలు మొదలయ్యాయి.

"గీతారాణి ఎస్టేట్స్" గేటుపైన ఆర్చిలా పాకించిన మాలతీ గుత్తుల మధ్య నుంచీ కనిపించింది. కారు చిన్న కుదుపుతో ఆగింది.

"దిగి నడుద్దామా?" అంటూనే ఆవిడ డోర్ తీసుకుని కిందకు దిగింది. గేటు

దాటి లోపలకు అడుగుపెడుతూనే చిరపరిచితమైన పరిమళం కమ్ముకుంది. గోడ పక్కన నాటిన సంపెంగ గుబురులోంచి తొంగి చూస్తున్న సంపెంగలు. వెళ్ళే దారికి రెండు వైపులా విరబూసిన మందారాలు, గులాబీలు, చామంతులు, ఎటు చూస్తే అటు గోడల మీదకు, కంచెల మీదకు పాకించిన పూల తీగలు. అన్నీ కలగలిసిన వింత పరిమళం.

"నాకు పూలంటే ఇష్టం. ఎన్ని పూల మొక్కలు ఉన్నా ఇంకా తనివి తీరదు" నా చూపులు గమనించి ఆవిడ అంది.

"ఒకసారి ఫామ్ హౌస్ అంతా చూసేసి వద్దాం" అంటూ మొక్కల మధ్యనుంచీ నడుస్తూ ఆవిడ ఒక షెడ్డు ముందు ఆగింది. దాదాపు పాతిక మంది వరకూ అక్కడ రకరకాల పనుల్లో ఉన్నారు. పప్పులు బాగుచేసే వాళ్ళు, మిరపకాయలు బాగు చేసే వాళ్ళు, వేరుశెనగలు వలుస్తున్న వాళ్ళు, ఒక పక్కగా నూనె తయారు చేసే చిన్న మిల్లు – ఒకటొకటే చూపిస్తూ ఒక స్టోర్ లోకి తీసుకెళ్ళింది. వాళ్ళు తయారు చేస్తున్న పచ్చళ్ళు, పప్పులు, తినుబండారాలతో సహా రాక్‌ల నిండా పేర్చి ఉన్నాయి.

"ఇవన్నీ మా దగ్గర తయారవుతున్నవే. ఎరువులు, పురుగు మందులు వాడకుండా మా ఫామ్‌లోనే పండించి వాటి నుంచీ తయారు చేసిన ప్రొడక్ట్స్. ఆర్డర్ల మీద సప్లయ్ చేస్తుంటాం" ఆవిడ చెప్పింది.

నలభై ఎకరాల ఫామ్ హౌస్. ఒక వంతు కూడా చూడకుండానే అలసటగా అనిపించింది. కనిపించినంత మేరా మామిడిచెట్లు, ఉసిరి, అరటి, జామ చెట్లు, జొన్న, మొక్కజొన్న పొలాలు, ఓ వైపుగా ట్రాక్టర్ల కోసం షెడ్డు, పక్కనే ఆవులు, గేదెలు, కోళ్ళ షెడ్డు అక్కడ లేనిది అంటూఏమీ లేదేమో అనిపించింది.

"రండి. ఇక్కడ కూర్చుందాం" గుండ్రంగా పెంచిన గులాబీ మొక్కల మధ్య రాతితో కట్టించిన టేబిల్ దగ్గరకు నడుస్తూ అంది ఆవిడ. పనిపిల్ల రెండు గాజు గ్లాసుల్తో మంచినీళ్ళు తెచ్చి పెట్టింది. రెండు హాట్ ప్యాక్‌లు, ప్లేట్లు తీసుకు వచ్చి ప్లేట్లలో పూరీలు, బంగాళాదుంపల కూర సర్దిపెట్టి వెళ్ళిపోయింది.

"తినండి" పూరీ ముక్క తుంచి నోట్లో పెట్టుకుంటూ అంది ఆవిడ.

"మా కావ్య మీకు ఎలా తెలుసు?" ఆవిడ మళ్ళీ అడిగింది.

"మా ఫ్రెండ్‌కి తను ఫ్రెండ్. మీకు ఒక విషయంలో లాయర్ సలహా కావాలని నిన్న ఫోన్ చేసి చెప్పింది."

"ఊ. అదే చెప్పబోతున్నాను. కావ్య, కార్తీక్ ఇద్దరు పిల్లలు మాకు. కార్తీక్ ఇద్దరిలో

చిన్న. ఇంజనీరింగ్ అయిన తర్వాత యుఎస్‌లో ఎమ్‌బిఎ చెయ్యడానికి వెళ్ళాడు. లాస్ట్ ఇయర్‌తో అయిపోయింది. అయిపోయిన తర్వాత వచ్చేసేవాడే. వచ్చేస్తాననే అన్నాడు. ఈయనే ఓ ఏడాది అక్కడే జాబ్ చేసి రమ్మన్నారు. అందుకని ఉండిపోయాడు. ఆయన మాట వినకుండా వచ్చేస్తే ఇవాళ వాడు ఇక్కడ మన మధ్య ఉండేవాడు... మాట్లాడుతుండగానే ఆవిడ గొంతు దుఃఖంతో పూడుకు పోయింది.

కాసేపు సంబాళించుకుంటున్నట్టు మౌనంగా ఉండి పోయి "ఆర్నెల్ల కిందట రోడ్ యాక్సిడెంట్లో చనిపోయాడు. అప్పుడు మొదలయ్యింది గుండెల్లో మంట. భగభగా భగభగా కార్చిచ్చులాగా రాత్రీ పగలూ దహించి వేస్తోంది. ఆయన్ని చూసినా ఆయన మాట విన్నా గుండె రగులుకు పోతోంది. ఆయన ఉండమనకపోతే కార్తీక్ వచ్చేసేవాడే కదా అనేదాని నుంచీ ఆలోచన ముందుకు వెళ్ళటంలేదు. అది తప్ప ఇంకేం ఆలోచించలేకపోతున్నాను. ఈ మంట పెరగడానికి ఇంకో కారణం కావ్య మొగుడున్నాడే వాడు.

అంతవరకూ అంటీ ముట్టనట్టు ఉండేవాడు. పొడిపొడిగ మాట్లాడేవాడు. కార్తీక్ చనిపోయిన కబురు వచ్చిన రోజున చూశాను వాడి ఉత్సాహాన్ని. వాడి కళ్ళల్లో దాచినా దాగని దుర్మార్గపు ఆనందం. ఆ రోజు ఎంత హడావుడి చేశాడని. అన్ని పనులూ తనై చేశాడు. వాడి కళ్ళల్లో ఆనందం చూసినప్పుడు అనిపించింది ఈ ఆస్తి గురించే కదా వాడు చావుని కూడా ఎంజాయ్ చేయగలుగుతున్నాడు అని.

గుండెల్లో మండుతున్న ఈ మంట ఉందే దాన్ని దేనితో చల్లార్చుకోవాలో తెలీదు. ఎట్లా చల్లార్చుకోవాలో తెలీదు. గీత చదివాను. కర్మ సిద్ధాంతం వంటబట్టించుకున్నాను. వేదాంతం, జెకె – ఏదీ ఆ మంటని చల్లార్చలేకపోయాయి. ఏదైనా చెప్పడం తేలిక. చెయ్యడం కష్టం.

ఉన్నట్టుండి ఏ అర్ధరాత్రో మెలకువ వస్తుంది. కార్తీక్ ఇంక ఎప్పటికీ తిరిగి రాడని గుర్తుకు వస్తుంది. అప్పుడు మొదలవుతుంది బాధ. "అయ్యో. కార్తీక్" అంటూ గుండె ఘోషించడం మొదలు పెడుతుంది. ఏడ్చి ఏడ్చి గుండెపగిలి పోతుందేమో అనిపిస్తుంది. ఎంత ఆపుకుందామన్నా ఆగని దుఃఖం. మృత్యువు అడుగుపెట్టని ఇంటి నుంచీ నువ్వులు తీసుకురమ్మన్న బుద్ధుడూ, పుట్టిన వారికి మరణం తప్పదన్న కృష్ణుడూ ఎవరూ ఆపలేనంత దుఃఖం. చుట్టూ ఉన్న మనుషులూ, చెట్టూ చేమా అన్నీ అలాగే ఉండీ ఒక్క నా కొడుకే లేకుండా పోయాడు. ఏం అనుభవించకుండానే వెళ్ళిపోయాడన్న దుఃఖం..." ఆవిడగొంతు మళ్ళీ పూడుకుపోయింది.

మాట్లాడుతున్నప్పుడు ఆవిడ చుట్టూ ఒక దుఃఖపు ఛాయ. జీవితం, మృత్యువుల మాయా మోహపు తెరల తాలూకూ ఘర్షణ. ఒక అకాల మృత్యువు తాలూకూ బీభత్సం. మృత్యువు చెల్లా చెదురు చేసిన ఓ జీవితపు విషాదాన్ని నిస్సహాయంగా చూడడం తప్ప ఇంకేం చేయలేని స్థితి. పనిపిల్ల ఖాళీ ప్లేటులు తీయడానికి వచ్చింది.

"టీ పట్టుకురా" అని చెప్పి "అన్నట్టు శనివారం నాన్‌వెజ్ తింటారా? ఏదన్నా పట్టింపా" ఆవిడ నావైపు తిరిగి అడిగింది. లేదన్నట్టు తలూపాను.

"ఇంతకు ముందు నేనూ శనివారం తినేదాన్ని కాదు. చిన్నప్పటి నుంచీ ఇంట్లో అలా అలవాటైపోయింది. ఇప్పుడు నా జీవితం రెండు భాగాలుగా విడిపోయింది. కార్తీక్ చనిపోవడానికి ముందూ, చనిపోయిన తర్వాత... ఈ రెండు భాగాలకు ఒకదానితో ఒకదానికి ఎలాంటి పోలికా లేదు, సంబంధమూ లేదు. ఇప్పుడు నాకు దేని గురించీ ఏ పట్టింపూ లేదు. నిజం చెప్పాలంటే అసలు జీవితం గురించే పెద్ద పట్టింపు లేదు. ఒకప్పుడు గాఢంగా అనిపించిన దేదీ ఇప్పుడు అనిపించడం లేదు. జీవితంలో దేనికీ విలువా, అర్థం లేదనిపిస్తోంది. ఏదైనా ఒక విలువైన దాన్ని పోగొట్టుకున్నపుడు ఇంక దేనికీ కూడా విలువ లేకుండా పోతుందేమో.

అప్పుడు కూర్చున్నాను నా గురించి అలోచించుకోవడానికి. నాకు ఏం కావాలో ఆలోచించుకోడానికి. అప్పుడు అనిపించింది నాకు నేనే ఏదైనా చేసుకోవాలని, బైటినుంచీ ఏదీ నాకు ఏమీ చేయలేదని. నేను నిలబడాలంటే నేనే ఏదో ఒకటి చేయాలి. ఈ శూన్యంలోంచి నేనే బైటపడాలి. అందుకే ఆలోచించడానికి కూడా తీరిక లేనంతగా ఈ వ్యాపకాలన్నీ పెట్టుకున్నాను. ఇదివరకు ఇక్కడికి వచ్చేదాన్ని కాదు. ఇప్పుడన్నీ నేనే చూస్తున్నాను. రోజంతా మనుషుల మధ్య పనులతో ఎలాగో గడిచిపోతుంది. ఇంక మిగిలింది సుదీర్ఘమైన రాత్రుళ్ళు. క్షణక్షణం భారంగా గుబులుగా దిగులుగా అనిపించే రాత్రుళ్ళు. ఏ నిద్ర మాత్రలకీ లొంగని రాత్రుళ్ళు. ఒంటరితనంతో భయపెట్టే చీకటి రాత్రుళ్ళు. ఇక ఈ రాత్రుళ్ళని కూడా జయించాలి. అప్పుడు అనిపించింది. కార్తీక్ చేయకుండా వదిలిపెట్టిన పనిని పూర్తిచేస్తే ఆ శూన్యం నిండుతుందేమో అని. ఇండియాకి వచ్చేసిన తర్వాత ఈ ఫామ్ హౌస్‌లోనే ఏదో ఒకటి చేయాలని వాడి ఆలోచన. వాడికి చిన్నప్పట్నుంచీ ముసలి వాళ్ళని చూస్తే జాలి. "పాపం వాళ్ళకి ఎట్లా అమ్మా" అనేవాడు. అందుకే ఒక ఓల్డేజ్ హోమ్‌నీ, అనాధాశ్రమాన్నీ ఏర్పాటు చేద్దామనిపించింది. అంతకన్నా ఇంకేం చేయొచ్చో నాకు తెలీదు. ఒక ట్రస్టుని ఏర్పాటు చేసి ఈ ఫామ్ హౌస్‌ని ట్రస్టుకి అప్పజెప్పాలన్నది నా

ఆలోచన. దీనినుంచీ వచ్చే ఆదాయాన్ని ఓల్డేజ్ హోమ్‌కి ఇతర అవసరాలకీ వాడుకోవాలి.

ఫామ్ హౌస్‌ని ట్రస్టుకి ఇచ్చేయడం ఆయనకి ఇష్టంలేదు. అందుకని ఈ విషయంలో ఆయన ఏమీ పట్టించుకోరు. ఇప్పుడు మీరు చేయాల్సింది ఏంటంటే ట్రస్టుకి సంబంధించిన డ్రాఫ్టుని తయారుచేసి దాన్ని రిజిష్టర్ చేయించడం. ఆయన మీద పంతంగా నేనే ఇదంతా చేయాలనుకుంటున్నాను. కావ్యని అడిగితే మీ పేరు సజెస్ట్ చేసింది. డ్రాఫ్టు ఎలా చేయాలో మీకు ఐడియా ఉండే ఉంటుంది కదా. డ్రాఫ్టింగ్‌కి ఎన్ని రోజులు పడుతుంది?" చెప్పడం పూర్తి చేసి ఆవిడ అడిగింది.

"మూడు, నాలుగు రోజులు చాలు. పూర్తి అయిన తర్వాత మీకు చూపిస్తాను. ఏదన్నా అవసరమైతే మధ్యలో ఫోన్ చేస్తాను" అన్నాను.

"అన్నట్టు నేను ఇప్పుడు మీతో రావడం లేదు. కొంచెం పనుంది. రాత్రికి ఇక్కడే ఉండిపోతాను. లంచ్ చేసిన తర్వాత ఆయన మిమ్మల్ని సిటీలో డ్రాప్ చేస్తారు. మీకేం అభ్యంతరం లేదుగా" ఆవిడ అంది.

ఫరవాలేదన్నట్టు తలూపాను.

మరో గంట తర్వాత ఆయనతో పాటు కారులో సిటీకి బయలుదేరాను. అప్పుడు హఠాత్తుగా తట్టింది వాళ్ళిద్దరూ ఒక్క మాట కూడా మాట్లాడుకోలేదని. అసలు మాట్లాడుకుంటున్నట్టు కూడా లేదని. కారు బయల్దేరి కొద్దిదూరం వెళ్లిన తర్వాత "గీత మీకు అంతా చెప్పిందనుకుంటాను" అన్నారాయన. ఆవిడ ఏది చెప్పింది అనాలోఏది చెప్పలేదని అనాలో తెలీని అయోమయంలో తలూపాను.

"కార్తీక్ చనిపోవడానికి నేను కారణమని గీతకు కోపం. కార్తీక్ చిన్నప్పట్నుంచీ కష్టం అంటే ఏంటో తెలీకుండా పెరిగాడు. వాడు అడక్కుండానే అన్నీ అమరుస్తూ వచ్చాం. అందుకే జీవితం లోని కష్టసుఖాలు, ప్రాధాన్యతలు, జీవితం విలువా, మనుషుల విలువ వాడికి తెలీకుండా పోయింది. డబ్బుకి ఉండే విలువ, ఆ విలువకు ఉండే పరిమితుల గురించి అంతకన్నా తెలీదు. వాడికే కాదు ఇప్పటి పిల్లల్లో చాలా మందికి తెలీదు. అది వాళ్ళ తప్పు కాదు. ఆ వయసు అంతే. అవన్నీ ఒకళ్ళు చెబితే తెలిసేవి కాదు. స్వయంగా అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి.

అందుకే చదువు అయిన తర్వాత ఒక సంవత్సరం అన్నా అక్కడ వాడు జాబ్ చేస్తే కష్టం విలువ తెలుస్తుందనుకున్నాను. జీవితం గురించి కొంతన్నా తెలిసి వస్తుందనుకున్నాను. అంతే నేను చేసింది. వాడు యాక్సిడెంట్‌లో చనిపోయాడు.

అది జస్ట్ యాన్ యాక్సిడెంట్ అంతే. దాని సమయం వచ్చినప్పుడు మృత్యువు ఎక్కడ వున్నా వస్తుంది. ఇక్కడికి వచ్చినా అదే జరిగేదేమో? కానీ ఇవన్నీ గీత ముందు పనిచేయవు. తనకి నామీద ఉన్నదంతా ద్వేషం. కార్తీక్‌ని తనకు దూరం చేశానని కోపం. కార్తీక్ తనకేనా కొడుకు? నాకు కాడా? వాడు పోయినందుకు తనకేనా దుఃఖం ? నాకు లేదా? ఓవైపు ప్రాణంగా పెంచిన కొడుకుని పోగొట్టుకున్న బాధ, మరోవైపు..." ఆయన గొంతు వణికింది.

"మీరే చెప్పండి. ఇందులో నేను చేసిన తప్పు ఏదన్నా ఉందా?" సంబాళించుకుని ఆయన తిరిగి అన్నారు.

నేను ఏం చెప్పలేక మౌనంగా ఉండిపోయాను. ఆయన కూడా సమాధానాన్ని ఆశించినట్టు కనిపించలేదు.

"ఇదుగో ఇది చూడండి ఒకసారి" సీటులో తన పక్కన ఉన్న ఫైల్‌ని నాకు అందిస్తూ అన్నారాయన. తీసుకుని చూసి ఆశ్చర్యపోయాను.

"కార్తీక్ మెమోరియల్ ట్రస్టు" తాలూకు డ్రాఫ్టింగ్ అది. నేను ఆశ్చర్యపోయాను. "ఇది పట్టుకెళ్ళి గీతకి ఇచ్చెయ్యండి. ఇదంతా ఏంటి అనుకుంటున్నారు కదూ. నాకు ఈ ట్రస్టు అంటే ఇష్టంలేదని గీత మీకు చెప్పి ఉంటుంది. నిజానికి ఈ ట్రస్టు ఆలోచన కావ్యదీ, నాదే. గీతని చూస్తుంటే ఒకోసారి ఎంత భయం వేస్తుందంటే ఒకోరోజు అన్నం తినదు. స్నానం చేయదు. ఎవరితో మాట్లాడదు. ఒక చోట కూర్చుందంటే ఇంక గంటల తరబడి అక్కడి నుంచీ లేవదు. ఒకో రాత్రి ఏడవడం మొదలుపెట్టి ఇంక తెల్లవార్లూ ఏడుస్తూనే ఉంటుంది. నేను ఓదార్చబోతే విసిరి కొడుతుంది. నా ఉనికినే భరించలేకపోతోంది. తనని ఇలాగే వదిలేస్తే పిచ్చిదైపోతుంది. అప్పుడనిపించింది. ఈ దుఃఖంలోంచి తనని బైట పడేయాలి. గీతకి ఏదన్నా వ్యాపకం కావాలి.

కానీ ఇది నా ఆలోచనంటే గీత ఇష్టపడదు. నేను చేయవద్దన్నది చేస్తుంది. ఒకళ్ళని ఎలాగూపోగొట్టుకున్నాం. ఇంకొకళ్ళని పోగొట్టుకోడానికి నేను సిద్ధంగా లేను. గీతని ఎలాగైనా కాపాడుకోవాలి. రాత్రింబగళ్ళు ఇదే నా ఆలోచన.

మీకు ఒకటి చెప్పనా! నామీది కోపమే గీతని బతికిస్తోంది. కేవలం ఆ పంతంతోనే తను బతుకుతోంది. ఆ కోపం, పంతం జారిపోతే తను ఒక్కసారిగ కొలాప్స్ అయిపోతుందేమో అనిపిస్తోంది. కాలం అన్ని గాయాలనూ మాన్పుతుందంటారు. అప్పటి వరకూ గీతని కాపాడుకోగలిగితే..." ఆయన ఇంక చెప్పలేనట్టు ఊరుకున్నారు.

నేను దిగాల్సిన చోటు వచ్చింది. మౌనంగా కారు దిగాను. ఆయన కూడా

ఇంకేం మాట్లాడలేనట్టు ఒక్క నిముషం అలాగే ఉండిపోయారు. ఆయన మొహం మీద కార్తీక్ జ్ఞాపకాల తాలూకు దుఃఖపు నీడ, మరో నిముషం తర్వాత కారు మెల్లగా కదిలింది. దుఃఖభారంతో అది వెళ్ళలేక వెళుతున్నట్టు అనిపించి అటేచూస్తూ నిల్చున్నాను.

దుఃఖంతో అంతవరకూ అంత సమీపంగా నాకు పరిచయం లేదు. ఒక దుఃఖాన్ని ఎలా చూడాలి, దాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్న ఆలోచనా తెలియదు. ఒక దుఃఖపు గాఢతను ఎలా తగ్గించవచ్చో అంతకంటే తెలీదు. ఒక మనిషిని ఓదార్చడం ఎలాగో, ఓదార్చకుండా ఉండడం ఎలాగో తెలియని కొన్ని దౌర్భాగ్య క్షణాలను నేను నిస్సహాయంగా అనుభవించాను.

లోకంలో ఇంత దుఃఖం, వేదన ఉందని తెలిసికూడా మనుషులు దాని గురించి ఏ మాత్రం ఆలోచించకుండా జీవితాన్ని గడిపేయడం ఆశ్చర్యంగా అనిపించింది. ఒకో మనిషీ తన తలపై తనకు తెలియకుండానే నిన్నటిదో, రేపటిదో ఎంత దుఃఖ భారాన్ని మోస్తున్నాడు.

హఠాత్తుగా కార్తీక్ గుర్తుకొచ్చాడు.

ఎక్కడో దేశంకాని దేశంలో మృత్యువు తాకినపుడు ఆ చివరి గడియల్లో అతనికి ఏమనిపించి ఉంటుంది? మృత్యువు తనను సమీపిస్తోందని, జీవితంపై తను పెంచుకున్న ఆశలు, కోరికలు అర్ధాంతరంగా ముగుస్తున్నాయని అతనికి తెలిసి వుంటుందా? కంటితో ఒక్కసారి కూడా చూడని అతని కోసం నా కళ్ళు నీటితో నిండాయి.

*'చినుకు' మే 2016*

# హోమం

ఇంటికి చుట్టాలొచ్చారు. ఇల్లంతా సందడి సందడిగా ఉంది. చుట్టాలంటే చుట్టాలు కాదు. పెద్దాయన కూతురు. అక్కడెక్కడో డాక్టరుగా చేస్తోంది. ఆమె వచ్చిందంటే ఆ కాసేపూ ఇల్లు మాట్లాడుతూనే ఉంటుంది. రాత్రి పొద్దుబోయాక కార్లో దిగింది. నాలుగు నెలల కిందట పెద్దాయన చనిపోయిన దగ్గర్నుంచీ ముసలావిడ బెంగ పెట్టుకుంది. అందుకే ఈ మధ్య కూతురు తరచుగా వస్తున్నట్టుంది.

పొద్దుట కాఫీ వాసనతో పాటే మాటలూ వరండాలోకి పాకాయి. వరండాలోకి తొంగిచూశాను. కూతురు వరండా గట్టుమీద కూచోబోతున్నదల్లా కాఫీ కప్పు పట్టుకునే నా దగ్గరకు వచ్చింది. వచ్చి తలెత్తి నావంకా, కొమ్మ వంకా పరీక్షగా చూసింది.

"అరే. ఇదేంటి కాయలే లేవు. నిరుడు ఈ పాటికల్లా విరగ్గాసిందిగా. ఏమయింది దీనికి?" అంటూ నా చుట్టూరా తిరిగింది.

"అవును. పోయినేడు కూడా బాగానే కాసింది" అన్నాడు పెద్దాయన కొడుకు.

"ఏం కాయలు వెధవకాయలు. ఒక పచ్చడికీ పనికిరావు. పండుగానూ పనికిరావు. కాయకపోతే పోయింది. మొన్న మొన్నటివరకూ ఆకులు రాలినవి రాలినట్టే ఉన్నాయి. తుడవడానికి పనిది రోజూ గొణుక్కోడమే." కోడలు కాఫీ కప్పులు ట్రేలో పెడుతూ అంది.

నాకు ప్రాణం చివుక్కుమంది. నేను ఎందుకు కాయలేదో నాకు తెలుసు. నా మనసుకి తెలుసు. కూతురే వైజాగు నుంచీ వస్తూ నన్ను కడియం నర్సరీలో కొనుక్కువచ్చింది.

"ఇది హైబ్రీడ్ నాన్నా. నాలుగేళ్ళలోపే కాపు కొచ్చేస్తుంది. వెనక ఖాళీ లేదుగా. ముందువైపున పెడదాం. మామిడి మొక్కలేని ఇంటికి అందం రాదు నాన్నా" అంది కూతురు.

"ఈ వీధినిండా అల్లరి పిల్లలే. ముందువైపు పెడితే కాయల కోసం రాళ్ళేసి కొడతారు. కిటికీ అద్దాలు పగిలితే మళ్ళీ అదో అవస్థ. మామిడి మొక్క బదులు ఇంకో నాలుగు గులాబీ మొక్కలే తెస్తే సరిపోయేది" కోడలు అయిష్టంగా అంది.

"లేదులే వదినా. మామిడి అందం మామిడిదే. మాకు అపార్ట్‌మెంట్లో ఎలాగూ అవకాశం లేదు. కనీసం ఇక్కడన్నా పెడదాం" కూతురు అంది.

పెద్దాయన వెచ్చటి చేతుల స్పర్శ అప్పుడు మొదటిసారి రుచి చూశాను. ఐదేళ్ళ కిందట పెద్దాయనకి గుండెజబ్బు వచ్చింది. కూతురూ కొడుకూ డాబా ఎక్కి పిట్టగోడ మీద నా పక్కనే కూర్చుని మాట్లాడుకున్నారు.

"ఈ వయసులో సర్జరీ కష్టం. ఇప్పుడు ఆయనకి ఎనభై అయిదు నడుస్తోంది. మందుల మీదే ఉంచడం మంచిది. ఇంట్లో చిన్నపాటి వ్యాయామాలుచేస్తే సరిపోతుంది. నేను వెళ్ళేలోపల అవన్నీ నాన్నకి నేర్పిస్తాను. గుండెజబ్బు ఉందని నాన్నకు చెప్పొద్దులే" అంది కూతురు.

అప్పట్నుంచీ మొదలైంది పెద్దాయనకీ నాకూ సావాసం. రోజూ పొద్దున్నా, సాయంత్రం రెండు పూటలా డాబా మీదికి వచ్చేవాడు. కాసేపు వ్యాయామాలు చేసేవాడు. కాసేపు నా పక్కనే పిట్టగోడమీద కూర్చుని కబుర్లు చెప్పేవాడు. బూజులుంటే దులిపేవాడు. ఆకు ఆకునీ తడిమేవాడు. ఆయన దగ్గరికి రాగానే కొమ్మలు సంతోషంతో ఊగేవి. ఆకులు గలగలా కదిలేవి. అది ఆయనకు నేనిచ్చే కరచాలనం.

ఆ రోజు ఉదయం కూడా అలాగే వచ్చాడు. కాసేపు వ్యాయామాలు చేశాడు. కాసేపు నాతో మాట్లాడాడు. తర్వాత కిందకువెళ్ళాడు. అప్పుడు వినిపించింది ఆ శబ్దం ధన్‌మని ఏదో పడిపోయినట్టు. ఏమైందోనని ఆదుర్దాగా కొమ్మల్ని వంచి కిటికీలోకి చూశాను. పెద్దాయన స్నానాల గదిలో తలుపుకి అడ్డంగా పడిపోయి వున్నాడు. కొడుకూ, మనవడు కలిసి ఆయన్ని లేపడానికి చూస్తున్నారు. ముసలావిడ 'ఏమండీ' అంటూ ఏడుపు మొదలెట్టింది.

ముసలాయన చనిపోయాడేమోనన్న సంభ్రమంతోనూ, మళ్ళీ ఎక్కడ బతుకుతాడోనన్న భయంతోనూ కోడలు కంగారు కంగారుగా చూస్తోంది. తొంభై ఏళ్ళు దాటికూడా మనుషులు బతకడం ఏంటని ఆవిడకెప్పుడూ ఓ నిష్టూరం ఉండేది. పైగా ఆ అనర్థం ఏదో ఇరుగింట్లోనో పొరుగింట్లోనో కాకుండా తమింట్లోనే జరగడం అనేది ఆమెకు కొరుకుడు పడేదికాదు. మనుషులు ఏ అరవైఏళ్ళో, డెబ్బై ఏళ్ళో బతికి చావాలి కానీ తొంభై ఏళ్ళు బతకడం ఏంటని ఆవిడ దేవుడితో పాటు

అందర్నీ నిలదీస్తూనే ఉంటుంది. పేపర్లోనో, టీవీల్లోనో చిన్నచిన్న పిల్లలు ఏదన్నా ప్రమాదంలోనో, యాక్సిడెంట్లోనో చనిపోయారన్న వార్తలు విన్నప్పుడల్లా "ఏంటో ప్రారబ్ధం చిన్న చిన్న పిల్లలు చచ్చిపోతున్నారు" అనేది. అయినా వీళ్ళింకా పోవడం లేదు చూడండీ అనేది దానికి ముక్తాయింపుగా అందరికీ అర్థమయ్యేది. పైగా తొంభై ఏళ్ళు దాటిన తన తండ్రిని వదినల మీదా, వాళ్ళు పెట్టే పచ్చడి మెతుకుల మీదా వదిలేసి ఎవరి నాన్నకో అన్నీ అమర్చిపెడుతుండడమేమిటన్న దుగ్ధ కూడా ఉండేది. పచ్చడి మెతుకులు పెట్టడానికి వదినలకున్న స్వతంత్రం తన ఇంట్లో తనకు లేకపోవడమేమిటన్నది కూడా ఆమెకు ఓ బాధే. తనకు అరగని చికెన్ పచ్చళ్ళు, మటన్ పచ్చళ్ళు కూడా ముసలాళ్ళు తిని అరిగించుకోవడం ఇంకో బాధ.

ఇక పెద్దాయన కొడుకుది అదో వరస. ఆయన ఏదో పెద్ద ఉద్యోగం చేస్తున్నాడంట. గది వదిలి బైటకు రాడు. ఏదో పురిటిగది అన్నట్టు అన్నీ ఆ గదిలోనే. బాత్రూంకి తప్ప బైటకురాడు. ఆయనకు బీపీ పెరిగితే అటు ఆఫీసులోనూ ఇటు ఇంట్లోనూ పెంకుల్లేస్తాయి. అందుకే సాధ్యమైనంత వరకూ ఆ పెంకుల్లేవకుండానే అందరూ జాగ్రత్త పడుతుంటారు.

అప్పుడెప్పుడో పెళ్ళయిన కొత్తల్లో అత్తగారి హయాంలో అత్తగారు కోడల్ని రాచి రంపాన పెట్టేదంట. మామగారు రిటైరైన తర్వాత కోడలి హయాం మొదలయింది. దాంతో ఇంట్లో కొన్నేళ్ళ పాటు రామరావణ యుద్ధాలు, కురుక్షేత్ర యుద్ధాలు జరిగిపోయినై. భార్యకి, అమ్మా నాన్నలకి మధ్య జరిగిన యుద్ధాల్లో "ఇంక మీతో మాట్లాడితే అప్పుడడగండి" అని నాన్నమీద అలిగాడట.

శ్రీరామడిలాగే ఆయన కూడా ఆడిన మాట జవదాటి ఎరుగడు. అందుకే అప్పటినుంచీ ఇప్పటివరకూ ఆ మాట మీదే నెట్టుకొస్తున్నాడు. ఏ రోజూ నాన్నని 'నాన్నా' అని పిలవలేదు. ఆయనతో మాట్లాడలేదు. పెద్దాయన మనసులో ఏమనుకునే వాడో ఎవరికీ తెలియదు. ఆయన రోజులో మూడొంతులు వరండాలోనే గడిపేసేవాడు.

పెద్దాయన్ని అతి కష్టమ్మీద ఇద్దరు ముగ్గురు కలిసి బాత్రూంలోంచి పట్టుకొచ్చి మంచం మీద పడుకోబెట్టారు. కొడుకు అంబులెన్స్ కోసం ఫోన్లు చేస్తున్నాడు. మనవడు తాతగారి గుండెల మీద చేత్తో వత్తుతున్నాడు. ఇవన్నీ ఎక్కడ ఫలిస్తాయోనని కోడలు ఆదుర్దాగా చూస్తోంది. ఎన్ని చేసినా నేనేమీ లేచి బతకనులే అమ్మా కంగారు పడకు అన్నట్టు పెద్దాయన కదలకుండా ఉండిపోయాడు. ఒకళ్ళొకళ్ళే పోగవుతున్నారు. ఫోన్లు మొదలయ్యాయి. ఇదీ ఆ రోజు జరిగింది.

పెద్దాయన ఎవరితో చేయించుకోకుండా ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా ఆదివారం అలా చులాగ్గా వెళ్ళిపోయాడు. వచ్చిన వాళ్ళంతా మంచి చావు అన్నారు. అందులో రేపు మేం ఎట్లాపోతామో అన్న బెంగ ఇమిడ్చి.

ఇక ఆ తర్వాత జరిగింది చెప్పకపోతే కథ పూర్తవనట్టే. పెద్దాయన్ని వరండాలో ఆయన ఎప్పుడూ కూర్చునేచోటే బాక్సులో పెట్టి పడుకోబెట్టారు. వరండాలోకి తొంగి చూశాను. ఆయన మొహం ప్రశాంతంగా నిద్రపోతున్నట్టే ఉంది.

ఏడుస్తున్న మనవణ్ణి చుట్టాలావిడ పాలు తాగమని బ్రతిమిలాడుతోంది. స్నానం చేసి తడిబట్టలతో రావాలని బ్రాహ్మడు కొడుకుకీ కోడలికీ చెప్పాడు.

"తడిబట్టలతో ఏంటి దరిద్రం" కోడలు గొణుగుతోంది.

"మా మామయ్యగారు చనిపోయినప్పుడు ఇట్లా చెప్పలేదే? స్నానం చేసి రమ్మన్నారు" కోడలి వదిన అంటోంది.

కూతురు వైజాగు నుంచీ వచ్చింది. వరండాలో తండ్రిని ఉంచిన పెట్టె పక్కన ఓ రెండు నిముషాలు నిలబడి ఆయన వంకే చూస్తూ ఉండిపోయింది. "పోనీలే నాన్నా, నీకు విముక్తి దొరికింది" అన్నట్టున్నాయి ఆమె కళ్ళు.

అప్పుడు మొదలయింది అసలైన తంతు. ముసలాయన్ని లేపి స్నానం చేయించి పాడెపైన పడుకోబెట్టారు. బ్రాహ్మడు కొడుకుని పిలిచి "మీ నాన్న చెవి దగ్గర వంగి ఆయన్ని "నాన్నా నాన్నా" అని మూడుసార్లు పిలవండి" అన్నాడు. కొడుకు స్తంభించి పోయాడు. ఏం అర్థం కానట్టు నిలబడిపోయాడు. ఆయన్ని 'నాన్నా' అని పిలవాల్సి వస్తుందని కొడుకు అనుకున్నట్టులేడు. ఎన్నో ఏళ్ళ కిందట మర్చిపోయిన పదం. పిలవని పదం.

"ఏం లేదండీ. చెవి దగ్గర వంగుని మూడుసార్లు" బ్రాహ్మడు మళ్ళీ చెప్పాడు.

కొడుకు తండ్రి చెవిదగ్గర ఒంగున్నాడు.

"నాన్నా... నాన్నా... నాన్నా" అని పిలిచాడు.

పెద్దాయన ఉన్నప్పుడంతా ఆ పిలుపు కోసం ఎదురుచూశాడు. ఆయన బతికుండగా వినిపించని ఆ పిలుపు ఇప్పుడు వినిపించింది. నేను కొడుకు మొహంలోకి తొంగి చూశాను. ఆయన మొహంలో ఏ భావం ఉందో, ఆయన మనసులో ఏ సంచలనం రేగిందో చెప్పడం కష్టమనిపించింది. 'నాన్నా' అనే పిలుపు ముసలాయన చెవులకి వినిపించిందో లేదో కానీ కొడుకు గుండెకి వినిపించినట్టుంది.

వెళ్ళిపోతున్న ముసలాయన వంక చివరిసారిగా చూశాను. ఇంక రోజూ నాతో

ఎవరు మాట్లాడుతారు? పూతపూస్తే ఎవరు సంతోషిస్తారు? బూజులు పడితే ఎవరు దులుపుతారు? కాయలు కోసి ఎవరు పంచుతారు అని ఆయన్ని అడగాలనిపించింది.

ఇంక ఆ తర్వాత జరిగిన వాటి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. పదకొండో రోజున పదిహేడు మంది భోక్తలను పిలిచి వెండి చెంబులు, రాగి చెంబులు, వచ్చిన వాళ్ళకు వెండి కుంకుమ భరిణెలతో సహా పెళ్ళిలాగా జరిగింది పెద్దాయన కార్యక్రమం.

బ్రాహ్మడు మంచి ఆరితేరిన పండితుడనీ, ఒక్కసారి కూడా పుస్తకం చూడకుండానే మంత్రాలు అమోఘంగా చదివాడనీ కొడుకు అందరితో చెప్పి సంతోషించాడు. ఆ మంత్రాల తతంగం మధ్యాహ్నం రెండుగంటల వరకూ కూడా ముగియక పోవడంతో భోజనాలకు వచ్చిన జనాల్లో సగంమంది (చక్కెర పడిపోయి) వెళ్ళిపోయారనే విషయం ఆయనకు మర్నాడుగానీ తెలియలేదు (అప్పటికి మూడు లక్షల ఖర్చు).

బ్రాహ్మడు మర్నాడు చావుకబురు చల్లగా బైటపెట్టాడు. పెద్దాయన చనిపోయిన ఘడియలు మంచివి కాదుట. శాంతి చేయాలట. హోమం చేయకపోతే మంచిదికాదుట (ఎవరికని కొడుకు అడగలేదు). లేకపోతే ఆయన ఆత్మశాంతించదంట. ఇంటికి కీడు జరుగుతుందట.

వింటుంటే నాకే వళ్ళు మండిపోయింది. పెద్దాయన అంత శుభ్రంగా తిరుగుతూ తిరుగుతూ ఆదివారం పూట ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా అంత చక్కటి చావు చచ్చిపోతే శాంతిచేయాలట. హోమం చేయాలట. మూర్ఖత్వానికి హద్దులు ఏముంటాయి.

హోమ గుండంలోంచి పొగ సుడులు సుడులుగా లేచి ఇంటిచుట్టూ కమ్ము కుంటోంది. మామగారు నెయ్యి దిమ్మరించుకుంటాడని నేతి గిన్నెను దాచిపెట్టే కోడలు ఆపకుండా హోమ గుండంలో నెయ్యి గుమ్మరిస్తోంది. దట్టంగా కమ్ముకుంటోన్న పొగకి నాకు ఉక్కిరిబిక్కిరిగా ఊపిరాడనట్టు అయిపోయింది. మంత్రాలతో ఇల్లు దద్దరిల్లి పోతోంది.

బ్రాహ్మడు గిన్నెడు నెయ్యి గుమ్మరించాడు. పొగనిలువెత్తున లేచి నా మీదకు ఎగబాకింది. అదిగో అప్పుడు పెట్టుకున్నాను ఒట్టు. ఈ మూర్ఖుల కోసం ఇంక కాయకూడదని.

***'చినుకు' అక్టోబరు 2016***

# అద్దం

**బెం**గుళూరు వెళ్ళే పని పడింది. గట్టిగా రెండు రోజుల పని. ఏదన్నా హోటల్లో దిగితే సరిపోతుంది. కానీ రాఘవ పట్టుబట్టాడు. బెంగుళూరు అంటూ వెళితే స్ఫూర్తి దగ్గరే ఉండాలని. నా ఎదుటే స్ఫూర్తికి ఫోన్ చేసి ప్రోగ్రామ్ డిసైడ్ చేసేశాడు. స్టేషన్‌కి స్ఫూర్తి వచ్చి ఇంటికి తీసుకు వెళతాడు. తిరిగి ట్రైన్ ఎక్కించే వరకూ స్ఫూర్తిదే బాధ్యత. నాకు అవుననీ కాదనీ చెప్పడానికి కూడా లేకుండా పోయింది. రాఘవ ఏది చేసినా అంతే. రెండో మాటకి అవకాశం ఉండదు. ఇవ్వడు. వాడి మాటకి కాకపోయినా ప్రేమకి కట్టుబడిపోయేట్టు చేస్తాడు.

పర్యావరణానికి సంబంధించి రెండు రోజుల వర్క్‌షాప్. ఏర్పాటు చేస్తోంది మల్టీ నేషనల్ కంపెనీ. ఐరనీ ఏంటంటే తమ పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, కంపెనీల ద్వారా పర్యావరణాన్ని చెడగొట్టేదీ వాళ్ళే. తిరిగి పర్యావరణాన్ని బాగుచేయాలని సెమినార్లు పెట్టేదీ వాళ్ళే. ఇదంతా ఒక అర్ధవృత్తంలా ఇటునుంచటు, అటునుంచిటూ తిరుగుతుంటుంది. ఏ మూడ్నెల్లకో ఆర్నెల్లకో సారి ఏదన్నా స్టార్ హోటల్‌లో ఈ సెమినార్లు జరుగుతుంటాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాయు కాలుష్యం, జల కాలుష్యం, అంతరించిపోతున్న ప్రకృతి వనరులు, నీటి సంక్షోభం, దాదాపు ఏళ్ళ తరబడి ఇవే అంశాలు. వాటిమీద చర్చలు, మీది తప్పంటే మీది తప్పని ఆరోపణలు, పరిష్కారాలు సూచించాలని విజ్ఞాపనలు తర్వాత వీడ్కోలు – కుడీ ఎడమగా ఇదే ఎజెండా.

స్టేషన్‌లో దిగేటప్పటికి స్ఫూర్తి ఫోన్ చేశాడు 'అంకుల్ ఎక్కడ ఉన్నారంటూ.' చెప్పాను. సెల్‌ఫోన్లు వచ్చిన తర్వాత కలిగే అనర్థాలు ఎలా ఉన్నా అపరిచితుల్ని గుర్తించడం మాత్రం తేలికయిపోయింది. బ్లూజీన్స్, వైట్ షర్టులో ఎదురుగా వస్తున్న స్ఫూర్తిని తేలిగ్గానే గుర్తుపట్టాను. చూడడానికి బావున్నాడు.

"రమణ అంకుల్ కదా?" చేయి చాస్తూ అన్నాడు.

"స్ఫూర్తినా?" నేనూ అడిగాను.

అవునంటూ నవ్వినా చేతిలోని బ్రీఫ్ అందుకున్నాడు.

"నా కారు సర్వీసింగ్‌కి ఇచ్చానంకుల్. కాబ్ బుక్ చేశాను. ఫ్లాట్‌కి వెళ్ళి రిఫ్రెష్ అయిన తర్వాత మిమ్మల్ని సెమినార్ దగ్గర దింపేస్తాను. ఈవెనింగ్‌కి నా కారు వచ్చేస్తుంది" బైటకు దారి తీస్తూ అన్నాడు.

"ఓ.కే. నో ప్రాబ్లమ్" అన్నాను.

మేం బైటకు వెళ్ళే సరికల్లా కాబ్ సిద్ధంగా ఉంది. స్ఫూర్తి అడ్రస్ చెప్పాడు.

కారులో పదినిముషాల పాటు స్ఫూర్తితో మాట్లాడానో లేదో తనమీద మంచి ఇంప్రెషన్ కలిగింది. చాలా విషయాల మీద తన ఎనాలిసిస్ నాకు నచ్చింది. అంతే కాదు అతను ప్రతి సమస్యనీ ఒక కొత్త దృక్కోణం లోంచి విశ్లేషణ చేయడం గమనించి ఆశ్చర్యమనిపించింది. స్టడీ టూర్లలో భాగంగా నేను చాలామంది యువతీ యువకులను ఏదో ఒక విషయం మీద కదిలిస్తుంటాను. కొంతమంది ఫరవాలేదనిపిస్తారు. కొంత మందిని చూస్తే అసలు వాళ్ళు డిగ్రీలు, ఇంజనీరింగ్‌లు ఎలా పాసై ఎలా ఉద్యోగాలు చేస్తున్నారా అని ఆశ్చర్యం వేస్తుంటుంది. మనం ఉండే సమాజం గురించి, సమాజ పరిస్థితుల గురించీ కనీస జ్ఞానం అన్నా లేకుండా ఎలా ఉంటారు వీళ్ళంతా అనిపించేది. కేవలం క్లాసు పుస్తకాలు మాత్రమే చదవడం వల్ల కలిగే అనర్థం అది.

పర్యావరణం మీదా, కాస్టిజం మీదా, మతం మీదా స్ఫూర్తి ఆలోచనా విధానం, అతను లాజికల్‌గా చెబుతున్న తీరు నిజంగా నాకు సంతోషం కలిగించాయి.

"ఏయ్ బాబూ. ఇటెందుకు వచ్చావ్?" నేను చెప్పిన ఏరియా ఏంటి? నువ్వు తీసుకెళ్తున్న రూట్ ఏంటి? ఎందుకు అనవసరంగా ఇంత చుట్టు తిరిగావ్?" స్ఫూర్తి గట్టిగా అరవడం విని ఉలిక్కిపడ్డాను.

"అటు ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది సార్. ఇది పీక్ టైమ్. అటు వెళ్తే ఇప్పుడే బైటపడలేం" డ్రైవరు అన్నాడు.

"అలాంటప్పుడు నువ్వు నన్ను అడగాలా వద్దా? రోజూ ఈ రూట్లో తిరుగుతాను. నేను డైరెక్ట్ చేసే వాడిని కదా. మాటల్లోపడి గమనించలేదు. ఏడెనిమిది కిలోమీటర్ల డిస్టెన్స్ తేడా వస్తుంది. టైమ్‌కి టైమూ పడుతుంది. కిలోమీటర్లు పెరిగితే ఫేర్ ఎక్కువ వస్తుందని మీ వేషాలు. నాకు కథలు చెప్పొద్దు" స్ఫూర్తి కరుగ్గా అన్నాడు.

"లేదు సార్. పీక్ అవర్స్ అనే ఇటు వచ్చా. అటు సిగ్నల్ పాయింట్స్ ఎక్కువ సార్. ఇటు అంత ఉండవు" డ్రైవరు వినయంగా అంటున్నాడు.

"నాకు టైమ్ సరిపోతుందిలే స్ఫూర్తీ. సెమినార్ తొమ్మిది గంటలకి" నచ్చ చెబుతున్నట్టు అన్నాను.

"మీకు తెలియదు అంకుల్. వీళ్ళంతా కావాలనే ఇలా చేస్తారు. నేను చూస్తున్నాను కదా. ఎక్కడో అక్కడ చెక్ పెట్టకపోతే అందరితో ఇట్లాగే ఆడుకుంటారు" స్ఫూర్తి గొంతులో ఇంకా కోపం తగ్గలేదు.

"సారీ సర్. టైము పెద్ద తేడా లేకుండా మిమ్మల్ని దించే బాధ్యత నాది సార్" డ్రైవరు అన్నాడు.

"ఆ పదికిలోమీటర్ల ఫేర్ ఎవరు కడతారు? నువ్వు కడతావా?"

"పోనీలే. వదిలెయ్యి స్ఫూర్తీ" అన్నాను.

క్యాబ్ డ్రైవరుకి నిండా ఇరవై ఏళ్ళుండవు. సరిగా రాని చదువో, బాధ్యతలో ఏదో డ్రైవరు పనికి తరిమినట్టున్నాయి. తెలియని తనమూ, అమాయకత్వమూ, నిర్లక్ష్యమూ కలగలిసినట్టు ఉన్నాడు.

"అదుగో, ఆ అపార్ట్‌మెంట్ ముందాపు" అంటూనే స్ఫూర్తి కారుదిగి సెల్ తీసుకుని ఓ పక్కకు వెళ్ళాడు.

క్యాబ్ తాలూకూ కంపెనీ వాళ్ళకి ఫోన్ చేసి డ్రైవరు మీద కంప్లెయింట్ చేస్తున్నట్టున్నాడు. ఆ ఎక్స్ట్రా ఫేర్ ఇవ్వనని అంటున్నాడు. క్యాబ్ డ్రైవరు కిందకు దిగి కారుని ఆనుకుని నిలబడి స్ఫూర్తివంక చూస్తూ వాళ్ళ సంభాషణని ఫాలో అవడానికి చూస్తున్నాడు. అతన్ని చూస్తే జాలనిపించింది.

"ఊరికి కొత్తా" అడిగాను.

"అవును సార్. ఈ మధ్యే ఆంధ్రా నుంచి వచ్చాను. ఇంకా రూట్లు అలవాటు పడలేదు. చెబితేసార్ కోప్పడతారని అనలేదు. కొంచెం మీరన్నా చెప్పండి సార్" డ్రైవరు అన్నాడు. స్ఫూర్తి సెల్ ఆఫ్ చేసి మా వైపు వచ్చాడు.

"ఆ ఫేర్ ఇవ్వక్కర్లేదన్నారు. కావాలంటే నువ్వు ఫోన్ చేసి మాట్లాడుకో. ఇదుగో డబ్బులు" స్ఫూర్తి అతనికి డబ్బులిచ్చేసి బ్రీఫ్ అందుకున్నాడు.

ఆ కుర్రాడు మాట్లాడకుండా డబ్బులు తీసుకుని నా వైపు ఓసారి చూసి వెళ్ళిపోయాడు. ఆ డబ్బులు అతని జీతంలో కోయడమో, లేక అతన్ని చివాట్లు పెట్టడమో

కచ్చితంగా జరుగుతుంది. ఇలాంటి కంప్లైయింట్లు రెండు మూడు వస్తే ఏకంగా ఉద్యోగమే పోవచ్చు.

ఆ సంఘటన మా ఇద్దర్నీ డిస్టర్బ్ చేసింది. తర్వాత సంభాషణ పెద్దగా సాగలేదు. స్ఫూర్తి నన్ను వర్క్‌షాప్ జరిగే దగ్గర దించేసి ఈవెనింగ్ సిక్స్‌కి వచ్చి పికప్ చేసు కుంటానని చెప్పాడు.

వర్క్‌షాప్ అనుకున్నట్టే షరా మామూలుగానే జరిగింది. ఎప్పటి సమస్యలే. ఎప్పటి పరిష్కారాలే. ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉంటాయి. ఓజోన్ పొరకు చిల్లు పడుతూనే ఉంటుంది. మంచు కరుగుతూనే ఉంటుంది. చెట్లు నాటండి అంటూనే ఉంటాం. రోడ్లే నాగరికతని రోడ్ల కోసం మహావృక్షాలని సైతం తెగనరుకుతూనే ఉంటాం. వీటిలో ఏదీ ఆగదు. దేన్నీ ఆపలేం. ఒక మహా యంత్రంలో పడి గిరగిరా తిరగడం మినహా ఏమీ చేయలేని నిస్సహాయత. దానిలోంచి వచ్చిన నిర్వేదం. కొన్ని కొన్ని వ్యవస్థలు ఎంత బలంగా పాతుకునిపోయి ఉన్నాయో ఆ విష వృక్షాల వేర్లు ఎంత విశ్వవ్యాప్తం అయిపోయామో, వాటిల్లో చిటికెన వేలంత వేరుని కదల్చడం కూడా ఎంత కష్ట సాధ్యమో తెలిసి వస్తున్న తాలూకూ నిర్వేదం. సెమినార్ నుంచీ అంతకన్నా ఏమీ ఆశించలేదు కనుక నేను పెద్దగా డిజప్పాయింట్ అవలేదు. చిత్తశుద్ధి లేని శివపూజలేలరా అన్న వేమన గుర్తొచ్చాడు అదంతా చూస్తుంటే.

సాయంత్రం అన్నట్టుగానే స్ఫూర్తి ఆరుగంటలకి వచ్చేశాడు. దారిలో కాఫీ తాగి ఇద్దరం ఫ్లాట్‌కి చేరుకున్నాం. రిఫ్రెష్ అయిన తర్వాత “అంకుల్. బైట ఏదన్నా రెస్టారెంట్‌లో డిన్నర్ చేద్దాం” అన్నాడు స్ఫూర్తి. సరేనన్నాను.

చిన్నదైనా రెస్టారెంట్ నీట్‌గా ప్లెజంట్‌గా ఉంది. స్ఫూర్తినే ఆర్డర్ ఇవ్వమన్నాను. స్ఫూర్తి వర్క్‌షాప్ గురించి అడిగాడు. జరిగింది చెప్పాను. వాటన్నిటి గురించీ నేను ఏం అనుకుంటున్నానో స్ఫూర్తి కూడా సరిగ్గా అదే అన్నాడు. ఇంకా చెప్పాలంటే నాకు కూడా తట్టని కొన్ని కొత్త సజెషన్స్ కూడా ఇచ్చాడు. మళ్ళీ అదే విభిన్నమైన విశ్లేషణ. స్ఫూర్తి అన్నది నూటికి నూరుపాళ్లు నిజమని మెచ్చుకున్నాను.

“ఏయ్. బాబూ ఇలారా! గ్లాస్ నీట్‌గా లేదు. నీళ్ళల్లో నలకలు ఉన్నాయి చూడు. వేరే గ్లాస్ పెట్టు” స్ఫూర్తి కరుగ్గా అన్నాడు. స్టీవార్డ్ గబగబా వేరే గ్లాసులు తీసుకొచ్చి పెట్టి “సారీ సార్” అన్నాడు.

“ఏదైనా సరే చిన్నపని అయినా పెద్ద పని అయినా చేసేపని పర్‌ఫెక్ట్‌గా లేకపోతే

నాకు నచ్చదు అంకుల్. అస్సలు తట్టుకోలేను. ఏ చిన్న తేడా వచ్చినా కోపం వచ్చేస్తుంది" స్ఫూర్తి సంజాయిషీ ఇస్తున్నట్టు అన్నాడు. నేను తలూపి ఊరుకున్నాను. డిషెస్ రావటంతో ప్లేట్లు పెట్టి రోటీలు, కర్రీ సర్వ్ చేసి స్టీవార్డ్ ఒక పక్కకు వెళ్ళిపోయాడు. స్ఫూర్తి మళ్ళీ సంభాషణ కొనసాగించాడు. నా ప్లేట్లో కర్రీ అయిపోవచ్చింది. కర్రీ బౌల్ పక్కనే ఉంది. స్పూన్‌తో తీసిపెట్టుకోబోయాను.

"ఆగండి అంకుల్" అంటూ స్ఫూర్తి స్టీవార్డ్‌ని పిలిచాడు. కర్రీ సర్వ్ చేస్తుండగా ఒక చికెన్ పీస్ జారి టేబిల్ మీద పడిపోయింది.

"ఆ సర్వ్ చేయడం ఏంటి? కిందపడకుండా సర్వ్ చేయడం తెలీదా?" స్ఫూర్తి కఠినంగా అన్నాడు.

"సారీ సర్" అంటూ అతను గబుక్కున ఆ చికెన్ పీస్‌ని తీసి మళ్ళీ బౌల్‌లో వేయబోయాడు.

"ఏం చేస్తున్నావు? ముందు దాన్ని డస్ట్‌బిన్‌లో పడెయ్" స్ఫూర్తి అరిచాడు.

నాకు ఇంక తినే మూడ్ పోయింది. ఏదో బలవంతంగా తిన్నాననిపించి లేచాను. ఆ కుర్రాడిని చూస్తే ఇంకా హోటల్ పద్ధతులు పూర్తిగా ఒంటబట్టినట్టు అనిపించలేదు. చిన్నగా లేతగా ఉన్న అతని మొహం ఎర్రగా కందిపోయింది. నన్ను వారించి స్ఫూర్తి బిల్ పే చేశాడు. కుర్చీలోంచి లేస్తూ ఫోల్డర్ ఓపెన్ చేసి చూశాను. బిల్ కన్నా పది రూపాయలు మాత్రమే ఎక్స్‌ట్రా వుంది.

"స్ఫూర్తీ ఛేంజ్ లేదా! ఇవ్వనా?" పర్స్‌లోంచి యాభై రూపాయలు బైటకు తీశాను.

"ఆ పాటి సర్వింగ్‌కు అది చాల్లే అంకుల్" నిర్మొహమాటంగా అంటూ లేచాడు.

వచ్చేటప్పుడు స్ఫూర్తి కౌంటర్ దగ్గర ఆగి ఆ కుర్రాడి వైపు చూపిస్తూ ఏదో చెబుతున్నాడు. నేను అక్కడ నిలబడకుండా బైటకు వచ్చేశాను. ఇంటికి వెళ్ళేదారిలో "ఏదన్నా మూవీకి వెళ్దామా అంకుల్" అని అడిగాడు స్ఫూర్తి. నిద్ర వస్తోందని చెప్పి తప్పించుకున్నాను.

స్ఫూర్తికి అతని ఆలోచనా విధానానికి, అతని ప్రవర్తనకీ కుదరని లంకె ఏదో నన్ను ఇబ్బంది పెడుతోంది. చిన్న చిన్న విషయాలకే అతను అలా సహనం కోల్పోవడం, అతని ప్రవర్తనలో వస్తున్న విపరీతమైన తేడా నాకు అర్థం కాలేదు. అన్నీ అంత చక్కగా విశ్లేషిస్తున్న స్ఫూర్తి తన ప్రవర్తనను విశ్లేషించుకోవడం లేదా అనిపించింది.

మర్నాడు పొద్దున కార్లో దించేటప్పుడు కూడా స్ఫూర్తి ఏదో సంభాషణ లేవనెత్తాడు.

నేను పొడిపొడిగా మాట్లాడుతూ కూర్చున్నాను. ట్రాఫిక్ విపరీతంగా ఉంది. చీమల బారులో వున్న చీమలా కారు కదులుతోంది. సిగ్నల్ దాటుతుండగా ఫట్‌మని ఏదో రాచుకున్న శబ్దం వినిపించింది.

“రేయ్” అని అరుస్తూ స్ఫూర్తి విండో ఓపెన్ చేశాడు. పక్కన ఉన్న ఆటోడ్రైవరు భయంగా కారు పక్క భాగం వైపు చూస్తున్నాడు.

స్ఫూర్తి కారు ట్రాఫిక్‌లో నిలిపేసి కిందకు దిగిపోయి ఆటోడ్రైవరు కాలర్ పట్టుకున్నాడు. నేను కూడా కిందకు దిగాను. కారుకి ఒకవైపు గీరుకుపోయింది. ఆటో అతను “సారీ సార్. కొంచెమే గీరుకుపోయింది” అంటూ బ్రతిమిలాడుతున్నాడు.

“కొంచెమా? యూ రాస్కెల్. అది రిపేరు చేయడానికి ఎంతవుతుందో తెలుసా. ఐదువేలు. ఇస్తావా? తియ్యి. ఐదు వేలు. ఖాళీ ఉంటేదూరడమేనా?” స్ఫూర్తి అతన్ని కొట్టడానికన్నట్టు రెడీ అయిపోయాడు. ట్రాఫిక్ ఆగిపోయింది. ఒకటే హారన్లు. కొందరు గుమికూడారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ వచ్చి ఏం అయిందని అడిగి “సార్. కేసుపెడతారా?” అని అడిగాడు. ఆటోడ్రైవర్ నావైపు ప్రాధేయపడుతున్నట్టు చూశాడు. కేసుపెడితే పోలీసుల చేతుల్లో అతని పని అయిపోయినట్టే.

“ఎంతో కొంత తీసుకుని వదిలేయండి సార్. వాడు బతికి పోతాడు” జనంలోంచి ఒకాయన అన్నాడు.

“అందరూ అలా వదిలేస్తే వీళ్ళకు బుద్ధి వచ్చేది ఎప్పుడండీ? ముందు చక్రం పడితే చాలు దూరిపోతారు. ఇంత ట్రాఫిక్‌లో ఎలా పడుతుందని దూరాడు” స్ఫూర్తి అతనిమీద లేచాడు. ట్రాఫిక్ బాగా జామ్ అయిపోయింది. స్ఫూర్తి కారు తీసి పక్కన పెట్టాడు. ఈ పంచాయితీ అయేటప్పటికి నాకు లేటైపోతుందేమో ననిపించింది. ఆటో అతను జేబులన్నీ వెతికి డబ్బులు తీశాడు.

“సార్. నా దగ్గరున్నదంతా ఇచ్చేస్తాను. ఈ ఒక్కసారికీ వదిలేయండిసార్. పిల్లల్ని స్కూల్ దగ్గర దింపాలి. లేటైతే గేటు వేసేస్తారు. వాళ్ళ పేరెంట్స్ ఊరుకోరు” ఆటోడ్రైవరు బ్రతిమలాడుతున్నాడు.

“చిన్న పిల్లల్ని పెట్టుకుని ఇట్లాగేరా ఆటో నడిపేది? పిల్లలకి ఏదన్నా అయితే ఏం చేసేవాడివి?” కానిస్టేబుల్ ఆటోడ్రైవరుకి ఒక్కటిచ్చాడు.

నేను ఇంక చూస్తూ ఉండలేకపోయాను.

“స్ఫూర్తీ ఇంక చాలు వదిలెయ్. కేసువద్దు. పోనీ తీసుకుంటే డబ్బులు తీసుకో”

అన్నాను. నిజానికి డబ్బులని అనడం కూడా నాకు ఇష్టం లేదు. ఏదో రకంగా తెగుతుందని అన్నాను. స్ఫూర్తి విధిలేక అన్నట్టు మొహం పెట్టి అతని చేతుల్లోంచి డబ్బులు గుంజుతున్నట్టు లాక్కుని కారెక్కాడు. అమ్మయ్య అనుకున్నాను.

"షోరూమ్‌కి వెళితే ఎంత చిన్న రిపేరయినా మినిమమ్ ఫైవ్ థౌజండ్ ఛార్జ్ చేస్తారంకుల్. ఈ వెధవలేమో చిన్న దెబ్బేగా అంటారు. తిప్పి కొడితే మూడొందలు లేవు వాడిదగ్గర. డబ్బులుకన్నా ముందు వాడి నిర్లక్ష్యానికి పెనాల్టీ పడాలి అంకుల్. అందుకే డబ్బులు తీసుకన్నాను. అట్లాగన్నా కొంచెం వళ్లు దగ్గరపెట్టుకుని నడుపుతారు" స్ఫూర్తి అన్నాడు. డబ్బులు ఇచ్చేటప్పుడు ఆటో అతని దిగాలు మొహం ఒక్క నిముషం కళ్ళముందు కదలాడింది. వర్క్‌షాప్‌లో కూర్చున్నానన్న మాటే కానీ మధ్యలో ఏ చిన్న గ్యాప్ వచ్చినా అతనే గుర్తుకి వచ్చాడు.

నాకు ఇప్పుడు స్ఫూర్తి తెలివితేటలు, అతని విశ్లేషణా శక్తి గుర్తుకు రావటం లేదు. మాటిమాటికీ అతని అసహనం గుర్తొస్తోంది. అతనిలో లోపించిన సహానుభూతి గుర్తొస్తోంది. అతనితో గడిపిన రెండు రోజుల్లోనే స్ఫూర్తి అంటే ఒక రకంగా భయంగా అనిపించింది. మనిషికి తెలివితేటలు అవసరమే. కానీ తోటి మనుషుల పట్ల దయ, సానుభూతి, సహానుభూతి ఇంకా అవసరం. మనకన్నా గొప్పవాళ్ళ దగ్గర కన్నా మనకన్నా తక్కువ వాళ్ళ దగ్గర మన ప్రవర్తన వల్లే మన సంస్కారం బైటపడుతుంది.

వాళ్లు ముగ్గురూ అతనికన్నా అన్ని రకాలుగా చిన్నవాళ్ళు. జీవితంలో అతనికున్న అవకాశాలు లేని వాళ్ళు. వాళ్లకన్నా స్ఫూర్తి అన్ని రకాలుగా ఆధిక్యతలో వున్నాడు. దానికి అతను జీవితం పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఆ అవకాశాలు లేనివాళ్ళ పట్ల ఆదరణ ఉండాలి. చులకన కాదు. జీవితం అతనికి ఇచ్చిన అవకాశాలకి అదే అతను చూపించే కృతజ్ఞత. ఇవన్నీ రోజూ జరిగే చిన్న చిన్న సంఘటనలు. ఇలాంటివే ఇక మీదట కూడా జరుగుతూనే ఉంటాయి.

ఇప్పుడంటే అతను ఒంటరి. రేపు పెళ్ళవుతుంది. భార్య ఇంటికి వస్తుంది. భార్య ఎవరికైనా పర్మినెంట్ సబార్డినేట్ కదా. ఇంట్లో పనితో మొదలుపెట్టి బైటకు షికారు వెళ్ళడంతో సహా రకరకాల సందర్భాల్లో స్ఫూర్తి అసహనాన్ని, పర్‌ఫెక్షన్ పేరుతో జరిగే హింసనీ తట్టుకోవలసిన మొట్టమొదటి ప్రాణి అతని భార్యే అవుతుంది. రెండు రోజులకే స్ఫూర్తి ప్రవర్తనను నేను తట్టుకోలేక పోతే జీవితాంతం కలిసి ఉండాల్సిన ఆ అమ్మాయి ఏం కావాలి?

మనిషిలోని పర్‌ఫెక్షన్ కన్నా అతనిలోని కంపాషన్ ప్రవర్తనకు నిండుతనాన్ని ఇస్తుందని స్ఫూర్తికి తెలీదా?

అయినా జీవితం ఏమన్నా పర్‌ఫెక్ట్‌గా ఉందా అన్నీ పర్‌ఫెక్ట్‌గా ఉండాలని కోరుకోడానికి?

ఎన్నో నిరాశలు, నిస్పృహల మధ్య తామరాకు మీది నీటి బొట్టులా అంటీ అంటనట్టు గడుపుకొని పోవడమే కదా జీవితం అంటే.

సముద్రమంత ఒంటరి ప్రయాణంలో మన పడవను అనుబంధాల్తో నింపుకోవాలి కానీ ఫిర్యాదులతో కాదు. ఈ చిన్న సూత్రం స్ఫూర్తికి తెలీదా?

స్ఫూర్తి నిజానికి అన్ని రకాలుగా బాగున్నాడు. కానీ చంద్రుడిలోలా చిన్న మచ్చ. దాన్ని అతనికి అద్దంలో చూపించగలిగితే చాలు.

*'విశాలాంధ్ర' అక్టోబరు 2016*

# అదృశ్యం

**మం**చం మీద నుంచీ ఇంకా పూర్తిగా లేవకుండానే ఫోన్. అర్ధరాత్రి పన్నెండు తర్వాత, తెల్లవారు జామున వచ్చే ఫోన్లంటే నాకు కొంచెం బెదురు అవేం వార్తలు మోసుకువస్తాయోనని. ఫోన్ వెంటనే తియ్యకుండా నెంబర్ చూశాను. ప్రకాశం. ప్రకాశం చెప్పింది వినగానే నిద్రమత్తు వదిలిపోయింది. సత్యం  నిన్నటి నుంచీ కనిపించడం లేదంట రాత్రి ఇంటికి కూడా రాలేదంట.

"ఏం చేద్దాం?" ఏం తోచక ప్రకాశాన్నే అడిగాను.

"చేసేదేముంది? అప్పట్లా వెతకడమే."

"కిరణ్మయి ఎలా వుంది?"

"ఫోన్‌లోనే ఏడుస్తోంది. ఇంకెట్లా వుంటుంది?"

"సరే. పది నిముషాల్లో అక్కడుంటా" ఫోన్ పెట్టేశానన్న మాటే కానీ మనసంతా గజిబిజిగా ఉంది. సత్యం గురించిన గజిబిజి. ఏం చేయాలి సత్యాన్ని.

నాలుగు రోజుల కిందట అనుకుంటా సత్యం ఇంటికి వచ్చాడు. వచ్చి ఏం మాట్లాడకుండా అలాగే కూర్చున్నాడు. అప్పుడప్పుడు అలా ఉన్నట్టుండి మౌనంలోకి వెళ్ళిపోవడం సత్యానికి అలవాటే.

"ఏమయింది సత్యం? అలా ఉన్నావేంటి?" అడిగాను.

"మనుషులు ఉన్నకొద్దీ ఎదగాలి కానీ మరుగుజ్జులయిపోతున్నారెందుకు?"

"ఏమయింది?"

"ముందు నేను అడిగిన దానికి సమాధానం చెప్పు?"

ఏం చెప్పను? సత్యం అడిగిన దానికి ఏం తెలుసని  ఏం చెప్పను? అలాంటి ప్రశ్నలకి సమాధానం అయితే మౌనం. లేకపోతే ఏడవలేని నవ్వు.

"ఏమయిందో చెప్పరా? చెబితే కదా తెలిసేది? ఏదైనా చెప్పగలిగేదీ?" అన్నాను.

"ఏం లేదు. ఏదీ సరిగ్గా లేదు. జీవితం, సమాజం ఎక్కడా ఏదీ సరిగ్గా లేదు. ఇంతేలే అని వదిలేయలేకపోతున్నా. అట్లా అని రాజీ పడలేకపోతున్నా. జీవితం ఎందుకుఇట్లా వుంది?" మళ్ళీ ప్రశ్న.

"నువ్వు దేని గురించి అంటున్నావో చెబితే నేను ఏదన్నా చెప్పగలనురా. దేని గురించో ఏంటో తెలియకుండా ఏం చెప్పను? అన్నాను.

ఒక రచయితని కొలవడానికి కొలమానం ఏమిటి చెప్పు? అతని రచనా? అతని కీర్తి ప్రతిష్టలా? లేకపోతే అతని వెనుక ఉన్న హోదా అంతస్తా? అతని వ్యక్తిత్వమా? జ్ఞానమా?" సత్యం అడిగాడు.

"ఇప్పుడు ఇవన్నీ దేనికిరా?"

"ముందు నేను అడిగింది చెప్పరా. రచనని బట్టి రచయితకి గుర్తింపా? రచయితని బట్టి రచనకి గుర్తింపా? ఏది ముందు ఏది వెనుక?" ఇంకో ప్రశ్న.

అసలు సత్యమే ఓ ప్రశ్నల పుట్ట. ప్రశ్నల మీద ప్రశ్నలు బాణాల్లా సంధిస్తుంటాడు. అన్నీ తెలిసిన ప్రశ్నలే. కానీ సమాధానం లేని ప్రశ్నలు. సమాధానం తెలిసీ చెప్పలేని ప్రశ్నలు. రావడం రావడమే ఓ ప్రశ్న వేసి కూర్చుంటాడు. వచ్చాడంటే ఒక ప్రశ్న వచ్చినట్టే. ప్రశ్న తనకో మనకో తెలీదు. సత్యమే ప్రశ్న. ప్రశ్నే సత్యం.

"ఎందుకొచ్చిన ప్రశ్నలు సత్యం. సమాధానం లేని ప్రశ్నలు. ప్రశ్నల సంగతి సరే. ముందు జీవితం సంగతి చూడు" అన్నాను.

"నా ప్రశ్నలే నా జీవితం. నా ప్రశ్నలకు సమాధానం దొరికితే నా జీవితంలోని చిక్కుముడి అదే పోతుంది" అంటూ వెళ్ళిపోయాడు.

ఎందుకు వచ్చాడో, ఏం చెబుదామని వచ్చాడో తనూ చెప్పలేదు. నేనూ అడగలేదు. అడగడానికి అవకాశం కూడా ఇవ్వడు. అన్నీ ప్రశ్నలే. ఒకటికి నాలుగు ప్రశ్నలు. ఎప్పుడు వచ్చినా అంతే."మనుషులు ఎందుకు రాక్షసులవుతున్నారు?" "ఒకరికి దుఃఖం కలిగించేది ఇంకొకరికిసంతోషం ఎందుకుకలిగిస్తోంది?" "ఎందుకు చెడే గెలుస్తోంది?" "అసత్యం సత్యంగా ఎలా చలామణీ అవుతోంది?" "మనిషి మతం, కులం, పార్టీల పేరుతో ఎందుకు కుదించుకుపోతున్నాడు?" ప్రశ్నల మీద ప్రశ్నలు. అన్నీ తవ్వుకుని ఏం లాభం? ఏం సుఖం? ఏ ప్రశ్న వెనుక ఏ సత్యం ఉందో? తవ్వుకుంటూ పోతే ఏ దుఃఖం ఉందో? ఏ అశాంతి ఉందో ఎవరికి తెలుసు? శాంతినిచ్చే అజ్ఞానం గొప్పదా?అశాంతిని ఇచ్చే జ్ఞానం గొప్పదా? సత్యానికి ఏం చెప్పాలి? ఏది చెప్పి ఒప్పించాలి? నీకెందుకు ఇవన్నీ ఎవరికీ అక్కరలేని ప్రశ్నలు అంటే, బతికి ఉన్నా

కదా అంటాడు. అన్నీ "ఎందుకు? ఎందుకు?" అనేదాని చుట్టూ తిరగడమే. ఎందుకు అంటే ఏం చెప్పడం? తెలుసుకుని ఏం ప్రయోజనం?

ఇంతకీ సత్యం ఎక్కడికి వెళ్ళినట్టు? ఆ కనపడని కొండల మాటుకా? నిరంతరం జీవితంతో సంఘర్షించి సంఘర్షించి గెలుపోటములు తట్టుకుని తట్టుకుని తనని, తన ప్రతిభని గుర్తించడానికి నిరాకరించే మనుషులపై, సమాజంపై రోతపుట్టి కనిపించ కుండా పోయాడా?

ఒక మనిషిని గుర్తించడానికి మనుషులు ఎందుకు నిరాకరిస్తారు? తెలియక గుర్తించక పోవడం కాదు. కావాలనే గుర్తించకపోవడం. అసూయతోనా? అలక్ష్యం తోనా?

బతుకులో ఓడిపోయాడు కాబట్టి సత్యం ఈ ప్రశ్నలు వేస్తున్నాడా? బతకలేక ఈ ప్రశ్నలు వేస్తున్నాడా? గెలిచి ఉంటే అందర్లాగే గొర్రెలాగా అయిపోయి ఉండే వాడేమో. ఓడిపోతున్నాడు కాబట్టే ప్రశ్న అయాడేమో?

జీవితంలో విజయం సాధించడం అంటే ఏంటి? ఆస్తులూ అంతస్తులూ సంపాదించడమా? కీర్తి ప్రతిష్టలా? కీర్తి అంటే ఏది కీర్తి? ఇంత విశ్వమానవ కుటుంబంలో నువ్వు కానీ నీ ప్రతిభ కానీ తెలిసేది ఎందరికి? ఓ వందా, నూటయాభై మందికి సంబంధించిందే కీర్తి అనుకోవాలా?

అయినా అన్నిటినీ ప్రశ్నించి ప్రశ్నించి సత్యం ఏం సాధించాడు? ప్రశాంతంగా ఉన్న సరస్సుపై రాళ్ళు వేసి చెల్లా చెదురు చేస్తున్నాడన్న అపఖ్యాతి తప్ప. ఒంటరి ద్వీపంలా నిలువెత్తు ప్రశ్నలా మిగిలిపోవడం తప్ప. అట్లా ప్రశ్నిస్తున్నందుకే ప్రపంచం తన చుట్టూ గోడ కట్టుకుంది. సత్యాన్ని గోడ అవతల ఉంచింది.

ఎందుకు సత్యం అందర్లా ఉండలేకపోతున్నాడు? ఏం కావాలి సత్యానికి? ఎందుకు పెనుగులాడుతున్నాడు జీవితంతో. మేం అందరం బతికేయడంలా బతుకుతో రాజీ పడిపోయి. అబద్ధపు మోహాలు తగిలించుకుని అంతా బాగానే ఉందని నమ్ముతూ నమ్మించుకుంటూ ఆనందంగా బతికేయడంలా? వాడికే ఎందుకు ఈ ప్రశ్నలన్నీ? సమాజం ఎట్లా ఉంటే వాడికి ఏం పోయింది? ప్రశ్నలేసి సమాధానాలు అడిగి రాబట్టుకుని ఏం చేస్తాడు? ఆలోచనల్లో పడి ప్రకాశం ఇల్లు రావడాన్ని కూడా గమనించలేదు. ప్రకాశం కంగారుగా వరండాలో పచార్లు చేస్తున్నాడు. నన్ను చూడగానే గబగబా ఎదురు వచ్చి గేటు తీశాడు.

"ముందు ప్రభాకర్ దగ్గరికి వెళదాం. వాడి దగ్గరికి వెళ్ళొస్తానని చెప్పే నిన్న

ఇంటి నుంచీ బయలుదేరాడట" ప్రకాశం చెప్పాడు. వెంటనే ప్రభా ఇంటికి బయలు దేరాం.

"కిరణ్మయితో ఏమన్నా గొడవ పడ్డాడా?" దారిలో ప్రకాశాన్ని అడిగాను.

"అలాంటిదేం లేదు. ఉంటే కిరణ్మయి చెప్పేదేగా?" ప్రకాశం చెప్పాడు.

మేం వెళ్ళేటప్పటికి ప్రభాకర్ మా కోసమే ఎదురుచూస్తున్నాడు. మొహం వాడిపోయి ఉంది.

"సత్యం నిన్న పొద్దున తొమ్మిదింటికి వచ్చాడు. ఎందుకో అశాంతిగా గజిబిజిగా ఉన్నాడు. టీ ఇవ్వబోతే వద్దన్నాడు. ఒక్క ప్రశ్నకు సమాధానంచెప్పు వెళ్ళిపోతా అన్నాడు. మొహం పీక్కుపోయి కళ్ళు ఎర్రగా లోతుకుపోయి ఏంటోగా వున్నాడు" అడక్కుండానే ప్రభాకర్ చెప్పాడు.

"ఏం అడిగాడు?" నేనూ ప్రకాశం ఒక్కసారే అడిగాం.

"ఏంటో అశాంతిగా అనీజీగాఉందిరా. మనశ్శాంతి లేకుండా పోతోంది. ప్రశ్నించి అశాంతిని తెచ్చుకోవడం జ్ఞానమా? ప్రశ్నించకుండా శాంతితో జీవించడం జ్ఞానమా?" అని అడిగాడు.

"నువ్వేం చెప్పావ్?"

"నేనేం చెబుతాను? చెప్పడానికి ఏం ఉందని? వాడి సంగతి, వాడి ప్రశ్నల సంగతి తెలియంది ఏముంది? కాసేపు అలాగే కూర్చుని ప్రసాద్ దగ్గరికి వెళ్ళొస్తా అని వెళ్ళిపోయాడు. ప్రసాద్ కూడా ఇప్పుడు ఇక్కడికి వస్తున్నాడు. మీరొస్తున్నారని వాడినీ ఇక్కడికే రమ్మన్నాను" ప్రభా చెప్పాడు.

ఇంతకీ సత్యం ఏమైనట్టు? ఎక్కడికి వెళ్ళినట్టు?

ఇప్పటికిది రెండోసారి. ఆర్నెల్ల కిందట ఇలాగే అదృశ్యం అయిపోయాడు. తెలిసిన చోట్లా తెలియని చోట్లా వెతికి వెతికి చివరికి పట్టుకున్నాం. ఊరికి ఇరవై మైళ్ళ దూరంలో ఓ కొండరాయిపై పడుకుని కనిపించాడు. అంతకు ముందు అందరం కలిసి అక్కడికి చాలాసార్లు వెళ్ళాం. పచ్చటి కొండల వరస, వాటిని ఆవరించి ఉన్న పచ్చని చెట్ల సమూహం, కొండకొమ్ముపై నుంచీ తెల్లగా పాలనురుగులా జారే నీటిధార. చీకటి వెలుగులు దోబూచులాడే ఆ మార్మిక ప్రపంచంలో చెట్టుకింద ఓ బండరాయి మీద కళ్ళు మూసుకుని ధ్యానంలో ఉన్న బుద్ధుడిలా ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. ఇంటికి రమ్మంటే రానన్నాడు. అతి కష్టమ్మీద నచ్చచెప్పి ఇంటికి తీసుకు వచ్చాం. ఉన్నట్టే ఉన్నాడు. ఇప్పుడు మళ్ళీ ఈ వార్త.

కాసేపట్లో ప్రసాద్ కూడా వచ్చేశాడు, మొహం వేలాడేసుకుని. సత్యం అంటే వాడికి ప్రాణం. వాడికి ఒక్కడికేనా?

"ఏరా ప్రసాద్. సత్యం ప్రభాకర్ వాళ్ళ ఇంటి నుంచీ మీ ఇంటికి వచ్చాడంటగా. ఏమన్నా తేడాగా ఉన్నాడా?"

"ఎంత వచ్చినట్టే వచ్చి వెళ్ళిపోయాడు. ఏంటో కంగారు కంగారుగా ఉన్నాడు. అంతా కలిపి పది నిముషాలు కూడా లేదు. టిఫిన్ చెయ్యమంటే 'చేసి వచ్చాను ఆకల్లేదు' అన్నాడు. ఉన్నట్టుండి "దుర్మార్గం ఇలా గెలుస్తూపోతే మనిషి ఏ ఆశతో బతుకుతాడు?" అని అడిగాడు. వాడి ప్రశ్నలకు ఎప్పుడు సరైన సమాధానం ఉంటుంది కనుక. నేను చెప్పలేనన్నాను. "సరే. నేను వెళ్తున్నాను. నేను ఆపనిలోనే ఉన్నాను. నా ప్రశ్నలన్నింటికీ సమాధానం కనుక్కువస్తాను" అంటూ వెళ్ళిపోయాడురా. ఎప్పుడూ అనేమాటలే కదా అని నేనూ అంతగా పట్టించుకోలేదు" ప్రసాద్ గొంతులో దిగులు.

ప్రశ్నలకు సమాధానం కనుక్కు వస్తానని సత్యం ఎక్కడికి వెళ్ళినట్టు? కంటికి కనబడే లోకంలో ప్రశ్నలకు సమాధానాలు దొరక్క సమాధానం వెతుకుతూ కనపడని లోకానికి వెళ్ళిపోయాడా?

అన్నట్టు మొన్నా మధ్య ఓరోజు సత్యం నా దగ్గరకి వచ్చాడురా. "ఏంటి సత్యం" అన్నాను. కాసేపు మౌనంగా కూర్చుని "నాకు ఒకటి అనిపిస్తోంది. అవునో కాదో చెప్పు" అన్నాడు. ఏంటని అడిగాను. "ఇన్నాళ్ళూ ఇంట్లో వాళ్ళు, బైట వాళ్ళకన్నా నేను పైస్థాయిలో ఉన్నాననుకునేవాడిని. వాళ్ళు తేడాగా ఉన్నారు. నేను సరిగ్గా ఉన్నానని అనుకునే వాడిని. ఇప్పుడిప్పుడే నాకో సందేహం వస్తోంది. నేనే తేడానేమో, వాళ్ళే సరిగ్గా ఉన్నారేమో అనిపిస్తోంది. నిజమేనంటావా?" అన్నాడు. ఏం అంటే ఏం అనుకుంటాడో అని నేనేం చెప్పలేదు. ఎందుకలాంటి పిచ్చి ప్రశ్నలన్నీ అడుగుతావని కోప్పడ్డాను. మొత్తానికి ఏదో గందర గోళంలో ఉన్నాడు" ప్రకాశం చెప్పాడు.

"ఏం గందరగోళం? ఎన్నాళ్ళని గందరగోళంలో ఉంటాడు. తన పక్కనున్న వాళ్ళందరినీ ఉంచుతాడు? ఏం ప్రశ్నలు. దిక్కుమాలిన ప్రశ్నలు. మనిషిని కుదురుగా నిలబడనివ్వని ప్రశ్నలు ఎందుకు? అదేంటంటే ప్రశ్నే జ్ఞానం కదా అంటాడు. జీవితాన్ని కొంత చూశాడు కదా ఇక నన్నా నేర్చుకుంటాడులే, ప్రశ్నలు వేయడం మానుకుంటాడులే అనుకుంటా. కానీ మానడు. ప్రశ్నించకపోతే ఎలా? బతకడం అంటే దేన్నయినా ప్రశ్నించడమేగా అంటాడు" ప్రభా అందుకున్నాడు.

నిజానికి ఇవన్నీ సత్యం ఒక్కడి ప్రశ్నలేనా? ఎవరికీ అలాంటి ప్రశ్నల్లేవా? ఎవరికీ ఎలాంటి సందేహాల్లేవా? ఉన్నా అందరూ మొద్దుబారిపోయారు. ఇంకా ఇంకా మొద్దుబారిపోతున్నారు. ఏం చేయలేక కొంతా, రాజీపడిపోయి కొంతా, సత్యం అలా రాజీపడలేక పోతున్నాడు. అతని అంతరాత్మ ఏదో దీనికి ఎదురుతిరుగుతోంది. సత్యంలో బాల్యం ఇంకా బతికే ఉంది. దాని తాలూకూ అమాయకత్వం, స్పందనలూ కూడా ఇంకా బతికే ఉన్నాయి. అందుకే ఈ ఘర్షణ. ఈ అస్థిమితత్వం.

ఏం చెప్పి సత్యాన్ని మామూలు మనుషుల్లో పడేయాలి? ఏం చెబితే కన్విన్స్ అవుతాడు? అతని జ్ఞానాన్ని అజ్ఞానం అనాలా? అజ్ఞానమే జ్ఞానం అని చెప్పాలా? ప్రశ్నించకపోవడమే బతకడానికి సరైన పద్ధతి అని చెప్పాలా? సత్యమే ఓ ప్రశ్న అనుకుంటే సత్యం చుట్టూరా కూడా అన్నీ ప్రశ్నలే. ఏది ఏమైనా సత్యం కూడా బతుకుతో రాజీపడాలి. లేకపోతే పిచ్చివాడైపోవడం ఖాయం.

ఒక మంచి రచయితని, సత్యాన్వేషకుడిని కాపాడుకోలేని సమాజం ఏం సమాజం? మనుషులు ఏం మనుషులు? ఈ మనుషుల కోసమేగా సత్యం ఇంతకాలం తపన పడింది. ఇన్నాళ్ళూ సత్యాన్ని ఎవరూ పట్టించుకోలేదు. సత్యం కనిపించడం లేదని రేపు ఒక్కవార్త వచ్చిందంటే చాలు సత్యం రాత్రికి రాత్రి గొప్పవాడై పోతాడు. బతికి ఉంటే పట్టించుకోరు. చచ్చిపోతే బ్రహ్మరథం పడతారు. ఒక్కసారి పోగొట్టుకుంటే మళ్ళీ సత్యం ఎక్కడినుంచీ వస్తాడు?

సత్యం కోసం మళ్ళీ గాలింపు. కనబడిన చెట్టూ పుట్టా ఎక్కడా సత్యం జాడలేదు. కొండకొమ్మున ఉన్న ఆ చెట్టు నిశ్చలంగా తపస్సు చేసుకుంటున్నట్టు మౌనంగా వుంది. చెట్టు అట్లాగే ఉంది. చెట్టుకింద ఉంటాడనుకున్న సత్యమే లేడు. మూడు రోజులుగా ఎవరికీ నిద్రాహారాలు లేవు. అడుగేస్తే ఎక్కడ కిందపడిపోతామో అన్నట్టు వుంది.

నలుగురం చెట్టుకింద బండమీదకి చేరి అడ్డంగా పడిపోయాం. బండల మీది నుంచీ లేవనివ్వని నిస్సత్తువ. అందరం అన్ని రకాలుగా అలసిపోయాం.

"అవును. అసలు సత్యాన్ని వెతకడం అవసరం అంటావా?" ప్రకాశం ఉన్నట్టుండి అడిగాడు.

తలకింద చేతులుపెట్టుకుని పడుకుని ఆకాశం వంక చూస్తున్న నేను ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. ఒక్క నిముషం పాటు ఏం విన్నానో కూడా అర్థం కాలేదు. అసలు అలాంటి ప్రశ్న ఒకటి వస్తుందని నేను ఊహించలేదు.

"ఏంటీ" ఆశ్చర్యంగా అడిగాను.

ప్రభాకర్, ప్రసాద్ మౌనంగా మా ఇద్దరివంకే చూస్తున్నారు.

"అహ. కాదు. నువ్వు కూడా ఆలోచించు" ఎటో చూస్తూ ప్రకాశం మళ్ళీ అన్నాడు.

ఏం ఆలోచించను? ఆలోచించడానికి ఏం మిగిల్చాడు సత్యం అన్నీ ప్రశ్నలు తప్ప. ప్రకాశం అన్నది కూడా ఒక రకంగా నిజమేనేమో. ఊరికే అన్నీ కెలికి అన్నిటినీ చెల్లా చెదురు చేసి ఉన్న సుఖాన్ని కూడా పోగొట్టేవాడు ఎవరికైనా ఎందుకు?

అవన్నీ ఎవరికీ తెలియని ప్రశ్నలా? తెలియని సమాధానాలా? నువ్వు బతుకుతున్నావా? లేదా? అవసరమైతే అవతలివాడిని ముంచి అయినా నువ్వు బతగ్గలవా లేదా? మనసులో తిట్టుకుంటున్నా ముఖానికి చిరునవ్వు పులుముకో గలవా లేదా? గొర్రెలాగా తలవంచుకుని ఎవరు ఎలాపోతే నాకేంటి? నేను బాగుంటే అంతేచాలు అనుకోగలవా లేదా? ఇదేకదా బతికే పద్ధతి. మనిషిని బతికించే పద్ధతి. ఈ మాత్రం తెలియకుండానే అందరూ బతికేస్తున్నారా?

పక్కలో కుంపటిని పెట్టుకుని ఎవరన్నా ప్రశాంతంగా పడుకోగలరా? ఎన్నో చికాకులు, సంక్షోభాలు, అలజడుల మధ్య పట్టీ పట్టని కునుకులాంటిది జీవితం. జోకొట్టేవాడు కావాలి కానీ ఆకాస్త కునుకునీ చెడగొట్టే పీడకల లాంటివాడు ఎవరికి మాత్రం ఎందుకు?

"సత్యాన్ని వెతికి పట్టుకోవడం కష్టం. సత్యం తనంతట తనే సాక్షాత్కారం అవ్వాలి తప్ప ఇలా వెతికిపట్టుకోలేం. సత్యమూ కనిపించడు. సత్యమూ కనిపించదు" ప్రభాకర్ గొంతులో నిస్పృహ.

"కనిపిస్తే గనక మాత్రం సత్యాన్ని ఏం చేసుకుంటాం? పడవలో బరువెక్కువైతే సరంగు ఏం చేస్తాడు? అనవసరమైన బరువుని వదుల్చుకుంటాడు. సత్యం అలాంటివాడే" ప్రకాశం అన్నాడు.

దూరం నుంచీ ఏదో దేవుడి ఊరేగింపు దగ్గర పడుతోంది. ఒకటే కోలాహలం. బూతు సినిమాపాట బాణీలో కట్టిన భక్తిగీతం ఊపుకి జనం చిందులు. ఊరు ఊరంతా భక్తితో ఊగుతోంది. మత్తులో జోగుతోంది. ఊరేగింపు అనంతరం స్వామి పరమానంద ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందని, భక్తులు అందరూ తప్పకుండా విచ్చేసి స్వామి ప్రవచనాలు విని తరించాలని మైకులు ఒకటే హోరు పెడుతున్నాయి.

ఊరేగింపు చూసి నవ్వొచ్చింది. ఒకప్పుడు ప్రజలు పండగలు చేసుకునేవాళ్ళు. ప్రభుత్వాలు వాటిపని అవి చేసుకునేవి. ఇప్పుడు ప్రభుత్వాలు పండగలు చేసుకుంటున్నాయి. ప్రజలు వాళ్ళ పని వాళ్ళు చేసుకుంటున్నారు. ఎందుకో సత్యం గుర్తు

కొచ్చాడు. "మతమూ, కర్మసిద్ధాంతం ప్రజల్ని జోకొట్టకపోతే ప్రభుత్వాలు ఏమైపోయే వంటావ్?" అన్నాడోసారి. సత్యం లేదులేదు అనుకుంటున్నాం. నిజానికి సత్యం ఎక్కడ లేదు? సత్యంలాంటి వాడు లేకుండా ఎలా?

"చందమామ మన చేతికి అందకపోతే ఆ లోపం చందమామదా?" ప్రసాద్ ప్రకాశం వంక సూటిగా చూశాడు.

ప్రకాశం మౌనంగా ఉండిపోయాడు. నేను ప్రసాద్ వంక చూసి చిన్నగా నవ్వాను. అందరం మొహాలు చూసుకున్నాం. అందరి మొహాల్లో ఏదో తెలియని రిలీఫ్.

"సత్యంకోసం ఏం వెతకక్కర్లేదు. పదండిపోదాం. సత్యం తనంతట తనే వస్తాడు" ప్రసాద్ లేచి నిలబడ్డాడు.

నిజమే. సత్యం ప్రశ్నగా వెళ్ళాడు. సమాధానమై తిరిగి వస్తాడు. నలుగురం మౌనంగా కొండ దిగడం మొదలెట్టాం.

*'ఆంధ్రజ్యోతి' 6 నవంబరు 2016*

# కళాకారుడు

**ఆ** ఫోన్‌కాల్ వచ్చినప్పటి నుంచీ అసూయతో, ఆందోళనతో, రోషంతో, కోపంతో మనసంతా భగ్గున మండిపోతోంది. వళ్ళంతా మే నెల ఎండల్లో మగ్గినట్టు సలసలా కాగిపోతోంది. నిన్న మొన్నటి వరకూ మనలో ఒకడిగా మనతో సమానంగా ఇంకా మరీ చెప్పాలంటే మరికాస్త తక్కువ సమానంగా ఉన్నవాడు రాత్రికి రాత్రి ప్రముఖుడైపోతే, ఎక్కడ చూసినా మాట్లాడుకోదగిన వార్తల్లో వ్యక్తి అయిపోతే ఎంత దుఃఖం, ఎంత బాధ? ఎంత హింస? ఆ బాధ అనుభవించితే తప్ప ఒకరు చెబితే తెలిసేది కాదు. అర్థమయేది కాదు.

ఆ వార్త విన్నప్పటినుంచీ మనసు ఎంత క్షోభిస్తోందో నాకు తప్ప ఎవరికి తెలుసు? నిన్న మొన్నటి దాకా భుజం భుజం కలిపి భుజాలపై చేతులేసి నడిచిన మనిషి భుజం ఒక్కసారిగా మనకు అందనంత ఎత్తుగా అయిపోతే ఎంత నరకం? ఎంత అశాంతి? ఎంత చిత్రవధ.

నెలరోజుల కష్టం. నెల రోజుల హోం వర్కు అంతా అన్నీ వృధాయేనా? ఎవడైనా కోడి కెలికినట్టు గీతలు గీసినంత మాత్రాన ఆర్టిస్టయిపోతాడా? ఏం గీశాడో దేని గురించి గీశాడో తెలియనంత మాత్రాన గొప్పవాడైపోతాడా? దేని గురించి గీశాడో అర్థం కాకపోతే అదే గొప్పట. అర్థమైపోతే అందులో ఏం గొప్పలేదట.

అసలు ఏ కళాకారుడన్నా తనకన్నా తనతోటి కళాకారుడు గొప్పవాడని ఒప్పుకుంటాడా? అట్లా ఒప్పుకుంటే అతను అసలు కళాకారుడవుతాడా? తనకన్నా గొప్పవాడు ఇంకొకడున్నాడనుకుంటే ఏ కళ నన్నా సృష్టించగలుగుతాడా? నన్ను మించిన జ్ఞాని లేడనుకుంటేనే కదా నా ప్రాణం సుఖంగా ఉండేది? ఆత్మకు తృప్తి కలిగేది. ఆ తృప్తి నుంచే కదా ఎదుటివాళ్ళకు ఏదైనా చెప్పగలిగేది. చెయ్యగలిగేది.

నాదేముంది ఆఫ్ట్రాల్ అనుకుంటే ఏదన్నా రాయగలరా? గీయగలరా? కలం కానీ కుంచె కానీ కదపగలరా?

అరగంట కిందట ఫోన్ చేసినప్పుడు కూడా “కమిటీ అంతా మనకే ఫేవర్‌గా ఉంది. నీ పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. ఒకటి రెండు స్థానాల్లో అటూ ఇటూ మారుతోంది” అన్నాడు.

అబ్బ! ఎంత ఆనందం వేసిందని. ఊరుకున్న వాడిని ఊరుకున్నట్టన్నా ఉన్నాను కాదు. టపటపా ఫోన్లుచేసి అటు తరపు వాళ్ళకీ ఇటుతరపు వాళ్ళకీ మనకే బహుమతి వస్తున్నట్టు టముకు కొట్టుకున్నానయ్యే. మనల్ని మించిన వాడు లేడని ఇప్పటికన్నా గుర్తించారని ఆనందంగా నిట్టూర్చానయ్యే. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకునేది?

అయినా ప్రపంచంలో ఎక్కడన్నా నీతీ, నిజాయితీ ఏడిసిందా? మనుషులకి ఎక్కడన్నా న్యాయం, ధర్మం ఏడిసిందా? గంట గంటకీ నిముష నిముషానికీ రంగులు మార్చుకునే వాళ్ళు ఎక్కడన్నా మనుషులవుతారా? గంటకిందట ఔనన్న మనిషి గంట తర్వాత కాదన్నాడంటే ఏం చేస్తే ఏం చేయకపోతే కాదంటాడు?

వాడు ఆ బవిరి గెడ్డం గాడు ఆకలి గురించి మార్మికంగా చెప్పాడంట. ఆకలి అన్నట్టు కాకుండా ఎరుపు రంగులద్ది  పసుపురంగులద్ది నలుపురంగులద్ది మానవ జీవితంలోని చీకటి విషాదాల్ని వాళ్ళ ముందు బొక్కబోర్లా పడేయించాడంట. త్రాష్టపు వెధవ ఐదు నక్షత్రాల హోటల్లో కూర్చుని బీర్లు తాగుతూ బిర్యానీలు తింటూ బొమ్మలేసి ఆకలికి గొప్పగా రంగులద్దగలిగాడంట. అసలు వాడికి ఆకలి అంటే ఏంటో తెలుసా? ఆకలి ఎంత ఎర్రగా ఎంత నల్లగా ఎంత నరకంగా ఎంత ఆకలిగా ఉంటుందో వాడికి తెలుసా?

నాకు తెలుసు. నేను ఐదొందలు ఇస్తానని ఆశపెట్టి ఇంటికి పట్టుకొచ్చిన ఆ ముష్టివాడికి తెలుసు. ఇప్పటి హీరోలు కష్టపడి కసరత్తులు చేసి సాధించిన సిక్స్‌ప్యాకుల్ని సహజసిద్ధంగా అమర్చుకుని బొయికల బొమ్మలా ఎంత సహజంగా ఉన్నాడువాడు. కళ్ళల్లో నుంచీ ప్రాణాలు పోతున్న వాడిలా ఎంత సజీవ ఆకలి చిత్రంలా ఉన్నాడు వాడు.

రెండు రోజులు కదలకుండా కూర్చుంటే ఐదొందలిస్తానంటే వాడి కళ్ళల్లో ఎంత ఆశ? ఎండి ఎండి చిక్కి చిక్కి అస్థిపంజరంలా ఉన్న వాడి శరీరంలో ఎంత ఆకలి కళ? ఎంత డబ్బు పోస్తే వస్తుంది అంత కళ? అన్నంతిని ఐదురోజులయిందట. అందుకే ఆ కళ.

ఆ కళ కోసం కదూ వాడు కాస్త అన్నం పెట్టమన్నా పెట్టంది? గుక్కెడు మజ్జిగ పోయమన్నా పోయంది. ఏదన్నా తిని ప్రాణం కాస్త తేరుకుంటే ఇంక మొహంలో ఆ కళ ఎందుకుంటుంది? వాడి ఆకలి తీర్చి ఆ సహజమైన ఆకలి కళ పోగొట్టడానికి తనేమన్నా పిచ్చివాడా? మూర్ఖుడా?

అట్లా అయితే పైసా ఇవ్వనన్నాను. ఏం తినకుండా తాగకుండా రెండు రోజులు కూర్చోగలిగితేనే ఐదొందలిస్తానంటే కదా వాడు ఒప్పుకుంది. ఏం ఐదొందలంటే ఏమన్నా తక్కువగా ఉన్నాయా? వాడి జన్మలో వాడు కళ్ళజూసి ఉంటాడా ఐదొందలు? పోనీ తనేమన్నా బలవంతం చేశాడా? ఇష్టమైతే ఉండు లేకపోతే లేదు అన్నాడు. వాడికి ఇష్టమై ఐదొందల మీద ఆశతోనే కదా ఒప్పుకున్నాడు.

అప్పుడు వాడి కళ్ళల్లో నీరసం ఎంత అందంగా ప్రతిఫలించిందని? శోష వచ్చి పడిపోయేలా ఉన్న మొహం, మూతలు పడిపోతున్న కళ్ళు ఎంత చక్కగా అమరి పోయాయని. అప్పుడు కదా తన కుంచె కదిలింది. వాడి ఆకలి బాధని సజీవంగా పట్టుకోగలిగింది. ఎండిపోయిన వాడి డొక్కల్ని ఎముక ఎముకనీ దొంతరలు దొంతరలుగా పట్టుకోగలిగిందీ?

అదేమన్నా తను సరదాకి చేశాడా? పనిలేక చేశాడా? కళ కోసమేగా? ఆకలి బాధ ఎలా ఉంటుందనేది ప్రపంచానికి చూపించడం కోసమేగా పగలు గడిచి రాత్రి అయ్యాక అడిగాడు వాడు ఇప్పుడన్నా ఏమన్నా పెట్టించండయ్యా. అయిదు రోజుల నుంచీ ఒక్క మెతుకు కూడా ముట్టలేదని. రాత్రికి కడుపునిండా తిని గుర్రు పెట్టి నిద్రపోతే పొద్దుటికి ఆకలి కళ ఎట్లా ఉంటుంది? తేటపడిన మొహం వాడు తనకెందుకూ?

ఆకలితో ఉన్న వాడికి పేగు పేగూ మెలితిప్పి పొట్ట లుంగలు చుట్టుకుపోయి నరనరాల్లో నీరసం నిస్సత్తువ నిండిపోయి ఒళ్ళూ కళ్ళూ కాళ్ళూ గాలిలో తేలిపోయినట్టు అయిపోయి ప్రాణం కడగట్టినట్టు అనిపిస్తుంది తప్ప నిద్ర ఎక్కడ పడుతుంది? నిద్ర పోకపోతేనే కదా మొహం పీక్కుపోయి ముడతలు ముడతలుగా పడేది? అట్లాంటి ముడతలే కదా రేఖల్లో చిక్కేది? వాడూ శుభ్రంగా తిని నిద్రపోయి నేనూ శుభ్రంగా తిని నిద్రపోతే ఇంక కళని ఎవరు బతికిస్తారు? అందుకు కదూ వాడికి ఏదన్నా పెట్టడానికి తను ససేమిరా అంది.

అయినా ఎంత లేకి వాడు కాకపోతే ఎంత మాట మీద నిలకడలేనివాడు కాకపోతే కడుపు పట్టుకుని లుంగలు తిరిగి పోతూ ఆకలి ఆకలి అని ఏడుస్తాడా? ఆ మాత్రం

నిగ్రహించుకోలేదూ? రెండు రోజులు ఏమీ తినకుండా తాగకుండా ఉండాలనే కదా అగ్రిమెంటు? మాటమీద నిలబడలేరు కనుకే వెధవలు అంత దరిద్రంలో మగ్గేది.

ముందంతా సరేనని ఒప్పుకుని బొమ్మ మూడొంతులు అయ్యాక దరిద్రుడు స్పృహతప్పి పడిపోతాడా? ఒక్క రెండు గంటలు ఓర్చుకోలేదూ వెధవ. రెండు గంటలు ఓర్చుకుంటే ఐదువందలు చేతుల్లో పడిపోయేవే కదా. ఓర్పులేని వెధవలు. అందుకు కదూ లక్ష్మీదేవి ఆ వెధవల వద్దకు పోనిది?

అక్కడికీ మొహం మీద కొంచెం నీళ్ళు చిలకరించాడు వెధవని లేపి కూర్చోపెట్ట డానికి. కళ్ళు తెరిచి దాహమన్నట్టు సైగలు. ఇంత బతుకూ బతికి ఇంటెనక చచ్చినట్టు రెండురోజుల్నుంచీ నిద్రాహారాలు మాని బొమ్మ గీస్తున్నది వాడికి మంచినీళ్ళు ఇచ్చి బ్రహ్మాండంగా వస్తున్న బొమ్మను చెడగొట్టుకోడానికా? సజీవంగా, కంటతడి పెట్టించేలా ఒక కళాకారుడికి జీవనసాఫల్యాన్ని అందించే బొమ్మ ఎక్కువా? ఒక అడుక్కునే వాడి ఆకలి ఎక్కువా? వాడికి ఆకలి ఏమన్నా కొత్తా? లేచి కూర్చోమంటే కూర్చోడే వెధవ.

కళ్ళమ్మట నీళ్ళు కారిపోతున్నాయి. డొక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి. ఎగశ్వాస దిగశ్వాసగా అయిపోయాడు. వెధవ కొంపదీసి చచ్చిపోడు కదా అనిపించింది. మొహంలో చావుకళ ఎంత అద్భుతంగా ఉందని. చకచకా బొమ్మ వేయడం మొదలు పెట్టాడు గానీ అప్పుడు వచ్చింది ఆ ఆలోచన. వాడికి ఏదన్నా అయితే బొమ్మ సంగతి దేవుడెరుగు. వాడిని ఎలా వదుల్చుకోవాలి అని.

కొంచెం కొంచెంగా వేడి పాలు పోసేటప్పటికి కాసేపటికి కళ్ళు తెరిచాడు వెధవ. ఆ కాసిని పాలచుక్కలకే మొహం తేటపడింది. ఇంకెందుకు పనికి వస్తుంది ఆ వెధవ మొహం?

చేతిలో వందరూపాయలు పెట్టి వెళ్ళమంటే ఎంత ఛీత్కారంగా చూశాడు? ఐదొందలు ఇస్తానన్నారు కదా బాబయ్యా అంటాడు. తానేదో మాటమీద నిలబడనట్టు. వాడు నిలబడ్డాడా మాటమీద? ఇంకా బొమ్మ పూర్తి కానిదే? తను మళ్ళీ ఇంకొకడిని వెతుక్కోవద్దూ? వాడికీ డబ్బులివ్వొద్దూ?

అసలు నా మంచితనమే ఇంతపని చేసింది. ఎంత అద్భుతమైన దృశ్యం? అంత అద్భుతమైన దృశ్యం నాకు మళ్ళీ కంటికి కనిపిస్తుందా? శరీరంలోని అన్ని అవయవా ల్లోంచీ ప్రాణం కొంచెం కొంచెంగా వెళ్ళిపోతుంటే ఎలా ఉంటుందో సజీవంగా చిత్రించగలిగే అవకాశాన్ని చేతులారా పాడుచేసుకున్నాడు. అప్పుడు వాడి బొమ్మగీసి 'మరణ సమయంలో' అని క్యాప్షన్ పెట్టి ఏదన్నా పోటీకి పంపితే అవార్డు తన్నుకుంటూ

వచ్చేది కాదూ? వాడు పోతే పోయాడనుకుని బొమ్మ పూర్తి చేసుకోకుండా మంచితనానికి పోయి వాడి నోట్లో నాలుగు పాలచుక్కలు పోసినందుకు నాకీ శాస్తి కావలసిందే?

ఒక ప్రపంచ ప్రఖ్యాతి చెందే కళాఖండాన్ని చిత్రించే అవకాశాన్ని పోగొట్టుకుని వాడి ప్రాణాన్ని నిలబెట్టాను. నాకు ఆ రకంగా ఎంత నష్టం? ఆ మాత్రం విశ్వాసం లేకుండా వెధవ ఎలాంటి చూపు చూశాడు? అయినా వెధవ. వాడి ప్రాణం కూడా ఒక ప్రాణమేనా? ఇవాళ కాకపోతే రేపైనా పోయే ప్రాణమేగా? వాడేమన్నా తనలా సృష్టికి ప్రతిసృష్టి చేయగలిగిన అద్భుత చిత్రకారుడా? దేనికైనా ప్రాణప్రతిష్ట చేయగలిగిన కళాకారుడా? బస్టాండు దగ్గర కూర్చుని వచ్చే పోయే వాళ్ళని అడుక్కునే ఓ ముష్టివాడు. అలాంటి వాడు బతికి ఉద్ధరించేది ఏంటి? చచ్చి ఉద్ధరించనిది ఏంటి? అనవసరంగా ఒక కళాఖండంగా మారిపోయే అవకాశాన్ని పోగొట్టుకున్నాడు కదా. వెధవకి ఆ శాస్తి చాలదూ?

చివరకు ఇంకో ముష్టివాడ్ని వెతికి పట్టుకుని ఆ బొమ్మ ముగించడానికి తాతలు దిగి వచ్చారు. ఈసారి దొరికిన వాడు పాతికేళ్ళవాడు. ముసలివాడి సహజ సిద్ధమైన ప్రేతకళ వీడికి ఎక్కడ వస్తుంది? అడుక్కునే వాడైనా దున్నపోతులా ఎలా ఉన్నాడనీ వెధవ? నాలుగు రోజులు తిండిపెట్టకుండా ఎండబెడితే కానీ ఆ మాత్రపు ఆకలి కళ రాలేదు వెధవ మొహంలో.

అంత తిప్పలుపడి అహోరాత్రాలు కష్టపడి వేసిన బొమ్మలో ఆకలి కళ కనిపించ లేదంట ఆ జడ్జీలకి. ఆకాశం మీదకి ఎరుపు రంగూ పసుపు రంగూ కలిపి పేడ నీళ్ళు చిమ్మినట్టు చిమ్మితే అందులో బ్రహ్మాండంగా ఆకలి కేకలు కళాత్మకంగా కనిపించాయట. వినిపించాయట. దానికే బహుమతి రావచ్చుట.

మీరే చెప్పండి ఇదేమన్నా న్యాయంగా ఉందా? ధర్మంగా ఉందా? లోకంలో ఎక్కడన్నా నీతీ, నిజాయితీ, జాలీ దయా మిగిలున్నాయా?

*'నవ్యాంధ్ర' ఫిబ్రవరి 2017*

# నాలుగో తరం

ఇంటిముందు ఆటోదిగి గేటు తీసుకుని లోపలికి వచ్చింది లలిత. ఎప్పట్లానే తాళంకప్ప ఆమెని పలకరించింది. దాన్ని చూసి నిర్లిప్తంగా నవ్వుకుంది. రెండువేల నూట రెండోసారో, నాలుగువేల రెండొందల ఒకటోసారో తాళం తీయడానికి ఆమె తాళపు చెవిని బ్యాగులోనుంచి తీసింది. “మల్లెపూలు రెండు మూరలు తీసుకోనా?” పక్కింటాయన గుమ్మంలో నిలబడి వాళ్ళ ఆవిడని అడుగుతున్నాడు. నిన్న ఇదే టైముకి ఇదే పక్కింటాయన ఏదో పని సరిగా చేయలేదని ఆవిడని పట్టుకుని తిడుతున్నాడు. రాజకీయాల్లోలాగానే పెళ్ళిళ్ళలో కూడా శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరేమో అనుకుంది లలిత.

లోపల టీపాయ్‌మీద పేపర్లూ, మేగజైన్లూ చెల్లాచెదురుగా పరిచి ఉన్నాయి. హాల్లో కుర్చీమీద తడి టవలు ఆరేసి ఉంది. డైనింగ్ టేబుల్ మీద సగం తిని వదిలేసిన పళ్ళెం, మూతల్లేని నేతిగిన్నె, పచ్చడిసీసా చూసి ఆమె ప్రాణం ఉసూరుమంది. టవలు బైట ఆరేసి, పళ్ళెం తీసి సింకులో వేసింది. తిన్న తర్వాత గిన్నెలు మూతపెట్టమని ఏమన్నా మిగిలితే ఫ్రిజ్‌లో పెడితే రాత్రికి వేసుకోవచ్చని సాగర్‌కి చెప్పీ చెప్పీ విసుగొచ్చి వదిలేసింది.

వంటింట్లోకి వెళ్ళి గ్లాసుమీద గ్లాసు రెండు గ్లాసుల మంచినీళ్ళు తాగి టీకి నీళ్ళు పడేసింది. లలిత పనిచేసే స్కూల్లో బాత్‌రూమ్‌లు సరిగ్గా ఉండవు. దాన్లోకి వెళితే వాంతి వచ్చినంత పనవుతుంది. అందుకే స్కూల్లో ఉన్నంతసేపూ లలిత మంచి నీళ్ళు తాగదు. దాహం అనిపించినప్పుడు గుక్కెడు నీళ్ళతో గొంతు తడుపుకుంటుంది. ఇంట్లో ఉన్నప్పుడు ఆవార ఎక్కువ తాగుతుంది.

టీని కప్పులో పోసుకుని సోఫాలో కూర్చుంటూ టీవీ ఆన్ చేసింది. చూస్తే రిమోట్ పనిచేయడంలేదు. సెల్ అయిపోయింది. రాత్రే చెప్పింది సాగర్‌కి సెల్

తీసుకొచ్చి వెయ్యమని. సాగర్ మర్చిపోయినట్టున్నాడు. ఇదివరకంటే టీవీ రెగ్యులర్‌గా చూసేవాడు. ఇప్పుడు కంప్యూటర్ ముందు కూర్చుని టీవీని వదిలేశాడు. టీవీ చూసేది లలితే. లలితకి కోపంతో రిమోట్‌ని నేలకేసి బాదాలనిపించింది. సాగర్‌కి ఏపని చెప్పినా అంతే. ఏదీ ఓపట్టాన చేయడు. చెప్పి చెప్పి లలిత నోరు అరిగిపోవలసిందే.

స్కూల్ నుంచీ వచ్చే టైముకి సాగర్ ఇంట్లో ఉంటే అంత ఇబ్బంది ఉండదు. లలిత స్కూలు అయిన తర్వాత గంటప్రయాణం చేస్తే కానీ ఇంటికి రాలేదు. సాగర్ ఆఫీసు ఊళ్ళోనే. ఇంటికి వచ్చి తయారై మళ్ళీ టెన్నిస్ ఆడడానికి వెళ్ళిపోతాడు. అక్కడే టిఫిన్ చేసేసి ఏ రాత్రికో ఇంటికి వస్తాడు. పొద్దున్నే స్కూల్‌కి వెళ్ళే హడావుడిలో ఏదీ గుర్తుండదు. లలిత గుర్తుంచుకుని వస్తూనే సూపర్ బజార్‌లో కావలసినవి తెచ్చుకుంటుంది. ఏదిలేకపోయినా మళ్ళీ ఫర్లాంగు దూరం నడిచి వెళ్ళాలి. కనీసం తను వచ్చేవరకన్నా ఇంట్లో ఉండమని సాగర్‌కి చెప్పీ చెప్పీ అలసిపోయింది లలిత. టెన్నిస్ ఆడడానికి వెలుతురు పోతుందని సాగర్ వినడు.

అట్లా ఏదన్నా అవసరం వచ్చినప్పుడు, తెమ్మని చెప్పినవి సాగర్ తెచ్చి ఉంచ నప్పుడు లలితకి పిచ్చికోపం వచ్చేస్తుంటుంది. మొదట్లో వంట గిన్నెలు నేలకేసి కొట్టేది. అలమర తలుపులు, బీరువా తలుపులు ధడధడా వేసి కొట్టేది. అయితే దాని మూలంగా కలిగే నష్టం లలిత త్వరలోనే గ్రహించింది. గిన్నెలన్నీ చొట్టలు పడి పాడవుతున్నాయి. ఇక తలుపుల్లాంటివి రిపేర్లు వస్తే ఇంక వాటి గతి అంతే. సాగర్ ఓపట్టాన బాగు చేయించడు. అందుకే ఈ మధ్య లలిత కోపం తీరడంలేదు. పైగా అలా కోపంగా ఏదన్నా విసిరి కొట్టినప్పుడల్లా పొట్టలో ఏదో కదులుతున్నట్టు, ఎక్కడో పట్టుకున్నట్టు ఇబ్బందిగా ఉంటోంది. అది ఏమై ఉంటుందో, అమ్మమ్మ చెప్పింది అయితే కాదు కదా అని లలిత భయం.

"రోజూ బైటకు వెళ్ళకపోతే ఎప్పుడన్నా కాస్త ఇంట్లో ఉండొచ్చుకదా?" ఓరోజు సాగర్‌ని గట్టిగానే అడిగింది.

"ఉండి చేసేది ఏముంది? ఇంట్లో టీవీ ముందు కూర్చోవడమేగా? నేను ఉన్నంత మాత్రాన ఒరిగేదేంటి? సరే. ఇంట్లో ఉంటాను. ఉండి ఏం చేయాలో చెప్పు?"

"ఏదన్నా చేయాలంటేనే ఉండాలా? ఊరికే ఉండకూడదా?"

"అట్లా ఊరికే ఉండాలంటే బోర్ కొడుతుంది. అయినా ఉంటే నీకేం వస్తుంది చెప్పు?"

భర్త ఇంట్లో ఉంటే భార్యకి ఏం వస్తుంది? సాయంత్రాలు రోడ్లమీద కాలక్షేపం

చేయకుండా భర్త ఇంట్లో ఉంటే  ఆ భార్యకు ఏం వస్తుంది? ఆ ప్రశ్నకు ఏ భార్య మాత్రం ఏం సమాధానం చెబుతుంది. అందుకే లలిత కూడా సాగర్‌కి ఏం చెప్పలేకపోయింది. ఇంటికి వచ్చే సమయానికి ఇంటికి తాళం కప్ప కాకుండా ఇంట్లో ఓ మనిషి ఉంటే ఇంటికి రాబుద్ధి అవుతుందని లేకపోతే ఇంటికి రావాలని కూడా అనిపించదని లలిత అతనికి చెప్పి ఒప్పించలేకపోయింది. ఇంట్లో ఒక మనిషి ఉండి కబుర్లు చెప్పుకుంటూ కలిసి టీ తాగడంలోనో, అన్నం తినడంలోనో, టీవీ చూడడంలోనో ఉండే ఆనందం గురించి అసలు ఒప్పించలేకపోయింది. ఏది చెప్పినా దాన్ని తేలిగ్గా కొట్టిపడేయడం సాగర్‌కి అలవాటు.

ఒకరోజు లలితకి కోపం వచ్చిందనుకున్నాడో ఏమో ఇంట్లో ఉండిపోయాడు. కాసేపు టీవీ ముందు కూర్చుని ఛానెల్స్ అన్నీ తిప్పి తిప్పి చూస్తూ మధ్య మధ్య లలిత మొహంవంక చూస్తున్నాడు. లలిత ఏం గమనించనట్టు ఉండిపోయింది.

"ఇంట్లో ఉండడంలేదు, ఉండడంలేదు అని ఊరికే గోలపెడతావు. ఇదుగో ఉన్నాగా? ఏం చేయాలి చెప్పు? నా మొహం నువ్వూ, నీ మొహం నేను చూసు కోవడమేగా" ఒకసారి అన్నాడు. లలిత విననట్టే ఉండిపోయింది.

ఏదో ఫోన్ వస్తే "అబ్బే, అదేంలేదు బ్రదర్. వంట్లో బాగానే ఉంది. ఏదో చిన్న పనుండి ఉండిపోయాను. ఏం చేస్తున్నారు? మన వాళ్ళంతా వచ్చారా? ఓ ష్యూర్. ష్యూర్. రేపు కచ్చితంగా వచ్చేస్తాను" అని చెప్పడం వింటూనే ఉంది లలిత. ఆ చెప్పడం తనకి కూడా అని ఆమెకి అర్థమయింది.

"మా ప్రసాదు ఫోను. నేను లేకపోతే వాళ్ళకు బాగా బోర్ కొట్టేసిందంట. చెప్పా చెయ్యకుండా మానేశానని నాకు వంట్లో బాగోలేదేమో అని ఫోన్ చేశాడు. నువ్వేమో ఇంట్లో ఉండండి ఇంట్లో ఉండండి అంటావు. ఉండి ఏంచేయాలంటే చెప్పవు" అతని గొంతులో విసుగు. దాని తర్వాత ఆమె అతన్ని ఉండమనీ అనలేదు. సాగర్ ఉండనూ లేదు.

స్కూల్ నుంచీ రావటం, టీవీ ముందు కూర్చుని కాలక్షేపానికి పనికిమాలిన ప్రోగ్రాములన్నీ చూడడం, నిరాసక్తంగా తిండితినడం రాను రాను లలితలో జీవితంమీదే ఒకలాంటి నిరాసక్తత వచ్చేసింది. ఆ నిరాసక్తత నిదానంగా తనమీదా, తన శరీరంమీదా, ఆరోగ్యంమీదా అన్నిటి మీదకూ మెల్ల మెల్లగా పాకింది. అంతకు ముందు సాగర్ ఇంటికి రాగానే ఆ రోజు స్కూల్లో జరిగినవన్నీ టకటకా పాఠం చెప్పినట్టు చెప్పేసేది. ఈ మధ్య ఆమెలో మౌనం పేరుకు పోతోంది. ఏది చెబుదామన్నా అది చెప్పకపోతే

ఏం పోయింది అన్నట్టు ఊరుకుంటోంది. టెన్నిస్ నుంచీ వచ్చి కాసేపు సెల్‌తో, కాసేపు కంప్యూటర్‌తో గడిపే సాగర్ లలితలో వచ్చిన మార్పు అంతగా గమనించలేదు. కంప్యూటర్ భార్యని మించిన మంచి కాలక్షేపం అని అతను గ్రహించి చాలా కాలమయింది. పైగా అది ఎలాంటి ఘర్షణ, వాదోపవాదాలు లేని కాలక్షేపం కూడా. అతను ఏం చెప్పినా కంప్యూటర్ వింటుంది. ఎదురు మాట్లాడదు. అవునన్న దాన్ని కాదనదు. అందుకే లలిత ఒకరకంగా ఒంటరి జీవితానికి అలవాటు పడిపోతే, సాగర్ ఆఫీసుకి, టెన్నిస్‌కి, కంప్యూటర్‌కి అంకితమైపోయాడు.

టీవీ ముందు నుంచీ లేచి బియ్యం కడిగి పెడదామని చూసింది లలిత. ఖాళీ బియ్యపు డబ్బా వెక్కిరించింది. నాలుగు రోజుల్నుంచీ చెబుతోంది సాగర్‌కి బియ్యం అయిపోతున్నాయని. పొద్దున చెబితే రాత్రి, రాత్రిచెబితే పొద్దున తెస్తానని కాలక్షేపం చేస్తున్నాడు తప్ప తేలేదు. పొద్దున మరీమరీ చెప్పింది. సాయంకాలానికి బియ్యంలేవు తెచ్చిపెట్టి టెన్నిస్‌కి వెళ్ళమని. సాగర్‌కి చెప్పింది కాబట్టి అతను తెస్తాడని ఇంక ఆ విషయం మర్చిపోయింది. తెచ్చి ఇంకెక్కడన్నా పెట్టాడేమోనని ఇల్లంతా చూసింది. ఎక్కడా కనిపించలేదు. ఆకలి, నీరసం, కలగలిసిన ఉక్రోషంతో ఆమె మనసు ఒక్కసారిగా ఉడికిపోయింది. గుండెల్లోంచి లావాలాగా పైకి ఏదో ఎర్రగా ఎగజిమ్మింది. గొంతు లోంచి అస్పష్టంగా ఒక అరుపు బైటపడింది. చుట్టు పక్కల ఇళ్ళన్నీ ఆ సమయంలో టీవీ సీరియళ్ళలో గాఢంగా మునిగిపోయి అయితే కన్నీటితో తడిసిపోవడమో, లేకపోతే ప్రతీకారంతో రగిలిపోవడమో జరుగుతుంటుంది. ఆ అరుపు అందుకని నిశ్శబ్ధంగా గాలిలో కలిసిపోయింది. బలంగా బియ్యపు సోలని నేలకేసి కొట్టేసరికి పొట్టలో మళ్ళీ కలుక్కుమంది.

వంగుని కిందపడిన సోలని తియ్యబోయింది. కడుపులో మళ్ళీ ఏదో పట్టుకున్నట్టు, ఏదో అటు నుంచిటు కదిలినట్టు.... సోల తీసే ప్రయత్నం మానుకుని తింటానికి ఏమున్నాయా అని ఫ్రిజ్ తీసి చూసింది. 'ఫ్రిజ్‌లో రెండు రోజుల కిందటి అట్లపిండి కనిపించి ప్రాణం లేచి వచ్చినట్టయింది. ఎటూ చాలదని ఆ పిండిని ఫ్రిజ్‌లో ఉంచి దాని గురించి మర్చిపోయింది. రెండు అట్లు వేసుకుని తిని మంచినీళ్ళు తాగిన తర్వాత ఆకలి శాంతించింది.

స్కూల్లో పిల్లలకు హోం వర్క్ ఇచ్చినట్టే సాగర్‌కి కూడా రోజూ హోమ్‌వర్క్ ఇచ్చి ఈ పని చేయాలి అంటే చేస్తాడు. వస్తా కూరగాయలు తేవాలంటే తెస్తాడు. సరుకులు తేవాలంటే తెస్తాడు. ఏది చెప్పినా అంతవరకు చేసి ఊరుకోవడం అది కూడా ఏదో

మొక్కుబడిగా లలిత చెప్పింది కాబట్టి లలితకోసం అని చేసేవాడు తప్ప ఇంటికోసం చేస్తున్నానన్న ఫీలింగ్ అతనిలో కనిపించేది కాదు. చెప్పకపోయినంత మాత్రాన ఇంటికి ఏం కావాలో తనంతట తనకి తట్టవద్దా అని గింజుకునేది లలిత. పిల్లలకు హోంవర్కు ఇవ్వటం బాగానే ఉంటుంది. కానీ రోజూ భర్తకు కూడా హోమ్‌వర్కు ఇవ్వడం ఏ భార్యకు మాత్రం బాగుంటుంది?

ఒకరోజు స్టాఫ్‌రూమ్‌లో వనజ కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంటోంది. ఎందుకని అడిగితే "మీకేమండీ? సాగర్ గారు డ్రింక్ చేయరు. పేకాడరు. సిగరెట్ కూడా తాగరు. కనీసం వక్కపొడి అలవాటు కూడా లేదు. ఎంత అదృష్టం అలాంటి వాడు దొరకడం. మీకు ఎంత చెబితే మాలాంటి వాళ్ళ బాధలు అర్థమవుతాయండి" అనేసింది. వనజే కాదు చాలామంది అదేమాట అంటుంటారు. అదేదో భర్తలకు తాగుడు, సిగరెట్, పేకాట అలవాటు లేనంత మాత్రాన మంచివాళ్ళయిపోయినట్టు. వాళ్ళ భార్యలందరూ సుఖంగా సంతోషంగా ఉన్నట్టు. కానీ ఇల్లు పట్టని, బాధ్యత లేని భర్త వాళ్ళందరికన్నా భార్యను ఇంకా ఎక్కువగా బాధించగలడని వాళ్ళకు ఎలా తెలుస్తుంది?

పిల్లల విషయం కూడా అంతే. ఏదో గాలికి పుట్టి గాలికి పెరిగారు. వాళ్ళ అదృష్టం బాగుండి ఉద్యోగాలొచ్చి పెళ్ళిళ్ళయిపోయినై. ఇల్లు కడుతున్నప్పుడూ అంతే. చిరచిరలాడి పోయేవాడు. "ఇప్పుడు ఇల్లు కట్టకపోతే ఏం పోయింది? మంచి ఇంట్లోనే ఉంటున్నాంగా? నీకు వచ్చిన నష్టం ఏముంది?" అనేవాడు. రానురాను సాగర్‌ని చూసే కొద్దీ లలితకి ఒక విషయం స్పష్టంగా అర్థమయింది. సాగర్‌కు బాధ్యతలంటే భయం. తన రోజువారీ కార్యక్రమాలకీ, సరదాలకీ, తిరుగుళ్ళకీ ఎక్కడ ఆటంకం కలుగుతుందో నన్న భయం. అతనికి జీవితమంతా ఎలాంటి బాదరబందీ లేకుండా సరదాగా పిక్నిక్‌లా జరిగిపోవాలి. జీవితమంతా పిక్నిక్‌లా సాగిపోవడానికి జీవితం పిక్నిక్ కాదు కదా. రకరకాల బాధ్యతలు, ఒడిదుడుకులతో కూడుకున్న జీవితం.

దేనికైనా పూర్తి బాధ్యత తీసుకోవడం సాగర్‌కి ఇష్టముండదని ఆమెకు అర్థమయింది. ఇష్టం ఉండకపోవడం అనేదానికన్నా అది అతనికి చేతకాదు అనికూడా ఆమెకు క్రమంగా తెలిసి వచ్చింది. ఒక తెలివిగా మాట్లాడ్డం రాదు. ఫైనాన్షియల్ మేనేజిమెంటు తెలియదు. ఏది ఎప్పుడు చెయ్యాలో తెలీదు. ఎలా చేయాలో చెప్పినా చెయ్యడం తెలీదు. ఇలా ఆ బాధ్యతారాహిత్యం, చేతగానితనం ఫలితాలను రకరకాల రూపాల్లో చూసి చూసి లలిత అలసిపోయింది.

ఏదైనా వ్యవహారం నడపడం చేతగాని వాళ్ళు చేతగాని వాళ్ళుగా, నడపగలిగిన వాళ్ళు సమర్ధులుగా పేరు తెచ్చుకుంటారు. అదే భార్యాభర్తల్లో అయితే అలా వ్యవహారం నడపలేని చేతగాని వాడు మంచివాడుగా పేరు తెచ్చుకుంటే, నడపగలిగిన భార్య గయ్యాళిగా పేరు తెచ్చుకుంటుంది. లోకం దృష్టిలో అలా సాగర్ మంచివాడు.

"చేతకాని మొగుళ్ళు చివరకు పెళ్ళాల కడుపుల్లో పుండ్లుగా తేలతారే" అనేది లలిత అమ్మమ్మ.

"ఎందుకు అమ్మమ్మా?" అడిగింది లలిత.

"చేతకాని మొగుడిని బతుకంతా భుజాలపై మోసీమోసీ, ఇంటి గుట్టంతా కడుపులో దాచీ దాచీ అది పేరుకుని, పేరుకుని చివరికి పుండుకాక ఇంకేమవుతుంది" అంది.

లలిత తాత వట్టి మేదకుడు. అతని అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆస్తి పంపకాల్లో వాళ్ళ అన్నలు అన్నీ పనికిరాని పొలాలు అంటకట్టారంట. దానితో లలిత అమ్మమ్మే అన్నీ చేసుకునేది. ఆవిడ భర్తకు పొలం పనిని హోంవర్క్‌గా ఇచ్చేది. ఇవ్వడమే కాదు దగ్గరుండి మరీ చేయించేది. కాబట్టే నలుగురు పిల్లల్ని ఒకదారి చేయగలిగాను అనేది ఎప్పుడూ.

"మరి నీకు ఏదీ రాలేదుగా అమ్మమ్మా" ఒకసారి లలిత ఆవిడని అడిగింది.

"నేనంటే స్వయం సిద్ధనే. నా పరిస్థితివేరు. మీ తాతయ్య తెలివితక్కువవాడని దాచిపెట్టి పెళ్ళి చేశారు. ఆయన ఏమీ చేయలేడని తెలుసుకాబట్టి ఆయన్నుంచీ నేనేమీ ఆశించలేదు. అన్నీ నేనే చేసుకుపోయేదాన్ని. ఎవరి నుంచీ ఏమీ ఆశించనప్పుడు ఇంక బాధేముంది? మీ అమ్మ మీ నాన్న ఏదేదో చేయాలని ఆశించింది. అది తీరక దానికి కడుపులో పుండు పుట్టి పోయింది" అంది.

లలిత వాళ్ళ నాన్న వట్టి బోళా రకం.రాజకీయాలు మాట్లాడమంటే గంటలు గంటలు మాట్లాడతాడు కానీ ఒక వ్యవహారం నడపాల్సి వస్తే ఎలా నడపాలో ఆయనకు చేతయేదికాదు. దేశంలో ఎక్కడ ఏం జరిగినా అన్నీ ఆయనకే కావాలి. ఇంట్లో జరిగేది మాత్రం తెలీదు.

లలిత వాళ్ళ అమ్మ కూడా భర్తకు హోంవర్క్ ఇచ్చేది. ఏదన్నా పనిచేయాల్సి వచ్చినప్పుడు ఏం చేయాలో ఎట్లా మాట్లాడాలో అన్నీ చెప్పి పంపేది. ఆయన వచ్చేవరకూ గుమ్మం దగ్గరే నిలబడి చూస్తుండేది. ఆయన ఎప్పుడూ హోంవర్క్ సరిగ్గా చేసేవాడు కాదు. వాళ్ళ అమ్మ ఎంత చెప్పి పంపినా చివరికి అన్నీ అరకొర గానే చేసుకొచ్చేవాడు.

దాని తాలూకూ అసంతృప్తి ఎప్పుడూ లలిత వాళ్ళ అమ్మ మొహంమీద వేలాడింది వేలాడినట్టే వుండేది. "మీ నాన్నలాంటి మొగుడ్ని పెట్టుకుని ముగ్గురు ఆడపిల్లల్ని ఎలా కడతేరుస్తుందో మీ అమ్మ" అనేది లలిత అమ్మమ్మ ఎప్పుడూ.

పెద్దమ్మలు, పిన్నిలు, మేనత్తలు, అత్తయ్యలు అందర్నీ వాళ్ళ ఇంటి వ్యవహారాలన్నిటినీ చూస్తూనే పెరిగి పెద్దదయింది లలిత. ఆ క్రమంలో ఆమెకు ఒకటి అర్థమవుతూ వచ్చింది. ఏ ఇల్లు అయినా నిలబడడానికి కారణం మగవాళ్ళ దక్షతకాదు, ఆడవాళ్ళ దక్షతేనని. భర్తలు ఎట్లా ఉన్నా భార్యలు తెలివైన వాళ్ళయితేనే ఆ ఇళ్ళు నిలబడుతున్నాయి. భార్యలకు తెలివితేటలు లేని ఇళ్ళు దెబ్బతింటున్నాయని.

లలిత ఫిజిక్స్ లెక్చరరు ఒకాయన సరదాగా ఉండేవాడు. లాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తుంటే అందరిచుట్టూ తిరుగుతూ "భర్తలు థియరీల్లాంటి వాళ్ళురా అబ్బాయ్. భార్యలు ప్రాక్టికల్. అందుకే ప్రాక్టికల్స్‌లో ఎప్పుడూ అమ్మాయిలే ఫస్ట్" అనేవాడు.

ఏదన్నా అంటే నేర్పించగలం. బాధ్యతని ఎలా చెప్పి నేర్పించగలం అనుకునేది లలిత. దాన్ని ఏ స్కూళ్ళు నేర్పుతాయి? ముందు మనం చేసే పనిమీద శ్రద్ధ ఉండాలి. జీవితం పట్ల మన చుట్టూ ఉన్న మనుషుల పట్లా బాధ్యత ఉండాలి. దానిలోంచే ఏది ఎట్లా చెయ్యాలన్న అవగాహన కలుగుతుంది. అవన్నీ ఏదో పనికిమాలిన పనులు అనుకుంటే ఇంక పనికివచ్చే పనులు ఏవి? ఇంటికి ఉపయోగపడని వాడు తనకి తను ఏం ఉపయోగపడతాడు? ఇతర్లకి ఏం ఉపయోగపడతాడు?

ఏడాది కిందట గమనించింది లలిత పొట్టలో ఏదో అసౌకర్యంగా ఉన్నట్టు ఉండడం. ఏదో కదులుతున్నట్టు, గట్టిగా రాయిలా ఉన్నట్టు... డాక్టరు అల్సర్ రావచ్చేమో అని అనుమానం వ్యక్తం చేసినప్పుడు చెప్పింది లలిత తనకి వేరే సమస్యలు లేవని, సాగర్ ఇల్లు పట్టించుకోడని, తనకున్న సమస్యల్లా అదేనని. అప్పుడు డాక్టరు ఒకమాట చెప్పాడు.

"సమస్య అనుకుంటే సమస్య అవుతుంది. దాన్ని చూసి నవ్వడం నేర్చుకోండి. అప్పుడది సమస్య అనిపించకుండా పోతుంది" అని.

అప్పటినుంచీ లలిత నవ్వుతూనే వుంది. నవ్వి నవ్వి అలసిపోతూనే వుంది.

లండన్ నుంచీ కూతురి ఫోను. వెబ్‌కామ్ ఆన్ చేసింది. కూతురు ఇంట్లో అటూ ఇటూ తిరుగుతూ పనులు చేసుకుంటోంది. ఆమె మొహం కోపంతో ముడుచుకుని పోయి ఉంది.

"అబ్బబ్బ ఈయనతో ఇంక నావల్ల కాదమ్మా. ఒక్క పనీ పట్టించుకోరు. అన్నీ నేనే చేసుకోలేక చచ్చిపోతున్నాను. ఇటు పుల్ల తీసి అటు పెట్టరు. ఇక్కడేమన్నా పనిమనుషులా పాడా? అన్నీ నేనే చేసుకోవాలి. అదే ఇండియా అయితే కనీసం పనిమనుషులన్నా దొరుకుతారు. ఇండియా నుంచీ వచ్చిన మగవాళ్ళు ఇంట్లో భార్యలకు సహాయం చేసేవాళ్ళు ఎంతమంది లేరు? మరీ ఈయనే ఇల్లు పట్టకుండా ఏ మాత్రం బాధ్యత లేకుండా".... కూతురు చెబుతూనే వుంది.

లలిత నవ్వబోయింది. తన వారసత్వం కూతురు అందుకోవడానికి సిద్ధంగా వుంది. నాలుగుతరాల బతుకు రిలేలో కూతురు తన చేతిలోంచి కాగడా అందుకోబోతోంది. లలిత ఎప్పట్లా నవ్వలేకపోయింది.

*'ఆంధ్రజ్యోతి' మార్చి 2017*

# పరుసవేది

**"త**నే రాణీ అంటే. ఇందాక చెప్పలా మన రూమ్మేటని" కిందకి హాస్టలు గేటు వైపు చూస్తూ అంది సుధ. అప్రయత్నంగా అటు చూశాను. హాఫ్‌వైట్ కాటన్ చీరలో ఉన్న ఒక అమ్మాయి బండిమీద ఉన్న అబ్బాయివైపు తిరిగి ఏదో మాట్లాడుతోంది. ట్రాన్స్‌ఫర్ మీద హైదరాబాదు వచ్చి ఆ రోజే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో చేరాను. నాకు హైదరాబాదు కొత్త. గవర్నమెంటు హాస్టల్ అయితే ఎంతోకొంత సెక్యూరిటీ ఉంటుందని అన్నయ్య అందులో చేర్పించాడు. ఫీజులూ అవీ కట్టిన తర్వాత వార్డెన్ సుధని పిలిపించి మీరూమ్మేటని అప్పగించింది.

సాయంత్రం టీ తాగుతూ బాల్కనీ దగ్గర నిలబడ్డాం. అంతకుముందే చెప్పింది సుధ రాణీ గురించి. మేం ఇద్దరం కాక రూమ్‌లో రాణీ కూడా ఉంటుందని. తనది రాజమండ్రి దగ్గర ఏదో ఊరని.

"అతనెవరు" అనాలోచితంగా అడిగేశాను.

"తను రఫీ అని రాణీ ఫ్రెండ్. ఆఫీసు నుంచి రోజూ డ్రాప్ చేస్తాడు. గొంతు తగ్గించి అంది సుధ. ఆ గొంతులో ఏదో తేడా ధ్వనించింది. టైము ఆరున్నర అవుతోంది. అమ్మాయిలు ఒకళ్ళొకళ్ళు హాస్టల్‌కు చేరుతున్నారు. కొందరు ఆటోల్లో, కొందరు నడిచి, ఇద్దరు ముగ్గురు అబ్బాయిల బళ్ళమీద దిగారు. వచ్చిన అబ్బాయిలు గేటు బైట రోడ్డు మీద నిలబడి మాట్లాడుతున్నారు. కాసేపట్లో రాణీ పైకి వచ్చింది. సుధని చూసి కళ్ళెగరేసి నవ్వి "ఆఫీసుకి వెళ్ళలేదా?" అని అడిగింది.

"పొద్దున నీతో వెళ్తానని చెప్పానా తర్వాత వెళ్ళబుద్ధికాక ఉండిపోయాను. అన్నట్టు తను రజని అని మన కొత్త రూమ్మేటు. బ్యాంక్‌లో జాబ్. ట్రాన్స్‌ఫర్ మీద వచ్చారు. రజనిగారూ తను రాణీ" సుధ పరిచయం చేసింది.

"బ్యాంక్‌లో జాబ్ అయిఉండీ ఈ దరిద్రపు హాస్టల్ ఎందుకండీ బాబు. ఏదో

మాలాంటి ప్రయివేటు వాళ్ళకంటే తప్పదు. ఇక్కడ ఒకపూట ఫుడ్డు తింటే చాలు జీవితం మీద విరక్తి పుడుతుంది. ఏదో కాస్త ఫీజు తక్కువని ఉండడం గాని" రాణీ ప్రవాహంలా గలగలా మాట్లాడుతోంది. చామనఛాయతో కళగా ఉన్న మొహం. వత్తయిన నొక్కుల జుట్టు. తేటగా ప్రశాంతంగా ఉన్న కళ్ళు. చూడగానే నాకు రాణీ నచ్చినట్టు అనిపించింది. పొద్దుటి నుంచీ చూస్తున్న సుధ కన్నా రాణీలో ఏదో తెలియని ఆత్మీయత కనిపించింది.

"సెక్యూరిటీ ఉంటుందని అన్నయ్య ఇందులో చేర్చాడు. నాకు హైదరాబాద్ పూర్తిగా కొత్త. ఇంతకు ముందు మెడ్రాస్‌లో ఉండేవాళ్ళం." మొహమాటంగా చెప్పాను.

"కొత్తా లేదు పాతా లేదు. తర్వాతన్నా హాస్టల్ మారిపొండి. మంచి హాస్టల్ ఏదో నేను కనుక్కొని చెబుతాను" రాణీ అంది.

అప్పటికి నవ్వేసి ఊరుకున్నాను. అయితే తర్వాత కూడా హాస్టల్ మారలేక పోయాను. దానికి కారణం రాణీనే. రాణీ చెప్పినట్టు నిజంగానే హాస్టల్‌లో తిండి ఘోరంగా ఉంది. సుద్దల్లాంటి ఇడ్లీలు, కట్టెల్లాంటి చపాతీలు, రుచీ పచీ లేని కూరలు. వాళ్ళు అలా పెట్టి వెళ్ళడం, నిముషంలోనే అవన్నీ బక్కెట్లలోకి చేరిపోవడం ఏదో తిన్నామనిపించి కెలికి అలాగే వదిలేయడం. రూమ్‌లోని అరటి పళ్ళతోనో, బిస్కెట్లతోనో పొట్ట నింపుకోవడం ఇది రోజువారీ దినచర్యగా మారిపోయింది.

హాస్టల్‌లో చేరిన మూడోరోజు సాయంత్రం హాస్టల్‌కి రాగానే "ఇవాళ బంగాళా దుంప వేపుడు చేసుకుందామా" అంది రాణీ.

"ఎలా" అన్నాను నేను ఆశ్చర్యంగా.

రాణీ నవ్వి మంచం కింద నుంచీ స్టవ్ బైటకు తీసి "ఇలా" అంది. అప్పటివరకూ దాన్ని నేను గమనించలేదు. మంచంమీద దుప్పటి నేలమీద వరకూ వేలాడుతూ ఎందుకు ఉందో అప్పుడు అర్థమయింది.

"ఈ సందు చివర కూరగాయల కొట్టు ఉంది. వెళ్దాం వస్తారా?" రాణి అడిగింది. అప్పటికింకా సుధ రాలేదు.

"కూర అంటే గిన్నెలు, నూనె, ఉప్పు, కారం అన్నీ ఉండాలి కదా" అన్నాను చెప్పులేసుకుంటూ.

"మీకెందుకు రండి" అంది రాణి.

కూరగాయల అమ్మాయి రాణీని చూడగానే "అమ్మగారూ పచ్చి టమాటోలు వచ్చినయి ఇమ్మంటారా" అని అడిగింది.

"పచ్చి టమాటోలా? సరే ఇవ్వు. కొంచెం అల్లం, వెల్లుల్లి పచ్చిమిరపకాయలు కూడా ఇవ్వు" అని నావైపు తిరిగి పచ్చి టమాటాలో అల్లం వెల్లుల్లి వేసి కూర చేస్తే అద్భుతంగా ఉంటుంది. మీరు ఎప్పుడన్నా తిన్నారా?" అని అడిగింది.

పచ్చిటమాటా ఎప్పుడన్నా పచ్చడిగా తినడమే కానీ కూర చేస్తారని నాకుతెలీదు. లేదన్నట్టు తల అడ్డంగా ఊపాను.

"ఇవాళ మీకు తినిపిస్తాను చూడండి" ఉత్సాహంగా అంది రాణి.

తర్వాత కొన్ని మంచం కింద నుంచీ, కొన్ని కింద ఉన్న వంటవాళ్ళ నుంచీ తెచ్చిన సరుకులతో ఎలా చేసిందో కానీ అరగంటలో అంతా ముగించి మళ్ళీ స్టవ్ మంచం కింద దాచేసింది. హాస్టల్‌లో అలా వంట చేసుకోవడం నిషిద్ధం అంట. వార్డెన్ చూస్తే ఫైన్ వేస్తుందంట. అందుకే రహస్యంగా ఏ మూడు నాలుగు రోజులకోసారి ఇలా వండుకుంటుంటారట.

డైనింగ్‌కి కిందకు వెళ్ళకుండా అన్నం కూరలు మేముండే థర్డ్ ఫ్లోర్‌లోకి తెచ్చుకునే తినేవాళ్ళం. ఆ రోజు కూడా అలాగే పళ్ళాల్లో అన్నం పెట్టించుకుని పైకి తెచ్చుకుని వేడివేడి టమాటా కూరతో తింటుంటే కళ్ళముందు స్వర్గం కనిపించింది. ఒక మామూలు కూరతో కూడా అన్నం తినడాన్ని అంత ఎంజాయ్ చేయొచ్చని మొదటిసారిగా తెలిసింది. ముగ్గురం అరకిలో కూర ఆనవాలు కూడా లేకుండా ఖాళీ చేసేశాం. తర్వాత ఎన్నోసార్లు బంగాళా దుంపలు, బెండకాయలు, వంకాయలు లాంటి మామూలు కూరల్ని అపురూపంగా నోట్లో నీళ్ళూరేలా వండుకుని వర్ణించుకుని వర్ణించుకుని తినేవాళ్ళం. ఆ రుచి నిజానికి కూరలది కూడా కాదు. ఆ సమయానిది. ఆ సందర్భానిది. తినే మా రహస్య ఉత్సాహానిది.

ఓ రోజు పౌర్ణమి. బాల్కనీలో కూర్చుని మాట్లాడుకుంటున్నాం. పరిసరాలన్నీ పండు వెన్నెల్లో తడిసి తన్మయమైపోతున్నాయి. ఉన్నట్టుండి "ఒక్క నిముషం ఇప్పుడే వస్తాను" అని రాణి కిందకు వెళ్ళింది. చేతుల్లో ఏదో పట్టుకుని మా రూమ్‌లోకి వెళ్ళింది. అయిదు నిముషాల్లో టీ గ్లాసుల్తో బాల్కనీలో ప్రత్యక్షమయింది. ఎక్కడివంటే నవ్వి గ్లాసు చేతుల్లో పెట్టింది. తర్వాత చాలా వర్షం రాత్రుళ్ళని, శీతాకాలపు గడ్డకట్టించే చలి రాత్రుళ్ళని వెన్నెల రాత్రుళ్ళనీ రాణి వేడివేడి చాయ్ తాలూకూ సువాసనలతో నింపింది. ఒక్కమాటలో చెప్పాలంటే కటకటాలు మినహాగా జైలు జీవితం లాంటి ఆ దుర్భరమైన హాస్టలు జీవితాన్ని రాణి తన సమక్షంతో వెలిగించింది. జీవితం ఎంత

దుర్భరంగా ఉన్నా చిన్న చిన్న ఆనందాలతో దాన్ని సంతోషంగా చేసుకోవచ్చని రాణీ ద్వారా ఆ కొద్ది రోజుల్లోనే నేను నేర్చుకోగలిగాను.

"రఫీ కచ్చితంగా రాణీని చేసుకోడు. చూస్తుండు. వాడేదో పెద్ద ఇంద్రుడు, చంద్రుడు అని రాణీ నమ్ముతోంది. నేను ఒకసారి చూచాయగా అంటే రఫీ అలాంటి వాడు కాదు నాకు తెలుసులే అనేసింది. ఇంకేం చెబుతాం? ఇలాంటివి. ఒకరు చెబితే తెలిసేవి కావు. ఎవళ్ళకి వాళ్ళు తెలుసుకోవాల్సిందే." రాణీ లేనప్పుడు ఒకసారి సుధ నాతో అంది.

"రఫీని పెళ్ళి చేసుకోవడం రాణీ వాళ్ళ పేరెంట్స్‌కి ఇష్టమేనా?"

"వాళ్ళు మాత్రం ఏం చేస్తారు రాణీ మొండిపట్టు పట్టుకుని కూర్చుంటే? నీ ఇష్టం అని వదిలేశారు. రఫీ వాళ్ళ అమ్మకే వాళ్ళ బంధువులమ్మాయిని చేసుకోవాలని ఉందట. ఇవన్నీ తెలిసి కూడా రాణి అతన్ని గుడ్డిగా నమ్ముతుంది. నీకు ఇంకో విషయం తెలుసా వాళ్ళిద్దరి మధ్యా రిలేషన్ కూడా ఉంది. రాణీ అప్పుడప్పుడు ఆదివారాలు బైటకు వెడుతుంది చూడు అతని దగ్గరికే" సుధ గొంతు తగ్గించి రహస్యం చెబుతున్నట్టు అంది.

నేను వెంటనే ఏం మాట్లాడలేకపోయాను. సుధ చెబుతున్న దానిలో అబద్ధం ఏదీ లేదని నాకు తెలుసు. రాణీ మాటల్ని బట్టి ఆ విషయం కొంత నేనూ గ్రహించాను. ఆ రఫీ అనే అతను నాక్కూడా ఏ మాత్రం నచ్చలేదు. ఒకసారి రాణీ అతన్ని పరిచయం చేసింది. అతని కళ్ళు ఒకక్షణం కూడా స్థిరంగా నిలవడం లేదు. మేం మాట్లాడుతున్నంత సేపూ అతను అలాగే ఉన్నాడు. నాకెందుకో రాణీకి అతని మీదున్నంత ఇష్టం అతనికి రాణీమీద లేదని స్పష్టంగా అనిపించింది.

అదే రాణీ అయితే మేం ఏం మాట్లాడుకుంటున్నా అదే మా రఫీ అయితే అంటూ అతని ప్రస్తావన తేకుండా ఉండేది కాదు. రఫీ గురించి మాట్లాడేటప్పుడు ఆమె కళ్ళు, మొహం సంతోషంతో వెలిగిపోతూ ఉండేవి. రాణీ గురించి నేను భయపడినదల్లా ఒకటే. రఫీ రాణీని పెళ్ళి చేసుకోడన్నా నాకు బాధనిపించలేదు కానీ ఒకవేళ అదే జరిగితే రాణీ ఏమైపోతుందో అని భయమనిపించింది. తను ఆ దెబ్బని ఎంతవరకూ తట్టుకుని నిలబడగలదు అని. ఏ అఘాయిత్యానికైనా పాల్పడుతుందేమో అని అప్పుడప్పుడూ భయం కూడా వేసేది.

నాకు హైదరాబాదులోని ఇంకో బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫర్ అయింది. హాస్టల్ ఊరికి ఈ చివర అయితే బ్యాంక్ ఊరికి ఆ చివర. ఊళ్ళో ఊళ్ళోనే రెండు గంటల ప్రయాణం.

మధ్యలో ఊపిరి పీల్చుకోనివ్వని ట్రాఫిక్. ట్రాఫిక్ కారణంగా రోజూ బ్యాంక్‌కు లేటు. సాయంత్రానికి నీరసం. ఆ టెన్షన్ తట్టుకోవడం కష్టమనిపించింది. అన్నయ్య వచ్చి హాస్టల్ మార్పించాడు. అయిష్టంగానే మారక తప్పలేదు. కొత్త హాస్టల్‌లో నాకు రాణీ ఎవరూ దొరకలేదు. మొదట్లో అప్పుడప్పుడూ రాణీ దగ్గరికి వెళ్ళి వస్తుండేదాన్ని. రాణీ కూడా ఒకసారి నా దగ్గరికి వచ్చింది. 'రాణీని చూసినప్పుడల్లా నేను కోల్పోయిన ఆ సంతోషక్షణాలు నాకు గుర్తొస్తుండేవి.

కొత్త హాస్టల్‌కి వచ్చిన మూడు నెలల తర్వాత ఓ రోజు సుధ ఫోన్ చేసింది.

"రజనీ. చూశావా. అచ్చంగా నేను చెప్పినట్టే జరిగింది. ఆ రఫీగాడు రాణీని చేసుకోడంలేదు. వాళ్ళ చుట్టాలమ్మాయిని చేసుకోబోతున్నాడు. త్వరలోనే వాళ్ళ పెళ్ళి" సుధ గొంతులో బాధ కన్నా తను అన్నది నిజమవుతోందన్న ఉత్సాహం కనిపించింది. ఒక్క క్షణం మనసు చివుక్కుమంది.

ఆ తర్వాత ఆదివారం రాణీ దగ్గరికి వెళ్ళాను. రాణీ నన్ను చూసి నవ్వుతూ ఎదురొచ్చింది. నవ్వులో ఎప్పటిలా హుషారు లేదు.

"రా రజనీ. నేనే నీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను. ఈ ఆదివారం రాకూడదూ అని" రాణీ అంది.

సుధని బైటకు వెళ్ళనిచ్చి అప్పుడు మాట్లాడింది ఆ విషయం.

"నీకో సంగతి చెప్పాలి రజనీ, రఫీ వాళ్ళ చుట్టాల అమ్మాయిని పెళ్ళి చేసుకోబో తున్నాడు. వచ్చే వారంలోనే పెళ్ళి."

నేను వెంటనే ఏం మాట్లాడలేకపోయాను. నిజానికి ఏం మాట్లాడాలో కూడా తెలీని సందర్భం అది.

"ఎందుకో చెప్పలేను కానీ ఇది ఇలాగే జరుగుతుందని నాకు అనిపించింది రాణీ. నువ్వు ఏమన్నా అనుకుంటావేమో అని చెప్పలేకపోయాను" కాసేపు మౌనం తర్వాత అన్నాను.

"ఏం చేస్తాం? దురదృష్టవంతుడు. తనకి రాసిపెట్టిలేదు" తనలో తను అనుకుంటు న్నట్టు నెమ్మదిగా అంది.

నేను ఆశ్చర్యంగా చూశాను. తను దురదృష్టవంతురాలు అనడానికి బదులు పొరబాటుగా అందా అని. నా చూపు గమనించి చిన్నగా నవ్వింది.

"ఒక ఆడపిల్ల తన గుండెనిండుగా, నిండు మనసుతో ప్రేమిస్తే ఆ ప్రేమ ఎంత మధురంగా ఉంటుందో తెలుసా రజనీ? అమాయకమైన ఆ ప్రేమ అమృతంతో

సమానం. అలాంటి ప్రేమను తను పోగొట్టుకున్నాడు కదా. అది దురదృష్టం కాక ఇంకేంటి? నా గుండెల్లో రఫీ అంటే ఎంత ప్రేమ ఉందో తెలుసా? కన్నతల్లిలా చూసుకోగల భార్య దొరకడం ఎంత అదృష్టం? మూర్ఖుడు. ఆ అదృష్టాన్ని చేతులారా పోగొట్టుకున్నాడు. రేపు వాళ్ళ అమ్మ చెప్పిన అమ్మాయిని చేసుకోవచ్చు. ఆ అమ్మాయి ఒక మామూలు భార్య అవుతుంది తప్ప రాణీ కాలేదుగా. రఫీని చూస్తే నాకు జాలేస్తోంది రజనీ. కోపం వచ్చేదానికన్నా జాలే ఎక్కువగా ఉంది. తను పోగొట్టుకున్నదేంటో తనకు ఇప్పుడు తెలియదు. రఫీ కాదన్నంత మాత్రాన నేనేదో అయిపోతానా? నన్ను పోగొట్టుకోవడం తన దురదృష్టం కానీ నా దురదృష్టం కాదు.” తనలో తను మాట్లాడుకుంటున్నట్టు నిదానంగా ఒక్కొక్క మాటా అంది రాణి. ఆ మాటల్లో కొట్టొచ్చినట్టున్న ఆత్మవిశ్వాసం. రాణీని చూసి నిజంగా ఆశ్చర్యం వేసింది. ఒక్కసారిగా నా గుండె తేలికగా అయిపోయింది.

నిజమే. రఫీ పోగొట్టుకున్నది ఎంత అమూల్యమో నాకు తెలుసు. అందరికీ ఉండేది ఒకేలాంటి జీవితం. అయితే దాన్ని ఆనందంతో నింపుకోవడం మాత్రం ఎవళ్ళకి వాళ్ళ చేతుల్లోనే ఉంటుంది. ఆ పరుసవేది విద్యను పట్టుకోగలిగిన వాడు ఎడారుల్లో కూడా వసంతం పూయించగలడు. బంగారం పండించగలడు. ఆ పరుసవేది విద్య రాణీకి తెలుసు. అలాంటి రాణీని పోగొట్టుకోవడం నిజంగా రఫీ దురదృష్టం కాక ఇంకేంటి?

***‘ఈనాడు’ ఆగస్ట్ 27, 2017***

# అమ్మా వాళ్ళ ఇల్లు

**రా**ముడి వెంట పధ్నాలుగు ఏళ్ళపాటు వనవాసానికి వెళుతున్నపుడు తను అంతవరకూ నడయాడిన ఆ మహారాజ ప్రాసాదాన్నంతా సీతాదేవి అచ్చంగా అలాగే చూసి ఉంటుంది. పాండవుల వెంట అరణ్యవాసానికి తరలేటప్పుడు తను మళ్ళీ తిరిగి చూడగలదో లేదో  తెలియని ఆ అంతఃపుర పరిసరాలను రాజ ఉద్యానవనాలను ద్రౌపది కూడా అంతే ఆర్తిగా చూసి ఉంటుంది. సమస్త సామ్రాజ్యాన్నంతా విశ్వామిత్రుడికి ధారపోసి కట్టుబట్టలతో మిగిలిన హరిశ్చంద్రుడి వెంట అగమ్య గాడాంధకారంలో అడుగుపెట్టబోయే ముందు తను అంతవరకూ పవళించిన మధుర జ్ఞాపకాల హంసతూలికా తల్పంవైపు, పరిచర్యలు చేసిన దాసదాసీ జనంవైపు చంద్రమతీదేవి అంతే మమకారంతో చూసి ఉంటుంది. నలుడి వెంట కారడవులకు బయలుదేరే ముందు జరిగిన దానిని జీర్ణించుకోలేక దమయంతి కూడా అంతే దిగ్భ్రాంతితో రాజప్రాసాదపరిసరాలను అలాగే చూస్తుండిపోయి ఉంటుంది. ఇంటినిండా చెల్లా చెదురుగా పరిచి ఉన్న రకరకాల సామాన్ల గుట్టలమధ్య కూర్చున్న అమ్మ ముఖం కూడా అచ్చంగా అలాగే వుంది. దాదాపు అరవై ఏళ్ళుగా తన మహాసామ్రాజ్యానికి సేకరించి పెట్టుకున్న వస్తు సామగ్రినంతా కలియజూస్తున్న అమ్మ కళ్ళలో అదే ఆర్తి. అదే మమకారం. అదే దిగ్భ్రాంతి, అదే అభావం. ఆ క్షణంలో అమ్మ మనసులో ఏ భావాలు కదలాడుతున్నాయో చెప్పడం కష్టం.

ఎల్చిమీద నుంచీ అలమరాల నుంచీ, బీరువా నుంచీ తీసికింద పేర్చుతున్న సామాన్లల్లో రాగి బిందెలు, ఇత్తడి గంగాళాలు, పెద్ద పెద్ద అల్యూమినియం గిన్నెల నుంచీ ఏనాడో వాడి వదిలేసిన నిలువెత్తు మజ్జిగ కవ్వం, వాడుకలో లేని తిరగలి, రుబ్బురోలు, రోకళ్ళ లాంటి వస్తు సామగ్రి చాలానే ఉంది. మా చిన్నప్పటినుంచీ దిగిన ఫొటోలు మొదలుకుని మేం ఎవరిళ్ళకు వాళ్ళు తెచ్చుకోగా మిగిలిన పుస్తకాలు,

సర్టిఫికెట్లు, రకరకాల రశీదులు – తవ్వేకొద్దీ నీరు ఊరుతున్న ఊటబావిలా ఎక్కడెక్కడి నుంచో ఊరుతూనే ఉన్నాయి. నిజానికి అవి వట్టి వస్తువులు కాదు. ఒక జీవితకాలపు తీపి గురుతులు. ఒక జీవిత కాలపు స్మృతి శకలాలు.

ఆ గంగాళాలు, రాగి బిందెలు, ఇత్తడి బిందెలు, అల్యూమినియం గిన్నెలు అన్నీ పెళ్ళిళ్ళు కళ్యాణమండపాలలో జరగొచ్చు అన్న ఊహ పుట్టడానికి ముందు కొనిపెట్టుకున్నవి. పిల్లల ఫంక్షన్లు, పెళ్ళిళ్ళు వస్తే అద్దద్దా అని ఎక్కడికని వెళ్ళి అడుగుతాం అని అవసరం కోసం కొని పెట్టుకున్నవి. వాటిల్లో కొన్ని మా అమ్మవి, మా నాన్నవి మావి వాడి వదిలేసిన బట్టలతో స్టీలు సామాన్ల వాళ్ళ దగ్గర కొన్నవి కూడా ఉన్నాయి.

ఆ నిలువెత్తు మజ్జిగ కవ్వం అమ్మమ్మ జ్ఞాపకం. మా చిన్నప్పుడు అమ్మమ్మ మా దగ్గరే ఉండేది. ఇంట్లో ఎప్పుడూ రెండు మూడు గేదెలూ, కోళ్ళూ ఉండేవి. పాలు ఇంట్లో వాడగా పాలకేంద్రంలో కూడా పోసేవాళ్ళం. అమ్మమ్మ ప్రతిరోజూ పెద్ద కుండలో మజ్జిగ చేసేది. వంటింటి వరండాలో ఉన్న గుంజకు తాళ్ళు కట్టి చుట్టకుదురు మీద మజ్జిగ కుండపెట్టి నిలబడి తాళ్ళతో కవ్వాన్ని అటూ ఇటూ తిప్పుతూ మజ్జిగ చేస్తుంటే చూడడానికి భలేగా ఉండేది. మేం తిప్పుతాం మాకు ఇవ్వు అంటే మాకు ఇవ్వు అని అమ్మమ్మ చుట్టూ చేరేవాళ్ళం.

మజ్జిగ చిందిపోతుందని, గట్టిగా అంచులకు తగిలితే కుండ పగిలిపోతుందని అమ్మమ్మ మమ్మల్ని మజ్జిగ చేయనిచ్చేది కాదు. ఎప్పుడన్నా మా బాధ పడలేక ఇచ్చినా ఇచ్చినట్టే ఇచ్చి ఒక గుండ్రం తిరగ్గానే చేతుల్లోంచి మజ్జిగ తాడు తీసేసుకునేది. ఉక్రోషం పట్టలేక అమ్మమ్మ వెనుకే మేం కూడా నడుం తిప్పుతూ "చల్లచెయ్యి గొల్లభామ. ముడ్డితిప్పు ముసలిభామ" అని పాటలు పాడుతూ ఆటపట్టించేవాళ్ళం. అమ్మమ్మ కర్ర తీసుకుని వెంటపడేవరకూ అది సాగుతుండేది. ఎప్పటి అమ్మమ్మ. ఎప్పటి మజ్జిగ కవ్వం. ఎప్పటి మజ్జిగ తాళ్ళు. అప్పటి నుంచీ ఇప్పటికి కనీసం ఏడెనిమిది ఇళ్ళు మారి ఉంటారు అమ్మావాళ్ళు. అప్పటినుంచీ ఆ సామాన్లలో అవి కూడా ఇళ్ళు మారి జ్ఞాపకాలుగా వస్తూనే ఉన్నాయి.

అమ్మమ్మకు చివర్లో జబ్బుచేసి మంచాన పడింది. అమ్మ ఉద్యోగం చేస్తుంది కాబట్టి మామయ్య వచ్చి అమ్మమ్మను వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళాడు. వారం వారం అమ్మ అమ్మమ్మని చూడడానికి వెళ్ళేది. వెళుతూ వెళుతూ అమ్మమ్మకి ఇష్టమని క్షీరాన్నమో, కోడికూరో, చేపల కూరో తీసుకుని వెళుతూ ఉండేది. అయితే అమ్మమ్మ జబ్బుపడిన కారణం షుగరని అప్పట్లో అమ్మకు తెలీదు. చివర్లో తెలిసింది. అమ్మమ్మకు

షుగరని తెలియక బలానికని నీరసం తగ్గడానికని క్షీరాన్నం, స్వీట్లు తినిపించి చేతులారా చంపుకొన్నామని అమ్మ ఎప్పుడూ బాధపడుతుండేది.

అమ్మకి వస్తువులంటే మహా ప్రేమ. ఇంట్లో ఎన్ని వస్తువులున్నా ఇంకా ఇంకా కొంటూనే ఉంటుంది. మా ఇళ్ళకి వచ్చినప్పుడు ఎవరి ఇంట్లో నన్నా కొత్త వస్తువు కనిపిస్తే అది తనకు నచ్చితే తనకు కూడా అది తెప్పించుకునేది. అమ్మకు సామాన్లంటే ఉండే ప్రేమ చూసి మేం కూడా నవ్వుకునేవాళ్ళం. ఇల్లంతా సామాన్లతో నింపేస్తోందని విసుక్కునే వాళ్ళం కూడా.

ఇంట్లోని మూడు గదుల్నిండా కాలు పెట్టడానికి కూడా సందు లేకుండా ఇన్నాళ్ళుగా అమ్మ పేర్చిపెట్టుకున్న వస్తువులన్నీ అనాథల్లాగా పడి వున్నాయి. వాటిల్లో పనికి వచ్చేవి కొన్ని, పనికిరానివి కొన్ని, ఎప్పటికన్నా పనికివస్తాయో రావో తెలీనివి కొన్ని, ఎప్పటికీ పనికిరావని తెలిసి కూడా పారేయలేనివి కొన్ని, పనికి వచ్చినా వాటిని ఏం చేసుకోవాలో ఎక్కడపెట్టాలో తెలీనివి కొన్ని ఇలా రకరకాలు ఉన్నాయి. ఆ గుట్టల్లోంచి ఎవరు ఏ వస్తువు తీసి ఇది ఉంచాలా అక్కర్లేదా అని అడుగుతుంటే అమ్మ గాజుకళ్ళు ఆ వస్తువు వంక భావరహితంగా చూస్తున్నాయి. ఆ వస్తువుపై ఎవరు ఏ తీర్పు చెబుతారో అన్నట్టు ఉంది ఆ చూపు. చిట్టచివరికి ఆ వస్తువు పనికిరాదని తీర్పు వచ్చినప్పుడు ఎందుకు పనికిరాదు? దాన్ని ఉంచండి. పనికి వస్తుందని అమ్మ అల్టిమేట్ జడ్జిమెంట్ ఇచ్చేస్తోంది. అది ఎందుకు పనికివస్తుందో తెలీక, అమ్మ మొహం చూస్తూ ఆమాట అనలేక అందరి మొహాల్లో సందిగ్ధం.

ఏ వస్తువు కావస్తువు తీసి, పనికి వస్తుందో రాదో గంటలో తేల్చేయొచ్చని ఆషామాషీగా మొదలుపెట్టిన పని మూడు నాలుగు గంటలైనా తెమలకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది తప్ప ముందుకి నడవడం లేదు. ఇంటిలో ఇన్నాళ్ళుగా పేర్చి పెట్టుకున్న వస్తువుల్లో ఏది అవసరం? ఏది అనవసరం? ఏది ఉంచొొచ్చు? ఏది పడెయ్యొచ్చు. ఏది ఎవరికైనా ఇచ్చేయొచ్చు? ఏది ఎవరికీ కూడా ఇవ్వకుండా ఉంచొచ్చు అని చెప్పడం ఎంత కష్టం! ఏ వస్తువు పడేయాలన్నా అది అవసరం అనే మాటతో ఆగిపోతోంది. ఎవరికి అవసరం? ఎలా అవసరం అంటే సమాధానం లేదు. చివరికి ఎవళ్ళకి వాళ్ళకి నీరసం వచ్చి ఇది ఇప్పటికి తెమిలేలాగా లేదని అర్థమై ఆ వస్తువుల గుట్టల్లో మేం కూడా ఒకటిగా కూర్చుండిపోయాం.

నాన్న స్టీలు గిన్నెలమీద పేరుగా మారిపోయి ఇప్పటికి నెలయ్యింది. నెల

దాటకుండా ఆ ఇల్లు ఖాళీ చేసెయ్యాలట. అలాంటివాటిని ఏది ఎందుకు అని అడగలేం. బతికి ఉన్నంతవరకే మనిషికి తనమీద తనకు హక్కు ఉంటుంది. చనిపోతే ఇంక ఆ దేహం మీద అందరికీ హక్కు వచ్చేస్తుంది. ఆ శరీరం ఇంక ఉమ్మడి ఆస్తి అయిపోతుంది. అందరూ ఎవరికి తోచిన సలహాలు, సూచనలు వాళ్ళు ఇచ్చేస్తుంటారు. ఆ మనిషి బతికి ఉన్నప్పుడు ఏమీ చెయ్యనివాళ్ళు, బతకడానికి ఏం చేయాలో చెప్పనివాళ్ళు కూడా చనిపోయాక ఆ మనిషికి ఏమేం చేయాలో అనర్గళంగా చెబుతుంటారు. ఆ కర్మ కాండలమీద నమ్మకం ఉన్నా లేకపోయినా ఏమో ఎందులో ఏం ఉందో? ప్రత్యేక మైన నష్టం ఏమీ లేనప్పుడు వాళ్ళు చెప్పింది పాటిస్తే ఏం పోయిందని అనుకునే వాళ్ళే ఎక్కువ. మనుషుల్లోని ఆ ఉదాశీనత, చెయ్యకపోతే ఏం అవుతుందోనన్న భయమే ఆచారాల్ని సజీవంగా ఉంచుతుంటాయనిపిస్తుంది.

ఆ రోజు నాన్న ఏ కుర్చీలో కూర్చుని గుండెపోటుతో తలవాల్చేసి, ఒక్క నిముషంలో లేకుండా పోయారో ఆ కుర్చీ జరుగుతున్న దానికి సజీవ సాక్ష్యంగా ఇంకా అక్కడే వుంది. ఇంకా వెచ్చగా ఉన్న నాన్న అరిచేతుల్నీ, కాళ్ళనీ ఆ కుర్చీ పక్కన నిలబడి ఏదో ఆశతో ఇంకా రుద్దింది రుద్దుతున్నట్టే ఉంది. అమ్మ రోజంతా కష్టపడి తయారు చేసిన గోంగూర పచ్చడి, బాక్సుల్లో సర్దిపెట్టి మాకు ఇచ్చిరమ్మని నాన్నతో పంపించిన గోంగూర పచ్చడి, నడవలేక వెనక్కు వచ్చేసి కుర్చీలో కూర్చుని తల వాల్చేసిన నాన్న శరీరం పక్కన ఇంకా గోరు వెచ్చగా అలా బుట్టలోనే ఉంది. పచ్చడిని కూతుళ్ళకు ఇవ్వడానికి తీసుకెళ్ళాల్సిన నాన్నే వెచ్చగా లేకుండా ఉన్నకొద్దీ చల్లగా అయిపోయారు. చనిపోవడం ఇంత తేలికా అనిపించింది నాన్నని చూస్తుంటే. ఒకే ఒక నిముషంలో ఒక మనిషి ఉండడం, ఉండకపోవడం ఎలా సాధ్యం అనేది నాకు ఎప్పుడూ అర్థం కాదు.

ఉన్న చారెడు స్థలంలో నన్నా ఇల్లుకడదామని అమ్మ పోరింది పోరినట్టే వుండేది. నలుగురు ఆడపిల్లల చదువులు, పెళ్ళిళ్ళతో నాన్నకు వెసులుబాటు చిక్కలేదు. అలా అమ్మకు ఇల్లు అమరకుండానే పోయింది. ఇప్పుడింక అమ్మ ఒక్కటే ఒంటరిగా ఉండ లేదు. మాలో ఎవరో ఒకరి దగ్గర ఉండక తప్పదు. అందుకే ఇల్లు ఖాళీ చేయించాలని అనుకున్నాం. కానీ ఆ పనే ఒక పట్టాన అంతుబట్టటం లేదు. “ఇదుగో చూశారా ఇదేంటో. ఇంకా ఇది కూడా ఉంచింది.” అక్క మా చిన్నప్పటి లాంతరు పట్టుకొచ్చి చూపించింది.

మా చిన్నప్పుడు ఇంట్లో ఒక పెద్ద లాంతరు, రెండు చిన్న దీపపు బుడ్లు ఉండేవి. లాంతరు గ్లాసు, దీపపు బుడ్డిల గ్లాసు ముగ్గుతో శుభ్రంచేసి గరాటుతో కిరసనాయలు పోసే బాధ్యతను అమ్మమ్మ పెద్దక్కకి అప్పచెప్పేది. లాంతరును హాల్లో మధ్యగా పెట్టి దానిచుట్టూ కూర్చుని చదువుకునేవాళ్ళం. ఎప్పటిలాంతరు అది?

"ఆ లాంతరు ఎందుకు పనికివస్తుంది? పనమ్మాయికి ఇచ్చేద్దాం" చిన్నక్క అంది.

"దాన్ని ఆ పక్కన విడిగా ఉంచు అయితే" పెద్దక్క అంది.

"ఉహూ! వద్దు. ఉంచండి. దేనికన్నా పనికొస్తుంది" అమ్మ చటుక్కున అంది.

పనిచేస్తుందో లేదో కూడా తెలీని పాత లాంతరు. ఒకటి రెండు దశాబ్దాలుగా వాడని పాత లాంతరు. అందరి ఇళ్ళల్లో ఇన్వర్టర్లు ఉన్నాయి. ఇంక దేనికి ఎవరికి పనికి వస్తుంది? అందరం ముఖముఖాలు చూసుకున్నాం.

"ఈ పీటలు ఏం చేద్దాం?" చిన్నక్క అడిగింది.

చిన్నప్పుడు మేం కూర్చుని అన్నం తిన్న పీటలు. పెద్ద బాదంకాయ పీట ఒకటి, చిన్న బాదంకాయ పీట ఒకటి, నాలుగు నలుచదరం పీటలు సైజుల వారీగా ఒకదానిమీద ఒకటి పేర్చి ఉన్నాయి. అమ్మ అన్నాలకు పిలవగానే ఒకళ్ళ డ్యూటీ పీటలు వేసి, మంచినీళ్ళ గ్లాసులు పెట్టటం. ఒకళ్ళ డ్యూటీ పళ్ళాలు కడిగి ఇవ్వడం. అక్కడా మళ్ళీ పేచీనే. ఇవాళ బాదంకాయ పీట నాదంటే నాదని, బాదంకాయ పళ్ళెం నాదంటే నాదని నాన్న వచ్చేవరకూ పేచీలే. నాన్న రాగానే ఎక్కడి పిల్లులక్కడే గప్‌చుప్ అన్నట్టు అయిపోయేవాళ్ళం.

"ఎందుకే ఆ పీటలన్నీ? ఇప్పుడు ఎవరం కింద కూర్చుంటున్నాం గనుక? మీకెవరికన్నా కావాలంటే పట్టుకెళ్ళండి. నాకైతే వద్దు" పెద్దక్క అనేసింది.

బట్టల బీరువా, మంచం లాంటివి అమ్మకి ఏవి కావాలంటే అవి ఉంచి మిగిలినవి ఎవరికి కావాల్సింది వాళ్ళు తీసుకోవడం, ఎవరికీ అక్కరలేనివి, అంతగా పనికిరానివి పనమ్మాయికి ఇచ్చేయడం అని ముందే అనుకున్నాం. ఎవరో ఒకరు తీసుకుంటామన్న వస్తువుల గురించి పేచీ లేకుండా అయిపోతోంది. పనమ్మాయికి ఇద్దామనుకున్న వస్తువుల గురించే చర్చ తెగడం లేదు. అమ్మ తెగనివ్వడం లేదు.

"ఆ పీటలెందుకు? నాకూ వద్దు" చిన్నక్క తేల్చేసింది.

కళ్ళముందే తమ సంపదనంతా ఆంగ్లేయులు కొల్లగొట్టుకుపోతుంటే సంస్థానాధీశులు నిస్సహాయంగా ఎలా చూస్తుండిపోయారో అలా ఉంది అమ్మ చూపు.

"అవికూడా పనమ్మాయికి ఇచ్చేస్తారా? మంచి టేకుతో చేయించిన పీటలు. ఇప్పుడు చేయించాలంటే ఎంత కష్టమో తెలుసా?" అమ్మ మొహంలో గొంతులో నిష్ఠూరం. ఎవరూ ఉపయోగించక, పనమ్మాయికీ ఇవ్వక ఏం చేయాలి? అది అంతుచిక్కని భేతాళప్రశ్న. చిన్నప్పటి ఫొటోలు ఎవళ్ళవి వాళ్ళు తీసుకున్నాం. ఇంకా తేల్చాల్సినవి చాలానే ఉన్నాయి. తిరగలి, రుబ్బురోలు, పొత్రం, రోకలి బండ, బియ్యం చేటలు, పప్పుగుత్తి, దేవుడి మందిరం, చిన్న తులసికోట, వీటిల్లో పనివాళ్ళకు ఇవ్వ కూడనివి, లక్ష్మీదేవితో సమానమైనవి కొన్ని...

అమ్మ కళ్ళల్లో మొహంలో ఒకలాంటి అసంతృప్తి. ఒకలాంటి అయిష్టం. మేం నలుగురం అన్నా ఒకలాంటి అయిష్టం. మేం నలుగురం కూతుళ్ళలాగా కాకుండా తన సామ్రాజ్యాన్ని నాలుగు ముక్కలు చేస్తున్న శత్రురాజుల్లాగా కనిపిస్తున్నట్టున్నాం. రాజుపై తిరుగుబాటుచేసి ధనాగారాన్ని, ఆయుధాగారాన్ని తలా కొంత పంచుకొంటున్న సామంతరాజుల్లా ఉన్నట్టున్నాం.

ఒక మహా సామ్రాజ్యాన్ని ఇంతవరకూ మకుటంలేని మహారాణిలా ఏలిన అమ్మ కళ్ళల్లో ఒక లాంటి పరాధీనత. ఎవరిమీదో దేనిమీదో తెలీని ఆగ్రహం. ఏమీ చెయ్యలేని నిస్సహాయత ముప్పిరిగొని కనిపిస్తున్నాయి.

అవి ఒట్టి వస్తువులు కాదు. యాభై ఏళ్ళ అనుబంధాలు. యాభై ఏళ్ళ తీపి గురుతులు. అందుకే తిరగలి నుంచీ, రోటి నుంచీ మిక్సీకి మారినా అమ్మ వాటినన్నిటినీ వెంట తెచ్చుకుంది. వాటిల్లో యాభై ఏళ్ల అమ్మ జీవితం ఉంది. ఒకొకటీ కష్టపడి ఏరికోరి కొన్న మురిపెం ఉంది. ముచ్చట ఉంది. కొన్న సంతోషం ఉంది. వాటిని వాడిన అనుబంధం ఉంది.

మూడు నాలుగు పాతచీరలు, దుప్పట్లు, నిల్వ పచ్చళ్ళు లాంటి ఒకటీ అరా తప్ప పనిమనిషికి ఇవ్వదగ్గ వస్తువులేవీ లేవని, రోళ్ళు, రోకళ్ళు, తిరగలి లాంటి వస్తు సామగ్రి అంతా కచ్చితంగా ఉండాల్సిందేననీ తేలేటప్పటికి రాత్రి ఎనిమిదయింది.

ఇన్నాళ్ళూ అది తన సామ్రాజ్యం. తన సామ్రాజ్యాన్ని ముక్కలు ముక్కలు చేసి తలో ముక్కా పంచి పెట్టమంటే ఏ మహారాణి మాత్రం ఒప్పుకుంటుంది? అందుకే అమ్మ కూడా ఒప్పుకోలేక పోతోంది. ఇంక విషయం ఎక్కువ సాగదియ్యకుండానే మాకు అర్థం అయింది. ఆ వస్తువులన్నీ యధాతథంగా అలా ఉంటేనే అమ్మకు మనశ్శాంతి. ఏ కొంచెం చెదిరినా అమ్మ మనసు చెదిరిపోతుంది. అందుకే మొత్తం

సామానంతా ఎవరో ఒకరి దగ్గరో, ఇద్దరి దగ్గరో యధాతథంగా అలాగే ఉంచేయాలని అనుకున్నాం. అంతకు మించి వేరే గత్యంతరం కూడా లేదు. మర్నాడే ఇల్లు ఖాళీ చేసేశాం.

ప్రతి దసరా సెలవులకి, సంక్రాంతి, వేసవి కాలం సెలవులకీ అందరం అమ్మా వాళ్ళ ఇంట్లో కలిసేవాళ్ళం. ఆ మూడు నాలుగు రోజులు ఇల్లంతా సందడి సందడిగా ఉండేది. అమ్మా వాళ్ళ ఇల్లు మా అందరికీ ఓ తియ్యటి జ్ఞాపకం. మా సంతోషాల కూడలి. మా చిన్నప్పటి జ్ఞాపకాల బంగారు ఖజానా. ఆ ఖజానాను తెరిచే బంగారపు తాళం చెవి కూడా అదే. అంతేకాదు అమ్మావాళ్ళ ఇల్లు మా కష్టసుఖాల బాధా నివారణ కేంద్రం.

ఇప్పుడు ఇంక అమ్మకీ ఇల్లు లేదు. మాకు అమ్మావాళ్ళ ఇల్లూ లేదు.

***'పాలపిట్ట' ఆగస్ట్ 2017***

# సుమిత్ర

"ఇవాళ మా గురువుగారి దగ్గరికి వెళ్ళాను. ఈ పుస్తకాన్ని నూట ఎనిమిది సార్లు చదివితే మన చికాకులన్నీ పోయి మంచి జరుగుతుందని చెప్పారు" ఇంట్లోకి వచ్చీ రాగానే సుమిత్ర చేతుల్లో పుస్తకం పెడుతూ అన్నాడు మూర్తి. సుమిత్ర మూర్తి వంక ఆశ్చర్యంగా చూసింది. ఏం అనడానికి ఆమెకి ఒక్క నిముషం గుక్కతిరగలేదు.

తండ్రి మాటలకి టీవీ చూస్తున్న కిరణ్, హరిణి తలతిప్పి చూశారు. మూర్తి కనీసం పిల్లల ముందన్నా ఈ ప్రస్తావన తేకుండా వుంటే బాగుండేదేమో అనిపించింది సుమిత్రకి. అంతలోనే మళ్ళీ ఆమెకే అనిపించింది అతను కావాలనే పిల్లల ముందు ఈ విషయం చెప్పి ఉంటాడని. అందుకే వాళ్ళ ముందు వాదన పెంచడం ఎందుకని మౌనంగా పుస్తకం అందుకుని పేజీలు తిరగేసి చూసింది. దగ్గర దగ్గర మూడొందల పేజీల పుస్తకం చూడగానే సుమిత్ర గుండె ఒక్కసారిగా జారిపోయింది.

మూర్తి పట్టుబట్టాడంటే ఎంత వెంటపడతాడో ఆమెకి తెలియంది కాదు. అందులో ఇలాంటి పనులంటే మరీ. అయ్యేవరకూ నిద్రపోనివ్వడు. ఇంట్లో పనులన్నీ చేసి ఆఫీసుకి వెళ్ళి మళ్ళీ ఇంటికి వచ్చిన తర్వాత వంట, మర్నాటి పొద్దుటికి కావలసిన కూరల్ని తరిగి ఉంచుకోడం, మధ్య మధ్యలో మర్నాటి టిఫిన్‌కి ఏర్పాట్లు – ఈ కార్యక్రమాలన్నిటితో తలమునకలవుతూ రోజుకి ఇరవైనాలుగు గంటలు చాలవన్నట్టుగా ఉరుకులు పరుగులు పెడితే కానీ సుమిత్రకి ఒక రోజు పూర్తవదు. ఎంత పరుగులు పెడుతూ చేసినా రాత్రి పనులన్నీ అయేటప్పటికి పదకొండు చూపిస్తుంది గడియారం. అప్పటికే అలసిన శరీరం నిద్ర కోరుకుంటూ ఉంటుంది. కనురెప్పలు బరువుగా వాలిపోతూ ఉంటాయి. ఎప్పుడన్నా ఏమన్నా చదవడానికి ప్రయత్నించినా ఒక్క పేరా చదివేటప్పటికే కళ్ళు మూతలు పడిపోతుంటాయి. అలాంటిది మూడొందల పేజీల పుస్తకాన్ని నూట ఎనిమిది సార్లు చదవడం అంటే గొంతులో వెలక్కాయ పడినట్టు

ఉంది సుమిత్రకి. దాన్ని కక్కాలేదు, మింగాలేదు. చదవలేనంటే మూర్తి సాధింపులు ఒకలా ఉండవు. చదవలేకపోవడం అనేదాన్ని బద్ధకంతో మొదలుపెట్టి దాన్ని పిల్లల మీద ప్రేమలేని తల్లిగా చిత్రించడం వరకూ దాన్ని ఎంతవరకైనా తీసుకెళ్ళగల నేర్పు మూర్తికి ఉందని ఆమెకి తెలుసు. ఈ కొత్త గండాన్ని ఎట్లా ఎదుర్కోవాలో ఆమెకు పాలుపోలేదు.

"త్వరగా అన్నం పెట్టెయ్. మొన్న ఆ మ్యారేజీ బ్యూరో వాళ్ళు చెప్పిన సంబంధం తాలూకూ అబ్బాయిలవి ఫొటోలు మెయిల్ చేశారట. ఒకసారి చూద్దాం" మూర్తి బట్టలు మార్చుకుని కాళ్ళు కడుక్కోడానికి వెళుతూ చెప్పాడు. ఇప్పుడు ఇక ఆ ప్రహసనం మొదలవుతుంది కాబోలు నిట్టూర్చింది సుమిత్ర.

అన్నాలు అయిన తర్వాత ఎప్పటిలాగే మూర్తి, కిరణ్, హరిణి సిస్టమ్ ముందు చేరారు. సుమిత్ర వంటగదిలో సర్దుతూంటే "నువ్వు కూడా రా ఒకసారి. మళ్ళీ మళ్ళీ చూడాలంటే కష్టం" మూర్తి వంటగదిలోకి చూస్తూ పిలవడంతో ఇంక తప్పనిసరై హాల్లోకి వచ్చింది సుమిత్ర.

"మొన్న మేరేజీ బ్యూరో వాళ్ళు చెప్పారు చూడు మోహన్ అని ఎమ్టెక్ చేసి బ్యాంక్‌లో జాబ్  చేస్తున్నాడని. ఇతనే. తండ్రిలేదు. ఒక చెల్లి, తమ్ముడు ఉన్నారు. హైదరాబాదులో ఉద్యోగం" మూర్తి సుమిత్ర వంక చూస్తూ చెప్పాడు.

కుర్రాడు చూడడానికి సింపుల్‌గా వున్నాడు.  నిదానంగా వుండే కుర్రాడిలాగే వున్నాడు. అతను బాగానే ఉన్నట్టు చెబుదాం అనుకునేంతలో హరిణి అందుకుంది.

"అబ్బ. హారిబుల్ డాడీ. అసలు ఎమ్టెక్ చేసి బ్యాంక్ జాబ్ చేస్తున్న కళ ఏమయినా ఉందా ఆ  మొహంలో. ఎప్పుడో బీసీల కాలంలో పుట్టాల్సినట్టుగా ఉన్నాడు. పైగా పెద్ద కొడుకు అంటే ఇంటి బాధ్యతలూ, బరువులూ, పాత తెలుగు సినిమా వ్యవహారంలా వుంటుంది. ఆ తలనెప్పులన్నీ నాకొద్దు బాబూ" హరిణి కచ్చితంగా అనేసింది.

"అదేంటే అలా అంటావు? కుర్రాడు బాగున్నాడు. ఈ కాలం నాటి పిల్లల్లా కాకుండా  బరువు బాధ్యతలు తెలిసిన వాడిలాగా ఉన్నాడు. అలాంటి వాళ్ళే భార్యాపిల్లల్ని కూడా బాగా చూసుకుంటారు. దాని మాటలకేం కానీ, దాని మొహం దానికేం తెలుసు? అతని వివరాలన్నీ ఇంకోసారి పూర్తిగా కనుక్కోండి" సుమిత్ర ఆ సంబంధం ఎక్కడ తప్పిపోతుందో అన్నట్టు గబగబా అంది.

"అమ్మా, నువ్వు పాత చింతకాయ పచ్చడి కబుర్లు చెప్పకు. నా జీవితం ఎట్లా

ఉండాలో నా ఐడియాలు నాకున్నాయి. నాకు నచ్చకుండా అడ్జెస్ట్ అయ్యి చేసుకోమంటే మాత్రం చేసుకోను" హరిణి అంది.

"అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళు లేకుండా ఒంటికాయ సొంటి కొమ్ములా ఎవరుంటారు? నీకు మేం ఉన్నట్టే అతనికి వాళ్ళు. అన్నిటికీ అలా వంకలు చెబితే ఎలా?" సుమిత్ర విసుక్కుంది.

"పెళ్ళి చెయాల్సిన తమ్ముడూ, చెల్లీ, జీవితాంతం మోయాల్సిన అత్తగారు, ఆడబిడ్డ పురుళ్ళు, పుణ్యాలు అంత ఓపిక నాకు లేదు" హరిణి అంది.

"అది అంత కచ్చితంగా చెబుతోంది అంటే దాని సంగతి తెలియంది ఏముంది? ఎంత చెప్పినా ఒప్పుకోదు. ఆ సంబంధం వదిలెయ్యండి డాడీ" కిరణ్ అన్నాడు.

"సరే. సురేష్ అని ఇంకో అబ్బాయున్నాడు. బిటెక్ చేసి టీసీఎస్‌లో చేస్తున్నాడు. ఫైనాన్షియల్ పొజిషన్ కూడా బాగుంది. అయితే కొంచెం నలుపని అన్నారు. అతని ఫొటో ఇది" కంప్యూటర్‌లో ప్రొఫైల్ పిక్ చేస్తూ అన్నాడు మూర్తి. స్క్రీన్ మీద అతని ఫొటో చూస్తూనే మొహం చిట్లించింది హరిణి.

"అబ్బ నల్లగా ఉండేటట్టయితే అసలొద్దు డాడీ. రేపు పిల్లలు నల్లగా పుడితే నాకు వాళ్ళని కంటితో కూడా చూడబుద్ధి కాదు. నేను తెలుపు, అతను నలుపైతే చూడడానికి కూడా పెయిర్ బాగోదు" హరిణి అంది.

"ఇంక ఇట్లా అన్నిటికీ అన్ని వంకలు చెబుతూ పోతే ఎట్లా హరిణీ? ఇప్పటికి ఏడాదిన్నర నుంచీ చూస్తున్నాం. మంచిగా ఉన్నాటికి అన్నిటికీ వంకలు పెట్టి పోగొట్టుకుంటే చివరికి వచ్చేసరికి ఏదో ఒకటిలే అని రాజీ పడాల్సి వస్తుంది. అది మర్చిపోకు" సుమిత్ర విసుక్కుంది.

"మీకు అంత కష్టంగా వుంటే సంబంధాలు చూడడం మానేయండి. అంతేకానీ నచ్చకుండా ఏదో ఒకటి చేసుకోవాలంటే మాత్రం అసలు నాకు పెళ్ళే వద్దు" హరిణి కంప్యూటర్ దగ్గర నుంచీ లేచి వెళ్ళిపోయింది.

"నువ్వెందుకు ఓ దాని వెంట పడతావ్? ఏదన్నా ఉంటే నేను నిదానంగా చెప్పేవాడినిగా?" మూర్తి సుమిత్ర మీద గంయ్ మన్నాడు.

"నాకెందుకు బాబూ మీ కూతురు ఇష్టం. మీ ఇష్టం. అది ఏదో తెలిసీ తెలియక వంకలు పెడుతుంటే నచ్చచెప్పాల్సింది పోయి అది తానా అంటే తందాన అంటున్నారు. ఈ మాత్రం దానికి నన్ను పిలవడం దేనికి? వెతికి వెతికి ఏ ఒంటికాయి సొంటికొమ్ము రాజకుమారుడినో తెచ్చి చేయండి మీ రాజకుమారికి" సుమిత్ర కూడా గట్టిగా అనేసింది.

"అబ్బ అమ్మా. ఇంక ఆపుతారా మీ గోల. ఇల్లంతా నరకం చేసేస్తున్నారు. ఇంట్లో ఉండాలా వద్దా?" కిరణ్ అన్నాడు.

"అసలు నిన్నెవడు ఇంట్లో ఉండమన్నాడు రా? ఏదో ఒక ఉద్యోగం చూసుకుని బైటకు పోక? నీకేమో ఏ ఉద్యోగం నచ్చదు. దానికేమో ఏ సంబంధం నచ్చదు. బాగా తయారయ్యారు ఒకళ్ళకి ఇద్దరు మా ప్రాణానికి."

"ఇప్పుడు నామీదకు తిరిగిందా గాలి. ఎప్పుడూఎవళ్లో ఒకళ్ళని అనందే నీకు నిద్ర పట్టదా?" కిరణ్ అరిచాడు.

"అవునురా. నాకు నిద్ర పట్టదు. బాగా నిద్ర పట్టేలాగా చేస్తున్నారుగా ఇద్దరూ." సుమిత్ర కోపంగా కుర్చీ బర్రున లాగి లేచింది.

"ఏమయింది ఇవాళ నీకు? అందరిమీదా అలా ఎగురుతున్నావ్?" మూర్తి విసుక్కున్నాడు.

"అవును. ఎగురుతున్నాను. అందర్నీ చూసి సంతోషం పట్టలేక" సుమిత్ర బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి గట్టిగా తలుపేసుకుంది.

హరిణినీ, కిరణ్‌ని తల్చుకున్న కొద్దీ ఆమెకు వళ్ళు మండిపోతోంది. ఇద్దరికీ కొద్దిగన్నా బాధ్యత లేదు. తమ కారణంగా అమ్మ నాన్న ఇబ్బంది పడుతున్నారన్న ఇంగిత జ్ఞానం కూడా లేదు అనుకుంది కోపంగా. అన్నీ నచ్చాలి. అన్నీ ఫర్‌ఫెక్ట్‌గా ఉండాలంటే ఎట్లా సాధ్యమవుతుంది? అట్లా ఉంటే అది జీవితం ఎందుకవుతుంది? తెలియకపోతే పెద్దవాళ్ళు చెప్పింది వినాలి.

హరిణికి రెండేళ్ళ నుంచీ సంబంధాలు చూస్తున్నారు. ముందు తెలిసిన వాళ్ళ సంబంధాలు చూశారు. అవి నచ్చక మారేజీ బ్యూరోలని ఆశ్రయించారు. ఇక అక్కడి నుంచీ మొదలయ్యాయి పాట్లు. ఏ వారం పదిరోజులకో వాళ్ళు అబ్బాయిల వివరాలో, ఫొటోలో మెయిల్ చెయ్యడం, ఇంటిల్లిపాదీ పనులన్నీ మానుకుని కూర్చుని అవన్నీ చూడడం, చివరికి హరిణి ఏదో వంక చెప్పి వాటిని తోసిపుచ్చడం – ఇదే తంతు అయిపోయింది. హరిణికి నచ్చచెప్పడం సుమిత్ర వల్ల కావడం లేదు. మూర్తి పిల్లల విషయంలో సాఫ్ట్‌గా ఉంటాడు. అతని ప్రతాపం అంతా సుమిత్ర పైనే. పిల్లల దృష్టిలో మంచివాడు అనిపించుకోవాలనే తాపత్రయం అతనిది. అందుకే వాళ్ళు ఏదంటే అది అంటాడు తప్ప అందులో లోటుపాట్లు చెప్పడు. నచ్చకపోతే వాళ్ళను బలవంతం చేయడం ఎందుకు అంటాడు. సుమిత్రకి అదే కోపం.

ఇక కిరణ్‌ది ఇంకో తంతు. బిటెక్ అయిన తర్వాత ఇప్పటికి రెండు మూడు ఉద్యోగాల్లో చేరి మానేశాడు. అదేంటంటే ఉద్యోగం నచ్చలేదంటాడు. ఆఫీసులో వాతావరణం నచ్చలేదంటాడు. ఆ ఊళ్లో ఫుడ్ నచ్చలేదంటాడు. బాస్ అరిచాడని ఒక ఉద్యోగం మానేసి వచ్చాడు.

అంతంత చదువులు చదివి జీవితంలోని ప్రాథమిక విషయాల పట్ల వాళ్ళకు అవగాహన లేకపోవడం, ఆపాటి మానసిక పరిణతి లేకపోవడం చూస్తుంటే సుమిత్రకి అసహనం వచ్చేస్తుంటుంది.

అసలు ఉద్యోగం, పెళ్ళి – రెండూ రెండే. జీవితంలో కచ్చితంగా రాజీ పడాల్సిందీ, సర్దుబాటు తప్పనిది ఏదన్నా ఉందీ అంటే అది కచ్చితంగా ఆ రెండింటి విషయంలోనే. ఒకళ్ళ కింద సబార్డినేట్‌గా పనిచేయడం అంటేనే చికాకు పుట్టించే విషయం. ఏ ప్రొఫెషన్‌లో పనిచేస్తున్న వాళ్ళ నడిగినా తమ ప్రొఫెషన్ అంత పనికిమాలిన ప్రొఫెషన్ ఇంకొకటి లేదని అనడం సుమిత్ర చాలాసార్లు వింది. ఉద్యోగంలో హ్యాపీగా ఉన్నామని ఒక్కళ్ళంటే ఒక్కళ్ళు చెప్పరు. అలా చెప్పగల అదృష్టవంతులెవరన్నా ఉంటే వాళ్ళ కథ వేరు.

బతకడానికి ఏదో ఒక పని చేయాలి. కాబట్టి తామరాకుమీద నీటిబొట్టులాగా అన్నిటికీ అంటీ అంటక గడుపుకొని పోవాలి. ఎటూ చేయడం తప్పదు కనుక చేస్తున్న దానినే ఇష్టంగా చేసుకోగలిగితే మంచిది. కిరణ్‌కి ఈ నాలుగు మాటలు చెప్పీ చెప్పీ సుమిత్రకు విసుగొచ్చింది తప్ప ఉపయోగం లేకుండా పోయింది.

ఇక పెళ్ళిళ్ళు సరేసరి. అన్నీ చూసుకుని అట్టహాసంగా చేసిన పెళ్ళిళ్ళు కూడా పందిళ్ళు తీసేలోగా విడాకులు దారి పట్టడం సుమిత్ర చూస్తూనే ఉంది. ఇగోలు, అహంకారాలు, అన్నిటికీ వంతులు వేసుకోవడం, సర్దుబాటు లేక పోవడం – కర్ణుడి చావుకి లాగా కారణాలు బోలెడు.

అట్టహాసంగా జరుగుతున్న ఏ పెళ్ళిని చూసినా ఇంత అట్టహాసంగా చేస్తున్నారు. ఈ పెళ్ళి ఎంతకాలం ఉంటుందో అనుకోవడం అయ్యో తప్పు అలా అనుకోకూడదు అని చెంపలు వేసుకోవటం సుమిత్రకి ఈ మధ్య బాగా అలవాటైపోయింది.

"నేను ఇచ్చిన పుస్తకం తీసుకున్నావుగా. నూట ఎనిమిది సార్లు చదవాలి. లెక్క తప్పకుండా చూసుకో. నాక్కూడా ఓ పుస్తకం తెచ్చుకున్నాను. కాలేజీకి పట్టుకెళతాను. అలా అన్నా పిల్లలకు మంచి జరిగితే అదేచాలు" బెడ్‌రూమ్ తలుపు తీసుకుని లోపలకు

వచ్చి పడుకోబోతూ మూర్తి అన్న మాటలకి సుమిత్రకి మరింత మండిపోయింది.

"నూట ఎనిమిది సార్లా? అది చదివితే అంతా బాగైపోతుందా?" ఆమెకు తెలియకుండానే గొంతులో వెటకారం ధ్వనించింది.

"ఏంటి ఏమయింది నీకివాళ? తిక్క తిక్కగా మాట్లాడుతున్నావు" మూర్తి విసుక్కున్నాడు.

"అట్లా మంచి సంబంధాలన్నీ తిప్పి కొడుతోంటే తిక్క పుట్టక ఏం చేస్తుంది? మీరు కూడా దాన్ని వెనకేసుకొస్తున్నారుగా."

"దానికి నచ్చకుండా చేస్తే తర్వాత ఏదన్నా గొడవ వస్తే అది నెపం మనమీదకి నెట్టదూ? అసలే మొండిది. దానికి నచ్చింది అన్న సంబంధం చెయ్యడమే" అటు తిరిగి పడుకుంటూ అన్నాడు మూర్తి. ఒక నిముషం తర్వాత ఎప్పటిలాగే అతని గురక వినిపించింది.

సుమిత్రకి నిద్ర పట్టక లేచి కూర్చుంది. మూర్తి మళ్ళీ ఆ పుస్తకం చదవడం గురించి గుర్తుచేశాడు అంటే ఇంక దాన్ని వదలడని ఆమెకు అర్థం అయింది. అది ఏదో మూర్తి గురువుగారికి గురువుగారి జీవిత చరిత్ర అంట. హరిణికి పెళ్ళి అవడానికీ, కిరణ్‌కి ఉద్యోగం రావడానికి ఆ పుస్తకం చదవడానికి గల సంబంధం ఏంటో సుమిత్రకి అర్థంకాలేదు. మంత్రాలకు చింతకాయలు రాలడం అంటే ఇదేనేమో అనిపించింది ఆమెకి. ఆ పుస్తకం నూట ఎనిమిది సార్లు చదవగానే అప్పటివరకూ అవని పనులన్నీ అవడానికి వెనుక ఉన్న లాజిక్కేదో కూడా ఆమెకు అర్థంకాలేదు. లెక్చరర్‌గా పనిచేసే మూర్తి ఇలాంటివన్నీ నమ్మడం కూడా ఆమెకు ఆశ్చర్యం అనిపించింది. ఇలాంటి లెక్చరర్ల చేతిలో పడిన పిల్లలు ఇంక నేర్చుకోడానికి ఏముంటుంది అనుకుంది సుమిత్ర.

"మనం మంచిగా ఉండి మన పని మనం మంచిగా చేసుకుపోతూ ఇతర్లకి చెడు చేయకుండా ఉంటే చాలు. అది భగవంతుడిని పూజించినట్టే" అనేవాడు సుమిత్ర వాళ్ళ నాన్న ఎప్పుడూ. సుమిత్రకి చిన్నప్పటి నుంచీ అదే అలవాటయ్యింది. అయినా వాళ్ళు అలా గొంతెమ్మ కోరికలు కోరుతూ చేతులారా అన్నీ చెడగొట్టుకుంటుంటే వాళ్ళ కోసం తను పుస్తకాలు చదివి పూజలు చేయడం ఏంటి అనిపించింది సుమిత్రకి.

నాలుగైదు వారాలు ఎలాంటి మార్పు లేకుండా గడిచిపోయింది. బ్యూరో వాళ్ళు మళ్ళీ రెండు మూడు సంబంధాలు చెప్పడం, బట్టతల అనీ, వయసెక్కువ అనీ హరిణి వాటిని తిరగ్గొట్టడం జరిగిపోయింది. సుమిత్ర మౌనంగా అన్నీ చూస్తుండి పోయింది.

"ఆ పుస్తకం చదువుతున్నావుగా సుమిత్రా? ఇప్పటికి ఎన్నిసార్లు పూర్తయింది?" ఒకరోజు ఉన్నట్టుండి మూర్తి అడిగాడు.

సుమిత్రకి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అనిపించింది. సుమిత్ర ఆ పుస్తకం ఏంటా అని తిరగేసి చూసింది. అందులో భాష కానీ, భావంకానీ ఆమెకు ఏ మాత్రం నచ్చలేదు. అసలు ఆ మాటకొస్తే ఆమెకు అలా ఆ పుస్తకం చదవాల్సి రావడం, చదవమని మూర్తి పట్టుబట్టడం, ఆ నిర్బంధం కూడా చికాకు అనిపిస్తోంది. అందుకే మూర్తి అడిగితే అప్పుడు చూద్దాం అని పక్కన పెట్టేసింది. మూర్తి ఇంత సడెన్‌గా అడుగుతాడని ఆమె అనుకోలేదు. ఆమెకు గబుక్కున ఏం చెప్పడానికి కూడా తోచలేదు.

"పదిసార్లో, పన్నెండు సార్లో అయినట్టుంది" నోటికొచ్చిన అంకె చెప్పేసింది. ఒక్కసారి కూడా చదవలేదని నిజం చెబితే మూర్తి బతకనివ్వడు. నస పెట్టి చంపుతాడు.

"ఇంకా పదిసార్లేనా? నాకు పాతిక దాటింది. ఇట్లా అయితే నూట ఎనిమిది సార్లు ఎప్పటికి అవుతుంది మూర్తి అసహనంగా అన్నాడు.

"అయినప్పటికే అవుతుంది. అంతకన్నా చదవడం నావల్ల కాదు. ఈ పనులన్నీ చేస్తూ నాకెక్కడ తీరుతుంది" సుమిత్ర అంది కానీ నేనసలు చదవనే చదవను అని తెగేసి చెప్పలేకపోయింది. అది ఏదో ఒక పుస్తకం చదవడం, చదవకపోవడం అనే చిన్న విషయం కాదు. ఒక భర్త ఆజ్ఞను ఒక భార్య ధిక్కరించడం. అది ఏ విషయంగా అయినా సరే. పవిత్ర భారతదేశంలో ఒక భార్య కర్తవ్యం ఏంటో సుమిత్ర ఇప్పటికే తెలుసుకుంది.

"అది చదివితే మన చికాకులన్నీ సర్దుకుంటాయని గురువుగారు చెప్పారు కదా" మూర్తి నిష్ఠూరంగా అన్నాడు.

"అట్లా అయితే మీరే పూర్తి చేయండి. ఎవరు చదివినా ఒకటే కదా" సుమిత్ర ఏ మాత్రం తగ్గకుండా అంది.

"అసలు మొదట్నుంచీ చూస్తున్నాను. అన్నిటికీ అన్నీ చెప్పడం తప్ప ఒక్కటైనా చెప్పింది సరిగ్గా చేయవా? ఓ వైపు ఇద్దరు పిల్లలు ఉసూరుమంటూ ఇంట్లో పడి ఏడుస్తున్నారు. తల్లిగా నీకు ఆ మాత్రం బాధ్యతలేదా?" మూర్తి దెప్పిపొడుస్తున్నట్టు అన్నాడు.

ఇంక సుమిత్ర సహనం చచ్చిపోయింది.

"ఇదుగో చూడండి. మీరు మాటిమాటికీ నా బాధ్యత లేంటో నాకు గుర్తు

చేయనక్కరలేదు వాళ్ళకు చదువుకి, ఉద్యోగానికీ, జీవితానికి సంబంధించినంత వరకూ ఏది కావాలన్నా చేస్తాను. ఏ సమస్య వచ్చినా, ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతాను. వాళ్ళు బాగుండడానికి ఏది కావాలంటే అది చేస్తాను. అంతేకానీ ఇలా పుస్తకాలు చదవడం, పూజలు, వ్రతాలు చేయడం అంటే మాత్రం నావల్ల కాదు. అలా చెయ్యలేకపోవడం వల్ల నేను మంచి తల్లిని కాదని మీరన్నా నాకు అభ్యంతరం లేదు. ఆ మాట అని మాటిమాటికీ నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యాలని మాత్రం చూడకండి. నాకు నేర్పే బదులు ఏది మంచో ఏది చెడో ముందు మీ పిల్లలకు నేర్పుకోండి" ఎప్పుడూ లేనిది సుమిత్ర అలా ధిక్కారంగా అంటుంటే మూర్తి ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

***'విశాలాంధ్ర' అక్టోబర్ 2017***

# రూట్ కెనాల్

**నో**ట్లో నీళ్ళు పోసుకుని పుక్కిలించి వాష్ బేసిన్‌లో ఊసింది విజయ. చిక్కటి ఎర్రటిరక్తం – వాష్‌బేసినంతా చెల్లాచెదురుగా పడింది. మరోసారి పుక్కిలిస్తూ అద్దంలో యధాలాపంగా మొహం చూసుకుని ఉలిక్కిపడింది. నాలుగు దంతాలు పీకేయడంతో దవడలు జారిపోయి మొహమంతా ఎక్కడికక్కడ వదులుగా తోళ్ళు తోళ్ళుగా వేలాడుతూ భయంకరంగావుంది. అది తన మొహమని తనకే నమ్మబుద్ధి కానట్టుంది. చూస్తోంది కాబట్టి తన మొహం. లేకపోతే అది ఎవరో తనకు తెలియని వికారపు ముసలి మొహం. అద్దంలో మొహం చూస్తున్నకొద్దీ విజయ మొహం పాలిపోయింది. నోట్లోంచి రక్తం ఇంకా ఊరుతూనే వుంది. కళ్ళముందు వలయాలు కమ్ముతున్నట్టు అనిపించి గోడను ఆసరా చేసుకుని కుర్చీలోకి వచ్చి పడింది. తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకోబోతోంటే అప్పుడు గుర్తుకు వచ్చాడామెకి రామచంద్ర.

రామచంద్ర గుర్తుకు రాగానే ఒక్కసారిగా అదిరిపడింది విజయ. ఆ రోజు గురువారం. అంటే మర్నాడు రాత్రికల్లా రామచంద్ర వచ్చేస్తాడు. రామచంద్ర వచ్చి తనని ఇట్లా చూస్తే? ఇంకేమన్నా వుందా? తనని ఈ అవతారంతో (అసలే మన మొహం అంతంతమాత్రం) చూస్తే డోక్కోడూ? కచ్చితంగా డోక్కుంటాడు.(అసలే ఆయనకి డోకులెక్కువ) పంటి బాధకి మించి విజయకు రామచంద్ర బాధ ఎక్కువవుతోంది.

పళ్ళ డాక్టరు పిప్పిపన్ను పుచ్చిపోయింది. పీకేయాలంటే ఒక్క పన్నే కదా అనుకుంది. తీరా హాస్పిటల్‌కి వచ్చిన తర్వాత అటు పక్కవీ ఇటు పక్కవీ కలిపి నాలుగు దంతాలు పీకేయాలని పీకి పడేశాడు.

మత్తుమందు ప్రభావం తగ్గుతున్నట్టు ఉంది. పంటి నరం జివ్వున లాగినట్టయి

పోటు ఒక్కసారిగా చెవిలోంచి తలలోకి ఎక్కింది. కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు తిరిగినయి.

"ఈ పంటి బాధ. అబ్బా రామచంద్ర ప్రభో. సీతమ్మతల్లీ నువ్వు అదృష్టవంతురాలివి తల్లీ, నీకు ఈ బాధల్లేవు. నీకు పళ్ళూడిపోతే రాముడు ఏమని ఉండేవాడో... "సీతా నీ మొహం చూడలేకపోతున్నాను" అంటాడా రామచంద్రకు మల్లే. ఛ. సీతాదేవికి పళ్ళూడిపోవటం ఏంటి నాన్సెన్స్...? ఏ సీతాదేవికి పళ్ళు లేవా? పళ్ళున్నాక ఊడవా? ఐనా సీతాదేవికి ఏం ఖర్మ పళ్ళూడడానికి? సీతాదేవి ఏమన్నా తెల్లారి ఐదింటికి లేవాలా? టీలూ, టిఫిన్లూ, వంటలూ చేయాలా? అందరికీ అన్నీ అమర్చి పళ్ళు తోముకోడాని కన్నా కుదరక ఎనిమిదింటికల్లా పరుగెత్తాలా?

తనదే వెధవ బతుకు. పొద్దున్నే పళ్ళు తోముకోడానికి, ప్రశాంతంగా టీ తాగడానికి కనీసం దొడ్లోకి పోడానికి కూడా తీరిక లేని బతుకు. ఏది చేసినా ఆదరాబాదరాగా పరుగులు పెడుతూ చేయడమే. ఇంత పేస్టు బ్రష్షు మీద వేసుకుని పరపరా తోమడం, పళ్ళు తోమితే తోమిందనుకోడం, తల దువ్వితే దువ్విందనుకోడం, చీర కట్టుకుంటే కట్టిందనుకోడం.

"చీర కట్టుకున్నావా? చుట్టుకున్నావా? చీరను ఎవరైనా కట్టుకుంటారు. చుట్టుకోరు" ఒకసారి రామచంద్ర సినిమాకని తయారవుతున్నప్పుడు వెటకరించాడు.

"ఏడిశావులేవోయ్. నీ మొహానికి ఇదే ఎక్కువ" రామచంద్ర తనని ఎగతాళిగా ఏదన్నా అన్నప్పుడల్లా విజయ మనసులో ఈమాటే అనుకుంటుంది. ఆ మాట పైకి అనకపోవడం జ్ఞానం కనుక తనకి కచ్చితంగా జ్ఞాన దంతాలు వచ్చి ఉంటాయనే ఆమె విశ్వాసం.

రామచంద్ర విజయకి వీకెండు మొగుడు. వారమంతా కష్టపడి కష్టపడి విజయని ఉద్ధరించడానికి వారం చివర్లో రెక్కలు కట్టుకుని వచ్చేస్తుంటాడు. ఆ రెండు రోజులూ విజయ కార్యేషు దాసి, భోజ్యేషు మాతా, శయనేషు రంభ, క్షమయా ధరిత్రిలా దశావతారాలు ఎత్తుతుంది. కరణేషు మంత్రి అయ్యే సౌభాగ్యం ఆమెకు రామచంద్ర ఇంతవరకూ పట్టనివ్వలేదు. (ఆడదాని మాట విని బాగుపడిన వాడెవడన్నా ఉన్నా డటండీ?)

రామచంద్ర అనే ప్రతిమాటకి "అసలే వారం రోజుల పాటు కష్టపడి కష్టపడి ఏదో సుఖపడదామని వస్తే" అనే టాగ్ లైన్ ఉంటుంది. "తల స్నానానికి కొంచెం కుంకుళ్ళు కొట్టలేవా?" (అసలే వారం రోజుల పాటు...)

"షర్టు బటన్ కొంచెం కుట్టి ఉంచొచ్చుగా?" (అసలే వారం రోజుల పాటు...) "ఏదన్నా రోటి పచ్చడి చేయొచ్చుగా? హోటల్ కూడు తినితిని నోరు చచ్చిపోయింది." (అసలే వారం రోజుల పాటు...) ఇట్లా సాగుతుంటుంది. వారం రోజులపాటు ఇంట్లో ఒక్కటే ఉండి తను పడిన కష్టంమాటో అని విజయ అడగదు. పొరబాటున అడిగితే రామచంద్ర ఏకరువు పెట్టే చిట్టాని చివరికంటా వినే శక్తిని ఆ యొక్క భగవంతుడు తనకు ప్రసాదించలేదని విజయకు బాగా తెలుసు.

రెండు వారాలకోసారి తల్లి రుణం తీర్చుకోడానికి బెంగుళూరు నుంచీ కొడుకు కూడా వచ్చేస్తుంటాడు. వాడు అచ్చంగా రామచంద్ర కొడుకు.

"వారానికి ఒక్కసారి రాకరాక వస్తే మంచిగా వండిపెట్టడానికి కూడా బాధేనా?" అని రామచంద్ర అంటే "అదే వాళ్ళ అమ్మా వాళ్ళు వస్తే చక్కగా వండుతుంది నాన్నా. మనకు వండాలంటేనే బాధ" (యూటూ బ్రూటస్. రేయ్ మాతృద్రోహీ. నా కడుపున చెడబుట్టావురా.) అంటూ వంత పలుకుతుంటాడు.

ఒక్కసారిగా కరెంటు షాక్ కొట్టినట్టు పంటి నరం మళ్ళీ జివ్వుమంది. బుర్రంతా మొద్దుబారిపోయినట్టు అయోమయంగా అయిపోయింది. ఆమెకు మళ్ళీ రామచంద్ర గుర్తుకొచ్చాడు.

"ఇదుగో ఇప్పుడే చెబుతున్నా. డెలివరీ తర్వాత పొట్టమీద పొడలు రాకుండా చూడు. ఆ పొడలు చూస్తే నాకు డోకు. ముట్టుకోబుద్ధి కూడా కాదు."

పొట్టమీద పొడలు రాకుండానా? తమలపాకు లాంటి పలుచటి పొట్ట సాగిసాగి... సాగిన తర్వాత పొడలు రాకుండా ఎట్లా? చారలు రాకుండా ఎట్లా? సీతమ్మ తల్లీ ఎట్లాగే !.... అమ్మయ్య తెలిసింది. నూనెతో పొట్ట మర్దనా చేస్తే చారలు రావట. ఆహో తెలిసెను కదా చారల మర్మంబు. రుద్దు రుద్దు. తోము తోము. రుద్ది రుద్ది తోమి తోమి పోచార పొమ్మికన్. మా నడుమకు రా వలదు రా తగదు ఇక పోచార పొమ్మికన్. పోయిందా? ఇట్స్‌గాన్. అమ్మయ్య ఇక కాపురానికొచ్చిన ఢోకా ఏమీలేదు.

"అయ్యో డాక్టర్. సిజేరియన్ తప్పదా? మొదటిసారి కాదుగా? రెండోసారేగా? బలహీనంగా ఉన్నానా? అయినా ఫరవాలేదు. సిజేరియన్ వద్దు డాక్టర్. మచ్చల పాములా వళ్ళంతా పొడలు పొడలు. ఎంత బాధైనా ఫరవాలేదు. ఎంత నొప్పులైనా భరిస్తాను. సిజేరియన్ వద్దు. అయ్యో డాక్టర్...."

"వెధవ పొడలు. పొడల పాము వళ్ళంతా పాకినట్టు. లైటు తీసేయ్."

"ఆరిపేయవే దీపమూ. ఎలుతురులో నీమీద నిలపలేనే మనసూ. ఆరిపేయవే

దీపమూ" ఎవరది ఏడ్చేది? నండూరి ఎంకేనా? ఏడు. ఏడు. ఇంకా బాగా ఏడు. నీకీశాస్తి కావలసిందే. మొగుడిలో భావుకత్వం ఎవడు చూసేడవమన్నాడూ?

"ఎప్పుడూ ఆ ఏడునెలల కడుపేసుకుని తిరక్కపోతే పొద్దున్నే కాస్త వాకింగ్ చేసి ఏడవ్వచ్చు కదా?"

ఏడవ్వచ్చు. ఏడవ్వచ్చు. మహారాజుగా ఏడవ్వచ్చు. మొగుడిగా నీ పనులు నువ్వు సక్రమంగా చేసి ఏడిస్తే అప్పుడు నీ పెళ్ళాం నువ్వు చెప్పకుండానే నీ కోసం వాకింగ్ ఏం ఖర్మ ఏకంగా జాగింగే చేస్తుంది. జాగింగ్ చేసి నీకోసం సన్నజాజి మొగ్గలా సిగ్గుల మొగ్గయి నాజూగ్గా నడిచివస్తుంది నాయనా రామచంద్రా. మాయల పకీరు ప్రాణం చిలకలో వుండడం కాదు నీ చిలక ప్రాణం ఎక్కడుందో తెలుసుకోవడం ముఖ్యం బాబూ. ముందు అది తెలుసుకో.

అసలే రామచంద్ర. ఆపై ఆరునెల్ల వేవిళ్ళు. తనని ఇట్లా చూస్తే డోక్కోడూ? కచ్చితంగా డోక్కుంటాడు. ఇన్నాళ్ళూ మొగుళ్ళనే నమ్మకూడదనుకుంది. ఇప్పుడు డాక్టర్లని కూడా నమ్మకూడదని తెలిసొచ్చింది. ఎంత మూర్ఖుడు కాకపోతే పవిత్ర భారతదేశంలో పుట్టిన ఒక మొగుడిచాటు ఆడకూతుర్ని పట్టపగలు పళ్ళు ఊడగొట్టి ఇంటి దగ్గరికి మొగుడి దగ్గరికిపొమ్మని అనగలడు? (అసలు డాక్టరు పట్టా ఎట్లా వచ్చిందో?) మనం ఏం చేశాం? దాని పర్యవసానాలు ఏంటన్న కామన్‌సెన్స్ ఉండక్కర్లా? పళ్ళూడిపోయిన పెళ్ళాన్ని ఏలుకోడానికి ఆయనేమన్నా శ్రీరామచంద్రుడా? (శ్రీరామచంద్రుడు ఏలుకున్నాడని నీకుతెలుసా? చూసివచ్చావా? మరి సీత అడవికి ఎందుకు వెళ్ళినట్టో?) (డాక్టర్ గారూ. ఈ ఆడవాళ్ళకి జ్ఞానదంతాలు అనవసరమండీ బాబూ. మీకు పుణ్యం ఉంటుంది కానీ బాబ్బాబు కాస్త వాటిని కూడా పీకేయండి.)

"డాక్టర్ గారూ. దంతాలు ఇవాళ పెట్టేయకూడదా?"

"కుదరదమ్మా. రెండు రోజులు ఆగాలి."

"కాదండీ. పోనీ రేపన్నా పెట్టేయండి."

"అబ్బబ్బ. ఎందుకమ్మా అట్లా విసిగించి చంపుతావ్? అట్లా పెట్టకూడదు. ఇన్‌ఫెక్షన్ వస్తుంది. చెబుతుంటే అర్థం చేసుకోమ్మా?" డాక్టరు గొంతులో విసుగు.

నా బాధ నువ్వు అర్థం చేసుకోవయ్యా బాబూ. డాక్టరీ చదివావు మళ్ళీ. పళ్ళూడగొట్టి ఇలా ఇంటికిపొమ్మంటే ఎట్లా పొయ్యేది? నువ్వు నిలబెట్టేది నా పళ్ళు కాదయ్యా బాబూ. నా కాపరం. ఏంటి మాటిమాటికీ కాపురం కాపురం అంటావు. నువ్వంటే నువ్వా? నీ పళ్ళా? మీ ఆయన కాపురం చేసేది నీతోనా? నీ పళ్ళతోనా? నోట్లో అన్ని

పళ్ళూ ఉన్న నాతో సరేనా? ఆ మాత్రం తెలివితేటలు నాకూ వున్నాయి. నాతో పెట్టుకోకు. నేను అసలే అంతంత మాత్రపు విజయని. నా స్థానంలో నువ్వుంటే అప్పుడు తెలుస్తుంది డాక్టర్ బాబూ నా బాధ. నీ పళ్ళు కూడా ఇట్లాగే ఊడగొట్టి నీ భార్య దగ్గరకి పంపితే...

"డాక్టర్ గారూ. నా పళ్ళండీ..."

"అబ్బబ్బ. కాస్త చెప్పేది వినవమ్మా తల్లీ. నీకు షుగరుంది, బీపీ వుంది. మర్చిపోకు. కాస్త ఆగి పెడదాం."

షుగరుంది. బీపీ వుంది. నిజమే కానీ మా ఆయన కూడా ఉన్నాడు డాక్టరుగారూ. ఇవాళ గురువారం రేపు రాత్రికి ఆయన ఆగమేఘాల మీద పల్లెకుపోదాం పారుని చూద్దాం చలో చలో అంటూ వస్తాడండీ బాబూ. అందులోనూ వారం రోజుల విరహంతో. "ఆపలేనే ఎంకి ఈ పడవ ఇసురు" అంటూ వస్తాడు. మీరేచెప్పండి? ఈ పళ్ళూడిపోయిన మొహంతో హౌకెన్ ఐ డిజప్పాయింట్ మై వీకెండ్ హజ్బెండ్ యూనో?" (సరిగా పళ్ళు తోముకోడం చేతకాదు కానీ ఆంగ్లము ఒకటి మన మొహానికి).

"డాక్టర్ గారూ. ప్లీజ్. నా బాధ అర్థం చేసుకోండి. పోనీ రేపు సాయంత్రం అన్నా దంతాలు పెట్టేయండీ. రేపు రాత్రికి మావారు (సిగ్గులేకపోతే సరి. థూ) ఊరినుండి వస్తారు. కనీసం అప్పటికన్నా...."

"ఆయన వస్తే మాత్రం ఏమవుతుందమ్మా? ఆయనేమన్నా బైటివాడా? మీ ఆయనేగా? ఆయన వస్తాడని తొందర పడి చేయాల్సిన అవసరం ఏంటి చెప్పు?"

నీ మొహం మండా. నువ్వేం డాక్టరువయ్యా బాబూ. నువ్వు పీకింది ఏ కాలో చెయ్యో కాదు. ఏకంగా నాలుగు దంతాలు. నా కాపురాన్ని నిలబెట్టే నాలుగు ధ్వజ స్తంభాలు. పళ్ళూడిన మొహాల్ని చూసి చూసి నీకుబోసి మొహాలు అలవాటైపోయి నట్టుంది. ఇంత సిగ్గు లేకుండా చెబుతున్నా విషయం అర్థమైచావకపోతే నేనెక్కడ చచ్చేదయ్యా బాబూ? ఆయన వట్టి రామచంద్రుడు కాదయ్యా బాబూ. డోకుల చంద్రుడు. రేపు నా మొహాన్ని చూసి డోక్కుంటే.... పళ్ళూడిపోయి దవడలు జారిపోయి తోళ్ళు తోళ్ళుగా వేలాడుతున్న ఈ జారిపోయిన సంచుల్ని వేసుకుని, ఈ జారిపోయిన సంచుల్లో వదులు వదులుగా ఉన్న నా చారెడేసి ముడతల చెంపల్ని వేసుకుని ఆయన ఎదటికి... మహాప్రభో ఆయన ఎట్టఎదుటకి ఎలా పోగలను? ఎలా మాట్లాడగలను? చదువుకుని తెలివితేటలు ఉండి (?) ఉద్యోగం చేస్తున్న ఒక ఆడది ఆఫ్టరాల్ ఒక నాలుగు పళ్ళ కోసం ఇంత ప్రాధేయపడుతోంటే ఎందుకు అడుగుతోందో, నీ దేశంలోని ఓ ఆడకూతురికి అంత కష్టం ఎందుకు వచ్చిందో అర్థం చేసుకోకుండా ఏ కత్తుల వంతెనపై

ఏ బోసి నోటి దంతంపై కాలం ఆమెను నిలబెట్టిందో తెలుసుకోకుండా ఎందుకోయ్ శ్రీనివాసరావ్ పదే పదే నిరాకరిస్తావ్? (శ్రీనివాసరావా? ఆయనెవరు మధ్యన? డాక్టరు పేరు మాధవరావు కదూ. పళ్ళ దెబ్బకి దీనికి పైత్యం ప్రకోపించి నట్టుంది).

"డాక్టర్ గారూ. పోనీ ముందు రేపు పెట్టేయండి. ఏదన్నా తేడా వస్తే పోనీ సోమవారం తీసేద్దురు గానీ"

"ఏమ్మా? ఎందుకు నా ప్రాణం తీస్తావ్. పళ్ళను కొంటున్నావా? గాడిద గుడ్డను కుంటున్నావా? అంతా నీ ఇష్టమేనా? పెట్టడానికి తీసేయడానికి? తెలిసిన దానివని ఊరుకుంటున్నాను. సరే. తల్లీ. నీకూ నీ దంతాలకీ ఓ దండం. రేపు పెట్టేస్తాను. సరా. ఇంక నన్ను విసిగించకు. నన్ను నా పని చేసుకోనీ....

దేనికయ్యా బాబూ అంత విసుగు. ఏదో వీకెండ్ మొగుడి భార్యని. శనివారాలకి, సోమవారాలకి ఏదో మా ఏర్పాట్లు, ఎడ్జెస్ట్‌మెంట్లు మాకు ఉంటాయి. కాపురానికైనా, పళ్ళకైనా. నా ఏర్పాట్‌మెంటేదో నేను చెప్పాను. కుదిరితే చెయ్యి. కుదరకపోయినా చెయ్యి. ఇంక గొడవేముంది? జుట్టు పీక్కుంటున్నావా? పీక్కో. అన్యాయంగా ఓ ఆడకూతురి పళ్ళు పీకినందుకు ఆ మాత్రం పీక్కోకుండా ఎలా?

"చూడమ్మా. నీ బాధ పడలేక దంతాలు పెట్టేస్తున్నా. సెట్ అవుతుందో లేదో తెలీదు. చెప్పినా నువ్వు వినకపోతే ఏం చేసేది?"

అయ్యో. పెట్టేయండి డాక్టరు గారూ. పెట్టేయండి. అసలే అంతంత మాత్రపు మొహమున్న అంతంత మాత్రపు విజయని. ఏదో ఒకలాగ నాలుగు స్తంభాల్ని అలా నిలబెట్టి జారిపోయిన నా చెంపల సంచుల్ని, సంచుల్లా వేలాడిపోయిన నా తోళ్ళ చెంపల్ని ఆ స్తంభాలమీద కాస్త అలా లేపికూర్చోబెట్టండి చాలు. జారిపోయిన నా చెంపల్ని కాదు కాదు కూలబోతున్న నా కాపురాన్ని నిలబెట్టండి చాలు. నా అంతంత మాత్రపు మొహాన్ని నాకు మళ్ళీ తెచ్చివ్వండి చాలు.

ఇప్పుడు రానీయ్ నా వీకెండ్ మొగుడిని? నన్ను చూసి ఎలా డోక్కుంటాడో నేనూ చూస్తాను.....

*'చినుకు' ప్రత్యేక సంచిక, 2017*

Abhayarnyam

*by* G. Lakshmi



రచయిత్రిగా పాఠకులకు సుపరిచితం అయిన శ్రీమతి జి. లక్ష్మి మొదటి కథా సంకలనం "పూలు పూయని నేల" 2015 లో వెలువడింది. ఆల్బర్ట్ కామూ "ది స్ట్రేంజర్" నవలను "అపరిచితుడు"గా తెలుగులోకి అనువాదం చేశారు. నోబెల్ పురస్కార గ్రహీత ఆలిస్‌మన్రో కథల్ని "ఆలిస్ మన్రో కథలు"గా, ప్రముఖ జర్మనీ రచయిత ఫ్రాంజ్ కాఫ్కా కథల్ని "కాఫ్కా కథలు"గా, ప్రముఖ నోబెల్ రచయితల కథల్ని "నోబెల్ కథలు"గా తెలుగులోకి అనువాదం చేశారు.

₹ 120/-

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004